
# ప్రత్యూష పవనం

## వెలుతురు పువ్వులు

(నవలలు)



డా॥ ఆచారి విజయలక్ష్మి

# ప్రత్యూష పవనం

❀ ❀ ❀ ❀

# వెలుతురు పువ్వులు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

# కృతజ్ఞత

80లలోనే ఈ నవలలు, 'ప్రత్యూషపవనం' 'ప్రభవ' మాసపత్రిక లోనూ, 'వెలుతురు పువ్వులు' 'ఆంధ్రభూమి" మాసపత్రికలోనూ అనుబంధ నవలలుగా ప్రచురింపబడినాయి. వాటిని పుస్తకరూపంలో తీసుకు రావడానికి ఇప్పటికి శ్రద్ధ కలిగింది.

తొలుత తమ పత్రికల్లో ఈ నవలల్ని ప్రచురించిన 'ప్రభవ', 'ఆంధ్రభూమి' సంపాదకులకు కృతజ్ఞతలు. జాతీయ, అంతర్జాతీయ సాహిత్యాన్ని ఔపోసన పట్టి, అందలి మూల సారాన్ని అంతర్గతం చేసుకుని, ఆ జ్ఞానదీప్తుల్ని సాహిత్యాభిలాష కలవారందరికీ పంచుతున్న శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు ఈ పుస్తకానికి ఆత్మీయ స్పర్శతో ముందుమాట రాసారు. స్వర్ణ జలతారు లాంటి విశ్లేషణతో పుస్తకాన్ని సుసజ్జితం చేసిన శ్రీ చిన వీరభద్రుడు గారికి ధన్యవాదాలు.

పదేళ్ళుగా నా కథల పుస్తకాల్ని, కౌమార బాలికల ఆరోగ్యానికి ఉపయుక్తమైన పుస్తకాల్ని వేల సంఖ్యలో ప్రత్యేక శ్రద్ధతో, ఎంతో అభిమానం తో ముద్రిస్తున్న మిత్రులు డా॥ డి. పూషాగారికి ధన్యవాదాలు.

పుస్తకాన్ని ప్రేమించేవారందరికీ శుభాభినందనలతో,

**– డా॥ ఆలూరి విజయలక్ష్మి**

# అదిగో నవలోకం



డా॥ ఆలూరి విజయలక్ష్మిగారు రాసిన రెండు నవలికలు మీ చేతుల్లో ఉన్నాయి. సరళంగా, సూటిగా ఉన్న ఈ రెండు కథల్నీ చదవగానే నా మనసులో చాలా ఆలోచనలు ముసురుకున్నాయి. వాటిలో కొన్ని జ్ఞాపకాలు, కొన్ని ప్రశ్నలు, కొంత మనం ఊహించని ఊరడింపు. ఎంతో బాధ్యత తెలిసిన మనిషి రచయిత్రిగా చెప్పిన ఈ రెండు కథల్లోనూ నేటి కాలానికీ, నేటి సమాజానికీ పట్టిన రుగ్మతలకి అవసరమైన ఔషధం చాలానే ఉందనిపించింది.

## 1

ప్రసిద్ధ రచయిత, భావుకుడు ఫణికుమర్ ఒకసారి నాతో మాట్లాడుతూ 'నేను 60ల తరానికి చెందిన మనిషిని. భారతదేశానికి సంబంధించినంత వరకూ, 60లతో అమాయికత్వం అంతమైపోయింది' అన్నారు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ మాటల్లో ఎంతో నిజం కన్పిస్తోంది. 50ల్లోనూ, 60ల ప్రారంభంలోనూ దేశంలో, కళల్లో, సాహిత్యంలో ఎంతో కొంత అమాయికత్వం ఇంకా కనిపించేది. ఏదో చెప్పలేని ఆదర్శవాదం. మనుషులు కొన్ని విలువల్ని నమ్మి, వాటికి కట్టుబడి ఉండాలన్న ఒక తపన. దేశానికి కొత్తగా స్వాతంత్ర్యం వచ్చిన రోజులు. నవీన భారతదేశాన్ని నిర్మించాలన్న తాపత్రయం. నలుగురికోసం పాటుపడాలన్న నిష్కల్మషమైన ఆకాంక్ష. ఇవన్నీ 1967కి ముందు సంగతి. 67 తరువాత దేశం మూడుగా చీలిపోయింది. సమాజంలో వ్యాపార విలువల్ని నమ్మి, వాటి కోసం బతికే వర్గం ఒకటి. అస్తవ్యస్తమౌతున్న వ్యవస్థని హింసాత్మకంగా తప్ప మరోలా సరిదిద్దలేమనే వర్గం మరొకటి. అత్యధికశాతం మనుషులు, ముఖ్యంగా మధ్యతరగతికి చెందినవారు ఈ రెండు వర్గాలతోనూ కలవలేనివారు తామున్నచోటుకే అంటిపెట్టుకుని ఎటువంటి ఆదర్శవాదాన్నీ నమ్మలేకా,

ఆచరించలేకా, తాము చాలా ఆచరణాత్మకంగా ఉన్నామని నమ్మించు కుంటూ యథార్థానికి పూర్తిగా రాజీపడుతూ జీవించడం మొదలుపెట్టారు.

సాహిత్యంలో కూడా ఈ ధోరణులు ప్రస్ఫుటంగా ప్రతిఫలించడం మనం చూడవచ్చు. 70ల నుండీ వచ్చిన సాహిత్యంలో, సినిమాల్లో, కళల్లో, అధికభాగం వ్యాపారాత్మకం, లేదా సామాజిక అసమ్మతిని వినిపించే సాహిత్యం. కాని తామున్నచోటనే ఉంటూ, తమ తమ స్థాయిల్లో చేపట్టగల చిన్ని చిన్ని పోరాటాల్నో, తాము నిలుపుకోగల చిన్ని చిన్ని విలువలనో ప్రస్తుతించగల, పైకెత్తగల సాహిత్యం మనకి 70ల తర్వాత దాదాపుగా మృగ్యం. ఆ మాటకొస్తే అసలటువంటి మనుషులు కూడా సమాజంలో చాలా తక్కువ. సామాజంలోనూ, సాహిత్యంలోనూ కూడా ఆదర్శవాదం ఆచరణాత్మకం కాదనే అభిప్రాయం నానాటికీ బలపడుతూ వస్తున్న పరిస్థితి మనది.

## 2

నేను 70ల తరానికి చెందిన వాణ్ణి. మా అక్కా, అన్నయ్యా కొంత వరకూ 60ల తరానికి చెందిన వాళ్ళు. 1972 లో మా అక్క ఉద్యోగం కోసం కాకినాడలో అడుగుపెట్టినప్పుడు, మేమంతా మొదటిసారి మా ఇంటినీ, మా ఊరినీ దాటిన విస్తృత ప్రపంచంలో అడుగుపెట్టాం. ఒక చిన్న కుగ్రామం నుంచి జిల్లా కేంద్రంలో అడుగుపెట్టినప్పుడు ఆ ప్రపంచం మా కోసం తెరిచిన తలుపులు, మా ముందు పరిచిన అవకాశాలూ చాలా సమ్మోహకరంగా ఉండేవి. సాహిత్యసమావేశాలూ, కవిసమ్మేళనాలూ, నాటకపోటీలూ, ఫిల్మ్ క్లబ్బులు, సామాజిక ఉద్యమాలు మా ముందొక కొత్త లోకాన్ని తెరిచాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే అప్పుడు మా ముందు తెరుచుకున్న ప్రపంచమేమంత పెద్దదికాదనిపిస్తోంది గానీ, ఆ రోజు మా ముందు తెరుచుకున్న లోకంలాంటి దాన్ని మళ్ళా ఇప్పటికీ నేను చూడలేకపోయాను. బహుశా 70ల ప్రారంభంలో దేశమంతటా నాగరీకరణ మొదలైన నవ్యోత్సాహంలో చాలా పట్టణాల్లో అటువంటి

వాతావరణమే నెలకొని వుండవచ్చు. కొంత భావుకత, కొంత సున్నితత్వం, కొంత విజ్ఞానం, కొంత సైన్సు, కొంత ఆదర్శం, కొంత ఆగ్రహం– అవన్నీ కలగలిసి జీవితానికి కొత్త ఇంద్రియాలు మొలుస్తున్నట్టుండేది. కొత్త రెక్కలు పుట్టుకొస్తునట్టుండేది.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, డా॥ ఆలూరి విజయలక్ష్మిగారిని మేం మొదటిసారి చూసింది ఆ రోజుల్లోనే. అప్పటి రోజుల ఆ నవ్యోత్సాహ మంతా ఇప్పుడు అదృశ్యమైపోయిందిగానీ, డా॥ ఆలూరి విజయలక్ష్మిగారిని చూసినప్పుడల్లా 70ల తొలినాటి ఆ సమ్మోహనీయ కాలమంతా మళ్ళా కొత్తగా నా చుట్టూ ముసురుకుంటుంది.

కాలం మారింది. దేశం మారింది. విలువలు మారాయి. జీవితానందానికి నిర్వచనాలు మారాయి. కాని డా॥ ఆలూరి విజయ లక్ష్మిగారు మారలేదు. ఆమె 60ల నాటి నిష్కల్మషత్వాన్నీ, ఆ అమాయి కత్వాన్నీ ఇంకా అట్లానే పదిలంగా దాచుకుంటున్నారా అనిపిస్తుంది. అందుకు దృష్టాంతాలుగా మీ చేతుల్లో ఉన్న ఈ రెండు కథలూను.

**3.**

There can be no poetry after Auschwitz అని 'అడొర్నొ' అన్నాడని మనకు తెలుసు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీ జర్మనీలో యూదుల్ని చిత్రహింసలు పెట్టిన తరువాత కవిత్వానికి కాలం చెల్లిపోయిందన్న ఉద్దేశ్యంతో ఆయన ఆ మాట అన్నాడు. 1950లో మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం ఇస్తూ చలంగారూ కూడా 'కవిత్వపు కాలం అంతమైంది' అన్నారు. ఆ మాటనే తెలుగు కథకి కూడా అన్వయిస్తే కాళీపట్నం రామారావు 'యజ్ఞం' (1964) కథ తరువాత తెలుగు సాహిత్యంలోనూ, సామాజిక భావజాలంలోనూ ఆదర్శ వాదం మళ్ళా తలెత్తే అవకాశం లేకుండా పోయిందని చెప్పవచ్చు. కాళీపట్నం యాభైల ప్రారంభంలోనే ఆదర్శవాద వినాశనాన్ని పసిగట్టాడు. యజ్ఞానికి మాతృకగా చెప్పదగ్గ 'అప్రజ్ఞాతం' (1951) కథలోనే ఆయన మొదటిసారి మన స్వతంత్ర్య

భారతదేశం ప్రస్తావిస్తున్న ఆదర్శాలు కేంద్రీకృత లక్షణాలు కల్గిన ఆదర్శాలనీ, అవి అంతిమంగా బలహీనుల్ని అణచివెయ్యడంలోనే పర్యవసిస్తాయనీ పసిగట్టాడు. 1967లో నక్సల్బరీ ఉద్యమం వచ్చింది, ఆ ఏడాదే కాంగ్రెసు చీలిపోయింది, అప్పట్నుంచీ దేశ భావనావ్యవస్థలో సంభవించిన చీలిక నానాటికీ మరిన్ని చీలికలుగా పర్యవసిస్తూ వచ్చిందే తప్ప మొత్తం సమాజాన్ని నిలబెట్టగల ఉమ్మడి ఆదర్శాన్ని గానీ, ఉమ్మడి విశ్వాసాన్నీ గానీ మనం చూడలేకపోయాం.

ఇక ఇప్పుడు మనం ఆధునికానంతర యుగంలో ఉన్నాం. ఇది స్వభావరీత్యా ప్లూరలిస్టిక్. ఇప్పుడు ఏ ఇద్దరికీ ఉమ్మడిగా వర్తించగల ఏ ఒక్క విలువా లేదనేటంత నిష్ఠురమైన కాలం. కానీ మనుషుల్నీ, విలువల్నీ అమాయికంగా ప్రేమించలేని రచయితలింకా మనమధ్య ఉంటే వాళ్ళిప్పుడేం రాయాలి? తమ తోటి మనుషులు కోసం ఏం చెప్పాలి?

ఆశ్చర్యమేమిటంటే ఇప్పుడు మళ్ళా రచయితలు ఆదర్శవాదం వైపు చూస్తున్నారు. ఈ మధ్య స్కైబాబ అనే యువకథకుడు 'ఏక్ కహానీ! తీన్ రంగ్' అని మూడు కథలు రాసాడు. మూడూ సెల్ ఫోన్ చుట్టూ అల్లుకున్న కథలు. నిష్ఠురమైన వాస్తవాన్ని ఉన్నదున్నట్లుగా పసిగట్టిన ఈ ఆదర్శవాదానికీ, 1964కి ముందు ఆదర్శవాదానికీ తేడా వుంది. పూర్వకాలపు ఆదర్శవాదం బోలు ఆదర్శవాదం. దానిలో వాస్తవ పరిస్థితుల పట్ల ఎరుక తక్కువ. అది చాలా వరకు ఊహాత్మకం. నేల విడిచిన సాము. ఇప్పటి ఆదర్శవాదం వాస్తవపరిస్థితులపట్ల సమ్యక్ జ్ఞానంతో, మెలకువతో, క్రియాశీలతత్వంతో కూడుకున్నది. అత్యంత ఆచరణాత్మకం. అన్నిటి కన్నా ముఖ్యమైన తేడా మరొకటి ఉంది. పూర్వకాలపు ఆదర్శవాదం ఒకే ఆదర్శాన్ని నలుగురికీ యాంత్రికంగా వర్తింపచెయ్యగలమని నమ్మేది. అది సాంప్రదాయికం. కాని ఇప్పటి ఆదర్శవాదం అలా భావించదు. ఇది ఎవరికి వారు తమ తమ వ్యక్తిగత జీవితానుభవాల మీంచి, తమ తమ వ్యక్తిగత ఆచరణల మీంచి తమ శక్తి సామర్థ్యాలకు తగ్గట్టుగా ఆచరించి చూపగల

ఆదర్శవాదం. ఒక రకంగా దీన్ని ఆధునికానంతర ఆదర్శవాదం అనవచ్చు.

## 4

తెలుగు సాహిత్యంలో ఆధునికానంతర కవిత్వంలో 1980 లో రేవతీదేవి 'శిలాలోలిత' కావ్యంతో మొదలయ్యింది. కథానిక ప్రక్రియలో సావిత్రిగారి 'ఈ దేశంలో ఇదో వర్గం' (1981) కథతో మొదలయ్యిందని చెప్పవచ్చు. ఇదంతా నా 'వందేళ్ళ తెలుగు కథ' (2001)లో నేను వివరంగా చర్చించాను. 80 ల్లోనే రాసినప్పటికీ, చాలా ఆలస్యంగా ఇప్పుడు వెలుగు చూస్తున్న ఈ రెండు కథల్లోనూ ఆధునికానంతర ఆదర్శవాదం చాలా స్పష్టంగా కనిపించడం నన్నెంతో సంతోషానికీ, సంభ్రమానికీ గురిచేసింది. ఏమిటుంది ఈ కథల్లో? విషయం చాలా స్పష్టంగా ఉంది. ప్రశ్నలు సూటిగానే ఉన్నాయి.

ప్రేమానుభవ తీవ్రతలో ఉన్న ఒక స్త్రీ పెళ్ళి కాకుండానే శారీక అనుభవాన్ని కోరుకుని గర్భం ధరించడం, తీరా ఆ వ్యక్తి తనని నిరాకరించి నప్పుడు అబార్షన్ చేయించుకోక తప్పకపోవడం. ఆమెను మరొక పురుషుడు ప్రేమించినపుడు, ఆమె తన ఈ అనుభవమంతా అతనికి చెప్పినప్పుడు, అతడు ఆమెను అర్థం చేసుకోగలగడం, స్వీకరించడం–ఇది 'వెలుతురు పువ్వులు' ఇతివృత్తం. ఇటువంటి కథ 64కి పూర్వం వస్తే అందులో అబార్షన్ ఉండదు. ఆత్మహత్య ఉంటుంది. 64 నుంచి 80 మధ్యలో అబార్షన్ ఉంటుంది గానీ, ఆమె ఒంటరిగా జీవించకతప్పదనే నిర్ణయానికి వచ్చి ఉంటుంది. 80ల తర్వాత చాలా స్త్రీ వాద సాహిత్యంలో కూడా దాదాపు ముగింపు అలానే ఉంటుంది. కానీ అటువంటి ముగింపు నివ్వకపోవడంలోనే డా॥ ఆలూరి విజయలక్ష్మిగారి సాహసం కనిపిస్తుంది. అందుకు ఆమె వేసుకున్న ప్రశ్నలిలా ఉన్నాయి!

వివాహమయ్యేదాకా నీ జీవితంలోకి ఎవరూ రాకూడదు. ఒకవేళ ఎవరైనా వస్తే ఆరునూరైనా అతనితో లేక ఆమెతోనే నీ జీవితం ముడిపడాలని ఎవర్నైనా శాసించగలమా?....వివాహమయాక కూడా

మరొక వ్యక్తిని అభిమానించవచ్చు. ఇష్టపడవచ్చు. ఆకర్షింపబడవచ్చు. ధైర్యం, చొరవ, కోరిక ఉన్నవాళ్ళు శారీరక బంధాన్ని కూడా పెంచు కుంటారు. ఏది తప్పు? ఏది ఒప్పు? తప్పొప్పుల సరిహద్దుగీతలెక్కడ? కేవలం శారీరక సంబంధమే తప్పా? మానసికమైన ఇష్టం, ఆకర్షణ ఇవి తప్పు కావా? ....పాశ్చాత్య సమాజంలో వీటినంతగా పట్టించుకోరే?! స్త్రీ పురుష బాంధవ్యాలిక్కడింత సంకుచితంగా, అక్కడంత విశృంఖలంగా ఎందుకుంటున్నాయి? ఈ రెండు వ్యతిరేక ధృవాలకీ ఎప్పటికి సమన్వయం కుదురుతుంది? ఈ స్త్రీ పురుష బాంధవ్యాలకు ఆర్థిక సామాజిక పునాదులేవి?.... ప్రపంచం ఆర్థికంగా, వైజ్ఞానికంగా ముందుకు పోవలసిన సమయంలో నిరంతర స్రవంతిలా సాగిపోవలసిన బాంధవ్యం ఇంత క్లిష్టంగా ఎందుకు మారుతూంది?..'

ఇవీ ప్రశ్నలు :

సమాధానం ఇలా ఉంది :

'బ్రతకడమెంత సహజమో, పొరపాట్లు చెయ్యడమూ అంతే సహజం. ఈ పొరపాట్లనేవి వ్యక్తికీ వ్యక్తికీ, కాలానికీ కాలానికీ, దేశానికీ దేశానికీ మారుతూ ఉంటాయి. సుఖంగా బ్రతకాలంటే కొన్ని పొరపాట్లతో రాజీపడాలి.'

ఇది ఆదర్శవాదమే కానీ, వ్యక్తులు తమ తమ ఆచరణలో తమకు తాముగా చేరగల ఆదర్శవాదం. ఎవరో చెప్పారు కాబట్టి ఆచరించాలనుకునే నీతిశాస్త్రం కాదు.

ఇక రెండవ కథ 'ప్రత్యూష పవనం' లో జీవిత వాస్తవాల నిష్టురత్వం పట్ల ఎరుక మరీ స్పష్టంగా ఉంది. మొదటిది ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిన ప్రశ్నల్ని లేవనెత్తితే రెండవ కథలో ఒక సమాజం మొత్తానికి సంబంధించిన ప్రశ్నలున్నాయి. 'ఎంతో చిత్తశుద్ధితో, ఎన్నో ఆదర్శాలతో, వృత్తిలో, ఉద్యోగంలో ప్రవేశించే యువతను అవినీతిపరులుగా, చరిత్ర

హీనులుగా మారుస్తున్న వ్యవస్థ' గురించిన దుర్భరమైన మెలకువతో రాసిన కథ. వాస్తవాన్ని నిదానించడంలో రచయిత్రి ఎక్కడా వెనకంజ వెయ్యలేదు. రాజీపడలేదు. అయినా కూడా కథలో డా. వాసంతి తన ఆదర్శాల్నీ, విలువల్నీ వదిలిపెట్టాలనుకోదు. బహుశా ఆమె కోరుకున్నదంతా సుధీర్ వంటి ఒక స్నేహితుణ్ణి మాత్రమే. ఒక సహచరుడో, సహచరినో తోడుగా నిలబడగల్గితే మనిషి తన ఆదర్శాలకు నిలబడటం ఏమంత కష్టం కాదనే రచయిత్రి భావిస్తున్నది.

**5**

డా॥ ఆలూరి విజయలక్ష్మిగారు జీవితంలోనూ, సాహిత్యంలోనూ కూడా తన ఆదర్శలోకాన్ని పదిలపర్చుకుంటున్న వ్యక్తి. 70ల మొదట్లో ఆమె ఎంత ధగధగతో నాకు కనిపించారో ఇప్పుడు ఈ కొత్త శతాబ్దంలో కూడా ఈ రెండు కథలు చదువుతున్నప్పుడు కూడా ఆమె అంతే ధగధగతో కన్పిస్తున్నారు. కథలు చదవడం పూర్తవగానే 'అదిగో నవలోకం, విరిసే మనకోసం' అనిపిస్తోంది.

# ప్రత్యూష పవనం

**సంధ్య లలాటం మీద కుంకుమలా ధగధగలాడు తున్నాడు సూర్యుడు. కడలి తరంగాలలో సయ్యాటలాడిన గాలి గళం విప్పి హాయిగా పాడుతూంది.**

పొడవాటి జడని బిగించి ముడిచుట్టుకుని పయటచెంగు బొడ్లోదోపి సామానంతా సర్దుకుంటూంది వాసంతి. రాత్రి డ్యూటీతో ఆమె హౌస్‌సర్జన్సీ పూర్తి చేసింది. అప్పుడే జారిన ప్రత్యూష కిరణంలా వుందామె కళ్ళలోని మెరుపు. అప్పుడే రాలిన పారిజాతాల్లా వున్నాయామె ఆశలు, ఆశయాలు, ఆలోచనలు.

సర్జరీ పుస్తకాన్ని శుభ్రంగా గుడ్డతో తుడుస్తూంది వాసంతి. తలుపుమీద టకటకలాడించి, ధబ్బున తోసి లోపలికొచ్చింది సంధ్య.

"ఏయ్! అప్పలమ్మా! నువ్వింకా యిక్కడే వున్నావా? అక్కడ హాస్టల్లో అంట్ల గిన్నెలన్నీ నీమీద విరహంతో నల్లబడిపోతున్నాయి. క్విక్! క్విక్! తొందరగా కానివ్వు. ఇంతకూ మా వాసంతసమీరమేది?" సుడిగాలిలా అలగా తిరుగుతూంది సంధ్య. చేతిలోని సర్జరీ పుస్తకాన్ని ఎక్కడ సర్దాలా అని ఆలోచిస్తున్న వాసంతి సంధ్య వంక తీక్షణంగా చూచింది.

"నీ నటనని, నాట్యాన్ని ఆపుతావా, లేక యీ సర్జరీ బుక్‌తో నీ పాదాలకు ముద్దు పెట్టించమంటావా, మొహమాట పడకుండా చెప్పు" నిజాయితీగా అడిగింది వాసంతి. పుస్తకం వున్న చేతిని పైకెత్తి వుంచి సంధ్య జవాబు కోసం నిరీక్షిస్తూంది.

"బాబ్బాబు! అంత పనిచేయకే. ముద్దుల రుచి తెలియని అర్భకురాల్ని,

అవంటే నాకు గాభరా.” చిలిపిగా నవ్వింది సంధ్య

“సరే. దయతలచి క్షమించానీసారికి. నేనీ సామాను సర్దేవరకు యిదిగో యీ సర్జరీ బుక్ చదువుకుంటూ కూర్చోబుద్ధిగా” వాసంతి ఆర్డర్ విని కంగారుపడి పోయింది సంధ్య.

“ఏమిటే, ఎంత నీకు నామీద కోపమైతే మాత్రం యింత పెద్ద శిక్షేస్తావా? నొ.నొ. ఆ పుస్తకాల గాలంటేనే నాకు ఎలర్జీ” రెండోసారి పాథాలజీతో కుస్తీపడుతున్న సంధ్య వాసంతి ఎక్కడ బలవంతాన పుస్తకం తనచేతిలో పెడ్తుందో నన్నట్లు చేతులు వెనక్కు పెట్టుకుంది.

“ఖర్మ!! నీలాంటి దానికి సీటిచ్చినవాడిని షూట్ చెయ్యాలి ముందు” వాసంతి ముఖకవళికల్ని చూచి గలగల నవ్వింది సంధ్య.

“పద! పద! తొందరగా ఆ అప్పలమ్మ అవతారాన్ని చాలించు. అలా కోస్టల్ బ్యాటరీ మీదుగా బీచ్‌రోడ్‌లో కబుర్లు చెప్పుకుంటూ “క్వాలిటీ” దాకా వెళ్ళొద్దాం. ఏదో ఒకనాటి క్లాస్‌మేట్‌ని. మరీ కంగారు పడిపోయి, రుబ్బేసి పాసయి పోయావు కాని ఇంకా నాక్లాస్‌మేట్‌గా వుండే అదృష్టాన్ని పొందాల్సినదానివి, వెళ్ళిపోయేప్పుడు ఒక కప్పు ఐస్‌క్రీమన్నా పెట్టంచలేదని ఏడ్చుకుంటావని యిలా వచ్చాను.” పెదాలు బిగపట్టి వాసంతి వంక ఓరగా చూస్తూ నవ్వింది సంధ్య.

వాసంతి, సంధ్య కబుర్లు చెప్పుకుంటూ, ముంతకిందపప్పు తింటూ ‘క్వాలిటీ’ ఐస్‌క్రీమ్ షాపు దాటి పిఠాపురం క్వార్టర్స్ వైపు కొంచెం దూరం నడిచి వెనక్కు తిరిగారు. బీచ్ అంతా రంగులమయంగా వుంది. ఒడ్డున ఉన్న మనుషుల కంటే ఎక్కువగా అరుస్తూ నవ్వుతూ, త్రుళ్ళుతూ వుంది సముద్రం.

జనం అంతగా లేని చోట కూర్చున్నారిద్దరూ. సంధ్య కాలు ముందుకు జాపి, చీరపైకి జరిపి, పిచిక గూడు కడుతూంది. గడిచిపోయిన బంగారు

జీవితంలోని అందమైన స్మృతుల్ని నెమరేసుకుంటూ, భవిష్యత్తుని మధురమధురంగా ఊహించుకుంటూ, తమ కలల్ని కలబోసుకున్నారిద్దరూ.

"హలో సంధ్యా!" కళ్ళజోడు సర్దుకుంటూ వస్తున్నాడు సుధీర్. యూనివర్సిటీలో రీసెర్చి స్కాలరతను. సంధ్య ఫ్రెండ్. పలకరింపులయ్యాక వాసంతి హౌస్ సర్జన్సీని పూర్తిచేసిన సందర్భంలో ఆమెకు వీడ్కోలు పార్టీ ఇవ్వాలనే మహత్తరమైన ఆలోచన వచ్చిన వైనం చెప్పింది సంధ్య.

"సుధీర్!యీరోజు నుంచి మా వాసూ ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ డాక్టర్. అనగా సదా ప్రజల్ని తన సేవలతో తరింపజేసే వ్యక్తి. అఫ్‌కోర్స్, కిట్టని వాళ్ళు లైసెన్స్ వున్న హంతకి అనికూడా అంటారనుకో. అలాంటి దుర్భాషల్ని మంచివాళ్ళం, మనం వినకూడదు." సుధీర్ చూడకుండా సంధ్య నోటికింక తాళం వెయ్యమని ఆదేశిస్తూ ఆమె జడని గుంజింది వాసంతి.

"కిట్టని వాళ్ళనటంకాదు. మీ డాక్టర్లంత దగుల్బాజీ లింకెవరూ వుండరు. దయా దాక్షిణ్యం, మంచీ మానవత్వం లేని రాక్షసులు." సుధీర్ ధోరణి చూచి గాభరా పడుతున్న వాసంతి వంక చూచి 'భయపడకు' అన్నట్లు సైగ చేసింది సంధ్య.

"డబ్బు కోసం ప్రజల రక్తాన్ని పీల్చే జలగలు. శవాలమీది డబ్బు పోగుచేసుకుని మూటలు కట్టుకునే పిశాచాలు. ఒక వైపు పేషెంట్ ప్రాణం పోతున్నా డబ్బు పెట్టందే చలించని పాషాణాలు." సుధీర్ మనస్సులో దుగ్ధ తీరినట్లు లేదు. కాని తిట్టటాని కింకేమీ మాటలు తట్టక ఆపుచేశాడు. వినోదంగా సుధీర్‌వంక చూస్తున్న సంధ్య చటుక్కున లేచి నుంచుని వాసంతి చెయ్యి పుచ్చుకుని ఆమెను కూడా లేపింది.

"సుధీర్! ఏదీ నీ కాళ్ళిటుపెట్టు" అంది సంధ్య. అర్థంకానట్లు చూచి కాళ్ళను దగ్గరకు జరుపుకున్నాడు సుధీర్.

"ఏమిటే" అయోమయంగా సంధ్య వంక చూచింది వాసంతి.

"ఈ మహాజ్ఞానికి సాగిలపడి మొక్కడం అజ్ఞానుల మయిన మన కనీసకర్తవ్యం. సుధీర్! కాళ్ళు ముందుకు జరుపు స్వామీ! మీ పవిత్ర పాదాల్ని స్పృశిస్తే మా సర్వపాపాలు హరించి, మా హృదయాలు మీ దివ్య స్పర్శతో పునీతమయి దయాదాక్షిణ్యం, మంచీ మానవత్వాలతో తొణికిసలాడతాయేమో ఎవరు చూడొచ్చారు?".

"ఏమిటే, నీ పెంకితనం నువ్వూను! " సంధ్యను కసిరి బలవంతాన కూర్చోబెట్టింది వాసంతి.

"అయ్యో! అదేమిటే అలా అంటావు. మన గురించి ఇంతింత గొప్ప గొప్ప అభిప్రాయాలున్న మహానుభావుడికి మనం తప్పకుండా భక్తితో నమస్కరించాలి. అయితే సుధీర్, అజ్ఞానిని, నాకు చాలా సందేహాలున్నాయి తమరు తప్పక నన్ను కరుణించి వాటిని తీర్చాలి" అంది సంధ్య.

"సంధ్యా! నువ్వెంత ఎగతాళిగా మాట్లాడినా నే నన్నది పచ్చి నిజం. బోర్డు కట్టిన మరుక్షణం నుంచి బంగారపు ఇటుకల్తో మేడ లెప్పుడు లేపుదామా అని ఎదుచుచూసే దురాశపరులు. పవిత్రమైన వృత్తికి కావలసిన సేవ, దయ, బాధను చూచి స్పందించే మెత్తని హృదయంలేని కటికరాళ్ళు" కచ్చగా అన్నాడు సుధీర్.

"దగుల్బాజీలు, రాక్షసులు, జలగలు, పిశాచాలు, పాషాణాలు, దురాశాపరులు...వాసూ! నోట్‌డౌన్. మన కిచ్చిన యీ బిరుదులకి సంజాయిషీ తరువాత అడుగుదాం. అయ్యా, సుధీర్ బాబూ! అసలు తమరీ బిరుదులివ్వడానికి గల కారణాలు సెలవివ్వండి." అంది సంధ్య చురుగ్గా చూస్తూ.

"కారణాలు జగద్విదితం.ప్రత్యేకించి యిప్పుడు చెప్పఖ్ఖర్లేదు" అన్నాడు సుధర్ ముఖం ప్రక్కకు తిప్పుకుని.

"అహఁహ! అలా తప్పించుకుంటే లాభం లేదు" అంది సంధ్య.

సుధీర్ పెదాలు బిగించి ఎటో చూస్తూ కూర్చున్నాడు.

"వాసూ! ఈయనగారిలా మండి పోవడానికి గల కారణాల్ని ఊహించడానికి పెద్ద తెలివితేటలేం అక్కర్లేదు. ఈయనగారికో, ఈయనగారి సన్నిహితులకో డాక్టర్ల దగ్గర చేదు అనుభవం ఎదురయ్యుంటుంది. డబ్బు పెట్తే తప్ప ముఖం చూడనని చీదరించుకుని వుంటారు" అంది సంధ్య నింపాదిగా సుధీర్ వంక చూస్తూ.

"యస్. యూ ఆర్ కరెక్ట్. నిన్నగాక మొన్న నా ఫ్రెండ్ మదర్‌కి సీరియస్ అయి అర్జంట్‌గా ఆపరేషన్ చెయ్యాల్సొస్తే వెయ్యి రూపాయలు టేబుల్‌మీద పెడితే కాని కత్తిపుచ్చుకోనన్నాడా డర్టీ రోగ్. ఉండే ఇల్లమ్ముకుని తెచ్చుకున్నా, మెళ్ళో పుస్తెలమ్ముకుని తెచ్చుకున్నా మీకు చీమ కుట్టినట్లుకూడా వుండదు. మీరు....మీరీ సమాజాన్ని కలుషితం చేస్తున్న విష కీటకాలు?" సుధీర్ ఆవేశం చూచి గల గలా నవ్వింది సంధ్య.

"నెమ్మది, నెమ్మది. మరీ అంత ఉద్రేకపడిపోతే హార్ట్‌ఎటాక్ వచ్చేస్తుంది. అప్పుడు చచ్చినట్లు నువ్వు పిశాచాలు, రాక్షసుల దగ్గరకే చేరాలి" అంది సంధ్య.

"అదిగో, అదే మీ అహంకారం. ప్రతివాడికీ మీతో ఎప్పుడో ఒకప్పుడు అవసరం వచ్చి తీరుతుంది. తమప్రాణాల్ని మీ చేతుల్లో పెట్టే దయనీయమైన స్థితి వస్తుందనే పొగరుతోనే మీరింత విచ్చల విడిగా ప్రవర్తిస్తున్నారు" సుధీర్ ఆవేశం తార స్థాయినందుకుంది.

"సుధీర్! యింక నిన్ను క్షమించను. ఎవరికో జరిగిన ఒక చెడ్డ అనుభవాన్ని తీసుకొని డాక్టర్లందరినీ ఒకే గాటిన కట్టెయ్యడం మొదటితప్పు. ఇప్పుడే హౌస్‌సర్జన్సీ పూర్తిచేసి ఎన్నో ఆదర్శాలతో, స్పందిచడం మరిచిపోని హృదయంతో వృత్తిని చేపట్టబోతున్న మావాసూ లాంటి వాళ్ళను కూడా వాళ్ళల్లో కలిపేయడం రెండో తప్పు"

"విత్ అపాలజీస్ టు డాక్టర్ వాసంతి, మీదంతా ఒకటేజాతని నానమ్మకం. సంపాదనముందు ఇంకేమీ కనపడవుమీకు. నీబోటిదెవరైనా ఆదర్శాలు వల్లించిందంటే అది ప్రజలకళ్ళల్లో కారం కొట్టడానికే."

"ఎక్సలెంట్! నీ అభిప్రాయాలు బ్రహ్మాండంగా వున్నాయి, నువ్వింతగా తెగేసి నీ అభిప్రాయాల్ని చెప్తునావు గనుక నా అభిప్రాయాల్ని కూడా చెప్తాను విను. నీలాంటివాళ్ళంతా సంపాపదించుకునే వాళ్ళను విమర్శించేది, మీకూ అలాంటి అవకాశం లేదనే ఏడుపుతో. షీర్ జెలసీ ఐసే, నీలా నీతులు చెప్పేవాళ్ళకు అవకాశం దొరికిందంటే, నువ్విందాక ఒకలిస్ట్ బిరుదులిచ్చావే, అంతకంటే అధ్వాన్నంగా ప్రవర్తిస్తారు. బాబూ! సుధీర్! నీతికి, అవినీతికి, న్యాయానికి, అన్యాయానికి మధ్య సరిహద్దుగీతలు మనం గీసుకునేవి. మనఅవసరాలు, అవకాశాల్నిబట్టి యీ గీతల్ని మనకనుకూలంగా యిటూ అటూ జరుపుకుంటాం. నీకే వున్నపళాన మా డిగ్రీ యిస్తే 'సేవ, దయ' లాంటి చెత్తనంతా మురుగుకాలవలోకి తోసేసి జనాన్ని విరిచేసి నంజుకు తింటావు"

"అబ్బ! ఆపవేబాబూ:" విసుక్కుంది వాసంతి. వాసంతి విసుగుచూచి సుధీర్ తగ్గాడు.

"సంధ్యా: నేను శాకాహారిని. జనాన్ని నంజుకుతినలేను" నవ్వాడు సుధీర్

''అవడానికి శాకాహారివే కాని యీమధ్య వేటలో సిద్ధహస్తుడివయ్యావని తెలిసిందిలే." సుధీర్ వంక పరిహాసంగా చూచింది సంధ్య.

"వేటా!" అర్థంకానట్లు చూచాడు సుధీర్

"నంగ నాచిలా చూడకు." గదిమింది సంధ్య.

"ఏమో! నాకేం అర్థం కావడం లేదు." చిత్రంగా భుజాలెగరేశాడు

సుధీర్.

"రీసెర్చి అంటూ నువ్వు యూనివర్సిటీలో చేస్తున్న ఘనకార్యం నాకు తెలీదనుకోకు. అమ్మాయిల వేటలో కొత్తమెలకువల గురించి నువ్వు రీసెర్చి చేస్తున్నావని నాకు వార్తలొచ్చాయి" ఇప్పుడేం చెప్తావ్ అన్నట్లు చూచించి సంధ్య.

"అన్యాయం. లేనిపోనివన్నీ కల్పించిచెప్పారెవరోనీతో, అవునుగాని సంధ్యా: నామీద సి.ఐ.డి. పనెందుకు మొదలు బెట్టినట్లో తమరు?" సుధీర్ ప్రశ్నకు జవాబును సంధ్య చెప్పలేదు. కొంటెగా నవ్వుతున్న ఆమె కళ్ళు చెప్పాయి.

## 2

ఇంటికి వెళ్ళి పదిరోజుల్లో తిరిగొచ్చింది వాసంతి. ఎమ్.డి. చేసి ఫారెన్ వెళ్ళి యింకా పై చదువులు చదివి రావాలనే కోరిక ఎంతగానో వుంది. కాని అవసరాలు ఆమెకా అవకాశాన్నివ్వక నెత్తిమీద మొట్టిమరీ సంపాదనకోసం ప్రయత్నించమంటున్నాయి. వాసంతి నాన్నగారు ఆమె ఫైనలియర్‌లో వుండగా అకస్మాత్తుగా కన్నుమూసేరు. ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముడు చదువుకుంటున్నారు. తండ్రి ఉద్యోగం తప్ప వెనుక ఆధారంలేక పోవడం వల్ల కుటుంబభారాన్ని వాసంతి భుజాలమీద కెత్తుకోక తప్పిందికాదు.

హౌస్‌సర్జన్సీ అయిపోగానే ఉద్యోగం దొరికే రోజులు పోయాయి. ప్రాక్టీస్ పెట్టాలంటే పెట్టుబడికి ఇబ్బడి ముబ్బడిగాడబ్బుండాలి. పెట్టుబడి పెట్టాక నిలదొక్కుకోగలమో లేమోనని భయం. బయటి దేశాల్లోఏమాత్రం అవకాశం దొరికినా దాన్ని అంది పుచ్చుకొని బ్రతుకుదెరువు కోసం విదేశాల్లో జాబ్స్‌కి తరలి పోతున్నారు.

దేశంలో ఒకవైపు కోట్లాది ప్రజలు కనీస వైద్యసదుపాయం కూడా అందక అతి దారుణంగా నివారించగల మరణాలకు గురవుతున్నారు. మరోవైపు 'మీరు స్వార్ధంతో డబ్బుకోసం టౌన్స్‌లోనే వుండిపోతున్నారు. స్వార్థాన్ని విడనాడి గ్రామసీమలకు తరలి వెళ్ళి పేద ప్రజలకు సేవచెయ్యండి.' అంటూ సిటీల్లో ఎయిర్ కండిషన్స్ గదుల్లో కూర్చుని మాకు ఉద్భోధచేసే ప్రతివాడూ తగిన మందులు, పరికరాలు, సౌకర్యాలు సమకూరేలా బడ్జెట్‌ని రూపొందించకుండా, మా సేవలకు తగిన ప్రతిఫలం గురించి ఆలోచించ కుండా, ఏదోఒక అవకాశం దొరికితేచాలు, మా చదువుకు సార్ధకత చేకూరేలా పనిచేస్తానికి మేము సిద్ధంగావున్నా మమ్మల్ని స్వార్ధపరులుగా, దోషులుగా సమాజంముందు నిలబెట్టడం న్యాయమా" అని ఆక్రోశి స్తున్నారు యువడాక్టర్లెంతోమంది. తమ సమస్యల్ని పట్టించు కోకుండా రాక్షస రాజకీయ క్రీడలో నిమగ్నులైన వినాయకులవంక కసిగా చూస్తున్నారు ప్రజలూ, యువడాక్టర్లు కూడా.

"ఉష్" అనుకుంటూ లోపలికి వచ్చింది వాసంతి. వాడిపోయిన వాసంతి ముఖంచూచి గబగబ మంచినీళ్ళందించింది సంధ్య..

"ఏమిటే అలా చూస్తున్నావు" తన కాళ్ళవంక నిశితంగా చూస్తున్న సంధ్యను అడిగింది వాసంతి.

"చెప్పులెంత వరకు అరిగాయా అని చూస్తున్నాను." సంధ్య సరదాగా అన్నా వాసంతికి చురుక్కుమనిపించింది.

"నీక్కూడ ఎగతాళి అయిపోయానన్నమాట" వాసంతి కళ్ళల్లోని విషాదం చూచి సంధ్య మనసు చివుక్కుమంది.

"ఛీ! ఛీ! నువ్వంటే ఎగతాళా నాకు? నా మాట విని ఎమ్.డి.లో చేరడం లేదని కోపం తప్ప."

"ఎలా వినవే? రెండేళ్ళనుంచి గౌతమిమీద, వేదమీద, నీ మీద 'పేరసైట్' లా బ్రతికాను. ఎప్పటికప్పుడు రెండో వ్యక్తికి తెలియనీయకుండా మీరు నన్నాదు కోకపోతే ఈ మాత్రం ధైర్యం కూడా ఉండేది కాదు. నాకో డిగ్రీ చేతికొచ్చాక కూడా ఇంకా ఎవరిమీదైనా ఆధారపడి బ్రతకాలంటే అసహ్యంగా వుంది. మీ స్నేహాన్ని ఉపయోగించుకోవటానిక్కూడా ఒక హద్దుంది."

"చాల్లే. బొత్తిగా భర్త్రాణి వవుతున్నావు? పెద్ద, మేమేదో నిన్ను ఉద్ధరించినట్లు కబుర్లు. మళ్ళీ ఎప్పుడైనా ఆమాటెత్తావంటే చూడు, పీక పిసికి అవతల పారేస్తాను." సంధ్య యాక్షన్‌కి, మాటలకి నవ్వకుండా వుండలేక పోయింది వాసంతి. అంతలోనే నిరాశ కారు మేఘంలా చుట్టేసింది.

"ఈ ఊళ్ళో వున్న నర్సింగు హోమ్స్ అన్నిటికీ వెళ్ళాను. ఒక్క ఐదు వందలిచ్చినా నర్సింగ్ హోమ్‌కి అంటి పెట్టుకుని వుండి ఇరవై నాలుగు గంటలూ సిన్సియర్‌గా పనిచేస్తానని బ్రతిమాలాను" దిగులుగా చెప్పింది వాసంతి.

"నువ్వొట్టి పిచ్చిమొద్దువే. నువ్వు ఒళ్ళొంచి పనిచేస్తావని వాగ్దానం చెయ్యగానే సంతోషంతో పూలమాల వేసి ఉద్యోగ మిచ్చేయడానికి యిదే కాలమనుకున్నావు? నీ మట్టుకు నువ్వు డిగ్రీ చేత్తో పట్టుకొని వెళ్తే చప్రాసీ ఉద్యోగం కూడా యివ్వరు."

"చప్రాసీ ఉద్యోగం ఎలాగు యివ్వరు లేవే. అందుకు పనికిరామని వాళ్ళకీ తెలుసు. ఒక్కదాన్నీ రికమెండేషన్ లేకుండా వెళ్తే పనిజరగదని తెలిసే మా దూరపు బంధువు, ఒకాయ నిక్కడ మంచి పొజిషన్‌లో వున్నారు, ఆయన్ని, నన్ను బెస్ట్ స్టూడెంట్ అని మెచ్చుకునే ప్రొఫెసర్ రామచంద్రరావు గారిని కాస్తమాట సహాయం చెయ్యమని అడిగాను. ఇదిగో, అదిగో అని

దాటేస్తున్నారు తప్పితే పని జరగడం లేదు.'' కన్నీళ్లు బయటకు దూకుతానంటున్నాయి. కంఠం పట్టేసింది. వాసంతి వంక జాలిగా చూచింది సంధ్య.

"ఈ రోజుల్లో రికమెండేషన్లు అల్లాటప్పగా చేస్తున్నారనుకున్నావా? అంతా తూకం. నీతో ఒక పనుంటే, నీకో పనిచేసి పెడతారు. స్నేహం, బంధుత్వం, కులం అన్నీ తరువాతవే." సంధ్య చెప్పేది కటువయిన నిజమని వాసంతికీ తెలుసు. కాని లోపల ఏదో అసంతృప్తి, ఏదో ఉక్రోషం, ఏదో అసహాయత.

"బాగా బంపర్ ప్రాక్టీసున్న డాక్టర్లు కూడా ఇంత కారు చౌకగా అసిస్టెంట్‌గా పని చేస్తానంటే ఒప్పుకోక పోవడం చూస్తే భలే ఆశ్చర్యంగా వుందినాకు. నా వల్ల ఎంత పని తగ్గుతుంది వాళ్ళకు!'' వాసంతి అమాయకత్వం చూచి నవ్వొచ్చింది సంధ్యకు.

"అదే, పని తగ్గుతుందనే వాళ్ళ భయం. వాళ్ళ ట్రేడ్ సీక్రెట్స్ అన్నీ నేర్చేసుకుని రెండు, మూడేళ్ళు పోయాక వాళ్ళ ఎదురుగుండానే నువ్వు దుకాణం తెరిస్తే నిజంగానే పని తగ్గిపోతుందనే దడ. అంచేత అంత త్వరగా ఎవరూ అసిస్టెంట్స్‌ని పెట్టుకోరుగాని, ఇంకో దారేమయినా వుందేమో ఆలోచించు."

"అలా అంటావేమిటే? పోనీ, లేడి డాక్టర్స్ సంగతి వదిలెయ్. మగడాక్టర్లు నన్ను అసిస్టెంట్‌గా పెట్టుకుంటే డెలివరీ కేసులవీ ఎక్కువరావూ?''

సంధ్య వాదన వింటూంటే ఉక్రోషం ఎక్కువవుతూంది వాసంతికి.

"డెలివరీ కేస్‌ల మాట దేవుడెరుగు, లేడీ డాక్టర్ని అసిస్టెంట్‌గా పెట్టుకుంటే ఇంట్లో భార్యా మణిగారు రోజూ డెలివరీ నొప్పులు డాక్టరుగారే పడేలా సాధించి పెడుతుంది. అదీగాక పేషెంట్స్‌కి మాంచి రొమాంటిక్

స్టోరీకి ముడిపదార్థం దొరుకుతుంది.”

“చచ్చాం. మళ్ళీ యిదొకటా?” నవ్వింది వాసంతి.

“మరేంటనుకున్నావ్? ఉద్యోగమంటే వరస తప్పకుండా గోల్డు మెడల్స్ పుచ్చుకోవడమనుకున్నావా?! అది సరే, మీరాజా వారెక్కడా దర్శన భాగ్యం కలిగించడం లేదేమిటి?” రాజా తలపు వాసంతిని ఉద్యోగపు ధ్యాస నుంచి మరల్చింది. గత స్మృతుల మాధుర్యం వర్తమానపు వ్యధను మరిపించింది.

## 3

క్లినికల్ సైడ్‌కి వచ్చాక మొదటి పోస్టింగ్ సర్జికల్ వార్డు. కొత్తగా వచ్చిన అలంకారం సరికొత్త స్టెతస్కోపుని మెళ్ళో వేసుకుని, పువ్వులావున్న ఓవర్ కోట్ జేబులో డైరీ పెట్టుకుని, అప్పుడే డాక్టరయి పోయినంత గర్వంతో వార్డులో అడుగు పెట్టింది వాసంతి. ఒక పేషెంట్ దగ్గరకు వెళ్ళి కేస్‌షీట్ చదవ సాగింది. ఆమె వార్డుమేట్స్ కొంచెం దూరంలో నుంచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళ దగ్గరకు వెళ్ళి హస్కు కొడదాం అంటున్న మనసును పట్టి ఆపి, కేసు గురించి చదవ సాగింది. అంతలో ఓ ఫైనలియర్ అబ్బాయి వచ్చి దూకుడుగా వాసంతి చేతిలో కేస్‌షీట్ లాక్కుని గబగబా డైరీలో ఏమిటో నోట్ చేసుకోసాగాడు. ఒక క్షణం విస్తుపోయి చూస్తూ నిలబడిన వాసంతి మరుక్షణం కోపంతో దహించుకుపోతూ తన కోపాన్నెలా బయటపెట్టాలో తోచక అతని వంక గుర్రుగా చూస్తూ నిలబడింది.

“మరీ అలా చూసేయకండి. సమయానికి వార్డుబోయిస్ కూడా ఎవరూలేరు” వాసంతి వంక చిత్రంగాచూచి చిలిపిగా నవ్వాడతను. ఇప్పుడు అర్జంట్‌గా వార్డు బోయిస్ అవసరమేమిటో అర్థంకాక తెల్లబోయింది వాసంతి.

"మరేంలేదు. మీ చూపులకి నేను భస్మమయాననుకోండి. మన బాస్ వచ్చేటప్పటికా బూడిదనెత్తేయకపోతే ఆయనకి పూనకం వచ్చేసి గణాచారిలా ఊగిపోతాడు" కేస్‌షీట్, డైరీ చేతిలోఉంచుకుని, కేస్ విషయం మరిచిపోయి కబుర్లకి దిగాడతను.

"అఫ్‌కోర్స్! మీలాంటి అందమైన ఆడపిల్లల చూపుల వేడి తగలడం కూడా అదృష్టమేననుకోండి" ఒక్కసారి వాసంతి కళ్లు వెడల్పుగా అయ్యాయి. 'అందమైన ఆడపిల్ల!' తియ్యటి విద్యుత్తు వాసంతి అణువణువులో వేగంగా పాకింది.

"అసలు నాకు మన ప్రిన్సిపాల్ మానసిక స్థితిమీద అనుమాన మొస్తూంది. అందంగా వున్నారు కదా అని మూగపిల్లల్నికూడా మెడిసిన్‌కు సెలక్టు చేస్తున్నారు." విచారాన్నభినయించాడతను. పెదాలు బిగించి, మెరుస్తున్న కళ్ళతో అతని వంక చూస్తూంది వాసంతి. 'మాటలురావా? వనపడను కూడా వినపడదా?' అంటూ మూగ, చెవిటి వాళ్ళని అడిగినట్లు సైగ చేసాడతను? దాంతో నవ్వాపుకోలేక ఫక్కుమంది వాసంతి.

"గుడ్‌గాడ్! ఫరవాలేదు. కనీసం మీకు నవ్వులబాణాలు వెయ్యటం వచ్చున్న మాట!" అతని మాటలు వినడానికి సరదాగావున్నా అతని ధోరణి గాభరా పుట్టిస్తూంది వాసంతికి.బొత్తిగా పరిచయం లేని అమ్మాయితో ఇంత చొరవగా మాట్లాడే అబ్బాయిని చూడడం ఇదే ప్రథమం.

"మిస్ వాసంతీ! కంగారు పడకండి. మీరు నాకెలా తెలుసా అని. ఎనాటమీ గోల్డుమెడలిస్టుల గురించి కాలేజీలో ఎవరికయినా తెలియదంటే వాళ్ళని అర్జంట్‌గా అండమాన్స్‌కి పేక్ చేసేయ్యాలి." గుండె ఝల్లు మనిపించేలా నవ్వాడతను. అతని నోటివెంట తన అందం, చదువు గురించి ప్రశంస వినడానికి చాలా ఆనందంగా వుంది వాసంతికి.

"మీకు మరీస్వార్థం. నా పేరడిగితే, మీ నోటినుండి రాలిన

ముత్యాలన్నిటినీ నేనే ఏరేసుకుంటానని మీకు భయంలా వుంది. ఎనీవే, నేను గోల్డుమెడలిస్టుని, స్పోర్ట్స్ ఛాంపియన్‌ని, నటుడ్ని, గాయకుడ్ని, డిబేటర్ని కాదు గనుక నాపేరు మీకు తెలిసే అవకాశం లేదు.” ‘ఎదుటి మనిషి నోరు విప్పక పోయినా ఇంతసేపు ధారాళంగా మాట్లాడే చాతుర్యానికి ఒక గోల్డుమెడలిచ్చి తీరాలిమీకు’ అనుకుంది వాసంతి.

“మీ మౌనవ్రతాన్ని నిరవధికంగా కొనసాగిస్తున్నందుకు నా జోహార్లు. మీ అమూల్యమైన స్నేహాన్ని కోరుతున్నవాడిని గనుక నా నామధేయాన్ని మీకు విన్నవించు కోవలసిన పవిత్రమైన బాధ్యత నా మీదుంది. సో, నేను రాజమోహన్ని, సింపుల్‌గా అంతా ‘రాజా’ అంటారు.” అన్నాడు రాజా తమాషాగా తలవంచి.

“ఏ దేశానికి రాజా మీరు?” అనుకోకుండా వాసంతిలోకూడా చిలిపితనం ప్రవేశించింది.

“హమ్మయ్య! ఐతే నేను పొరపాటు పడ్డానన్నమాటః మీకు మాటలొచ్చన్నమాట! ఏమిటడిగారూ, నేనే దేశపు రాజాననా...”అకస్మాత్తుగా రాజా మాటలాపేసి సీరియస్‌గా కేస్‌షీట్ చదవసాగాడు. ఏమిటింత సడన్‌గా బుద్ధిమంతుడయాడితను!... ఆశ్చర్య పోతూంది వాసంతి.

“దాస్ తెరవండి. గురుడొస్తున్నాడు.” గుసగుసగా అన్నాడు రాజా.

“దాస్ తెరవడమేమిటి? గురుడెవరు?” తాపీగా ప్రశ్నించింది వాసంతి.

“అదేనండి ఎమ్. డి.రాజు ఐమీన్ యమధర్మరాజు, సారీ, మనబాస్. దాస్ సర్జికల్ మెథడ్స్ బుక్ తెరిచి చదివినట్లు నటించండి. అదిగో వచ్చేస్తున్నాడిటు. నన్ను కేస్ ప్రెజంట్ చేయమన్నాడీ రోజు.” రాజా పేషెంట్‌ని గంభీరంగా ప్రశ్నించసాగాడు. అప్పటివరకు అతని మాటల్నివింటూ వినోదిస్తున్న పేషెంట్ అతని ప్రశ్నలకు నవ్వుతూ

జవాబివ్వసాగాడు.

రాజాకేస్ ప్రెజంటేషన్ ప్రహసనం ముగిసాక బాస్ ఆంధ్రాంగ్లభాషల్లో తన పాడిత్య ప్రకర్షనంతటినీ ఉపయోగిస్తూ అరగంటసేపు రాజాని, యీనాటి కుర్రకారు బాధ్యతా రహిత ప్రవర్తనని సోదాహరణంగా తిట్టిపోసి, ఆనక ఐదునిముషాలు కేస్ గురించి విపులంగా చెప్పి, హడావిడిగా ప్రైవేట్ పేషెంట్స్‌ని చూచుకోవడానికి తన రూమ్‌దగ్గరకు వెళ్ళిపోయారు. ఇంక ఆనాటికి విజ్ఞానార్జనని చాలించి విద్యార్థులు వార్డు బయటికొచ్చారు.

"మిస్ వాసంతీ!" అతని గురించే ఆలోచిస్తూ నెమ్మదిగా నడుస్తున్న వాసంతి రాజా తన ప్రక్కగావచ్చి మధురంగా పిలవగానే నవ్వుతున్న కళ్ళనతని వైపుకు తిప్పింది.

"ఏమీ తోచకపోతే కాలేజీకిరావడం మనఅలవాటు. కాని, మీరు మావార్డ్ మేట్ కనుక రేపటినుండి సెంట్ పర్సెంట్ అటెండెన్స్ ఎవరికుందయ్యా అనడిగితే ఠక్కున ఏ రిజిష్టరూ చూడకుండా రాజాకి అని చెప్పెయ్యెచ్చు. ఆఫ్‌కోర్స్ నేను కవిని కాదనుకోడి. కాని మీసాన్నిధ్యంలో నాకు కవితావేశం పొంగిపోతూంది. శరదిందు కిరణాల్లాంటి మీ చూపుల స్పర్శకోసమైనా నేను రోజూ వార్డుకు వచ్చితీరాలి." ఆ క్షణంలో అతని పుస్తక భాష వెగటు కలిగించలేదు. అతని మాటలు వింటూ తన్మయత్వా న్ననుభవిస్తున్న వాసంతిలో అకస్మాత్తుగా ఒక ప్రశ్న లేచింది. 'ఇంత సునాయాసంగా మొట్ట మొదటిసారే యింత ఆకర్షణీయంగా మాట్లాడుతున్న యీ 'మగాడు' యింకో ఆడపిల్ల ముందిలా మాట్లాడడని గ్యారంటీ ఏమిటి?'

## 4

సంపంగి పరిమళంలా వాసంతిని చుట్టేసిన రాజాస్నేహం ఆమెకు ఆగి ఆలోచించడానికి వ్యవధి నివ్వలేదు. రాజా పొగడ్తలు, తన మీద ఇష్టాన్ని వ్యక్తం చేసే కబుర్లు, రంగురంగుల కాగితాలమీద కలల్లోకి

సునాయాసంగా తోసేసే వర్ణనలు, చిరుకోపాలు, అలకలు, బ్రతిమాలు కోవడాలు....కొత్తలోకంలో బ్రతుకుతూంది వాసంతి. రాజా తలపుకు రాగానే ఆమె హృదయం అల్లంత దూరాన కనిపించే సంద్రంలా పరవళ్ళు తొక్కేది. లయతప్పకుండా లేచే కెరటాల్లా ఆమెలో భావాలు లేచేవి. ఊపిరి పీల్చుకోనివ్వని అతని ఆకర్షణ ఆవెు కళ్ళని పుస్తకాలమీద నిలవనివ్వడంలేదు. రెప్పల్నిమూతపడనివ్వడంలేదు. అతని పిలుపు వింటేచాలు ఆమె రక్తపువేగం, గుండెజోరు హెచ్చేవి. 'ఎలక్ట్రొకార్డియాక్ ఛేంజెస్ ఇన్ రొమాంటిక్ ఫీవర్' అని థీసిస్ సబ్జక్ట్ తీసుకుని నీమీద పరిశోధనచేసి డాక్టరేట్ కొట్టేస్తానేనేను" అని ఏడ్పించేది సంధ్య.

యీ వరదలోంచి బయటపడి కాస్త స్థిరంగా ఆలోచించడానికి ఒక విధంగా రాజాయే సహాయంచేసాడు.

"వాసూ! మంచిపిక్నిక్ ఎరేంజ్ చేసాం. రేపుఉదయం ఆరుగంటలకల్లా వస్తాను. రెడీగావుండు."

"పిక్నిక్కా? ఎక్కడికి? ఎవరెవరొస్తున్నారు?" ఉత్సాహంగా అడిగింది వాసంతి.

"అరకు వేలీకి.మూర్తి, అరవింద్, జాన్ వాళ్ళ గర్ల్‌ఫ్రెండ్స్‌తో వస్తున్నారు" అప్పటివరకు ప్రేమ, ఆకర్షణ తాలూకు అనుభూతిలో తేలిపోతున్న వాసంతిలో ఆలోచన మొదలయింది. 'అతని ఫ్రెండ్స్ ముగ్గురూ తమ గర్ల్‌ఫ్రెండ్స్‌తో వస్తున్నారా? అరకు వేలీకి పిక్నిక్కంటే రాత్రికి తిరిగి రాలేము. అక్కడ ఆగితీరాలి'.. సన్నటి వణుకులేచిందామె శరీరంలో.

"అరకువెళ్ళొద్దు. సింహాచలంగానీ, శాంతి ఆశ్రమంగానీ వెళ్దాం" అంది వాసంతి.

"యింకా నయం ఎనాటమీ థియేటర్‌కో, మార్చురీకో షికారెళ్దాం,

అన్నావుకాదు”

“అరకుకయితే నేనురాను” ఆమె మారుమాట్లాడకుండా తన ప్రతిపాదనను అంగీకరిస్తుందనే గాఢ విశ్వాసంతో వున్న రాజా దెబ్బతిన్నట్లు చూచాడు.

“ఏం, ఎందుకురావు?” రాజా కోపంచూచి వాసంతికి బాధగా వుంది కాని వెళ్ళకూడదనే నిశ్చయం బలపడుతూంది.

“అంతదూరం వెళ్ళడం నా కిష్టంలేదు. ఎక్కడికి వెళ్ళినా రాత్రికి హాస్టల్‌కి చేరాలి.”

“అంటే నీ ఉద్దేశమేమిటి? రాత్రికి బయట ఉంటే చెడిపోతారనా? చెడిపోయే వాళ్లు పగలుమాత్రం చెడిపోరా?” అంత అసభ్యమైన టాపిక్‌ని పొడిగించటం ఇష్టం లేనట్లు ముఖం పెట్టింది వాసంతి.

“నామీద నీకామాత్రం నమ్మకం లేదన్నమాట!” నిష్టూరంగా అడిగాడు రాజా.

“ఇప్పుడు నమ్మకాల ప్రసక్తి ఎందుకు రాజా?” అతని మొండితనం చూస్తే విసుగ్గావున్నా మృదువుగానే అంది వాసంతి.

“దీనర్థం ఏమిటిమరి? నా ప్రవర్తనమీద అనుమానం ఉండబట్టే రానంటున్నావు”

“నీ ప్రవర్తనమీద అనుమానంతో అని ఎందుకనుకుంటున్నావు? నామీద నాకే నమ్మకంలేక రానంటున్నాను, సరా” అతనలా సాగదీయడం చూచి చిరాగ్గా ఉంది వాసంతికి.

“అదేం కాదులే. నలుగురికీ తెలిస్తే ఏం స్కాండల్స్ ప్రచారం చేస్తారోనని నీ భయం.” ‘భయం’ అనేమాట ఎక్కడ తగలాలో అక్కడ తగిలింది వాసంతికి.

"మీ మగవాళ్ళ పుణ్యమా అని మీతో యెలా ప్రవర్తించాలో తెలియని భయాల్తోనే మా బ్రతుకులు తెల్లారిపోతున్నాయి. అసలు మీ మగవాళ్ళకి ఎలాంటి అమ్మాయిలు నచ్చుతారో నాకర్థం కావడం లేదు. పరమ పతివ్రతల్లా యింట్లో కూర్చోవడమే ఉత్తమమనుకున్న ఆడపిల్లల్ని ఎగతాళిచేసో, ప్రలోభపెట్టో బయటకు లాక్కొచ్చేదీ మీరే. బయటికొచ్చిన ఆడదాన్ని ఫుట్‌బాల్‌ని చేసి ఆడ్డానికి ప్రయత్నించేదీ మీరే, ఖర్మకాలి ఫుట్‌బాల్‌గా మారినదాన్ని పట్టు వదలని విక్రమార్కుల్లా మురుగ్గుంటల్లోకి తోసేదీ మీరే. మీ కెలాంటి ఆడది కావాలి? వంటిల్లు వదలని అమాయకురాలా? సోషల్‌గా తిరిగే అధునాతన యువతా?.... మీకిద్దరూ కావాలి. కాని ఒకరు భార్యగా, రెండోవారు ప్రేయసిగా, కదూ?" ఆవేశంగా మాట్లాడుతున్న వాసంతిని చూచి షాక్‌తిన్నాడు రాజా. తనమాటల్ని తన్మయత్వంతో వింటూ పలుకే బంగారమన్నట్లుగా ఒకటి, అర మాటలు మాట్లాడే వాసంతేనా యిన్ని మాటల్నింత ఉద్రేకంగా పేలుస్తూంది అని ఆశ్చర్యపోతున్నాడు.

"అసలీ రెండు తరహాల ఆడవాళ్ళే ఉంటారని మీ నమ్మకం. సోషల్‌గా తిరుగుతూనే మంచిగా, హద్దుల్ని దాటకుండా ప్రవర్తించే అమ్మాయిలుంటారని మీకు తెలియదు. హద్దులు దాటిన అమ్మాయిల్ని చూస్తే మీకు చులకన, మీరు దాటి రమ్మన్న గీతల్ని దాటనని నిర్మొహమాటంగా చెప్తే దాన్ని అవమానంగా భావించి పగ పెంచు కుంటారు." క్రమేపీ ఆవేశం జారిపోయి మృదువుగా మారింది వాసంతి స్వరం. అప్పటివరకు నిజంగానే ఆమె నిరాకరణని అవమానంగా భావిస్తున్న రాజా నెమ్మదిగా తన అభిప్రాయాన్ని మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

''ఇలాంటి నైట్‌హాల్ట్ పిక్నిక్‌కి వచ్చి నీమీద ఇష్టాన్ని నిరూపించుకోవాలంటే అది నా వల్లకాదు. నీమీద నమ్మకం లేకపోతే

నీతో ఇంతలా స్నేహాన్ని పెంచుకోను, ఈ మాత్రం చనువుగాకూడా తిరగనని నువ్వు గుర్తిస్తే చాలు."

"నీమీద నీకెంత ప్రేమ? నీ భవిష్యత్తుమీద నీకెంత జాగ్రత్త?" ఉక్రోషంగా అంటున్న రాజా మాటలువిని నవ్వింది వాసంతి.

"తనను తాను ప్రేమించుకోలేనివాడు ఇతరుల్ని ప్రేమించలేడు రాజా! ఎంతో జాగ్రత్తగా అన్నివైపులా చూచి అడుగులు వేస్తున్నా ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు బోల్తాపడుతున్న ఆడపిల్లల్ని చూచాక ఆ మాత్రం పాఠం నేర్చుకోకపోతే ఎలా?" రాజా మళ్ళీ పిక్నిక్ సంగతి ఎత్తడానికి భయపడ్డాడు. అతని హృదయంలో ఇదివరకు ఆమెమీదున్న ఇష్టానికి గౌరవం కూడా తోడయిందిప్పుడు.

## 5

అప్పటికి గంటనుంచి వాసంతి భవిష్యత్కార్యక్రమాన్ని గురించి దీర్ఘంగా చర్చిస్తున్నారు రాజా, సంధ్య కలిపి. పల్లెటూరిలో ప్రాక్టీస్ పెట్టాలనుకుంటున్న వాసంతి నిశ్చయాన్ని మార్చడానికి హోరా హోరీ ప్రయత్నిస్తున్నారు. సుధీర్ కల్పించుకోకుండా వాళ్ళ వాదనల్ని మౌనంగా వింటున్నాడు.

"దీని బ్రెయిన్ వాష్ చెయ్యడంకంటే అన్ని సబ్జక్ట్సనీ ఒక్కసారే పాసవడం బహుతేలికని ఒప్పుకుంటున్నాను. రాజా! మీరేమన్నా ప్రయత్నిస్తే ప్రయత్నించి చూడండి. దీనితో వాగివాగి నా గొంతుక ఎండిపోయింది. వేడి వేడి 'టీ' చేసి పట్టుకొస్తాను." అంటూ వెళ్ళింది సంధ్య.

పల్లెటూరి ప్రాక్టీస్ లోని సాధకబాధకాలన్నింటినీ మళ్ళీ ఓసారి ఏకరువు పెట్టాడు రాజా. సేవ, మానవత్వం లాంటి ట్రాష్‌మీద గ్లామర్‌తో మారుమూల ప్రాంతానికి వెళ్ళి ప్రాక్టీస్ పెట్టేంత దిక్కుమాలినపని చెయ్యొద్దని హెచ్చరించాడు. ఒక ఆడపిల్ల ఒంటరిగా పల్లెటూరులో వుండి నెగ్గుకురావడ

మెంత అసాధ్యమో సోదాహరణంగా వివరించాడు. అంతా జాగ్రత్తగా విని ఒక్క నవ్వుతో తేల్చేసింది వాసంతి.

"రాజా! ముదు నీ ఊహాగానాల్ని ఆపుచెయ్యి. నేను ప్రాక్టీస్ పెడుతూంది డబ్బుకోసం, నా భుక్తికోసం, ఎవరికీ సేవచెయ్యడానికి కాదు, ఎవర్నీ ఉద్ధరించడానిక్కాదని నాకు బాగా తెలుసు. ఇంక ఒంటరిగా అక్కడుంటే వాళ్ళు నన్ను మింగేస్తారనే పిరికతనం లేదునాకు. మనుషుల మంచితనంమీద నమ్మకముంది నాకు." ఆమె ధైర్యాన్ని, నిజాయితీని చూస్తే ముచ్చటగానే వుందిగాని అనుభవంలేని నమ్మకం మాత్రం బాగాలేదు రాజాకి.

"ఆ నమ్మకాన్ని పోగొట్టుకుంటానికే నువ్వక్కడికి వెళ్తున్నావు." అన్నాడు రాజా సంధ్య తెచ్చిన 'టీ' తాగుతూ.

"అసలు దీనిమొహం, యిది ప్రాక్టీసేం చేస్తుందండీ? ముక్కుకు సూటీగా 'నేను, నా వైద్యం' అనుకుంటూ ధీమాగా వెళ్తే సరిపోతుందా? అందర్నీ ఆకట్టుకునే తెలివితేటలు, ఎటువంటి వెధవాయినీ ప్రసన్నం చేయగల లౌక్యం, అరచేతిలో స్వర్గాన్ని చూపించి మెప్పించగల చాతుర్యం కావాలి. దీని కివన్నీ లేవుగాక లేవు." సంధ్యమాటలు వింటూ ఆలోచిస్తున్న వాసంతి కళ్ళముందు వెన్నెల్లాంటి చిరునవ్వుతో, వెన్నలాంటి హృదయంతో దయగా చూస్తున్న డాక్టర్ సుభద్ర నిలిచింది. రోగుల సేవకి అంకితమై పోయిన డాక్టర్ సుభద్రంటే ఆరాధన వాసంతికి.

"సంధ్యా! నువ్వు తెలివిగలదానివి, ఒప్పుకుంటాను. నా గురించి నువ్వన్నది కొంతవరకు నిజమే. కాని...పేషెంటుబాధను చూచి చలించే ఆర్ద్రహృదయం, పేషెంట్‌ని ఎట్టి పరిస్థితుల్లోనూ మోసగించని నిజాయితీ, పేషెంట్ బాధని మరిపింపజేయగల చల్లని చిరునవ్వు నువ్వు చెప్పినవాటి కంటే ఎక్కువ కావంటావా?" వాసంతి మాటల్ని విని అరచేత్తో నుదురు

కొట్టుకుంది సంధ్య.

"ఖర్మ! ఇదింక బాగుపడే యోగం లేదు" తన నిరాశను వెలిబుచ్చింది సంధ్య.

"పోన్లేవే. నువ్వంతగా ఇదవక. నాకు చెడిపోయే యోగంకూడా లేదు." నిరాశగా అంది వాసంతి. అర్ధంకానట్లు చూచారంతా.

"నేను ప్రాక్టీస్ పెడదామనుకోగానే సరా? అందుకు కావలసిన డబ్బెక్కడిది? నాన్నగారు పోయాక ఇంట్లో విలువైన వస్తువులకి కాళ్ళు వచ్చేశాయని అమ్మ ఏడుస్తూంటే చూస్తూ వూరుకోవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. కోరికయితే వుందిగాని డబ్బు దొరికే దారేది? చెయ్యిచాచి ఎవర్నడగను? అడిగినా అంత తేలిగ్గా ఎవరిస్తారు?" దిగులుగా, దీనంగావుంది వాసంతి స్వరం. చిత్తరువుల్లా చూస్తూ వుండిపోయిన సంధ్య, రాజా సుధీర్‌మాటలు విని ఉలిక్కిపడ్డారు.

"నేనిస్తాను".

"మీరా?" సంతోషం. సంకోచం కలగాపులగ మవుతూంటే సంభ్రమంగా చూచించి వాసంతి.

"మిమ్మల్ని చూస్తూంటే నాకు చాలా సంతోషంగా వుంది. మీలాంటివారు నూటికి పదిమందున్నా చాలు డాక్టర్ని ప్రత్యక్ష భగవంతునిలా పూజిస్తారు. మీలాంటి కొంతమందైనా దేవతల్లా ప్రవర్తిస్తే క్రమేపీ అప్రభావం మిగతావాళ్ళ మీద పడి తీరుతుంది" సుధీర్ మాటలువిని పకపకా నవ్వింది సంధ్య.

"అక్షరలక్షలైన మాటల్ని చెప్పినందుకు నీకు 'కళాప్రపూర్ణ' బిరుదిస్తున్నాను ఫో.....సరేగాని, సుధీర్! యింత అమాయకుడివి, అజ్ఞానివి. నువ్వు రిసెర్చి ఏమిచేస్తున్నావా అని నాకనుమానంగా వుంది. ఓ పది

సంవత్సరాలలాగే కుస్తీపట్టి నీ అజ్ఞానానికి కొత్తపూతపూసి జనాలకు పంచిపెడతావేమోనని ఆందోళనగా వుంది...అయ్యో: సుధీర్! ఆదర్శవ్యక్తుల ఆదర్శాలు, మంచితనం కథగా చదువుకోడానికి పనికొస్తాయి, సినిమాగా చూడడానికి పనికొస్తాయి. అంతవరకే. అవి మిగతావాళ్ళని ప్రభావితంచేసి మంచివైపుకు తిప్పవు సరికదా, వాళ్లు తినే ఎదురుదెబ్బల్ని చూచి భయపడి, బెదిరిపోయి, ఆదెబ్బలు తినడం కంటే దుర్మార్గులుగా ఉండిపోవడమే హాయనుకుంటారు. అందుచేత ఆదర్శప్రాయంగా బ్రతికే ఒక డాక్టరు జీవితంచూచి మిగతా డాక్టర్లు ఎంత ఆదర్శవంతంగా బ్రతకాలో నేర్చుకోరు, ఆదర్శవంతంగా ఎందుకు బ్రతకగూడదో నేర్చుకుంటారు.'' తన అమూల్యమైన ఉపన్యాసాన్ని ముగించిన సంధ్యవంక యింక అంతటితో ఆపినందుకు కృతజ్ఞతగా చూచించి వాసంతి.

"సంధ్యా! నీ ఉపన్యాసం బాగానేవుందిగాని, నువ్వెంత గొప్పగా వాదించినా డాక్టరు మిగతా వ్యక్తుల కన్నా భిన్నమయినవాడు. భిన్నంగావుండి తీరవలసిన వాడు. తన స్వార్థాన్ని ప్రక్కకునెట్టి హృదయ పూర్వకంగా రోగికి బాధా నివారణ చేసి కనబడే భగవంతునిలా ప్రవర్తించ వలసినవాడు'' సుధీర్ మాటలకి సంధ్య వెన్ను నిటారుగా అయింది.

"ఏమిటీ, స్వార్థాన్ని విడనాడి భగవంతుడిలా ప్రవర్తించాలా డాక్టరు? ఏం బాబూ! భగవంతుడికి మాత్రం స్వార్థంలేదా? కేవలం తన భక్తులకి మాత్రమే, తనను కీర్తించే వాళ్ళకు మాత్రమే, తనకు తీర్థప్రసాదాలిచ్చే వాళ్ళకు మాత్రమే వరాలిస్తాడే? సాక్షాత్తు భగవంతుడే ఆ బలహీనతను, స్వార్థాన్ని వదులుకోలేనప్పుడు, సామాన్య మానవుడు, తన చదువుతో, కేవలం పొట్టకూటికోసం చదువుకున్న చదువుతో దైవత్వాన్ని పొంద గలడా?...అసలు స్వార్థంలేని దెవరికి? జలగల్లాగ ఇతరుల రక్తాన్ని పీల్చుకుని బలవంతుడు కావడానికి ప్రయత్నించని దెవరు? ఒక దేశాన్ని మరోదేశం, ధనవంతుడు పేదవాడిని, పేదవాడు తనకంటే పేదవాడిని

దోచుకుంటానికి ప్రయత్నిస్తూనే వుంటారు. ఎక్కువ తక్కువ అనేది అవకాశాన్ని బట్టి మారుతూ వుంటుందంతే" సంధ్య వితండవాదంలో ఎంతోకొంత నిజం లేకపోలేదని పించింది వాసంతికి, సుధీర్‌కికూడా!

"మిష్టర్ సుధీర్! మీ ధోరణి చూస్తే మిగతారంగాలన్నిటిలోనూ న్యాయం, ధర్మం వర్థిల్లుతున్నాయనీ, ఒక వైద్యరంగమే కుళ్ళి కంపు కొడుతూందని మీ అభిప్రాయమనిపిస్తూంది." రాజా అందుకున్నాడు.

"నో....నో...మిగతారంగాలు నిష్కలంకంగా వున్నాయని నేనటంలేదు. మిగతా రంగాలెలావున్నా డాక్టర్లు మాత్రం సేవకి, మానవత్వానికి ప్రతిరూపంగా వుండాలని నా అభిప్రాయం."

"చాలా బావుంది! సమాజంలోని అన్ని రంగాల్లోనూ అవినీతి, అధర్మం తాండవిస్తూంటే ఒక్క డాక్టర్లనిమాత్రం అందుకతీతంగా వుండమని నీలాంటి మహానుభావులు శాసించడం విడ్డూరంగావుంది. మనచుట్టూవున్న సమాజం ప్రభావం మన ప్రతి కదలికమీద, ప్రతి ఒక్క ఆలోచనమీద పడుతుందనే ప్రాథమిక సూత్రాన్ని మరిచిపోయినందుకు నిన్ను ఉన్నపళాన ఆ భేఆఫ్ బెంగాల్లోకి తోసెయ్యొచ్చని నా తీర్పు, ఏమంటావ్?" తలప్రక్కకు పెట్టి ఓరగా చూస్తూ ప్రశ్నిస్తున్న సంధ్య చేతుల్ని గబుక్కున పట్టుకుంది వాసంతి.

"బాబ్బాబు! కాసేపాగవే. నాకు సహాయపడడానికి ఒక్కవ్యక్తన్నా ముందు కొచ్చాడని నేను సంతోషపడుతూంటే నా సంతోషాన్ని కర్కశంగా సముద్రంలోకి విసిరేస్తాననడం నీకు న్యాయంకాదు." వాసంతి అభ్యర్థనకు జలపాతం త్రుళ్ళి పడి నట్లు నవ్వింది సంధ్య.

"వాసంతిగారూ! సంధ్య మాటలకేంగాని నేను మీకు డబ్బిస్తాను. సుమారుగా ఎంతకావాలో చెప్పండి."

కాసేపు వాదోపవాదాలు జరిపి అధమపక్షం ఒక పదివేలన్నా లేందే

బోర్డుకట్టడానికి కావలసిన కనీస పరికరాలు రావనే నిర్ణయాని కొచ్చారు.

"ధర్మవడ్డీయా, చక్రవడ్డీయా? ఇది తేల్చు ముందు. పాపం ఇదసలే అమాయకురాలు, తరువాత నీతో లిటగేషన్ పడలేదు." నిలదీసింది సంధ్య.

"ఆసలు, వడ్డీలంటూ ఆవిడని బెదరగొట్టకు. ఒక మంచి డాక్టరుకి నాడబ్బు ఉపయోగపడగలిగితే అది సద్వినియోగ మయిందనుకుంటాను." సుధీర్ మాటలు విని 'పెద దానకర్ణుడు బయలుదేరాడ'న్నట్లు కళ్ళు వెడల్పుచేసి,పెదవివిరిచింది సంధ్య.

'డబ్బెక్కడినుండి వస్తుంది!' అని నిరాశపడిపోయిన వాసంతికి తీరా సుధీర్ డబ్బిస్తాడని నిశ్చయంగా చెప్పినప్పటికి సంకోచంగా వుంది. తీసుకుంటాననడానికి సంధ్య ఫ్రెండ్‌గా తప్ప అతనితో తన కాట్టే పరిచయం లేదు.

"ఇంతకూ ప్రాక్టీసెక్కడ పెట్టాలని నిశ్చయించుకున్నారు?" సుధీర్ ప్రశ్నవిని ఆలోచనల్లోంచి బయటపడింది వాసంతి.

"ఏదీ యింకా ఏమీ నిర్ణయించుకోలేదు. మీ పుణ్యమా అని డబ్బుసమస్య తీరింది. ఇప్పుడింక ఏఊరనేది ఆలోచించాలి" అంది వాసంతి.

"తగ్గు తగ్గు. అంతగా ఉబ్బిపోకు. పదివేలిస్తూంటే ఒక్క పొగడ్తన్నాలేకపోతే ఏడ్చుకుంటావని అంటూాందది. నిజంగా పుణ్యాత్ముడివని కాలరెత్తేసుకునేవు." సంధ్యమాటలు వింటూ వాసంతి రాజా కళ్ళల్లోని కంపరాన్ని గమనిస్తూంది.

"మా అక్కగారి ఊరిదగ్గర మంచి సెంటరుంది. ఒక ప్రైమరీ హెల్త్‌సెంటరుందిగాని, అక్కడ పోస్టుచేయబడ్డ ప్రతి డాక్టరూ సాధ్యమైనంత వరకూ లీవ్‌లో వుంటాడు. ఇద్దరు ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ వున్నారు. లేడీడాక్టరెవరూ లేరు." సుధీర్ చెప్పుకుపోతున్నాడు.

“అవన్నీ తరువాత. ధనధాన్యాలతో తులతూగుతున్న ఊళ్ళేనా అవి? అది ముందుచెప్పు. ఇదిగో సుధీర్! అలా కళ్ళెర్రజేయకు. పేషెంట్సు దగ్గర డబ్బులుంటేనే కదా మాకిచ్చేది? వాళ్ళదగ్గరే లేకపోతే మాకేమిస్తారు? ఏమంటావ్? నిజమా కాదా?” కళ్ళుచికిలించి నవ్వుతూ అడిగింది సంధ్య.

“సంధ్యా! నువ్వు కాసేపు నీ నోటికి ప్లాస్టర్ వేసుకుంటే సంతోషిస్తాను.” అంది వాసంతి. వాసంతి మాటల్ని విననట్లు నటిస్తూ మళ్ళీ మొదలు పెట్టింది సంధ్య.

“సుధీర్! మా అంటీ ప్రాక్టీస్ చేస్తున్న వూళ్ళో మగవాళ్ళంతా అధమపక్షం రెండేసి సంసారాన్ని నడపగల సమర్థులు, ఆడవాళ్ళంతా పరమ పతివ్రతలు. భార్యల హిస్టీరికల్ జబ్బులు, ప్రియురాళ్ళ గర్భవిచ్ఛేదాలు చాలు దివ్యంగా గడించెయ్యొచ్చు.” యింక వినలేనట్లు రెండు చెవుల్నీ గట్టిగా మూసుకుంది వాసంతి.

“మీరో సారి ఆఊరిని చూచి నిర్ణయించుకుందురుగాని, రేపే బయల్దేరుదాం. ఏమండీ! మీరేమంటారు? రాజాని అడిగాడు సుధీర్.

“నాదేముంది? వాసంతి ఇష్టం” చిత్రంగా భుజాలెగరేసాడు రాజా

“నేను రాను. రేపు నాకు సర్జరీ ఎగ్జామ్ వుంది. ఏమిటమ్మా, అలా చూస్తున్నావు? నేను మంచి బాలిక సీతనయిపోయాను. తెలుసా?” వాసంతికి కన్నుగీటి నవ్వింది సంధ్య.

## 6

వాసంతి ఊహించనివిధంగా సుధీర్ ప్రతిఒక్కపనిలో అండగా నిలబడ్డాడు. ఎమ్.ఎస్. చదువుతున్న రాజా తనకు క్లాసులు పోతాయి, ప్రారంభోత్సవం రోజుకొస్తానని తప్పించుకున్నాడు. సంధ్య, సుధీర్ ఆహ్వాన పత్రాలు తీసుకుని నాలుగురోజుల ముందు వచ్చారు.

ఇంటింటికి వెళ్ళి కార్డు యిచ్చి ఆహ్వానించడమంటే ప్రాణం పోయి నట్లయింది వాసంతికి. ఆ ఆహ్వానించడంలో మీరంతా వైద్యానికి నాదగ్గరకే రండన్న అంతరార్థం వుండకపోతే నిస్సంకోచంగా ఆహ్వానించ గలిగుండేది. వాసంతి నసుగుడు విని సంధ్య ఇంతెత్తున లేచింది.

"ఏమిటే నీ ఉద్దేశ్యం? ఇందాక హాస్పటల్ నేమ్ బోర్డుచూచి కాఫీ హోటలుకు లాగ ఇంత పెద్ద బోర్డేమిటంటూ సణిగావు. ఇప్పుడు పిలుపుల కెళ్ళడానికి గజగజలాడిపోతున్నావు. గుళ్ళో లింగంలాగా నీయింట్లో నువ్వుండి పేషెంట్స్ని రమ్మంటే ఎలావస్తారు? ఒక గ్రేట్ డాక్టరు గారిక్కడ అవతరించారని వాళ్ళకు తెలియాలా, వద్దా? మేడమ్! ఇది ప్రచారయుగం. ప్రచారం లేనిదే దేనికీ గుర్తింపు లేదని తెలుసుకో" సంధ్య దులుపుడు విని విసుక్కుంది వాసంతి.

"మనం ప్రచారం చేసుకుంటేనే పేషెంట్లొచ్చేస్తే ఇంక లేందేముంది? మనకి మనం కాదు ప్రచారం చేసుకోవాల్సింది, పేషెంట్స్‌చెయ్యాలి. మన సమర్థతమీద, మనమంచితనంమీద గురి కుదిరిన పేషెంట్ మన గురించి ఒక్క మంచి మాటచెప్తే చాలు, ఆమాట మరోపదిమంది పేషెంట్స్ని లాక్కొస్తుంది". వాసంతివంక ప్రశంసా పూర్వకంగా చూస్తున్నాడు సుధీర్.

"మీరు చెప్పేది కరక్టేకాని నలుగుర్నీ పిలవడం మర్యాద. మనకి ఇష్టం లేకపోయినా ఇతరుల ఆహాన్ని సంతృప్తిపరచడానికో, మర్యాద కోసమో కొన్ని కొన్ని పనులు చెయ్యక తప్పదు" సుధీర్ మాటమీద కొంత సంకోచాన్ని విడిచిపెట్టి సంధ్య ప్రతిపాదనకు ఒప్పుకుంది వాసంతి.

నిరాడంబరంగా హాస్పటల్ ప్రారంభోత్సవం జరిగింది. రాజా, సుధీర్, సంధ్య మరునాడు వెళ్ళిపోయారు. వాసంతి తల్లి అన్నపూర్ణ, చెల్లెళ్ళు వినత, శార్వరి, తమ్ముడు సాగర్ మరో నాలుగురోజులు పోయాక ప్రయాణమయారు. అన్నపూర్ణకా పల్లెటూర్లో కూతుర్ని ఒంటరిగా

విడిచివెళ్ళడానికి చాలాకష్టంగావుంది. వినత, సాగర్‌ల పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. ఎక్కువరోజు లిక్కడ వుండడానికి వీల్లేదు.

"అమ్మా! కొంచెం అమ్మాయిని చూస్తూ వుండండి. వాళ్ళనాన్నగారు లేకపోబట్టి పొట్ట పట్టుకుని ఇంతదూరం రావాల్సొచ్చింది. ఆ పిల్లల్ని ఏ హాస్టల్లోనైనా పడేసే వీలుంటే ఆ పని చేసి ఇక్కడేవుందును. ఇక్కడ వుండా లేక పోతున్నాను, అటు వెళ్ళాలేకపోతున్నాను" పొరుగింటావిడకి కూతుర్ని అప్పగిస్తూ కన్నీళ్ళు నింపుకుంది అన్నపూర్ణ.

"ఏమిటమ్మా నీ చాదస్తం? నేనేం చిన్నపిల్ల ననుకుంటున్నావా, అంత బాధపడుతున్నావు?" ప్రేమగా తల్లిని మందలించింది వాసంతి.

వాసంతి నవ్వుతూ అందర్నీ సాగనంపిందిగాని అంతా వెళ్ళిపోయాక ఒంటరితనం భయపెట్టింది. నర్స్, కాంపౌండర్, తను గంటలతరబడి కూర్చోగా, కూర్చోగా ఒకరో, ఇద్దరో పేషెంట్స్ దర్శనమిచ్చేవారు. అందులో కొత్తగా వచ్చిన డాక్టరమ్మెంత షోగ్గావుందో చూడడానికి వచ్చేవాళ్ళు కొంతమంది. మొదటి నుండీ మగడాక్టర్ల దగ్గర వైద్యం అలవాటయి పోవడం వల్ల లేడీ డాక్టర్  ఉన్నా, ఆ అవకాశాన్ని ఉపయోగించుకునేలా మారలేక పోతున్నారు.

నర్స్, కాంపౌండర్ బయట బల్లమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటు న్నారు. ఏం చెయ్యడానికీ తోచక గైనిక్ పుస్తకం తెరచి చదవడానికి ప్రయత్నించింది వాసంతి. కాని మనస్సు పుస్తకం మీద నిలవక ఏవేవో గుర్తుకు రాసాగాయి.

పి.యు.సి.లో ఫిజిక్స్ మాస్టారు దగ్గరకు ప్రైవేట్‌కు వెళ్ళేది తను. ఆయన ఒకోసారి సొల్లు కబుర్లతో కాలక్షేపం చేసినా పూనకం వచ్చినప్పుడు మాత్రం ఏకధాటీన నాలుగ్గంటలు పాఠం చెప్పేవారు, 'మాష్టారూ! కూర్చోలేక నడుము పోతూందండీ' అంటే, 'అదేంటమ్మా! మీకిప్పటి నుంచి

మంచి ట్రెయినింగిస్తున్నాను. రేపు మీకు మెడిసిన్‌లో సీటొచ్చి, చదువు పూర్తిచేసి ప్రాక్టీస్ పెట్టారనుకోండి. పేషెంట్సు కోసం మొదట్లో గంటల తరబడి నోట్లో వేలేసుకుని ఎదురుచూస్తూ కూర్చోవాలా లేదా?' అనేవారు నవ్వుతూ. మాస్టారు ఆ రోజుల్లో తమాషాకి అన్నా, ఇప్పుడదే నిజమయింది. బలవంతాన నిట్టూర్పు నాపుకుని వంట చేసుకుంటానికి లేచించి వాసంతి.

## 7

నెల గడిచి పోయింది, ఆదాయం లేక పోయినా కట్టవలసిన బిల్లులు నేను ముందంటే నేను ముందంటున్నాయి. అటు అమ్మకు డబ్బు పంపాలి. అప్పును తలచుకుంటే ఒణుకొస్తూంది వాసంతికి. తను ప్రాక్టీసు పెట్టడంలో తొందరపడిందేమో నన్న నిరాశ కలుగుతూంది. మళ్ళీ అంతలోనే పెట్టిన మర్నాడే పేషెంట్స్ రమ్మంటే ఎలా వస్తారు? ఓర్పుగా నిరీక్షించాలి. క్రమేపీ వాళ్ళే వస్తారు. తొందరపడి లాభంలేదు' అనుకుంటూ ధైర్యం తెచ్చుకుంటూంది. కాని.... తక్షణం కావలసిన డబ్బెక్కడి నుంచి వస్తుంది? ఎవరి దగ్గర చెయ్యి చాచాలీసారి....యింత వయసొచ్చి, యింత చదువుకుని, సంపాదన లేకుండా యింత నిస్సహాయ స్థితిలో ఉండడమెంత దయనీయం!

బయట ఇంటి యజమాని కంఠం వినపడడంతో వాసంతి గుండెదడ హెచ్చింది. మొదటిసారే అద్దెకు తిప్పిస్తే అతని కెంత లోకువగా వుంటుంది. కాంపౌండర్, నర్స్ కూడా నిన్నటినుంచి జీతం కోసం తన ముఖం వంక పదేపదే చూస్తుంటే వాళ్ళచూపుల్ని తప్పించుకు తిరుగుతూంది, వాళ్ళముందు ఇతనేమైనా కటువుగా మాట్లాడాడంటే ఎంత పరువు తక్కువ!

అదిగో ఇంటాయన లోపలికి రానే వచ్చాడు. ముఖానికి నవ్వు పులుముకుని ఆహ్వానించక తప్పదు.

"రండి రండి కూర్చోండి." లోపలి భయంతో అసహజంగా వుంది వాసంతి స్వరం. వచ్చి వాసంతికి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడతను.

"ఎలా వుందమ్మా మా ఊరు? పేషెంట్సు బాగా వస్తున్నారా?" పేషెంట్స్ గురించి తెలిసికూడా వ్యంగ్యంగా అడుగుతున్నాడో, మామూలుగా అడుగుతున్నాడో తెలియలేదు. వ్యంగ్యంగానే అడుగుతూ వుండుంటాడ నుకుని తెగ బాధపడిపోయింది వాసంతి.

"బావుందండీ ఊరు." నసుగుతూ జవాబిచ్చింది వాసంతి. రెండో ప్రశ్నకు జవాబు కావాలనే దాటేసింది.

"తమరేం భయపడకండి. తమకు పేషెంట్స్‌ని తీసుకొచ్చే పూచీనాది. నాలుగేళ్ళల్లో తమరితో మేడ కట్టించే భారం నాది." 'నాకు మేడావద్దు, పేషంట్సూ వద్దు. ఇప్పుడు అద్దెడబ్బు అడక్కుండా వుంటే అదే పదివేలు' అనుకుంటూ ఒక వెర్రినవ్వు నవ్వి ఊరుకుంది వాసంతి.

"ఆ కమ్మ డాక్టరీ ఊరు వచ్చినపుడు కట్టుగుడ్డలతో వచ్చాడు. ఇప్పుడు రెండస్తుల మేడ హాస్పిటల్‌కు కట్టాడు. పెద్ద డాబాయిల్లు కట్టాడు. ఏభై ఎకరాల భూమి కొన్నాడు. యివన్నీ ఎవరు కొనిపించారనుకున్నారు? నేనే. బిల్డింగులు కట్టించేటప్పుడు మా వాళ్ళంతా నిలబడి చేయించారు. ఇప్పుడంటే చితికిపోయాను కాని డాక్టర్‌గారి కెప్పుడైనా డబ్బు సర్దుబాటు కాకపోతే ముందు నా డబ్బు అడ్డమేసేవాడిని. అసలు పేషెంట్లిచ్చిన బెల్లపు అచ్చులు, చింతపండు బుట్టలు అమ్మించి దాదాపు ఇరవై వేలిచ్చుంటాను డాక్టరుగారికి." చివరి మాటవిని గుండాగి పోయినట్లయింది వాసంతికి. ఇరవైవేలు బెల్లపు అచ్చులకి, చింతపండు బుట్టలకి, కొంచెంముందు పుట్టుంటే, ఆ స్వర్ణయుగంలో ప్రాక్టీసు పెట్టుండునే, అనవసరంగా లేట్ చేసేసానని వాపోయిన వాసంతి తన ఊహకు చిన్నగా నవ్వుకుంది.

"బస్తాలకి బస్తాలు బియ్యమిచ్చే వాళ్ళం. చదివింపులన్నీ సంవత్సరానికోసారి సత్యనారాయణవ్రతం పెట్టించి చదివించే వాళ్ళం. ఒక్కో సంవత్సరం తక్కువగా వేసుకున్నా ఇరవై ముప్పైవేలు వచ్చాయి."

ఆయన చెప్పేదంతా చాలా ఆసక్తిగా వింటూంది వాసంతి.

"అమ్మా! మీరు నా కూతురులాంటివారు. మీకేం కావాలన్నా మొహమాట పడకుండా కాకితో కబురంపారంటే చాలు, మీకు కావలసింది మీ ఇంట్లో వుంటుంది." మీకు కబురంపడానికి కాకి నెక్కడ పట్టుకోను స్వామీ? పాపం! నిజంగానే డాక్టరమ్మకదా, అదీ తన యింట్లో వుంటూంది కదా అనే అభిమానంతో అలా అంటున్నాడేమో ... వాసంతి కొంచెం మెత్తపడింది.

అంతలో దేవుడిలా పోస్టుమన్ ప్రత్యక్ష మయ్యాడు. మనియార్డర్ ఫామ్ తీస్తున్నాడు. తనకేనా మనియార్డరు? ఎవరు తనకు డబ్బుపంపి అవమానం నుంచి తప్పించినదేవుడు? రాజా పంపాడా? సంధ్య పంపిందా?.... లేక, సుధీర్ పంపాడా?... పోస్టుమన్ ఇంటూ మార్క్ పెట్టి చూపించిన చోట సంతకం పెడుతూంటే వాసంతి చెయ్యి వణికింది. సంతకం పెట్టాక పంపినవారి పేరు వైపు చూపులు తిప్పింది....అయ్యో పంపింది రాజా కాదూ?....రాజా అయితే ఎంత బావుండేది?....మళ్ళీ సుధీరే ఆదుకున్నాడు. తనతో ఏ బంధమూలేని సుధీరే తన అవసరాన్ని గుర్తుపెట్టుకున్నాడు....ఏబంధమూలేదా?.....స్వచ్ఛమైన స్నేహబంధం గొప్పది కాదా?

పచ్చకాగితాలు చేతిలో పడగానే వాసంతి చేతుల్లో వణుకు తగ్గింది. మనసులో అలజడి మటుమాయమయింది. ధైర్యగా కళ్ళెత్తి యింటి యజమానివైపు చూచింది.

''మీ మిసెస్ బావున్నారా? మీ మనవడు బాగా చదువు కుంటున్నాడా?" నిబ్బరంగా ప్రశ్నలు వేస్తూంది వాసంతి.

"ఆః! ఏంబాగులేమ్మా! ఒకటే గుండెదడ, ఆయాసం, నుంచుంటే కూర్చో లేదు. కూర్చుంటే నుంచోలేదు. కీళ్ళవాతం, దానికితోడు బ్లడ్‌ప్రెషరు,

షుగరు" ఇంక భరించలేక పోయింది వాసంతి.

"ఇదుంచండి. ఈనెల ఇంటద్దె. ఒక్క నిముషం కూర్చోండి. కాఫీ తాగి వెళ్ధురుగాని." ఇప్పుడు సంధ్య వుందంటే 'కాఫీయిస్తే ఐసయిపోయి నీచేత మేడకట్టిస్తాడని ప్లానేస్తున్నావులే, నాకు తెలుసు', అంటూ నవ్వుతుంది. సన్నటి మందహాసం మెరిసింది వాసంతి అధరాల కొసన.

## 8

తీరిక ఎక్కువవడంతో రాజా తలపులు పదే పదే గుర్తుకొచ్చి వాసంతిని స్థిరంగా నిలవనివ్వడంలేదు. ఎందుచేతో రాజా మారిపోతున్నాడు. హాస్పిటల్ ప్రారంభతోత్సవానికి వచ్చి ఒక్కరోజంటే ఒక్కరోజున్నాడు. అదీ అంటీ ముట్టనట్లుగా, ముభావంగా వున్నాడు. వెళ్ళాక ఒక్క లెటరన్నా రాయలేదు. తనొక్కరోజు కనిపించకపోతే ఆతృతగా హాస్టల్‌కు పరుగెత్తుకొచ్చే రాజా, తన ముఖంలో రవ్వంత బాధ, కోపం కనిపిస్తే చాలు విలవిలలాడిపోయే రాజా ఇంత నిర్లిప్తంగా ఎలావుండగలుగుతున్నాడు? తనంటే అతను కనబరచిన ఇష్టం, ప్రేమ ఇంత అస్థిరమైనవా?....ఛ! తనకు రోజు రోజుకు తొందరపాటెక్కువవుతూంది. రాజా ఏం పనుల్లో తీరిక లేకుండా ఉన్నాడో! పరీక్షలు దగ్గర కొస్తున్నాయి గట్టిగా రుబ్బుతూ కూర్చుంటున్నాడేమో! ఇక్కడకు వచ్చినపుడు ముభావంగా ఉన్నాడంటే కారణం వుంది. సుధీర్ దగ్గర డబ్బు తీసుకోవడం రాజాకి ఇష్టంలేదు. ఆమాటకొస్తే తనకూ ఇష్టంలేదు. గత్యంతరంలేక, అప్పేకదా, త్వరలో తీర్చేస్తాను కదా అని మనసుని సముదాయించుకుంది....అసలు సుధీర్ తనకు డబ్బిస్తా నన్నప్పటినుంచి రాజా అదోలా వుంటున్నాడు. అతని వాలకం చూస్తుంటే తనకు నవ్వాగడం లేదు. "జెలసి దై నేమీజ్ ఉమన్" అన్న మహానుభావు డెవరో, ఆయనగార్ని అమాంతం ఆడదాన్ని చేసి ఇద్దరు మగవాళ్ళమధ్య పెట్టాలి. వద్దు వద్దన్నా తప్పయిపోయింది తప్పయిపోయిందంటూ

చెంపలేసుకుని "జెలసీ దై నేమీజ్ మేన్" అంటాడు...లేకపోతే ఏమిటి రాజా ఉద్దేశ్యం? సుధీర్ డబ్బు సాయంచేసాడు, నిజమే, అంతమాత్రం చేత తను సుధీరంటే పడిచచ్చిపోతుందని రాజా ఎందుకనుకుంటున్నాడో అర్థంకాదు. అలా అనుకోకపోతే సుధీర్‌ని చూడగానే అలా తుమ్మల్లో పొద్దుకూకినట్లు ముఖం పెట్టడు.... రాజా మనసులో ఏముందో తనామాత్రం కనిపెట్టగలదు. రాజా తననింత చంచలమైన మనస్తత్వం కలదాన్నని ఊహిస్తున్నాడంటే తన కెంతో అవమానంగా వుంది.

థాంక్ గాడ్! ప్రొద్దుటినుంచి కూర్చుంటే యిప్పటికి ఎవరో కరుణించి వస్తున్నారు. బాప్‌రే. ఆరక్తమేమిటి?.....అసలు మనిషిలో ప్రాణముందా? ....సంధించి విడిచిన బాణంలా చకచకా పేషెంట్ దగ్గరకు వెళ్ళింది వాసంతి.

రాత్రనగా పురుడొచ్చి మాయరాక విపరీతంగా రక్తస్రావమ యిపోతూంది, తమకు తెలిసిన వైద్యాలన్నీచేసి, చిట్టచివరికిప్పుడు పదిమైళ్ళ దూరాన్నుంచి బండిలో వేసి తీసుకువచ్చారు.

పేషెంట్ షాక్‌లో వుంది. రక్తం ఎక్కిస్తేగాని బ్రతకదు. మాయని తీసి రక్తస్రావం ఆగేలా చూడాలి. గబగబా యింజక్షన్ చేసి, రక్తం తెప్పించడానికి శాంపిల్సు తీసి, సెలైన్ పెట్టింది వాసంతి. మందులు రాసిచ్చి తీసుకు రమ్మని చెప్పింది.

మందులకోసం వెళ్ళినవాళ్ళు మరో పదినిముషాలు పోయాక ముఖం వేలాడేసుకు వచ్చారు. వాళ్ళు తిరిగొచ్చి చెప్పింది విన్నాక గాని వాళ్ళవంక పరిశీలనగా చూడలేదు వాసంతి. చూచాక పెద్ద సందిగ్ధంలో పడిపోయింది. వాళ్ళ దగ్గరుంది ఇరవైరూపాయలు, తను రాసిచ్చిన మందుల ఖరీదు ఏభైరూపాయలు. కనీసం మరో ఏభయ్యో, వందో కావాలి. ఇంకా ఎన్ని మందులు వాడాల్సివుంటుందో! కనీసంరెండుబాటిల్స్ రక్తం ఎక్కించాలి.

తను ఉచితంగా వైద్యంచేసినా కేవలం మందులకి, రక్తానికి డబ్బు తెచ్చుకోవాలంటే వాళ్ళు ఏదో ఒకటి అమ్ముకుంటే తప్ప రాదు. అసలు వాళ్ళ కామాత్రం ఆధారంకూడా వుందో లేదో!....పోనీ పట్నంలో వున్న జనరల్ హాస్పటల్‌కు పంపిస్తే!.....నొ. అలా వీల్లేదు. పట్నం చేరేదాకా కూడా ఈమె బ్రతకదు. మధ్యదారిలోనే ఈవిడ ఊపిరి ఆగిపోవడం ఖాయం. తను మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చోవడం కాదు. వెంటనే తను చెయ్యాల్సింది, చెయ్యగలిగింది చెయ్యాలి. డబ్బులేదని, తెచ్చుకోలేరని ఆమెను పంపించేసి చేతులు దులుపుకోవడం అమానుషం. అంత బాధ్యతా రహితంగా ప్రవర్తించి పరోక్షంగానైనా ఆమె చావుకు కారణమయితే తనను తానీజన్మలో క్షమించు కోలేదు.

ఒక నిశ్చయానికొచ్చిన వాసంతి ఇరవై నాలుగు గంటల పాటు దీక్షతో ప్రయత్నిస్తేగాని పేషెంట్ పరిస్థితి కొంచెం మెరుగుపడి బ్రతుకుతుందనే ఆశ చిక్కలేదు. పేషెంటుని వదలకుండా చెయ్యవలసింది చేస్తూ, పేషెంటు స్థితి దిగజారినప్పుడల్లా విపరీతమైన టెన్షన్‌తో నిమిషమొక యుగంలా గడిపిన వాసంతి హృదయం పేషెంటు మృత్యు ముఖాన్నుంచి బయటపడినట్లే ననుకోగానే అంతులేని సంతృప్తితో నిండిపోయింది. అంతవరకు ఆమెపడిన శారీరక శ్రమ, మెంటల్ టెన్షన్ ఒక్కసారి చేత్తో తీసేసినట్లనిపించింది.

మరోసారి బి.పి. నోట్‌చేసి సంతృప్తిగా పేషెంటు వంక చూస్తున్న వాసంతికి రాజా గుర్తొచ్చాడు. ఇలాంటి కేసుల్ని ఉదహరిస్తూ అతననే మాటలు గుర్తొచ్చాయి.

“ఒకో సీరియస్ కేసుకు మనం అనుభవించే టెన్షన్‌కి మన ఆయుర్దాయంలో కనీసం కొన్ని నిముషాలైనా తరిగిపోతాయి. డాక్టర్ల డబ్బు యావని విమర్శించే విమర్శక చక్రవర్తులు తరిగిపోతున్న యీ విలువైన

నిముషాలకు ఖరీదు కట్టగలరా? ఎంత డబ్బిచ్చినా డాక్టర్‌చేస్తున్న ఈ త్యాగానికి సరితూగుతుందా అది? డాక్టరుకిచ్చే డబ్బుని వందసార్లు లెక్కగట్టే ప్రబుద్ధులు ఒక్కసారన్నా పేషెంట్ కోసం అతను పడే ఆరాటాన్ని, వెచ్చించే శక్తిని గుర్తించరేం?" అంటూ ఒక ప్రశ్నపత్రాన్ని ముందుంచేవాడు. అతని ప్రశ్నలు వింటూంటే నవ్వొచ్చేది తనకు.

"ఏదో సామెత చెప్పినట్లుగా వుంది నీ వరస. నీలాంటి వాడే ఎవడో 'ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం చెయ్యడ'మన్నాట్ట. నీ వృత్తి ధర్మాన్ని నువ్వు చేస్తున్నావు. ఇందులో త్యాగం, సేవ, ఏముంది?" అనేది తను.

"అమ్మగారు! ఆ బాటిల్ అవగానే సెలైన్ తీసేయమంటారా?" నర్స్ ప్రశ్నవిని బలవంతాన ఆలోచనలనుండి బయటపడింది వాసంతి.

## 9

పని పని. ఊపిరి సలపని పని. ఆలోచించడానికీ, కలలు కనడానికీ వ్యవధి దొరకనంత పని.

వాసంతి చకచకా ఔట్ పేషెంట్స్‌ని చూచి పంపిస్తూంది. డెలివరీ రూమ్‌లోని పేషెంట్ కేకల్తో హాస్పటల్ దద్దరిల్లి పోతూంది. మొదటిసారి గర్భం దాల్చిన అమ్మాయిలు ఓ.పి. లో ప్రతిధ్వనిస్తున్న ఆమె కేకల్ని విని భయంతో ముడుచుకు పోతూ బేలగా చూస్తున్నారు.

"నీకు పెద్ద జబ్బేంలేదమ్మా! జాగ్రత్తగా నేను చెప్పినట్లుగా మందులు వాడావంటే పదిరోజుల్లో మామూలు మనిషివయిపోతావు." తనకేదో నయంకాని జబ్బు వచ్చిందని, చావు తనకింక ఎంతో దూరంలో లేదని హడిలిపోతున్న పేషెంట్‌కి వాసంతి మాటలు ఎంతో ధైర్యాన్ని, బలాన్ని ఇచ్చాయి. భయంగా చూస్తూన్న కళ్ళల్లోకి కాస్త వెలుగొచ్చింది. రొంటిలో దోపిన గుడ్డసంచి తీసి, అందులోనుంచి ఐదు రూపాయలు నోటు భద్రంగా

బయటికితీసి భక్తిగా వాసంతి ముందుంచింది.

"నాకు ఫీజు యివ్వొద్దులే. ఫరవాలేదు.ఆడబ్బుతోమందులు కొనుక్కో." నోటు తీసి పేషెంట్ చేతిలో పెట్టింది వాసంతి. అతిపేదగా కనిపిస్తున్న ఆమె దగ్గర్నుంచి డబ్బు తీసుకోవడానికి మనసొప్పలేదు. పేషెంట్ ఒక నిముషం ప్రక్కనేవున్న తల్లిముఖంలోకి చూస్తూ నుంచుని ఏమనుకుందో ఏమో ఐదురూపాయలు నోటు సంచిలో పడేసి పదిరూపాయలనోటు తీసి వాసంతి ముందు పెట్టింది.

"ఏమిటమ్మాయిది? నేను నువ్విచ్చింది చాలక తీసుకోలేదను కుంటున్నావా? భలేదానివి. తీసుకో తీసుకో! మళ్ళీ యిలా చేసావంటే నీ కసలు వైద్యమే చెయ్యను తెలుసా?" అప్యాయంగా బెదిరిస్తున్న వాసంతికి కృతజ్ఞతగా నమస్కరించి ఆమెడబ్బు తీసుకోనందుకు బాధపడుతూ బయటకి వెళ్ళింది పేషెంట్.

"డాక్టర్! నాకు క్రానిక్ సైనుసైటిస్ వుంది. విపరీతమైన తలపోటు, తుమ్ములు, పెన్సిలిన్‌కి రియాక్షన్ వస్తుంది. టెట్రసైక్లిన్స్ పడవు. ఎరిత్రోమైసిన్ ఫరవాలేదు." తరువాత వచ్చిన పేషెంటు వంక విస్తుపోయి చూస్తూంది వాసంతి. ఎన్నోరకాల పేషెంట్సుని అను నిత్యం చూస్తూవున్నా, ప్రతి ఒక్క పేషెంటుతో పరిచయం ఒకో కొత్తఅనుభవం.

"ఈ మధ్య బ్లీడింగు ఎక్కువవుతూంది. ట్యూమరేమన్నా వుందేమోనని అనుమానంగా వుంది. ఆపరేషన్ చెయ్యాలంటారా? మందులకి తగ్గుతుందంటారా?" ఆవిడ ప్రశ్నలకి, పరిజ్ఞానానికి జోహారు చెయ్యాలని పించింది వాసంతికి.

ఆవిడని పరీక్షచేసి ఆపరేషన్ అవసరం లేదని, మందుల్తో తగ్గి పోతుందని చెప్పి మందులు రాస్తోంది వాసంతి.

"ఆపరేషన్ చేయించుకుంటే నెలనెలా బాధపడకుండా వెధవ పీడ

విరగడవుతుంది కదండి. అసలు మీరు సరిగ్గా పరీక్ష చేసారా? కాన్సరేమోనని అనుమానమైమైనా వుందా మీకు? ఫరవాలేదు. నేనేం భయపడను. చెప్పండి నాతో అసలు విషయమేదో." ఏం జవాబివ్వాలో వాసంతికి వెంటనే స్ఫురించలేదు.

"ఒకవేళ ఆపరేషన్ చేయించుకుంటే మీరు చేసేయగలరా? టౌనులో ఇంకెవరయినా పెద్దడాక్టరుతో చేయించు కోమంటారా? అడుగుతున్నాన నుకోకండి. ఇంతకుముందిలాంటి ఆపరేషన్లేమయినా చేసారా మీరు?" నవ్వాలో, ఏడవాలో తెలియడంలేదు వాసంతికి.

"అసలు మీకు ఆపరేషన్ అవసరం లేదండి." పేషెంటు కళ్ళల్లోని గాఢమైన అపనమ్మకాన్ని చూచి మరోమాట మాట్లాడడానికి భయపడింది వాసంతి. అయిష్టంగా మందులచీటి తీసుకుని ఫీజు మాటెత్తకుండా వెళ్తున్న పేషెంట్ వంక తెల్లబోయి చూస్తూంది. అప్పటివరకు వారిసంభాషణ వింటూ అసహనంగా చూస్తున్న కాంపౌండర్ రామయ్య ఆవిడని ఆపి కన్సల్టేషన్ ఫీజు అడిగాడు.

"ఫీజా? ఎంత? ఇప్పుడే కట్టాలా? మళ్ళీ వచ్చినప్పుడు ఇవ్వ కూడదా? డాక్టరమ్మగారు డబ్బడగరని చెప్పారే?" మరో పేషెంటు బాధల వివరాలు చీటీ మీదరాస్తూ ఆవిడ ప్రశ్నల్ని వింటూనే వుంది వాసంతి.

"అమ్మగారు డబ్బడగరంటే ఇవ్వనక్కరలేదనా అర్థం? పరీక్ష ఫీజు ఇప్పుడే తీసుకుంటాం." విసుగ్గా అన్నాడు రామయ్య. ఫీజెంతివ్వాలిందీ చెప్పాడు.

చాలా బాధగా రెండు రూపాయలనోటు తీసి ఇవ్వబోయిందావిడ.

"అదేంటమ్మా? నేనెంత చెప్పాను? మీరెంతిస్తున్నారు?" మోజేతుల దాకా వున్న ఆవిడ బంగారు గాజుల్ని, జానెడు వెడల్పున్న జరీఅంచు చీరని చూస్తూ అడిగాడు రామయ్య.

‘‘మధ్యలో నువ్వేమిటయ్యా? డాక్టరుగారు ఎంతిస్తే అంతే పుచ్చుకుంటారని చెప్పింది మా ప్రక్కింటావిడ. తీసుకుంటే తీసుకో. లేకపోతే లేదు.” దులపరించుకుని వెళ్ళిపోయిందామె. నిర్ఘాంత పోయిన వాసంతి ఆమె వెళ్ళిపోయాక కూడ అటేచూస్తూ వుండి పోయింది. ఆవిడ బయటకు వెళ్ళిన మరుక్షణం రాజా ప్రత్యక్షమయ్యేసరికి సంభ్రమంగా లేచింది వాసంతి.

‘‘రాజా!’’ నమ్మలేనట్లుగా అతనివంక చూచింది వాసంతి, చిరునవ్వుతో తన వంక చూస్తున్న రాజాని చూచి ఆమె హృదయం వశం తప్పుతూంది. ఇన్నాళ్ళనుండి అతను రాకపోవడంగాని, ముక్తసరిగా రాస్తున్న లెటర్సుగాని ఆ క్షణంలో గుర్తుకు రావడంలేదు. తన ప్రక్కనున్న పేషెంట్, రాజా ప్రక్కగా వస్తున్న రామయ్య కనిపించడం లేదు. ఎన్నో యుగాల తరువాత అతనిని చూస్తున్నట్లు, కనురెప్పవేస్తే అతడు మాయమవుతాడేమోనన్న భయంతో అతనివంక తపనగా చూస్తున్న వాసంతి నిగ్రహించుకోవటానికో నిముషం పట్టింది.

‘‘కూర్చోరాజా!’’ సంతోషాన్ని దాచుకోవటానికి ప్రయత్నిస్తున్న వాసంతి హృదయంలో జలపాతాలు నాట్యం చేస్తున్నాయి. సెలయేళ్ళు, పాటలు పాడుతున్నాయి.

## 10

ఆకాశం తలనిండా మెరుస్తున్న అక్షింతలు చిక్కుకుపోయాయి. ఆట మొదటిలోనే ఓడిపోయిన చంద్రుడు చుక్కలన్నీ తననెక్కడ వెక్కిరిస్తాయోనన్న భయంతో మబ్బు పరదాల చాటుకు పారిపోయాడు.

“ఏమిటివాసూ విశేషాలు?’’ రాజా వచ్చినందుకు సంతోషంతో తలమునకలవుతున్న వాసంతి అతని ప్రశ్నవిని హాయిగా నవ్వింది.

“నువ్వు రావడమే పెద్దవిశేషం” మెరుస్తున్న కళ్ళతో అతనివంక

చూచింది వాసంతి. వాసంతి మామూలుగానే అన్నా అసలే తన ప్రవర్తనకు కించపడుతున్న రాజాకు ఆమె తనను దెప్పుతూందేమోననిపించింది. రాజా ముఖం చూచి కలవర పడింది వాసంతి.

"ఏమిటిరాజా అలావున్నావు?" ఛప్పున అతని చేతినందుకుని తన రెండు చేతుల్తో పదిలంగా పట్టుకుంది. తను అన్నమాటలో అతన్ని నొప్పించేదేముందా అని తర్కించుకుంది.

"రాజా!" నెమ్మదిగా, మధురంగా అతన్ని పిలుస్తూ అతని భుజంమీద తలానించింది.

"నీ దగ్గరకు పరుగెత్తుకు వచ్చేయకుండా ఉండడానికి నేనెంత శక్తిని కూడ దీసుకోవాల్సివస్తూందో నీకు తెలియదు. ఒక లక్ష్యంకోసం యింత శూన్యాన్ని, ఒంటరితనాన్ని పళ్ళబిగువున భరిస్తున్నాను" మరోలోకంలో వున్నట్లు చెప్పసాగింది. వాసంతి. ఆక్షణంలో అతని సాన్నిధ్యం తమ తొలిపరిచయపు పులకింతను అనుభవంలోకి తెస్తూంది.

"రాజా! నన్ను గుండెల్లో పెట్టుకుని అప్యాయతని పంచేవ్యక్తి ఎక్కడో వున్నాడనే ఊహనాకెంత శక్తినిస్తూందో నీకు తెలియదు" ఎప్పుడూ ఇలా హృదయం విప్పిమాట్లాడని వాసంతిని వింతగా చూస్తూన్నాడురాజా. ఆమె మాటల ప్రభావం అతని హృదయం మీదకూడా పడి భావోద్రిక్తత చుట్టేసింది.

గాలి ఛెంగుఛెంగున గెంతుతూవచ్చి వాసంతి చెంపల్ని తాకింది. వెన్నెల వేడి నిట్టూర్పుల కామె పయటచెంగు చెదిరింది. ఏకాంతం, వాసంతి స్పర్శ, హృదయాన్నావరించిన ఉద్రిక్తత అతనిని రెచ్చగొట్టాయి. వాసంతి ఇష్టపడే అతని పొడవాటి సర్జన్స్ ఫింగర్స్ ఆమెను గుచ్చిహృదయానికి హత్తుకున్నాయి. ఒక క్షణం వివశంగా అతని చేతల మధ్య యిమిడిపోయిన వాసంతి తెలివి తెచ్చుకుని, అతని చేతుల్ని మృదువుగా విడిపించుకుని,

అవసరం లేకపోయినా, ఒక సారి ఇన్‌పేషెంట్‌స నందరినీ చూసొచ్చింది.

''హమ్మయ్య! వచ్చావా! ఇంకీరాత్రికి పేషెంట్స్ దగ్గరే వుండిపోతావేమోనని హడిలి చచ్చిపోతున్నాను. నిన్నేం చెయ్యనుకాని యిలాకూర్చుని కాసేపుకబుర్లు చెప్పు" శేషతల్పంమీది విష్ణుమూర్తి పోజుతో మంచంమీదపడుకున్న రాజాప్రక్కకు జరిగి వాసంతి చేతిని పట్టుకుని కూర్చోబెట్టాడు. అప్పటికే వాసంతిలోని అలజడి తగ్గిపోవడంవల్ల మామూలుగా మాట్లాడసాగింది.

"రాజా! నీకు ఆపరేషన్స్‌కి బాగా ఛాన్సులిస్తున్నారా? కొత్తగా వచ్చిన ఛీఫ్‌కి నువ్వంటేయిష్టమేనా?'' కుతూహలంగా రాజావంకచూచింది వాసంతి.

"బ్రహ్మాండమైన యిష్టం. సీనియర్ పోస్ట్‌గ్రాడ్యుయేట్స్‌తో దెబ్బలాడీ మరీ ఛాన్సులు తీసుకుంటున్నాను. ఎమ్.ఎస్.అయిపోయేటప్పటికి సర్జరీస్ అన్నిటినీ క్షుణ్ణంగా నేర్చేసుకుంటాను. నీలాగా ప్రజలు, సేవ మొదలైన డామ్‌నాన్సెన్స్‌తో టైమ్ వేస్ట్ చెయ్యకుండా టౌన్‌లో ప్రాక్టీస్ పెడతాను' రాజా మాటలువిని వాసంతి ముఖకవళికలు మారిపోయాయి.

''నా బ్రతుకు తెరువుకు నేను కృషిచేస్తున్నాను తప్పితే నేనే సేవాచెయ్యడం లేదు మొర్రోఅని లక్షసార్లు చెప్పానీకు. అయినా మళ్ళీ లక్షా ఒకటోసారి చెప్తున్నాను. ప్రజలసేవకి జీవితాన్ని అంకితం చేసేంత గొప్పదాన్ని కాదునేను. మామూలు మనిషిని" అంది వాసంతి.

"వైద్యం చేయించుకుని ఫీజు ఎగ్గొడితేనూ, కనీసం మందులకుకూడా డబ్బివ్వకుండా పారిపోతేనూ మామూలు మనుషులెవ్వరూ ఊరుకోరు. గోళ్ళూడగొట్టి వసూలుచేస్తారు" అన్నాడు రాజా. గతుక్కుమంది వాసంతి. ఇవన్నీ రాజాతో ఎవరు చెప్పారు.? తనుడెలివరీ కేస్‌లో వున్నప్పుడు రామయ్య చెప్పివుంటాడు. తనను మెతకగా వుండొద్దని అప్పుడప్పుడూ

ఊరుకోలేక హెచ్చరిస్తూ వుంటాడు రామయ్య.

"రాజా! చాలా అద్భుతమైన సమాచారం సేకరించావే? నీకిదంతా ఎవరు చెప్పారోకాని అసలు మనిషిని నేను చెప్తున్నాను కనుక నువ్వు నమ్మితీరాలి. ఎక్కడో తప్ప ఎవరూ ఎగ్గొట్టరు. ఎంతో కొంత ఇచ్చిపోవాలనే చూస్తారు. డాక్టర్లలో రకరాలున్నట్టే పేషెంట్స్ కూడా రకరకాలు. అసలు మనుషులే రకరకాలు. వాళ్ళు రకరాలుగానే ప్రవర్తిస్తారు. నేను వాళ్ళు డబ్బివ్వాల్సిన సంగతి మరిచిపోయాకకూడా వాళ్ళకు కలిగినప్పుడు గుర్తుపెట్టుకుని భక్తిగా పట్టుకొచ్చి యిస్తారు కొంతమంది పేషెంట్స్. నేను మొహమాటుపడి తక్కువ చెప్పినా నన్ను కోప్పడి దానికి రెండింతలిచ్చే వాళ్ళున్నారు. పేదవాళ్ళు, వాళ్ళేంయివ్వగలరులే అని ఫీజువద్దంటే అలా అన్నందుకు కోపంతెచ్చుకుని ఫీజు చెల్లించనిదే కదలని వాళ్ళున్నారు. అసలలాంటివాళ్లున్నారని తెలుసానీకు?" డబాయింపుగా అడిగింది వాసంతి.

"తెలుసు మేడమ్, తెలుసు. అలాంటివాళ్ళు వెయ్యిమందిలో ఒక్కరని, ఎగ్గొట్టి పోవాలని చూచేవాళ్లు, ఆఫ్‌కోర్స్, ఆ అవకాశమిచ్చే నీలాంటి మహాత్ములుండాలనుకో, ఎక్కువమందుంటారనీ తెలుసు. నాకు తెలియని దల్లా చదువులో ఎప్పుడూ ఫస్టుండే నువ్వు లోకాన్నెలా చదవలేకపోతున్నావా అని. డబ్బు అవసరం ఎంతో వున్న నువ్వు డబ్బుదగ్గర ఖచ్చితంగా ఎందుకుండటం లేదూ అని'' రాజా వాసంతివంక తీక్షణంగా చూచాడు.'డబ్బు అవసరం! నిజమే డబ్బు అవసరం చాలావుంది తనకు. అప్పుతీర్చాలి. చెల్లెళ్ళచదువు, తమ్ముడిచదువు అవాలి. వినత పెళ్ళికి కట్నం....కట్నంయిచ్చి పెళ్ళి చేసుకోవడమనే మాట వింటేచాలు ఆదిశక్తిలా మండిపడుతుంది వినత. దాని పిచ్చిఆవేశం తప్పితే కట్నం విష్వకుండా పెళ్ళిచేసుకునే అవకాశం ఎక్కడుంది ఇప్పుడు? ఇష్టం లేకపోయినా రాజీపడక తప్పదు. ఆ మాటకొస్తే డబ్బుకోసం కాకుండా కేవలం

సేవాభావంతో తన వృత్తిని చెయ్యాలని లోలోపల తన ఆశయం. కాని డబ్బు తీసుకోక గత్యంతరం లేదు. అవసరాలు, అవసరాలు ఆశయాల్ని సమాధి చేస్తున్నాయి. రాజా తనవంక విసుగ్గా చూడటం చూచి ఆలోచనల్ని కట్టిపెట్టింది వాసంతి.

"రాజా! వైద్యమనేది ఏమైనా వస్తువా, ఇంతధర అనిచెప్పి ఖచ్చితంగా వసూలు చెయ్యడానికి?" ఆవేశం లేకుండా అడిగింది వాసంతి.

"నిజమే. వైద్యమనేది వస్తువుకాదు. కాని ప్రస్తుత ప్రపంచంలో అమ్మకపు వస్తువు కాకుండా ఏమైనా మిగిలిందా? సంఘంలో పరపతి, గౌరవం కీర్తి...యివేవీకూడా వస్తువులు కాదు. కానీ వీటిని డబ్బుతో కొనుక్కోవడం చూస్తున్నామే,....పోనీ, నిరాకారమైన వాటిసంగతి వదిలెయ్. రక్తమాంసాలున్న మనుషుల్నే కొనుక్కోక తప్పడం లేదు. వస్తువులు కానివాటిని కొనుక్కోక తప్పనిసరయిన పరిస్థితులున్నప్పుడు వైద్యాన్ని అమ్ముకోవడం తప్ప గత్యంతర మేముంది?" చురుగ్గా చూచాడు రాజా.

"బొత్తిగా అలా మాట్లాడకు రాజా! ప్రపంచంలో దేన్ని కొనుక్కున్నా అమ్ముకున్నా, వైద్యాన్నిమాత్రం రూపాయలతో తూచి అమ్ముకోవడమంత నీచమైంది మరొకటిలేదు. ఐనా, అలా అమ్ముకోని డాక్టర్లీ భూమ్మీద మరెవరూ లేనట్లు, నేనొక్కదాన్నే మతిలేనిదాన్లా ప్రవరిస్తున్నట్లు మాట్లాడతావేమిటి?" తను ఎంతోకొంత మంచిదార్లో నడవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు సమర్థించి, ప్రోత్సహించాల్సింది పోయి తెలివితక్కువ పెద్దమ్మలా ప్రవర్తిస్తున్నట్లు మాట్లాడుతూంటే చాలాకష్టంగా ఉంది వాసంతికి.

"అలా అమ్ముకోని డాక్టర్లీ భూప్రపంచంలో కొద్దిమందున్నారు నిజమే. మళ్ళీ వాళ్ళల్లో రెండురకాలు, ఒకరకం అన్నివిధాలా అమరిన జీవితం ఉన్న అదృష్టవంతులు. ఈ వృత్తిచేసి సంపాదించకపోయినా సలక్షణంగా, దర్జాగా బ్రతకగల సంపన్నులు, ఇలాంటి వాళ్ళకు పేరుప్రతిష్టలు,

బిరుదులూ, సన్మానాలూ పుష్కలంగానే లభిస్తాయి. ఎటొచ్చీ నీలా ఆధారం లేకుండా, అవసరాలు ఎక్కువ ఉన్న వాళ్ళకీ పిచ్చి పడితేనే మట్టిగొట్టుకు పోయేది."

"ఎంత ఘోరంగా మాట్లాడుతున్నావు?" రోషంగా అంది వాసంతి.

"ఉన్న విషయం చెప్తున్నాను. ఇందులో ఘోరమేముంది? నీలాంటివాళ్ళకి దొరికేది 'పిచ్చిది' అన్న ఘనమైన బిరుదు, మరీ అదృష్టం బావుంటే నీలాంటి ఆదర్శపు పిచ్చాళ్లు పదిమంది కలిసి నీ గురించి నాలుగు ఊకదంపుడు పొగడ్తలు కురిపించి, తెల్లారేటప్పటికి వాడిపోయే దండని మెళ్ళోవేస్తారు.ఇవేవీ నీకూ, నీ వాళ్ళకూ పట్టెడన్నం పెట్టలేవని, నిలవడానికి స్థిరమైన నీడను కల్పించలేవని మరిచి పోకు." రాజా మాటలకు ఉక్రోషం పెల్లుబుకుతూంది వాసంతికి. తన ప్రియమిత్రుడు, తను జీవితాంతం కలిసి బ్రతకాలని కోరుకుంటున్న వ్యక్తి అంతపచ్చిగా మాట్లాడుతూంటే సహించలేక పోతూంది.

"నేనెంత మొత్తుకున్నా నువ్వు నీ ధోరణిమానవు. నువ్వు చెప్తున్నంత ఆదర్శంగా నేను బ్రతకడం లేదు. అంతశక్తి నాకు లేదు. కాకపోతే రోగికి కాకుండా డబ్బుకు మాత్రమే ప్రాధాన్యమిస్తూ బ్రతకలేన్నేను."

" పేషెంట్ ఇచ్చినంతే పుచ్చుకోవాలి అన్న నీతివాక్యాన్ని అక్షరాలా ఆచరించడంలో కనపడుతూంది నీఅమాయకత్వమే. పేదవాళ్ళ సంగతీ, ఇవ్వలేనివాళ్ళ సంగతీ వదిలెయ్. రాక్షసిలాగా పీక్కుతినమని నేనూ అనను. కాని ఇవ్వగలిగిన వాళ్ళతో దీనికింత తీసుకుంటాను, ఇంతకయితేనే చేస్తాను, లేకపోతే దయచేయండి అని ఎందుకు చెప్పలేవు? అలా చెప్పడంలో పేషెంట్‌ని మోసగించడం గాని, తప్పు గానీ ఏముంది?" రాజా నిలదీసి అడుగుతూంటే వెంటనే జవాబివ్వలేక పోయింది వాసంతి. కాని అతను చెప్తూంది సబబుగా వుందని అంగీకరించలేక పోయింది.

"ఎవరయితే మాత్రం ఇంతడబ్బివ్వండి, ఇవ్వకపోతే వైద్యం చెయ్యనని ఎలాచెప్పేది రాజా?" గొణిగినట్లు అడిగింది వాసంతి.

"చెప్పకపోతే నువ్విక్కడే ప్రజాసేవ చేస్తూ కూర్చుంటావు. అప్పు దారిన అప్పు పాపం పెరిగినట్లు పెరిగిపోతుంది. అక్కడ మీ చెల్లెళ్ళు నీ నిజాయితీకి, సేవా ధర్మానికి ముచ్చటపడుతూ ముసలి కన్యలుగా మిగిలిపోతారు." అంత కోపంలోనూ రాజా వెక్కిరింపు చూచి నవ్వొచ్చింది వాసంతికి.

"మా తమ్ముడిని మరిచిపోయావు." చిలిపిగా చూచిందామె.

"అతనికేం! మగాడు. ఎలాగైనా బ్రతికేస్తాడు. రేపు చదువయి పోయిందంటే వేలు నెత్తిమీద పెట్టి తన్నుకుపోతారు. ఎంత చదువుకున్నా, ఎంత సంపాదిస్తున్నా త్రిశంకుస్వర్గంలాంటి దశనుంచి ఒక్క అడుగుకూడా ముందుకెళ్ళనిది మీ ఆడపిల్లల పరిస్థితే'' రాజా అలా కుండ బ్రద్దలుగొట్టినట్లు మాట్లాడుతుంటే ఆలోచిస్తూంది వాసంతి. అతని ఆలోచనా వైఖరిని పరిశీలిస్తూ తామిద్దరూ సమానాంతర రేఖల్లా మిగిలిపోతామా అని భయపడుతూంది.

"వాసూ!" ఆలోచనలతో పగిలిపోతూన్న కణతల్ని వ్రేళ్ళతో నొక్కు కుంటున్న వాసంతిని తనవైపుకి తిప్పుకున్నాడు రాజా.

"ఆలోచనలతో తలబ్రద్దలు గొట్టుకోవాల్సిందేమీ లేదిందులో. కొంచెం కళ్లు బాగా తెరిచి ప్రపంచమంతా ఎలా ఉందోచూడు. ప్రపంచాన్ని ఏది నడిపిస్తూందో, ఏది పాలిస్తూందో చూడు. డబ్బు. డబ్బు మాత్రమే ప్రపంచాన్ని నడిపిస్తూంది, పాలిస్తూంది. డబ్బులుండి ఎన్ని ఆదర్శాలైనా వల్లించొచ్చు. డబ్బు లేకపోయిన్నాడు నీ ఆదర్శాలకు చిల్లిగవ్వ విలువకూడా లేదు. ముందీపాఠాన్ని నేర్చుకుని డబ్బు సంపాదించే మార్గాన్ని గురించి ఆలోచించు.." పార్థుడికి గీతాబోధ చేస్తున్న శ్రీకృష్ణభగవానుడిలా ఉపదేశించాడు రాజా.

# 11

"హల్లో! ఎప్పుడొచ్చారు మీరు? అన్యాయం: నాకు కనపడకుండా నన్నుదాటుకుని మీ అక్కదగ్గర కొచ్చేసారా?" నిష్టూరంగా సుధీర్‌ని అడిగింది వాసంతి. సుధీర్ అక్క మూడోపురుడు వాసంతిదగ్గర పోసుకుని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుంది.

"మీరేదో కేస్‌లో ఉన్నారు నేనొచ్చేటప్పటికి. అంతలో అక్కను పలకరించి వద్దామని ఇటొచ్చాను. మీరు రౌండ్స్‌కి వచ్చినట్లున్నారు పూర్తిచేసి రండి. ఇవాళంతా నేనిక్కడే ఉంటాను. మీకు బాగా బోరుకొట్టించే ఇక్కడ్నుంచి కదుల్తాను." నవ్వాడు సుధీర్.

వాసంతి పనయేదాకా అక్కదగ్గర కూర్చున్నాడు సుధీర్. హాస్పటల్‌లో ఇన్‌పేషెంట్స్‌నీ, ఉదయంనుంచీ ప్రవాహంలా వస్తున్న ఔట్ పేషెంట్స్‌నీ గమనించాడు. ఈమెకింత ప్రాక్టీసున్నా సంపాదనింత తక్కువగా ఉండడానికి కారణమేమిటి?... ఎక్కడో యేదో లోపముంది.

తను వాకబుచేసిన దాన్నిబట్టి డాక్టరంటే ఎలాఉండాలని తను అనుకుంటున్నాడో వాసంతి అలా ఉన్నందుకు తనకు చాలా అనందంగా ఉంది. కాని.... మొన్నా మధ్య సాగర్ తన రూముకొచ్చి వాళ్ళయింటికి లాక్కెళ్ళాడు. వాళ్ళమ్మగారెంతో బాధపడ్డారు తనదగ్గర, ఇన్నాళ్ళయినా కనీసం తన అప్పుకూడా తీర్చలేక పోయినందుకావిడ నొచ్చుకొన్నారు.

వాసంతి పనయాక ఆమె దగ్గరకొచ్చి కూర్చున్నాడు సుధీర్.

"ఊఁ ఇప్పుడు చెప్పండి విశేషాలు. మా వినత, సాగర్ యూనివర్సిటీలో కలుస్తూంటారా ఎప్పుడయినా?"

"మొన్నీమధ్యే సాగర్‌తో కలిసి మీ యింటికి వెళ్ళాను."

"మా వాళ్ళ సీట్స్ విషయంలో మళ్ళీ మీకు శ్రమివ్వక తప్పిందికాదు.

రాజాకి రాస్తే తనంతగా పట్టించుకోలేదు. సంధ్య అసలు లెటర్సే రాయ దెప్పుడూ. దాని కబుర్లు తెలిసి యుగాలయింది. ఇంక మీకు రాయక తప్పిందికాదు. యూనివర్శిటీకి దగ్గర్లోనే ఇల్లుకూడా చూచిపెట్టారని రాసింది వినత. మీ ఋణాన్నెలా తీర్చుకోవాలో తెలియడం లేదు." ఉద్వేగంతో చలించిపోతూ మాట్లాడుతున్న వాసంతి వంక రెప్పవాల్చకుండా చూస్తున్నాడు సుధీర్. అతని హృదయంలో అకస్మాత్తుగా ఒక తేనె తరంగం ఉద్భవించింది. వెంటనే రాజా గుర్తుకొచ్చి ఆ తరంగం విరిగి పడిపోయింది.

"భలేవారు! ఋణమేమిటి? నేనేంచేసానని అసలు? సాటిమనిషి కామాత్రం సాయం చెయ్యకపోతే ఇంకెందుకు?" అంటూ సుధీర్ తనలోపలికి ఒక్కసారి చూచుకుని ఉలిక్కిపడ్డాడు, సాటి మనుషులందరికీ తనిలా సహాయపడుతున్నాడా? ఒక్క వాసంతికి, ఆమె కుటుంబానికే ఇంతగా ఎందుకు సహాయ పడుతున్నాడు?...యింకా తరచి ఆలోచించడానికి భయపడ్డాడు సుధీర్.

"సాటిమనిషికి సహాయపడాలనే మంచి బుద్ధి ఈరోజుల్లో ఎంతమంది కుంటూందండీ? కాని...మీ మంచితనాన్ని మేము ఎక్కువగా ఉపయోగించుకుంటున్నా మేమోనని భయమేస్తూంది. ఇంతవరకు మీకు సగండబ్బుకూడా తిరిగి ఇవ్వలేకపోయాను, సరిగ్గా మీకు పంపుదామ నుకునేసరికి ఏవోఖర్చులు. చివరికి మీకు పంపడం వాయిదావేయడం, మీరేమనుకుంటున్నారోనని గిల్టీగా వుంది నాకు" కించపడుతూ చెప్పసాగింది వాసంతి.

"మీరలా బాధపడొద్దు. యిప్పుడునాకు డబ్బవసరమేమీలేదు. యింకా సంగతి వదిలేయండి, మీప్రాక్టీస్ కబుర్లేమైనా చెప్పండి" చిన్నగా నవ్వాడు సుధీర్.

"ఏముంది? అంతా రొటీన్"

"అదేంటలా అంటారు? తెల్లారిలేచి ఎన్నిరకాల మనుషుల్ని, ఎన్నిరకాల జబ్బుల్ని చూస్తారు మీరు? నిత్యనూతనంగా వుండేది మీవృత్తే"

"అది నిజమేననుకోండి. ఒక స్థాయికి వచ్చాక బయట ప్రపంచాన్ని గురించి ఆలోచించే సావకాశంఉండదు. యంత్రాల్లాగా పనుల్ని చేసుకుంటూ పోతాం"

"మీరేమనుకోనంటే కొంచెం చనువు తీసుకుని కొన్ని విషయాలు చెప్తాను మీకు"

'చనువు తీసుకుని కొన్ని విషయాలు చెప్తాడా యితను!' చివ్వున తలెత్తి సుధీర్‌వంక చూచింది.

"ఏంలేదు. మీరు మరీ ముక్కుకు సూటిగాపోయి కొంతమందితో శత్రుత్వం తెచ్చుకుంటున్నారేమోననిపిస్తూంది. నిజాయితీగా వుండటం మంచిదే. కాని స్థానికులతో వైరం తెచ్చుకోవడం ప్రమాదం"

"ఎవర్ని గురించి మీరనేది?"

"మెడికల్‌షాప్స్ వాళ్ళతోనూ, క్వాక్స్‌తోనూ, ఊళ్ళో పెద్దలతోనూ తగాదా పడ్డారని విన్నాను" సుధీర్ మాటలు విని మండి పోయింది వాసంతి.

"పేషెంట్ జబ్బుతో సంబంధంలేకుండా రెండేసి పేజీలమందులు రాయాలట. ఫిజీషియన్ శాంపిల్స్ అమ్ముకోవాలట. నాకు కావలసింది పేషెంట్సా లేక వాళ్ళ వ్యాపారమా? నామీద కొండంత నమ్మకంతో వచ్చిన పేషెంట్‌ని మోసగించి నేనూ ఒక తోడుదొంగనవనా? వాళ్ళ ఉచిత సలహాలకు ఒళ్లు మండిపోతుందా లేదా చెప్పండి మీరే."

"అవుననుకోండి కాని..."వాసంతి అతని మాటల్ని వినిపించుకునే స్థితిలో లేదు.

"ఇంక యీక్వాక్స్ మహాశయులున్నారే, వాళ్ళకి తమ సహాయం

లేనిదే, తాము పేషెంట్స్‌ని తీసుకురానిదే మాకు పొద్దు పొడవదనే దురహంకారం. వాళ్ళు ప్రాపగాండాచెయ్యనిదే మాదగ్గర కెవ్వరూరారనే దారుణమైన అపోహ. మా ప్రాక్టీస్ నిలబడడానికిగాని, పడిపోవడానికిగాని వాళ్ళేకారణమని అతిశయం. వాళ్ళ అహంకారం, అతిశయం మాటెలావున్నా ఆపేషెంట్‌కీ ఇంజక్షన్ రాసివ్వండి, ఈ పేషెంట్ దగ్గర ఇంత ఫీజుపుచ్చుకోండి అని జబర్ధస్తీ చేస్తే 'గెటౌట్' అనకుండా వుండగలరా మీరయితే?" అంత విపులంగా ఆ విషయాలన్నీ తెలియని సుధీర్ వాసంతిలా చెరుగుతూ మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఊళ్ళోకొంతమంది పెద్దలక్కూడా అదే అహంభావం. తమ ఇళ్ళకు వాళ్ళింటి నౌకరులా పగలు పిలిస్తే పగలు, రాత్రిపిలిస్తే రాత్రి పరుగెత్తుకు వెళ్ళాలి. పేషెంట్ నాదగ్గరకు రాలేని పరిస్థితిలో వుంటే అదివేరేసంగతి. అలాకాక నన్ను తమయింటికి రప్పించుకోవడం గొప్పఅనుకునే వాళ్ళకేం సమాధానం చెప్పాలి? ప్రతిడబ్బున్న అడ్డగాడిద డాక్టర్‌కి 'బాస్' లాప్రవర్తిస్తే, డబ్బుతో మనుషుల్ని కొనెయ్యగలమనే నీచత్వాన్ని ప్రదర్శిస్తూంటే ఎలా నిగ్రహించుకోగలం చెప్పండి" వాసంతి ఎన్నాళ్ళనుంచో లోపల దాచుకున్న కడుపుమంటను వెల్లడిస్తూంది.

"టేకిటీజీ. నేనేదో మాటవరస కడిగాను" సుధీర్ నొచ్చుకుంటునట్లు అంటూంటే సన్నగా నవ్వింది వాసంతి.

"మీరన్నారుకదా అని చెప్పానిదంతా. ఇంత రాష్‌గానూ వాళ్ళ ముందు మాట్లాడాలనిపించినా సాధ్యమైనంత వరకు ముఖానికి నవ్వు పులుముకుని మర్యాదగానే మాట్లాడతాను. ఎప్పుడోతప్ప, మరీ ఇంక ఓర్చుకోవడం నావల్ల కాదనిపిస్తే తప్ప ఇలా బయటపడను. అలా బయటపడిపోతే ఈ వృత్తే చెయ్యలేము" నవ్వుతూ చెప్తున్న వాసంతివంక ఇష్టంగా చూస్తున్నాడు సుధీర్.

"మా వృత్తి చిత్రమైన వృత్తి. మాకున్నంతమంది 'బాస్'లు ఇంకెవరికీ ఉండరు" తమాషాగా చూచింది వాసంతి.

"ప్రైవేట్ ప్రాక్టీషనర్స్, మీకు బాస్‌లెవరండీ?"

"పేషెంట్స్. పేషెంట్సే మాకు బాస్‌లు. వారి కరుణా కటాక్ష వీక్షణాల్ని మా మీద ప్రసరింపజేస్తేనే మేము నిలిచేది. వారికి దయ కలగకపోతే మా పని హుళక్కే." గలగలా నవ్వింది వాసంతి. ఆమె మాటలు విన్నాక మెతకతనంతోనూ, మొహమాటంతోనూ అలా ప్రవర్తిస్తూందనుకుంటున్న తన అభిప్రాయం తప్పని తెలుసుకున్నాడు సుధీర్.

"మీరన్నట్లు నాకు కొంతమంది శత్రువులున్నారు, దానికి కారణం కూడా నాకు తెలుసు. ఆడపిల్లను, అమాయకంగా కనిపిస్తాను. వాళ్ళు చెప్పినట్లు నేను అక్షరాలా చేస్తానని భ్రమపడ్డ వాళ్ళందరికీ నేను కొరకరాని కొయ్యనని బయటపడేసరికి అంతులేని కోపమొచ్చింది, అదృష్టవశాత్తూ నా పేషెంట్స్ వాళ్ళకా అవకాశాన్నివ్వడం లేదుగాని లేకపోతే యీపాటికి నన్నీ ఊరునుంచి తరిమేసి ఉండేవారు." వాసంతి పెదాలు నవ్వుతున్నా కళ్ళల్లో బాధ లీలగా కదలాడింది.

"పోనివ్వండి. నిజాయితీ తప్పి కాకుండా మీ మంచితనంతో, సమర్థతతో ఇలా ప్రాక్టీసును వృద్ధి చేసుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది. ప్రాక్టిస్‌ని ఒకస్థాయికి తెచ్చుకోవడం కంటే దాన్నాస్థాయిలో నిలుపుకోవడం కష్టం. మీరలా నిలుపుకోగలరనే నమ్మకం నాకుంది." చప్పున రాజా గుర్తొచ్చాడు వాసంతికి. అనుకోకుండా సుధీర్‌ని రాజాతో పోల్చి చూడసాగింది.

"డబ్బుమీద దృష్టి పెట్టుకోకుండా మీరు ప్రాక్టీస్ చేస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. డబ్బొక్కటీ మనిషికి విలువని, సంతోషాన్నీ ఇస్తుందనుకోవడం భ్రమ. మంచి మార్గంలో సంపాదించిన డబ్బు కొద్దే

అయినా అదిచ్చే తృప్తి మనుషుల్ని పీడించి గడించిన లక్షలివ్వలేవు."

ఇతనేమిటో! బొత్తిగా నాలాగానే ఉన్నాడు. సంతోషం, తృప్తి అనేవి పూర్తిగా వైయక్తికం, సంధ్య అన్నట్లుగా సంపాదించే అవకాశం లేనివాడు తన తృప్తికోసం సంపాదించేవాడిని తూలనాడతాడు. అలా సంపాదించిన పాపపుడబ్బు సుఖాన్ని, సంతోషాన్నీ ఇవ్వలేదని తన ఆహాన్ని జోకొడతాడు. ఎవరెలా సంపాదిస్తే వాళ్ళకాసంపాదన ఫస్టుగా అనిపిస్తుంది.... గులాబీరేకుల్లా మందహాసంతో విచ్చుకుంటున్న వాసంతి అధరాలవంక చూస్తున్నాడు సుధీర్. రాజా గుర్తొచ్చి ఒకక్షణం అసూయతో జ్వలించాయతని కళ్ళు. మంచిగంధంలాంటి భావాలతో పరిమళించే ఈ అమ్మాయిని భార్యగా పొందిన వ్యక్తి జీవితం ధన్యమైపోదా! ఈఅందాలరాశి అతని బ్రతుకునే అలరింప చేయదా ?

"ఏమిటలా చూస్తున్నారు? సంధ్య గుర్తొచ్చిందా?" చిలిపిగా నవ్వింది వాసంతి.

"సంధ్య నాకెందుకు గుర్తుకువస్తుంది?" సర్దుకుంటూ అడిగాడు సుధీర్.

"దాని వితండ వాదాలేమైనా గుర్తుకొచ్చాయేమోనని. మీరు వెళ్ళాక దానికి గట్టి వార్నింగివ్వండి. నేనిక్కడికొచ్చి ఇన్నాళ్ళయింది. మనిషి ఒక లెటర్రాయదు. నేను రాసినా సమాధానమివ్వడానికి బద్ధకం. నేను కదలడానికి వీలవదని తెలుసుగా! తనన్నా రావచ్చుగదా?" సంధ్య ప్రవర్తన తలచుకుంటే బాధగావుంది వాసంతికి.

"క్రానిక్ రిఫర్డ్ బిరుదు పుచ్చుకున్నాక సంధ్య పరీక్షలముందు కొన్ని రోజులుండి వెళ్ళిపోతూంది. నేను కలిసి చాలా నెలలయింది. తనెప్పుడు వస్తూందో, ఎప్పుడు వెళ్తూందో కూడా తెలపటం లేదీమధ్య."

''దాంతంతా మరీ విడ్డూరం. ఎప్పుడెవరితో స్నేహం పెంచుకుంటుందో ఎప్పుడొదిలేస్తుందో అర్థంకాదు. దానికి సీజనల్ ఫ్రెండ్ కాకుండా స్థిరంగావున్నదాన్ని నే నొక్కదాన్నే.'' పారిజాతపు రెమ్మ కదిలి పువ్వుల్ని రాల్చినట్టు నవ్వింది వాసంతి. ఆ పువ్వులతో దేవీపూజ చెయ్యాలనుకునే భక్తుడిలా ఆరాధనగా చూస్తున్నాడు సుధీర్.

## 12

నియంతలా సూర్యుడు లోకాన్నదర గొట్టేస్తున్నాడు. నియంతృత్వ పాలనలో ప్రజల్లా ఒదిగి ఒదిగి వీస్తూంది గాలి.

ప్లేటులో అన్నాన్ని కెలుకుతూ ఆలోచిస్తూంది వాసంతి. ఏపూట కాపూట ఒక్కదానికీ వంటచేసుకుని ఒక్కతీ కూర్చుని తినాలంటే ఏమిటోగా వుంది.

"హాయ్‌వాసూ!" సుడిగాలిలా వచ్చి తనను చుట్టేస్తున్న సంధ్యవంక విభ్రాంతితో చూచించి వాసంతి.

"సంధ్యా! ఏమిటే యింత సడెన్‌గా ఊడిపడ్డావు?" సంభ్రమంగా చూస్తూ చెయ్యి కడుక్కుంది వాసంతి.

"సస్పెన్స్" కళ్లు విప్పార్చి, తలని ప్రక్కకువంచి పోజ్‌గా చెప్పింది సంధ్య.

"కూర్చోముందు. మంచినీళ్ళు తాగుతావా?" సంధ్య చెయ్యిపట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టింది.

"మంచినీళ్లు? యూమీన్ కోల్డ్‌వాటర్? నొ.నొ. ఘాటుపానీయాన్ని మాత్రమే సేవిస్తాం," మూతి బిగించి నవ్వింది సంధ్య.

"ఇంకా 'మంకీ' అవతారాన్ని చాలించలేదే నువ్వు. అదిసరే, అన్ని సబ్జక్ట్సనీ గట్టెక్కించేసావాలేదా?" కుతూహలంగా సంధ్య వంక చూచింది

వాసంతి.

"ఇన్సల్ట్! గ్రేట్ ఇన్సల్ట్! హౌస్ సర్జన్సీ కూడా పూర్తి చేసేసాం."

"రియల్లీ? ఐతే ...ఎట్టకేలకు ఎవరు పుణ్యం కట్టుకున్నారు?" చిలిపిగా చూచింది వాసంతి.

"బయటి వాళ్ళని పట్టుకుని రికమండేషన్ అంటూ వాళ్ళ చుట్టూ తిరిగి ఆనవసరంగా రెండేళ్ళు వృధా చేసాను. బుద్ధొచ్చి ఈసారి మా డాడీ పూజ్యులైన మన ప్రొఫెసర్స్‌నే పట్టుకున్నారు. దక్షిణ తాంబూలాదులు దండిగా సమర్పించి గట్టెక్కించేసారు. నౌ హియరీజ్ డాక్టర్ సంధ్య ఎం.బి.బి.యస్" దర్జాగా చూచింది సంధ్య.

"ప్చ్! ఈ దేశ ప్రజల్ని చూచి నాకు బోల్డు జాలిగావుంది." కొండవీటి చాంతాడంత నిట్టూర్పు విడిచింది వాసంతి.

"ఆగాగు. అప్పుడే అంత జాలిని వేస్టుచేయకు. ముందు ముందు నీకళ్ళముందే ఎన్నెన్నో ఘోరాలు జరగవచ్చు. నువ్వు రోజూ చూస్తున్న ప్రజలకే నీ జాలి టన్నుల కొద్దీ కావాల్సి రావచ్చు." సంధ్య చెప్పేదేమిటో అక్షరం కూడా అర్థం కాలేదు వాసంతికి.

"అదేమిటే అలా అంటావు?"

"అనడమేమిటి! యిప్పుడు నేను చెప్పబోయే న్యూస్‌వింటే నీ గుండాగి పోతుందేమోనని నాకు దడగా వుంది." విచారంగా అంది సంధ్య.

"పాపం, ఏమిటే ఆ బ్రహ్మాండమైన న్యూస్?" జాలిగా అడిగింది వాసంతి.

"ది గ్రేటు డాక్టర్ సంధ్య ఎం.బి.బి.యస్. గారిక్కడ, ఈ ఊళ్ళో ప్రాక్టీస్ పెట్టబోతున్నారు. గుండె సరిగావుందా లేదా? ముందు చెప్పు." ఆశ్చర్యం నుండి తేరుకోలేక పోయింది వాసంతి. పల్లెటూళ్ళ వాళ్ళని,

మురికి మనుషుల్నీ అసహ్యించుకునే సంధ్య ఇక్కడ ప్రాక్టీస్ పెట్టడమా? ఖరీదైన మనుషుల ఖరీదు జబ్బులకి మాత్రమే వైద్యం చెయ్యడానికి ఇష్టపడుతుంది సంధ్య అని తన అభిప్రాయం. ఈ ఊళ్ళో, ఈ మనుషుల మధ్య సంధ్య ఇమడగలుగుతుందా?! నెవ్వర్. రెండు రోజుల్లో ప్రాక్టిసుకో దణ్ణంపెట్టి టౌన్‌కు పరిగెత్తుకు పోదూ?

"ఏమిటే మాట్లాడవు? కొంపదీసి నీ గుండె నిజంగానే ఆగిపో యిందా?" గబగబ స్టెత్ తీసుకుని వాసంతి గుండెమీద పెట్టింది సంధ్య.

"అబ్బ వుండవే. నువ్వీ ఊరినెలా సెలక్ట్ చేసుకున్నావా అని సస్పెన్స్‌తో చచ్చిపోతున్నాను."

"స్టాప్, స్టాప్, నువ్వు చచ్చిపోతే యిప్పుడా పాపం నన్ను చుట్టుకుంటుంది. బట్, నన్ను చుట్టుకోవడం వల్ల పాపానికే నష్టంకాని నాకేం నష్టంలేదనుకో. ఐనా జెమ్‌వి, దేశానికుపయోగ పడాల్సిన దానివి, నువ్వింత త్వరగా పరమపదించటం నాకిష్టం లేదు గనుక ఈ పీట ముడిని విప్పేస్తున్నాను. ఈ ఊళ్ళోనూ, చుట్టుప్రక్కల ఊళ్ళోళ్ళలోనూ మావాళ్లు ఎక్కువగా ఉన్నారు."

"మీ ఊరు గుంటూరవతలకదే?" అర్థం కానట్లు చూచింది వాసంతి.

"అవును మా ఊరు గుంటూరవతలే, కాదన్న దెవరు?"

"మరి....ఇక్కడ, ఇన్ని ఊళ్ళల్లో మీ బంధువులెవరున్నారే?" వాసంతి ప్రశ్నవిని గలగల నవ్వింది సంధ్య.

"మా వాళ్ళంటే మా బంధువులు కాదే పుస్తకాల పురుగూ! మా కులం వాళ్ళీ ప్రాంతంలో ఎక్కువమంది ఉన్నారు గనుక మన ప్రాక్టీసుకు ఢోకాలేదని ఢంకా బజాయించి మరీ నా బిలవ్డ హజ్బెండ్ ఈ ఊరిని సెలక్టు చేశాడు. బైదిబై, అతనూ ఈ ప్రాంతం వాడేలే. అతను ఆస్మదీయులతో, అనగా, మా కులం పెద్దలతో మాట్లాడుతున్నాడక్కడ."

ఆశ్చర్యంతో మతిపోయినట్లయింది వాసంతికి. సంధ్య మెడవంక పరిశీలనగా చూచింది. మంగళసూత్రం, నల్లపూసలు లాంటి మోటు వస్తువులేవీ లేకుండా నున్నగా మెరుస్తూంది.

"ఏమిటే అలా బిగుసుకుపోయావు? నేను చెప్తూంది అబద్ధమను కుంటున్నావా? నీమీదొట్టు" చిలిపిగా నవ్వింది సంధ్య.

"అమ్మో! ఎంత గుండెలు తీసినబంటువే? నాతోచెప్పకుండా పెళ్ళిచేసుకున్నావా? ఏదీ జోడుగుళ్ళపిస్తోలు, కాల్చిపారేస్తాన్నిన్ను" హడావిడిగా వెదికింది వాసంతి.

"నీలాంటి సాధుజంతువు దగ్గర మారణాయుధాలుండవని నాకు తెలుసుగాని, తగ్గు తగ్గు"

"పాపం! ఎవరే నీమెళ్ళో తాళికట్టిన దురదృష్టవంతుడు?" వాసంతి జాలి ప్రశ్నవిని కళ్ళెర్రజేసింది సంధ్య.

"ఏయ్! కరెక్ట్ యువర్‌సెల్ఫ్! ఎవరా ధన్యుడని అడుగు" చిలిపిగా నవ్వింది సంధ్య. అతివేగంగా మారుతున్న సంధ్య ముఖకవళికల్ని చూస్తూ నవ్వుతూంది వాసంతి.

"నాబాయ్‌ఫ్రెండ్స్‌లో ఎవరిని చేసుకున్నా మిగతావాళ్ళంతా జెలసీతో చచ్చిపోయే ప్రమాదముంది గనుక మాడాడీ తెచ్చిన బంగారపు పిచ్చుకను చేసుకున్నాను. అదృష్ట వశాత్తు, బట్, దేశానికి దురదృష్టవశాత్తు, ఆ పిచ్చుకకూడా డాక్టరేననుకో" ఒకక్షణం ఆగి మతిపోయినట్లు చూస్తున్న వాసంతి భుజంమీద చెయ్యేసి చెప్పసాగింది సంధ్య.

"వాసూ! నువ్వున్నావని యిక్కడ ప్రాక్టీస్ పెట్టడం నాకే యిష్టంలేదు. ప్రాక్టీస్ పెట్టడానికీఊరుతప్ప మరో ఊరేదొరకదా అని తెగవాదించాను రమేష్‌తో" మాట్లాడాలంటే చాలా ఇరకాటంగా వుంది వాసంతికి.

"దాందేముందిలే?" నసిగింది వాసంతి.

"అదే అన్నాడు నా పతిదేవుడుకూడా. ఎవరిష్టం వచ్చినచోటవాళ్లు ప్రాక్టీస్ పెడతారు. నువ్వుకాకపోతే ఇంకొకళ్ళొచ్చి ప్రాక్టీస్ పెడతారు. ఇందులో అఫెండవాల్సిందీ, అబ్జెక్ట్ చెయ్యాల్సిందీ యేముందంటూ నామాట కొట్టిపారేసాడు'' తన స్నేహితురాలేం చెప్పదలచుకుందో పూర్తిగా అర్థమయింది వాసంతికి.

## 13

రెండు రోజుల్నుండి విశ్రాంతిలేకుండా పనిచేస్తున్నవాసంతి శరీరం మరిపనిచెయ్యలేనని మొండికేస్తోంది. ఐనా బలవంతంగా కళ్ళు విప్పుకుని ఔట్ పేషెంట్స్‌ని చూస్తోంది. అంతలో ప్రక్క ఊరి ఆర్.ఏమ్.పి. ఒక కేస్‌ని తీసుకొచ్చాడు.

అతనిరాకకు ఆశ్చర్యపోయింది వాసంతి. అతనితో ఒకసారి దెబ్బలాటయింది. పేషెంట్‌ని తీసుకొచ్చి, ఆమె చెల్లించిన ఫీజులో కొంత కమిషన్ ఇవ్వమని అడిగాడు. అందులో వింతేమీలేదు, సాధారణ విషయమేనని తెలిసినా అతని ధోరణిచూచి చిర్రెత్తుకొచ్చి నువ్వు నాకేమీ పేషెంట్స్‌ని తీసుకురానక్ఖర్లేదు. ముందు బయటకి నడవమంది తను. అప్పటినుండి పగబట్టిన త్రాచులా తనమీద నానాప్రచారాలు చేసాడని తరువాత పేషెంట్ ద్వారా తెలిసింది.

పేషెంట్‌ని చూచాక మళ్ళీ యిన్నాళ్ళకు తన దగ్గరకు పేషెంట్ నెందుకు తీసుకొచ్చాడో అర్థమయింది వాసంతికి. హార్ట్‌ఫెయిల్యూర్‌కేస్. పేషెంట్ పరిస్థితి సీరియస్‌గ ఉంది. బహుశా ఆఖరి క్షణాల్లోవున్న యీ పేషెంట్‌ని అడ్మిట్ చేసుకుంటానకి ఊళ్ళో మిగతా డాక్టర్లు ఒప్పుకొని ఉండరు.

సుమారు నెలరోజుల్నుంచి యీ మహాశయుడు వైద్యంచేస్తూ

అవసరమైన మందులు వాడక, అనవసరమైన మందులు గుప్పించి పేషెంట్ ప్రాణంమీదకు తెచ్చాడు. ఇప్పుడు ఆఖరిక్షణాల్లో తీసుకొచ్చాడు. పేషెంట్ని ఉంచి ట్రీట్ చేస్తే ఒక సమస్య. ట్రీట్ చెయ్యకుండా పంపేయడానికి మనసొప్పడం లేదు. పేషెంట్ చనిపోతున్నా ఆఖరి శ్వాస తీసుకునేవరకు శక్తివంచన లేకుండా ప్రయత్నించడమే తనధర్మమనేది మరిచిపోదుతను.

వాసంతి ప్రయత్నాన్ని విఫలం చేసి ఒక అరగంటలో యిక పనిచెయ్యలేనని మొండికేసి ఆగిపోయింది పేషెంట్ గుండె. అతని శరీరం మీదవాలి హృదయ విచారకంగా ఏడవసాగారతని భార్యాపిల్లలు.

ఎన్నిసార్లు చావునింత దగ్గరగా చూచినా, ఎంతగా చావునాపడం మనచేతుల్లో లేదనే మెట్టవేదాంతాన్ని ఒంటపట్టించుకున్నా ఎప్పటికప్పుడు యీ చావు నాపగలిగే శక్తి నాకుంటే ఎంత బావుండు ననుకుంటూ వాళ్ళ ఏడుపుకు, ఆ దయనీయతకు అసంకల్పితంగా పెల్లుబికే కన్నీటి నాపుకోవడానికి వ్యర్థప్రయత్నం చేస్తూంది వాసంతి.

తలవంచి ఉద్వేగాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తున్న వాసంతి ఔట్పేషెంట్స్ చూపించు కోకుండానే వెళ్ళి పోవడం గమనించలేదు. ఏడ్పులువిని లోపల వార్డులోవున్న పేషెంట్స్ అంతా గుమిగూడారు.

ఏడవడం, సానుభూతి చూపించడం చేస్తున్నారుకాని శవాన్ని త్వరగా హాస్పటల్నుంచి తీసుకుపోవాలనే ధ్యాస లేదెవరికీ. కాంపౌండర్ పదేపదే చెప్పగా ఆర్.ఎమ్.పి. రిక్షాగాని టాక్సీగాని కుదుర్చుకు రావడానికి వెళ్ళాడు.

ఎంతబాగా బ్రతికినా, ఎంతమంది ఎన్నివిధాల బ్రహ్మరథం పట్టినా ఆ కాస్తప్రాణం బొందిలోంచి పోయాక అన్నీ సమస్యలే. శవాన్ని తీసుకువెళ్ళడానికి ఏ రిక్షావాడూ, టాక్సీవాడూ ఒప్పుకోలేదు. ఎంత డబ్బిస్తానన్నా లొంగలేదు. డబ్బుకాశపడి శవాన్ని తీసుకెళ్తే మళ్ళీ అందులో ఎవరూ యెక్కడానికిష్టపడరని భయం. శవాలరిక్షా అని, శవాలటాక్సీ అని

పేరుపడి బేరాలు తగ్గిపోతాయనే బెదురు,అంచేత ఎంత ప్రయత్నించినా వాహనమేదీ దొరకక పోవడంతో ఇంటి దగ్గర్నుంచి ఎడ్లబండిని తీసుకురావడానికి వెళ్ళారు.

ప్రాణంపోయి గంటయినా శవాన్ని కదల్చక పోవడంతో హాస్పట లంతా నానా భీభత్సమైపోయి ఏడ్పులతో దద్దరిల్లి పోతూంది. ఆ ఏడ్పులకి భయపడి పోయిన ఒకమ్మాయి స్పృహతప్పి పడిపోయింది. పధ్నాలుగేళ్ళ ఆ అమ్మాయి మొదటిపురుడు పోసుకోవడానికి వచ్చింది, తనకు పురుడెలా వస్తుందోననే భయంతో బిగుసుకుపోతున్న ఆ అమ్మాయికి శవాన్నంత దగ్గరగాచూచి, అంత సేపు ఏడ్పుల్ని వింటూ ఉండేసరికి భయం తారస్థాయికి చేరుకుని షాక్వచ్చి పడిపోయింది. ఆ అమ్మాయి తల్లి ఏడుపులతో హాస్పటల్ టాప్ లేపేస్తోంది. వాసంతి గబగబ వచ్చి ఆ అమ్మాయికి స్పృహ తెప్పించే ప్రయత్నం చేస్తూంది. ఈలోపు కొంత మంది పేషెంట్స్ కాంపౌండర్, నర్స్ వారిస్తున్నా వినకుండా రిక్షాలు పిలుచుకొని రూముల్లో వున్న సామానులు తెచ్చేసుకొని వాసంతితో చెప్పనుకూడా చెప్పకుండా పారిపోయారు.

ప్రాణంపోయే సమయంలో హాస్పటల్క వచ్చినా, ఆ పోవడం హాస్పిటల్లో పోవడంవల్ల వాసంతి చేతకానితనం మూలానే అతను పోయినట్లు చూస్తున్నారంతా. కొంతమంది మాత్రం 'పాపం: అమ్మగారు తంటాలుపడ్డారు. ఆయనకి ప్రాప్తం లేదు వెళ్ళిపోయాడు' అంటూ సానుభూతి చూపిస్తున్నారు. యీ పరిస్థితి ఎంతగా చికాకు కలిగిస్తున్నా భరించక తప్పలేదు. ఈ గొడవల్ని తప్పించుకుంటానికే మిగతా డాక్టర్లిలాటి కేసుల్ని తీసుకోరు. ఒకవేళ పేషెంట్ అంతకుముందునుంచి హాస్పిటల్లో వున్నా పరిస్థితి దిగజారగానే, ప్రాణం ఉండగానే పంపించేస్తారని వాసంతికి తెలుసు.

కాని....అలా కేసుని తీసుకోకపోవడం గాని, ప్రాణం వుండగానే

ఇంక బ్రతకడని పంపేయడంగాని బాధ్యతారహితంగా ప్రవర్తించడమని, అలాంటి డాక్టరు వైద్యవృత్తికి అర్హుడుకాడని వాసంతి అభిప్రాయం.

ఎంతగొప్ప డాక్టరైనా పేషెంట్‌కి ప్రాణంపోసి యెలా బ్రతికించలేడో, అలాగే ప్రాణం పోతుందనీ ఖచ్చితంగా చెప్పలేడు. శరీరం గురించి, జబ్బుగురించి, మందుల గురించి ఎంత తెలుసుకున్నా తెలుసుకోనిదింకా యెంతో ఉంది. నూటికి తొంభయితొమ్మిది సార్లు ఎంత ప్రయత్నించినా చనిపోతాడనుకున్న వ్యక్తి నిజంగానే చనిపోవచ్చు. కాని ఒక్కసారి, ఒకేఒక్కసారి ప్రయత్నం ఫలించి పేషెంటు బ్రతకొచ్చు. అలా బ్రతికించగలిగి నప్పుడు డాక్టరు పొందగలిగే ఆత్మతృప్తి ఎంత అసమాన మైంది! అంతటి అపురూపమైన అనుభవం కోసం ఆరాటపడాల్సిన పవిత్రమైన బాధ్యత ప్రతిడాక్టరుమీదా వుంది. 'పవిత్రమైన' అనుకునేటప్పటికి రాజా, సంధ్యల వాదాలు గుర్తుకొచ్చాయి.

'ఎవరి బాధ్యతైనా పవిత్రమైందే.డాక్టరొక్కడే గంగాజలంలోనుంచి పుట్టుకొచ్చినట్లు, అతనొక్కడే మడిగా, ఏ మైలా అంటకుండా ఉండాలన్నట్లు మాట్లాడతావేమిటి?" అంటూ తనమీద విరుచుకుపడేవారు వాళ్లెంత విరుచుకుపడినా వాళ్ళ ఆలోచనాధోరణి సవ్యమైనదని అంగీకరించలేదు తను.

"అమ్మా! బాబుగారొచ్చారు." రామయ్య కంఠంవిని చేతులమధ్య తల వొంచుకుని ఆలోచిస్తూ కూర్చున్న వాసంతి కళ్ళెత్తి చూచింది. 'బాప్‌రే! రాజా వచ్చాడు. యీ సీన్‌నిలా చూచాడంటే తనకు లెక్చర్ తప్పదు' అనుకుంటూ గాభరాగా లేచింది.

## 14

రాజా ప్రతిపాదన విని ఆలోచనల్లో పడిపోయింది వాసంతి. ఎప్పుడో ఒక నాడీ పరిస్థితి వస్తుందని తెలుసు. తనో నిర్ణయానికి రాకతప్పదనీ

తెలుసు. రాజాకి కావలసింది తనుమాత్రమే. తనవృత్తి, తన బాధ్యతలూ అతనికక్కర్లేదు. అది తను స్పష్టంగా అర్ధంచేసుకునేలా ప్రవర్తిస్తున్నా డింతవరకు. రాజా ప్లాన్స్ వింటూంటే అతని భార్య అయ్యాక తనజీవిత విధానమే మారిపోవాలనిపిస్తూంది. తన ఆశయాలకు విరుద్ధంగా తనవృత్తిని వ్యాపారంగా మార్చేయాలి. తనంటూ మిగలకుండా పోయి అతని నీడగా మనగలగాలి.

ఒకవైపు ఈ ఒంటరిజీవితం విసుగు పుట్టిస్తూంది. వృత్తిలో విజయ మొక్కటే తన జీవితానికి పరిపూర్ణత నివ్వలేదు. మధురమైన దాంపత్య జీవితాన్ని, మాతృత్వాన్ని తను కోరుకుంటూందనేది చెరిగిపోని యదార్థం.

రాజా, రాజాప్రేమతప్ప మరి దేన్నీ గుర్తించనంత మత్తులో తను కొంతకాలం బ్రతికింది. ఆ స్థితిలో అయితే మరో ఆలోచన లేకుండా అతనికి కావలసినట్లుగా అలంకారపు బొమ్మగామారి అతని ఇల్లాల యుండేది. ఆ వ్యామోహంలో తన అస్థిత్వానికి సమాధిచేసేసి ఉండేది. అదృష్ణవశాత్తు ఆలోచన ఆకర్షణని జయించింది. వివేకం ఆవేశాన్ని అధిగమించింది. ఇప్పుడు తను స్థిరంగా ఆలోచించగలదు. మంచి చెడుల్ని బేరీజువేసుకుని నిర్ణయించుకోగలదు.

"వాసూ! అసలు నువ్వింత మారుమూలకొచ్చి ప్రాక్టీస్ పెట్టటం యిష్టంలేదు నాకు. అప్పుడు నేను గట్టిగాచెప్పినా నువ్వు వినేమూడ్‌లో లేవు. నేనూ ఒక నిర్ణయానికి రాలేక నీకు ఖచ్చితంగా చెప్పలేకపోయాను. ఐనా, అనుభవమయితే నువ్వే వెనక్కు వస్తావులే అనుకున్నాను." రాజా నుదుటిమీద అందంగా కదులుతున్న వంకీలజుట్టు వంకచూస్తూ వింటూంది వాసంతి. అనుభవంతో వెనక్కు మళ్ళడమా?...లేదు అంత చేదు అనుభవాలేమీ ఎదురవలేదు తనకు. తనెక్కువగా సంపాదించలేక పోతూంది. అప్పులు, అవసరాలు పెరిగినంతగా సంపాదనను

పెంచుకోలేకపోతూంది. నిజమే. కాని....తన వృత్తి నిర్వహణలో తనకు ఎనలేని సంతృప్తి కలుగుతూంది. ఆలోచించడానికి కూడా వ్యవధినివ్వని ఈ పనంటే అంతులేని ఇష్టంగా ఉంది. పేషెంట్స్‌తో విడదీయలేని ఆత్మీయత ఏర్పడింది. ఈ అనుబంధాల్ని తెంచుకుని వెనక్కు వెళ్తుందా?

"నర్సింగు హోమ్ పోష్‌గా పెట్టాలంటే చాలా ఖర్చయేలావుంది. ఖర్చయినా సరే ఇప్పుడున్న వాటికంటె గొప్పగా పెట్టాలంటున్నారు మా డాడీ." డాడీ వ్యాపార సూత్రాలు రాజాకు తెలుసు. వాసంతికి ఏం మాట్లాడాలో తోచక మౌనంగా వింటూంది.

"నీ విషయం చెప్పినప్పుడు డాడీ కోపంతో ఫైరయిపోయారు. డాక్టరు కాని అమ్మాయయితే మూడు లక్షలు. డాక్టరయితే అధమ పక్షం లక్షన్నరతో వస్తుంది కోడలు. నీ తెలివి తక్కువతో సిరిరా మోకాలడ్డు పెడుతున్నావని చీవాట్లేసారు.

"మీ అమ్మగారేమన్నారు?" కుతూహలంగా చూస్తోంది వాసంతి.

"మా అమ్మ బంగారం. నీకిష్టం వచ్చిన పిల్లను పెళ్ళాడరా బాబూ! కాని సంవత్సరం తిరిగేసరికి మనవడి నివ్వకపోతే ఊరుకోను అంది" చిలిపిగా నవ్వాడు రాజా. వాసంతి చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. హృదయం తేలిపోతూంది. తనను కనుపాపలా చూచుకునే రాజా, అత్తగారు, తమ ప్రేమఫలాలు, ముద్దులు మూటగట్టే చిన్నారిపాపలు ...వాసంతి మనో వీధిలో అస్పష్టంగా మెదులుతున్నారు. అందంగా, ఆరోగ్యంగా వుండే తమ పిల్లల చిలిపిమాటలు, కొంటె అల్లరితో తన జీవితం పులకించి పోతుంది. వాళ్ళకి విద్యాబుద్ధుల్ని నేర్పించడంలో, ఉన్నత వ్యక్తులుగా తీర్చి దిద్దడంలో తన బ్రతుకు సఫలమవుతుంది. రాజా తన చేతినంది పుచ్చుకుని ఆ సుందర సామ్రాజ్యానికి తనను రాణిని చేస్తానంటున్నాడు.

"నేను గట్టిగా వాదించాక మా డాడీ తగ్గారు. ప్రాక్టీసుతో పాటు

పెళ్ళికి కూడా పర్మిషనిచ్చేరు." డాడీ ఆంతర్యమేమిటో రాజాకి బాగా తెలుసు. తను కాదన్నా ఆగేట్టులేడు. తెగేదాకా లాగడం మంచిది కాదు. అమ్మాయి ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్ అంటున్నాడు. ప్రాక్టిసులో కూడా అనుభవముంది. బాగా సంపాదించే తెలివితేటలు ఉండే ఉంటాయి. పెట్టుబడి పెట్టి నర్సింగ్‌హోమ్ పెట్టించానంటే నాలుగేళ్ళు తిరిగేసరికి పెట్టుబడి, వడ్డీ డబ్బుకూడ వచ్చేస్తుంది... యిలా లాభనష్టాలు బేరీజువేసి తండ్రి తనకు పచ్చజెండా చూపించి వుంటాడని తెలుసు రాజాకి.

"వాసూ! డాడీ ఇంకా ఎంత రాద్ధాంతం చేస్తారో, ఎలా ఎదుర్కోవాలా ఆయన్ని అని హడిలిపోయాను. ఇంత సులభంగా ఆయన మనపెళ్ళికి అంగీకరించడం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తూంది." సంతోషంతో మెరుస్తున్న రాజాకళ్ళవంక తన్మయంగా చూచింది వాసంతి. ఆ క్షణంలో స్థిరంగా ఆలోచించాలని ఆమె అంతకు కొద్దిసేపు ముందు తీసుకున్న నిర్ణయం గాలికెగిరి పోయింది. ఆమె హృదయం పురివిప్పిన నెమలిలా అయింది.

"అమ్మ నిన్ను చూడడానికి వస్తానంది. తనీ పల్లెటూరికి ప్రయాణం చెయ్యలేదని నిన్నే తీసుకు వస్తానని చెప్పివచ్చాను. అమ్మ మనమెప్పుడు వస్తామా అని ఎదురుచూస్తూ వుంటుంది." నిర్మలమైన సరస్సులో పువ్వులతేరు మీద పయనిస్తున్న వాసంతికి ఒక్క కుదుపు కుదిపి నట్లయింది.

"ఒక హార్టు పేషెంట్ డెలివరీకి అడ్మిటయింది. ఆవిడని వదిలేసి ఇప్పుడెలా రాను రాజా?" ఒక నిర్ణయం తీసుకోలేక అసందిగ్ధమైన ఆలోచనల్లో వున్న వాసంతి గొణిగి నట్టుగా అంది.

"ఇప్పుడెలా రానంటావేమిటి? జాడూ బీడూ సర్దేసుకుని బిచాణా ఎత్తెయ్యడమే." మరోదారిలేనట్లు తేల్చేసాడు రాజా.

"అదెలాకుదురుతుంది?" భయంగా చూచించి వాసంతి

"ఎందుకు కుదరదు? అసలేమిటి నీ ఉద్దేశం?" రాజా నిలదీయడంతో వాసంతికి వున్న ధైర్యంకూడా జారిపోయింది. ఒకక్షణంసేపు రాజా అర్ధాంగిగా అతనివెంట మరో ఆలోచన లేకుండా, నిశ్చింతగా వెళ్ళిపోవాలనే కోరిక కలిగింది. మరుక్షణం అదెలా కుదురుతుంది! ఏమీ ఆలోచించకుండా అతనితో ఎలా వెళ్ళి పోతుంది? అమ్మావాళ్ళని గురించి రాజా ఏమీ మాట్లాడడం లేదు. వాళ్లని నిరాధారంగా వదిలి అతనివెంట ఎలా వెళ్ళిపోతుంది!' అనిపిస్తూంది కాని....యిప్పుడు తను రాజా వెంట వెళ్ళకపోతే శాశ్వతంగా అతనికి దూరమవడమే.

ఉహు! రాజాకి దూరమవడమనే ఊహనే తనుభరించలేకపోతూంది. రాజా లేకుండా తను బ్రతకలేదు. రాజాలేని ఎడారిలాంటి జీవితాన్ని గడిపే శక్తిలేదు తనకు. తన కలలకు, కోరికలకు కేంద్రం రాజా. రాజాని తప్ప మరో పురుషుడిని తన భర్త స్థానంలో నిలిపే ఊహే వెగటు పుట్టిస్తుంది. ఇప్పుడు తను రాజానికాదంటే జీవితాంతం అవివాహితగా మిగిలి పోవాల్సిందే. మోడులా, నిస్సారంగా జీవితాన్ని గడిపేయడమే...రాజావెంట వెళ్ళిపోవాలి. రాజా భార్యగా తనొక కొత్త అవతారాన్ని ఎత్తుతుంది. తను కోరుకునే స్వర్గం తనకు లభిస్తుంది. గృహిణిగా తనకొక ప్రత్యేక స్థానం లభిస్తుంది. సంపద, హోదా, సంఘంలో పరపతి తనవెంట సవినయంగా చేతులు కట్టుకుని నడుస్తుంటాయి.

"వాసూ! ఏమిటాలోచిస్తున్నావు? వీడేమిటి, ఎంతసేపూ నన్నక్కడికి రమ్మని నస పెడ్తున్నాడుగానీ, నాకోసం తనిక్కడికి వస్తానని మాట వరసకయినా అనడే అనుకుంటున్నావు కదూ?" వాసంతివంక సూటిగా చూచాడు రాజా.

"నొ! నొ! అదేం లేదు." తన మనసులో అస్పష్టంగా వున్న భావాన్ని అతను వెల్లడి చేసేసరికి గాభరా పడింది వాసంతి.

"వాసూ! ఈ పల్లెటూరి జీవితం, కుంచించుకుపోయి ఏవిధమైన వికాసం, విశాలతలేని బ్రతుకు, ఇక్కడి డర్టీ పాలిటిక్స్, ముందుముందు పిల్లల పెంపకం, చదువు మొదలైన విషయాల్లో ఎదురయ్యే సమస్య లు...అసలెందుకు భరించాలివన్నీ మనం? ఈ సమస్యలకి సిద్ధపడి చచ్చినట్లు ఈబురదలో బ్రతకవలసినవాళ్ళు కొంతమంది ఉంటే ఉండొచ్చు. మనకా అవసరంలేదు. మన చదువు, మానాన్నడబ్బు మననా ప్రమాదాన్నుంచి రక్షిస్తున్నాయి."

అతని మాటలోని అతిశయాన్ని గుర్తించే స్థితిలోలేదు వాసంతి. రాజా అంటూంది నూటికి నూరుపాళ్ళు నిజం. ఇక్కడ జీవితపు పరిధి చాలాచిన్నది. పిల్లలు చదువు కోవటానికి మంచి స్కూల్స్ లేవు. మంచి క్రమశిక్షణతో పెంచడానికి సరైన వాతావరణమూ లేదు. అసలిదో బహువిచిత్రమైన ఊరు. మొత్తం ప్రపంచంలో ఉన్న రాజకీయాలన్నీ ఇక్కడేవున్నాయి. ప్రపంచంలో వున్న అసూయంతా ఇక్కడే పోగుపడి పోయింది. మంచికి, నిజాయితీకి, ప్రతిభకు ఇక్కడ గుర్తింపు దొరకదు. లౌక్యం, మోసం సమర్థతకు గీటురాళ్ళు.

"కాలుమీద కాలేసుకు కూర్చుని సంపాదించుకునే అవకాశముండగా అనవసరంగా ఈ రొష్టంతా ఎందుకుపడాలి మనం? అయిందేదో అయిపోయింది. ఇంతకు ముందు నువ్వు పట్టుకు వేళ్ళాడిన పిచ్చి ఆదర్శాలు నీకు గుణపాఠాన్ని నేర్పే వుంటాయి. ఇంక నీ ఆదర్శాలకు స్వస్తిచెప్పు. నా మాస్టర్ బ్రెయిన్ ప్లాన్ ప్రకారం నడువు."

ఒక్కసారి కొరడాతో ఊచి కొట్టినట్లయింది వాసంతికి. నీతి, నిజాయితీతో బ్రతకాలనుకోవడం పిచ్చి ఆదర్శమా? మంచిగా, మానవత్వంతో ప్రవర్తించాలను కోవడం తెలివి తక్కువతనమా?....ఇంత దిగజారి పోయిన ఆలోచనలకి నూటికి నూరుపాళ్లు నిజమని సర్టిఫికెట్

ఇస్తుందా తను? ...మంచీ, చెడు అన్నిచోట్లా వుంటాయి. దేన్ని గుర్తిస్తామనేది మన మనోదృక్పథం మీద ఆధారపడి వుంటుంది. బురదలో లుకలుకలాడే పురుగులు మాత్రమే కొంతమందికి కనపడితే,  దానిలోంచి పుట్టి కొచ్చిన కమలాలే కొంతమందికి కనిపిస్తాయి. తమలాంటివాళ్ళు బురద, బురదంటూ ఈసడించుకుని పారిపోవడం కాదు చెయ్యాల్సింది.

"ఏమిటి వాసూ? మాట్లాడవేం?" ఆలస్యాన్ని భరించలేనట్లు రెట్టించేడు రాజా.

"రాజా! ఆలోచించుకోవడానికి నాకు కొంచెం టైమ్ కావాలి." దెబ్బతిన్నట్లు చూచాడు రాజా. ఆలోచించుకోవాలా? దేన్నిగురించి?...తన ప్రతిపాదన వినగానే వాసంతి ఎగిరి గంతేసి ఒప్పుకుంటుందన్న గాఢనమ్మకంతో ఉన్న రాజాకి పెద్ద ఆశాభంగం ఎదురయింది. ఉత్సాహంగా తనవెంట అమ్మను చూడడానికి వస్తుందనుకున్న వాసంతి అర్థంలేని సాకులు చెప్పడంతో చికాగ్గావుంది. అసలు ఆలోచించాల్సిందేమైనా వుంటే, మగవాడు, తను ఆలోచించాలి....అతనేం అంటాడోనని నిశితంగా అతనివంక చూస్తున్న వాసంతికి అతని ఆలోచనలు అంతుబట్టలేదు.

"నువ్వు వెంటనే నా వెంట రాలేకపోతున్నావంటే ఈ ప్రజలమీద నువ్వెంత గుడ్డినమ్మకాన్ని పెంచుకున్నావో తెలుస్తోంది. ఎంత ఇడియట్‌లా వాళ్ళమీద అభిమానాన్ని పెరగనిచ్చావో అర్థమవుతూంది. కాని నువ్వే ఫూలిష్ అభిప్రాయాలతో, సెంటిమెంట్స్‌తో నన్ను కాదంటున్నావో అవే ఒకనాడు నిన్ను ఘోరంగా దెబ్బతీస్తాయి.  ఏ పేషెంట్సుతో అనుబంధాన్ని తెంచుకోలేననే భ్రమతో నన్ను దూరం చేస్తున్నావో  అదే పేషెంట్స్ ఒకనాడు నిర్దాక్షిణ్యంగా నిన్ను ఒంటరిగా వీధిలోకి నెడతారు. వాసూ! మనుషులంతా ఒట్టి స్వార్థపరులు. అవకాశవాదులు. మోస్ట్ అన్‌గ్రేటుపుల్ ఫెలోస్. నీవల్ల వెయ్యి ఉపకారాలు పొందినవాడు కూడా ఒకనాడు నీకు ప్రత్యర్థిగా మారితే

ఆశ్చర్యపడనక్కరలేదు. నిన్నివాళ 'దేవత' అని నెత్తిమీద పెట్టుకుని పూజించినవాడే రేపు 'దెయ్య'మని తిట్టి మట్టిలోకి తొయ్యడాన్కికొక్క నిమిషంకూడా సందేహించడు. నువ్వు వందమంది పేషెంట్స్‌ని మృత్యుముఖంలోనుంచి తప్పించినా ఒక్క మంచి మాట అననివాడు ఖర్మకాలి పేషెంటుకేమైనా అయితే అది నీ నిర్లక్ష్యం మూలానే అని నిన్ను చిత్రవధ చెయ్యడానికి ముందుకురుకుతాడు."

"రాజా!" ఇంక వినలేనట్లు వారించింది వాసంతి. ఎంత దారుణంగా మాట్లాడుతున్నాడు రాజా! ఎంత తప్పు ఆలోచనలో ఉన్నాడు? తనవల్ల లాభం పొందినవారు తనను 'దేవత' లాగా భావించాలని తను ఆశించడంలేదు. కాని వాళ్ళు తన మీద ఈగనికూడా వాలనివ్వరు. తనకా ధైర్యముంది. ఈ లోకంలో మంచితనానికి ప్రతిఫలం దెబ్బలు తినడమేననే కుతర్కాన్ని సమర్ధించలేదు తను.

వాసంతి మౌనం రాజాని పూర్తిగా గాయపరిచింది. దీనంగా, జాలిగా ఉన్న ఆమె ముఖంచూచాక అతనిలోని కోపం, ఆవేశం నెమ్మదిగా జారిపోసాగాయి.

"వాసూ? నన్ను కాదంటున్నావనే కోపంతో నేనిలా అనడంలేదు. గాడ్ ఫర్బిడిట్. నీకలా అవ్వాలనీ శపించటం లేదు నేను. కాని నువ్వేమాత్రం లౌక్యాన్ని నేర్చుకోకుండా ఇలానేవుంటే నువ్వు నమ్మిన ఆదర్శాలన్నీ ఎదురుతిరిగి, ఓదార్చే దిక్కుకూడా లేని దౌర్భాగ్యస్థితిలో నిలబడిపోతావే మోనని భయంగా, బెంగగా ఉంది. ఇంత అమాయకపు ఆలోచనలతో ఈ దయలేని ప్రపంచలో ఎలా బ్రతుకుతావా అని దిగులుగా ఉంది" మలేరియా రోగికిలా లోపలినుంచి వొణుకు తన్నుకుంటూ వస్తూంది వాసంతికి. అయిపోయింది. రాజా తనకు గుడ్‌బై కొట్టేసి వెళ్ళిపోతాడు. ఈ క్షణం జారిపోయిందంటే మరి రాజా తనకు కనపడడు. అమ్మో! రాజా

లేకుండా ఎలా బ్రతకడం! రాజా! వచ్చేస్తా. నాకు నువ్వుతప్ప ఎవరూవద్దు. నువ్వు చెప్పేదే ఆదర్శం. మరే ఆదర్శాలూ అక్కర్లేదు.....

## 15

నాకు మరే ఆదర్శాలూ అక్కర్లేదనుకున్న వాసంతిని ఆమె ఆదర్శాలే పట్టి ఆపాయి. ఆమె ధోరణికి అహం దెబ్బతిని వెళ్ళిపోయాడు రాజా.

ఈ భయంకరమైన శూన్యాన్నెలా భరించాలా అని వాసంతి దిగులు పడుతున్న సమయంలో సంధ్య ప్రాక్టీస్ ప్రారంభించింది.

చుట్టుప్రక్కల ఊళ్ళన్నీ కారేసుకు తిరిగి ఇంటింటికి వెళ్ళి ప్రేమగా హాస్పటల్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించివచ్చారు సంధ్య. ఆమె భర్త డాక్టర్ రమేష్. పెద్ద ఆర్భాటంగా, ఆడంబరంగా జరిగింది ప్రారంభోత్సవం. సంధ్యనాన్న ప్రారంభోత్సవం చెయ్యడానికి తమ కులం మంత్రిగారిని తీసుకురావడంతో చుట్టుప్రక్కల ఊళ్ళలోని జనమంతా విరగబడ్డారు. 'డాక్టర్లు మనవాళ్ళేనంటే మనవాళ్ళే' అనుకుంటూ ప్రారంభోత్సవ విశేషాల్ని కథలు కథలుగా చెప్పుకున్నారు. పేపర్లన్నటిలో డాక్టర్ల గురించి, అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవం గురించి ప్రముఖంగా రాసారు.

సకల సౌకర్యాలతో, ఊరిబయట ప్రశాంత వాతావరణంలో ఉన్న సంధ్య హాస్పటల్ గురించి 'డబ్బుపోతేనేం? స్వర్గంలా ఉంది. అసలు హాస్పటల్లోనుంచి రావాలనిపించడం లేదు' అనుకుంటున్నారు పేషెంట్స్.

కొద్దిరోజులకే సంధ్య కులంవాళ్ళు, మిగతా కులాల్లోని ధనికులు సంధ్య నర్సింగ్‌హోమ్‌కి తిరిగిపోయారు. మిగతా బీదా బిక్కీమాత్రం సంధ్య అరిచి గీ పెట్టనా డబ్బుపెట్టందే పేషంటుముఖం చూడదు గనుక నర్సింగ్‌హోమ్ మీద ఎంత వ్యామోహమున్నా తప్పక వాసంతి దగ్గరకే వస్తున్నారు.

అవసరం ఉన్నా లేకపోయినా ప్రతిపేషెంట్‌కీ లాబొరేటరీ టెస్ట్స్ చేసి, ఎక్స్‌రేలు తీసి, చేతులు పట్టనన్ని ఖరీదైన మందులు వ్రాసిస్తూంటే 'అబ్బో! ఎంత శ్రద్ధగా చూస్తున్నారో!అన్ని టెస్టులూ చేసి, క్షుణ్ణంగా పరీక్షచేసి మంచి మంచి మందులు రాసిస్తున్నారు' అని చెప్పుకుంటున్నారు జనం.

ఏ మాత్రం ఆపరేషన్‌చేసే అవకాశమున్నా జారవిడుచుకోకుండా ఎడా, పెడా ఆపరేషన్లు చేసేస్తున్నారు. పెద్ద పెద్ద అపరేషన్లకి టౌన్‌నుంచి స్పెషలిస్టులని ఘనంగా తీసుకొచ్చి చేయిస్తున్నారు. సంధ్యకు వైద్యంలో ఉన్నా లేకపోయినా కబుర్లలో ఎక్కువ ప్రతిభ వుండడంవల్ల అందర్నీ ఆకర్షిస్తూంది.

“హాయ్ వాసూ!” వాసంతిని చూచి సంతోషంతో ఎదురొచ్చి రెండుచేతుల్తో చుట్టేసింది సంధ్య. ఆలోచనలు, ఒంటరితనం పిచ్చెత్తిస్తూంటే సంధ్య దగ్గరకు వచ్చింది వాసంతి.

“వాసూ! ఏమటే ఇలాఉన్నావు.? కళ్ళంత లోతుకు పోయాయే మిటి? కళ్ళక్రింద ఆ వలయాలేమిటి?” సంధ్య ఆత్మీయంగా, ఆతృతగా అడుగుతూంటే వాసంతి హృదయంలో ఘనీభవించిన వేదన కరగడం మొదలుపెట్టింది.

“అసలు తిండి తిని ఎన్నాళ్ళయిందో చెప్పు. బాప్‌రే! యేమిటే అలా ప్రాణంలేనట్లు చూస్తావు? ఇలా కూర్చో.” కుర్చీ చూపించి బిస్కట్స్, కాఫీ తీసుకొచ్చి బలవంతాన తినిపించింది సంధ్య.

“ఈ రెండు రోజుల్నుంచి నువ్వెలా ఉన్నావోనని నేనే నీ దగ్గరకు వద్దామను కున్నాను. రమేష్ ఊరెళ్ళడంవల్ల రావడానికి తీరికలేదు.” మౌనంగా కాఫీ తాగుతూంది వాసంతి.

“వాసూ! మంచో, చెడ్డో, నువ్వొకనిర్ణయం తీసుకున్నావు. ఆ నిర్ణయానికి కట్టుబడి ధైర్యంగా ఉండాలిగాని సెంటిమెంటల్ ఫూల్లా

బాధపడుతూ, తిండి తిప్పలూ మానేస్తే పెళ్ళయిపోయిన రాజా మళ్ళీ నీవాడవుతాడా?" అనునయంగా చెప్పసాగింది సంధ్య.

"అబ్బే! అదేంలేదే. నేనేమీ బాధపడడం లేదు" వాసంతి కళ్ళలో చివ్వున నీళ్ళుబికాయి. రాత్రి రాజా పెళ్ళయిపోయి ఉంటుంది. నిన్నటినుంచి ఆలోచనలు తన హృదయాన్ని నలిపేస్తున్నాయి. అవ్యక్తమైన ఆరాటం, వ్యధ తనకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఏపనిమీదా మనసు లగ్నం చేయలేకుండా వుంది. మనశ్శాంతి కోసం ఎక్కడికైనా పారిపోదామ నిపిస్తూంది. వాసంతి హృదయంలోని అలజడిని గుర్తించింది సంధ్య.

"జీవితంలో ఎన్నో అనుకుంటూ ఉంటాం. అన్నీ మనమనుకున్నట్లే జరుగుతాయా? రాజాని పెళ్ళిచేసుకోలేనంత మాత్రాన భూమి తలక్రిందు లయినట్లు బాధ పడిపోతావేమిటే? నువ్వు పెళ్ళి చేసుకోవాలను కుంటే రాజాతప్ప ఈ ప్రపంచంలో మరి మగాళ్ళేలేరా? వాసూ! నీ మనసులోనుంచి రాజాని బయటకి తోసెయ్. ఈ రాజా కాకపోతే మరో మహారాజా,.ఎవడో ఒకడు దొరక్కపోడు" సంధ్య మాటలువింటూ ఆలోచిస్తూంది వాసంతి.తన బాధ మరి తనకు భర్తదొరకడని కాదు. రాజాలేని జీవితాన్ని భరించలేక.

"వాసూ! కమాన్. ఈ లేడీదేవదాసు అవతారాన్ని చాలించు. మనం చెయ్యాల్సింది బ్రతుకులో జారిపోయినవాటిని తలచుకుంటూ ఏడుస్తూ కూర్చోవడం కాదు, ఎక్కడికక్కడ ఆనందాన్ని సృష్టించుకుని జీవితాన్నను భవించడం." వాసంతి చేతి నందుకుని గులాబీతోటలోకి తీసుకెళ్ళింది సంధ్య.

సంధ్య కబుర్లతో, జోక్స్‌తో వాసంతి విచారం కొంతవరకు తగ్గింది. కాలాన్ని పరిసరాల్ని గమనించకుండా కబుర్లు చెప్పుకుంటున్నారిద్దరూ.

"అమ్మగారూ! పేషెంట్స్ వచ్చారు" నర్స్‌వచ్చి చెప్పింది.

"ఇప్పుడేం పేషెంట్స్? వేళాపాళా లేదేమిటి? రేప్రొద్దున రమ్మను"

అంది సంధ్య విసుగ్గా.

"అదేమిటే అలా అంటావు? ఎమర్జన్సీ ఏమో?" అంది వాసంతి.

"ఎమర్జన్సీయా, వాళ్ళ తలకాయా, తీరిగ్గా భోజనాలు కానిచ్చుకుని, ఒక కునుకుకూడా తీశాక అప్పుడు గుర్తొస్తాయి ఎక్కడలేని జబ్బులు, బాధలు. ఏవేళప్పుడు వచ్చినా మహాప్రసాదమనుకుంటూ చూడాలనుకుంటారు. ఒకవేళ చూడకపోయామా 'గీర, పొగరు' లాంటి సద్గుణాలన్నీ ఉన్నాయని ఎలుగెత్తి చాటుతూ 'రాక్షసి' 'దెయ్యం' లాంటి బిరుదుల్ని తగిలించేస్తారు." అయిష్టంగా లేచి క్లినిక్ వయిపు వెళ్తూ చెప్పసాగింది సంధ్య. వాసంతికవన్నీ అనుభవమే కనుక సంధ్యమాటల్ని నవ్వుతూ వినసాగింది.

పేషెంట్ పరిస్థితి చూడగానే సంధ్య విసుగు ఎగిరిపోయింది. ఆతృతగా ప్రశ్నలువేస్తూ నిస్త్రాణగా పడున్న బాబును పరీక్ష చెయ్యసాగింది. "ఇంతప్రాణం మీదకొచ్చేదాకా ఏం చేస్తున్నారు?" సంధ్య ప్రశ్నకు జవాబివ్వకుండా బాబుతల్లి మౌనంగా వుండి పోయింది. వారికూడా వచ్చినామె బిక్కుబిక్కుమంటూ చూస్తూంది.

"ఈ తాళ్ళూ, తాయెత్తులూ ఏమిటి? తీసెయ్యండి" అంది సంధ్య చిరాగ్గాచూస్తూ.

"పిల్లాడిని చూచి అంతా 'అనాన' అంటే అనాన మందేయించామమ్మా! దానికి తగ్గకపోతే తాయెత్తులు కట్టించాము." అంది కూడావచ్చినామె. బాబుతల్లి దీనంగా చూస్తూంది.

"అనాసా? అంటే ఏమిటి?" కోపంగా ప్రశ్నించింది సంధ్య. సర్వరోగాలకి 'అనాస' అని ఓ పేరుపెట్టేసి నాటువైద్యుడిచ్చే మందులు పట్టించి పిల్లల ఆరోగ్యాన్ని చేతులారా పాడుచేసి ప్రమాదస్థితికి తీసుకొచ్చిన కేసులెన్నో చూడడం వల్ల కోపాన్నాపుకోలేక పోయింది సంధ్య.

"సంధ్యా! ముందు వాడి ట్రీట్‌మెంట్ విషయం చూడు." వాసంతి మాటవిని కోపాన్ని అణచుకుని మందులు రాసిచ్చింది సంధ్య. చీటీ తీసుకునే ప్రయత్నం చెయ్యకుండా శిలలా కూర్చుండిపోయిందా బాబుతల్లి.

"ఏమిటి మందులు తెమ్మంటే కదలరు? మగవాళ్ళెవరూ వెంట రాలేదా?" పిల్లడి జబ్బమీద ఇంజెక్షన్ చేస్తూ అడిగింది సంధ్య. అప్పటికీ నోరువిప్పలేదు వాళ్ళు.

"ఏమ్మా! డబ్బులేదా?" మృదువుగా అడిగింది వాసంతి.

"ఏమిటలా కళ్ళప్పగించి చూస్తున్నారు? చాలా ఖరీదైన మందులు వాడితే తప్ప బిడ్డ బ్రతకడం కష్టం." సంధ్య మాటలువిని బావురుమంది బాబుతల్లి.

"అమ్మా! ఈ బిడ్డతప్ప ఇంకేమీలేని దురదృష్టవంతురాల్ని. మందులు తేవడానికి డబ్బులేదు. ఇవాళ మీరు కనికరించి వీడికి వైద్యంచేస్తే రేపో, మాపో మీరుణం తీర్చుకుంటానని బ్రతిమలాడడానికి సంపాదించి మమ్మల్ని పోషించే మా ఆయన లేడు. నా రెక్కలకష్టం రెండు పూటలా రెండు ముద్దలు తిండి తినటానికే సరిపోవటంలేదు. మీకు దయకలిగి నా బిడ్డని బ్రతికిస్తే రెండూ చేతులూ ఎత్తి దణ్ణం పెట్టడం తప్ప మరేమీ ఇవ్వ లేని పేదదాన్ని" దీనంగా కుమిలి కుమిలి ఏడవసాగింది బాబుతల్లి.

"అమ్మా! ఎట్లాగొట్లా మీరే పుణ్యం కట్టుకోవాలి. ఆ పిల్లాడు బతికితే మీరు రెండు ప్రాణాల్ని నిలబెట్టిన వాళ్ళవుతారు. ఆయమ్మ చేతిలో డబ్బేవుంటే నాలుగురోజుల్నుంచి పిల్లాడ్ని పస్తుబెట్టి, తను పస్తుండేది కాదు. అనాస సుబ్బయ్య జాలిపడి ఏదో మందివ్వబట్టి యిప్పటిదాకా బతికాడు." కూడా వున్నామె చెప్పసాగింది. అనాస సుబ్బయ్య పేరువిని ఉలిక్కిపడింది వాసంతి. అతనిచ్చే అనాసమందులేమిటో తెలుసు. జ్వరానికికాని, విరేచనాలకికాని, రెండు మూడురకాల యాంటీబయాటిక్స్ సిరప్స్‌ని

కలగలిపి దప్పళంచేసి చిన్న చిన్న పెన్సిలిన్, టెట్రామైసిన్ ఖాళీవయల్స్‌లో వడ్డిస్తాడు. రెండుమూడురకాలవి ఒక్కసారే యివ్వడంవల్ల ఠక్కున తగ్గుతాయి జ్వరంకాని, విరేచనాలుకాని. అలా ఇవ్వడంవల్ల తర్వాత వచ్చేబాధలు, సరైనడోస్, సరైనకోర్స్‌లో ఇవ్వకపోవడం వల్ల వ్యాధి మళ్ళీ తిరగబెట్టడం, చివరికి యాంటీబయాటిక్స్ ఏవీ రోగక్రిములమీద పనిచెయ్యకపోవడం... ఇవన్నీ తెలియని మామూలు ప్రజలు క్వాలిఫైడ్ డాక్టర్స్ రాసిచ్చే మందులు కొనే స్థోమతులేక కొంత, అనాసమందులంటే వున్న మూర్ఖమైన నమ్మకంతో కొంత, రూపాయి రెండు రూపాయలతో లభించే ఈ మందుని కొని వేసి ఇలా వ్యాధి ముదిరిపోయాక తమ దగ్గరకొస్తారనేది అనేకసార్లు అనుభవంలోకి వచ్చింది.

అందంగా, ఆరోగ్యంగా పెరగవలసిన పిల్లలు అకాలమృత్యువు వాతపడడానికి ఇలాంటి నాటువైద్యులు కొంతవరకు కారకులౌతున్నారు. ఎంతోమంది శాస్త్రవేత్తల అవిరళకృషి ఫలితంగా లభించిన ఈ యాంటీబయాటిక్స్ కొంతమంది నిర్లక్ష్యం, అజ్ఞానం, స్వార్థంవల్ల నిరుపయోగంగా తయారవుతున్నారనేది గుర్తించి తగిన చర్యల్నిఅమలు చెయ్యడంలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జీవకోటి ఎంత ప్రమాదాన్ని ఎదుర్కోవలసి వస్తుందో గమనించరు.

"ఖర్మ! ఈ వెయిన్ కూడా దొరకడంలేదు." విసుగ్గా సిరంజిని ట్రేలోపడేసి లేచింది సంధ్య. సంధ్య మాటలువిని ఆలోచనల్లోనుంచి బయటపడింది వాసంతి.

వాసంతి లేచి బాబు నాడి చూచింది. పరిస్థితి మరింత క్షీణించడం చూచి ఆమె ముఖం వివర్ణమయింది.

"సంధ్యా! 'వీనిసెక్షన్' చేసి సెలైన్ పెట్టు." సంధ్య చెయ్యడానికి తటపటాయించడం చూచి, తనే వీనిసెక్షన్ చేసి సెలైన్ పెట్టింది వాసంతి.

గబాగబా సెలైన్ ట్యూబ్ ద్వారా ఇంజక్షన్ ఎక్కించి బాబుపరిస్థితి మెరుగయిందేమోనని ఆతృతగా గమనించ సాగింది సంధ్య. సంధ్య పడుతున్న ఆందోళనని చూస్తూంటే చాలా సంతోషంగా వుంది వాసంతికి.

బాబు పరిస్థితి కాస్త మెరుగయ్యాక లోపలకి వెళ్ళి కూర్చున్నారు సంధ్య, వాసంతి

"సంధ్యా! నువ్వు డబ్బున్నవాళ్ళను బాగాచూచి, లేనివాళ్ళను నిర్లక్ష్యంచేస్తావనే అభిప్రాయంతో వున్నానింతవరకు." సంజాయిషీ ఇస్తున్నట్లు చెప్పసాగింది వాసంతి. మధ్యలో అందుకుంది సంధ్య.

"అవును. నేను డబ్బున్నవాళ్ళనే శ్రద్ధగా చూస్తాను. కాని చిన్న సవరణ. డబ్బున్న వాళ్ళందర్నీకాదు. నాకెక్కువ డబ్బిచ్చేవాళ్ళను. అందులో తప్పేముంది? అయామ్ పెయిడ్ఫరిట్. నేను ఎక్కువశ్రద్ధగా చూడకపోతే ఎక్కువ డబ్బివ్వాల్సిన అవసరమేముందివాళ్ళకు?" సంధ్య తర్కంవిని చేదుతిన్నట్లు ముఖంపెట్టింది వాసంతి.

"గొప్పయినా, పేదయినా ప్రాణానికి ఒకేవిలువ. ఏవిధంగానైనాసరే ప్రాణం నిలపడం, బాధానివారణ చెయ్యడం ముఖ్యంకాని డబ్బుముఖ్యం కాదంటావు నువ్వు. బట్.." సంధ్య ఉపన్యాసం మొదలుపెట్టిందంటే పోయిన తలనొప్పి మళ్ళీ పరుగెత్తు కొస్తుందేమోనని భయమేసి గబుక్కున లేచి నుంచుంది వాసంతి.

"చాలా లేటయింది. యింక వెళ్లానే నేను." వాసంతి ఎందుకు పారిపోతుందో గ్రహించిన సంధ్య పకపకా నవ్వింది.

## 16

రానురాను బ్రతుకంటేనూ, పనంటేనూ, ఆసక్తి సన్నగిల్లి ఒక విధమైన నిరాశ, నిర్లిప్తత చోటుచేసుకుంటున్నాయి వాసంతిలో. నానాటికి తరిగి పోతున్న ప్రాక్టీసు, సంపాదన,చిక్కబట్టుకున్న ధైర్యాన్ని కూల దోస్తున్నాయి.

సాగర్ డబ్బు పంపమని వ్రాసాడు. సుధీర్‌కి తీర్చాల్సిన బాకీ ఎంతోవుంది.

"అమ్మగారూ!" తలెత్తిచూచించి వాసంతి. శ్రీరాములు భక్తిగా చేతులు జోడించి వినయంగా ఒదిగి నుంచున్నాడు.

"అమ్మా! ప్రొద్దుటినుంచి తిరిగితే ఇంతకంటె ఎక్కువ డబ్బుపుట్టలేదు. తమరుచేసిన ఉపకారానికి నా చర్మంతో చెప్పులు కుట్టించినా ఋణం తీరదు." భార్యను మృత్యుముఖంలోనుంచి వెనక్కులాక్కొచ్చిన వాసంతి వంక కృతజ్ఞతగా చూస్తూ చేతిలోని డబ్బుని టేబుల్ మీద పెట్టాడు. ఆడబ్బుని చూచి పెద్ద గుంజాటనలో పడిపోయింది వాసంతి. ఇప్పుడివరకు మందులకే ఎంతో ఖర్చయింది. ఇంటికి వెళ్లాకకూడా ఇంకా కొన్ని మందులువాడాలి. ఈ డబ్బంతా ఐదురూపాయల వడ్డీకో, లేదా ఇంకా ఎక్కువ వడ్డీకో తెచ్చుంటాడు. ఎన్నో నెలలు రెక్కలు ముక్కలు చేసుకుని, కడుపుకట్టుకుని దాస్తే తప్ప ఆ అప్పును తీర్చలేడు. ఎన్నో రోజులు ఇతను, ఇతని భార్యాపిల్లలు తిండి లేకుండా మాడిపోతేతప్ప తీసుకున్న డబ్బును చెల్లగట్టలేడు. ఇలాంటివాడిదగ్గర ఎలా తీసుకోవడం డబ్బు? ఇది డబ్బుకాదు ఇతని నెత్తురు. ఈ నెత్తురు తనకొద్దు. వద్దు!

కాని...రేపు కొంతగాకపోతే కొంతయినా సాగర్‌కి మనియార్డర్ చెయ్యాలి. తనదగ్గర డబ్బేమీలేదు ప్రస్తుతం. ఇవాళ, రేపట్లో డిశ్చార్జిఅయి వెళ్ళిపోయే పేషెంట్సూ లేరు...ఐనా రోజూ తారసపడే ఇలాంటి వాళ్ళందరి దగ్గర డబ్బులు తీసుకోకుండా ఉచితంగా వైద్యం చెయ్యగలదాతను? తనకు డబ్బు కావాలి. తనకు అర్జంటుగా డబ్బుకావాలి...చెయ్యిచాచి డబ్బునందుకుంది వాసంతి.

మరుక్షణం ఆమె మెదడులో విద్యుత్తులాపాకిన భావ పరంపర ఒకగమ్యాన్ని చేరుకుంది.

"శ్రీరాములూ! ఇదిగో యీ డబ్బుతో మీ ఆవిడకు రాసిచ్చిన

మందులు కొను" తన చేతిలోవున్న డబ్బులో కొంతతీసి అతని చేతిలో పెట్టింది వాసంతి.

"అమ్మగారూ!" జలజలా కన్నీళ్ళు రాలాయి శ్రీరాముని బుగ్గలమీద. ఒంగి వాసంతి పాదాలంటి నమస్కరించబోయాడు.

"ఛ!ఛ! అదేంపని?" అతన్ని వారిస్తూ గాభరాగాలేచిన వాసంతి సంధ్య రావడం చూచి శ్రీరాముల్ని గబగబ అక్కడనుండి పంపేసింది. ఇదంతా సంధ్య చూచిందంటే తనకో లెక్చరిచ్చిగాని వదిలిపెట్టదు.

స్నేహితురాళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు. సంభాషణ అటుతిరిగి, ఇటుతిరిగి ప్రాక్టీస్ దగ్గరకొచ్చింది. సందర్భం దొరికినప్పుడల్లా సంధ్య వాసంతికి అనర్గళంగా గీతాబోధ చేస్తూనే వుంటుంది.

"వాసూ! నీ సంగతులన్నీ నాకు తెలుస్తూనే ఉన్నాయిలే."

"ఏమిటే నీకు తెలిసేది?"

"అలా ఉరిమితే నేను బెదిరిపోతాననుకోకు. అసలింత బొత్తిగా తెలివితేటల్లేని దానివేం ప్రాక్టీస్ చేస్తావే? వైట్‌డిస్చార్జి అవుతూందని పేషెంట్ వస్తే మందులవల్లే తగ్గిపోతుందమ్మా: అంటూ అమ్మమ్మలా ధైర్యంచెప్పి మందులు రాసి పంపేస్తావా? వైట్ డిస్చార్జి అయేవాళ్ళకి కాన్సర్‌వచ్చే ప్రమాదముందని నీకు తెలుసా లేదా; గైనిక్‌ఫస్టువి. ఆ మాత్రం తెలీదనుకోను. ఆ కాస్తముక్కా పేషెంట్ చెవినపడేస్తే నీ సొమ్మేం పోయింది? ఆ ముక్క వాళ్ళ చెవిన పడేయగానే వాళ్ళే నీ చుట్టూ తిరుగుతారు కాన్సర్ గండంనుంచి తప్పించమని. అప్పుడు 'హిస్ట్రెక్టమీ' చేసిపడేయ్" దారుణంగా వున్న సంధ్య ఉద్భోధను భరించలేక వారించబోయింది వాసంతి. ఆమెను చొరనీయకుండా తన ప్రసంగాన్ని కొనసాగించింది సంధ్య.

"డెలీవరీ పేషెంట్ కాళ్ళదగ్గర గంటలతరబడి కూర్చుని భజన చెయ్యడం కాదే. కొంచెం ఆలస్యం కాగానే సిజేరియన్ చేసిపడెయ్. ఇంత

కన్సర్వేటివ్‌గా. మరీ అత్యవసరమయితే తప్ప సర్జరీ చెయ్యనని మడిగట్టుకు కూర్చుంటే మట్టిగొట్టుకుపోతావ్."

సంధ్య మాటలకు తల తిరిగిపోతూంది వాసంతికి. అసలు 'సిజేరియన్' 'హిస్ట్రెక్టమీ' లాంటి ఆపరేషన్ల స్టెప్స్‌అయినా, కనీసం పరీక్ష కోసమయినా క్షుణ్ణంగా చదివుంటుందా ఈసంధ్య. ఓరల్స్‌లో ఎగ్జామినర్స్ అడిగినప్పుడు కనీసం యీ ఆపరేషన్ల పేర్లయినా చెప్పుంటుందా? ఇప్పుడెంత తెలివిమంతురాలయిపోయింది? ఇంత దగుల్బాజీమాటలు చెప్తూంది, నిజంగా ఇలాగే చేస్తుందా? ఇలాంటి వాళ్ళను చూచే ప్రజలు డాక్టర్లకి వీసమెత్తు విలువివ్వడం లేదు. ఒక డాక్టరు నిజంగా అవసర మయి పరీక్షలు చేయించాలన్నా, ఆపరేషన్ పడుతుందన్నా 'వీడు నిజంగా నా జబ్బుగురించి చెపుతున్నాడా, లేక తన డబ్బుగురించి చెపుతున్నాడా' అనే సందిగ్ధంలో పడిపోతున్నారు. డాక్టర్స్‌ని నమ్మలేక, నమ్మక గత్యంతరంలేక అవస్థపడి పోతున్నారు పేషెంట్స్. వాసంతి ఆలోచనల్ని చెదరగొడ్తూ మళ్ళీ ఎత్తుకుంది సంధ్య

"సాధ్యమైనంత త్వరలో ఒకలాబ్, ఎక్స్-రే ప్లాంట్, ఇ.సి.జి మెషీన్, మెడికల్ షాపు వగైరాలన్నీ పెట్టు."

"ఏమిటే! నేనేమన్నా కుబేరుడి దత్తపుత్రిక ననుకుంటున్నావా?" ఖస్సుమంది వాసంతి.

"తెలివితేటలుంటే డబ్బు పుట్టించడమో బ్రహ్మాండమా? అదలా వుంచు. ఖచ్చితంగా అవసరమైనవాళ్ళకే టెస్ట్లు చేయించాలనే పిచ్చపిచ్చ నియమాలు పెట్టుకోకు. టెస్టులో మనకయే ఖర్చుతక్కువ, మిగిలేది ఎక్కువ" సంధ్య లెక్కలు చూచి తలపట్టుకుంది వాసంతి.

"ఏయ్ సంధ్యా! ముందసలు మనది వృత్తో, వ్యాపారమో చెప్పు"

వాసంతి కోపంగా అడిగిన ప్రశ్నకు ఠక్కున జవాబిచ్చింది సంధ్య.

"ఖచ్చితంగా వ్యాపారమే. అసలు లైఫే పెద్దవ్యాపారం. లైఫ్‌లో ప్రతి చిన్నదీ వ్యాపారంలానే నడుస్తూంది. తల్లిబిడ్డలమధ్య, భార్యాభర్తల మధ్య, తోబుట్టువుల మధ్య కల్మషమనేది లేకుండా స్వచ్ఛంగా ఉండాల్సిన బంధాలే యీ రోజుల్లో వ్యాపారంలా తగలడుతున్నాయే. ఇంక, ఆఫ్టరాల్, డాక్టరుకీ, పేషెంటుకీ మధ్య నున్న బంధం వ్యాపారం కాకుండా పరమపవిత్రంగా ఎలా ఉండేడుస్తుంది?'' ఇదికూడా తెలియని వాజమ్మవి ఎలా బ్రతుకుతున్నావే? అన్నట్లు వాసంతి వంక చూచించి సంధ్య.

''అంత దరిద్రంగా మాట్లాడటానికి నీకు సిగ్గేయటంలేదంటే మొద్దూ?" కోపంతో ఎర్రబడిన వాసంతి ముఖంచూచి నవ్వింది సంధ్య.

"సిగ్గా? ఎందుకే సిగ్గుపడడం? నేను ఉన్నమాటే చెప్తున్నానుకాని అబద్ధాల్నేం సృష్టించడం లేదుగా?"

"అలా సమర్ధించుకోవాలని చూడకు. మనల్ని నమ్మివచ్చిన పేషెంట్‌నింత ఘోరంగా మోసంచెయ్యడంలో తప్పులేదంటే నేనొప్పుకోను."

''మోసమా?'' పగలబడి నవ్వింది సంధ్య. ఆమెవంక చిరాగ్గా చూచింది వాసంతి.

''అవునే, నీతిచంద్రికా! అసలు నమ్మినవాళ్ళనే కదా ఎవరైనా మోసగించగలిగేది? నమ్మకుండా అతి జాగ్రర్తగా వుండేవాళ్ళని, తమనీడనే అనుమానించే వాళ్ళనెలా మోసగించగలం?" రెట్టించింది సంధ్య. వాసంతి మారుజవాబు చెప్పడానికిష్టపడనట్లుగా మౌనంగా ఉండిపోయింది.

''అయ్యో! నిన్ను చూస్తే తెగజాలేస్తోందే వాసూ! ఎప్పుడో సత్యకాలంలో పుట్టాల్సిందానివిప్పుడు పుట్టావు, ఎలా బ్రతుకుతావా అని బెంగగాఉంది. వాసూ! నేనిక్కడ ప్రొఫెషన్‌కి సంబంధించినంత వరకు నీ ప్రత్యర్థినే కావచ్చు. కాని ముందు నీ ఫ్రెండ్‌ని, ఆ అనుబంధంతో నీ

వెల్‌విషర్‌గా చెపుతున్నాను.” సాభిప్రాయంగా వాసంతివంక చూచింది సంధ్య.

‘ఏడ్చావులే, నువ్వు నాకు చెప్పేదేమిటి?’ అన్నట్లు తలతిప్పుకుంది వాసంతి. తన ఉపన్యాసాన్ని ఎట్టి అవాంతరం లేకుండా కొనసాగించింది సంధ్య.

“వింటున్నావా! మోసం, దోపిడి, అనే పదునైన మాటల్ని నీ డిక్షనరీ లోనుండి తీసిపడెయ్. ఎవడి పెరుగుదలకోసం వాడు వాడికి వీలైన మార్గంలో వెళ్తాడు. నువ్వో మార్గంలో వెళుతున్నప్పుడు నీ జాగ్రత్తకోసం నువ్వు నీ కాళ్ళను నేలమీద గట్టిగా ఆన్చి నడుస్తావు. అప్పుడు నీ కాళ్ళక్రిందపడి ఎన్నో చీమలూ, దోమలూ చస్తూవుంటాయి. దానికి నువ్వేం చేయగలవ్?” సంధ్యమాటలు విని చిర్రెత్తుకొచ్చింది వాసంతికి.

“ఏయ్ సంధ్యా! నువ్వు రియల్‌సెన్స్‌లో డాక్టరువి కాకపోతే కాకపోయావు అసలు మనిషివా? రాక్షసివా? నీకు పేషెంట్స్ చీమలు దోమలుగా కనిపిస్తున్నారా? ఎంత అహంకారం! ఈ అహంకారాన్ని నువ్వు చీమలు, దోమలుగా వర్ణిస్తున్న వ్యక్తులు సహిస్తారనుకోకు.” కటువుగా అంది వాసంతి. మళ్ళీ ఓసారి పగలబడి నవ్వింది సంధ్య.

“ఏమిటే, నేను మనిషినా, రాక్షసినా అని అనుమానమొచ్చిందా నీకు? యీ లోకంలో, మళ్ళీ మాట్లాడితే పరమదరిద్రంగా ఉన్న యీ లోకంలో బ్రతకనేర్వడం రాక్షసత్వమే అయితే నేను రాక్షసినే.”

సంధ్య మాటలు వింటూంటే ఒంటికి కారం రాసుకున్నట్లుగా ఉంది వాసంతికి. ఈ లోకం పరమదరిద్రంగా తయారవుతూంది నీలాంటి మహాత్ములవల్లే. మళ్ళీ ముందు మీరే ఈ లోకం పరమదరిద్రంగా వుందని తిడతారు. ఎంత జిత్తులమారి నక్కలు! అనుకుంటూంది వాసంతి.

“వాసూ! డార్విన్ సిద్ధాంతం గుర్తుందా? చచ్చు ప్రశ్న. నాకే

గుర్తుండగా లేనిది నీకు గుర్తుండదనుకోను. "సర్వయివల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్" అంటే ఏమిటే?"

"నీ నెత్తి."

"వాసూ! ఇదో పోటీప్రపంచం. ఎంతో చొరవగా, గడుసుగా రెండుచేతుల్తోనూ చుట్టూవున్న వాళ్ళను బలవంతంగా ప్రక్కకు నెట్టేస్తూ వెళ్తేతప్ప యీ పోటీలో నెగ్గలేము. అలా అందరి తలలమీదా చేతులుపెడ్తూ పైకిపోయి గెలుపొందావా, అంతా నీకు బ్రహ్మరథం పడతారు. ప్రపంచానికి కావలసింది నీ సక్సెస్. నువ్వెలా దాన్ని పొందావన్నది కాదు." ఒక్కక్షణం అలుపుతీర్చుకుంది సంధ్య. ముఖం ముడుచుకుని వింటూంది వాసంతి.

"అసలు ఎదుటివాడిని నువ్వు మింగేయడానికి ప్రయత్నించకుండా వాజమ్మలా కూర్చున్నావంటే వాడే నిన్ను మింగేస్తాడు. ఇది ఈనాటి ప్రపంచ ధర్మం."

"వెధవమాటలు మాట్లాడకు. పెద్ద ప్రపంచ ధర్మాలన్నిటినీ కాచి వడపోసినట్లు ఫోజ్ కొడుతున్నావు" వాసంతి కోపంచూచి నవ్వింది సంధ్య.

"ఇంత దరిద్రపు తర్కాన్ని ఎక్కడ నేర్చుకున్నావే? ప్రపంచంలో అందరూ దొంగవెధవలే ననుకోవడం మొదటి పొరబాటు. అందరూ దొంగవెధవల్లా ప్రవర్తిస్తున్నారు కనుక మనమూ వెధవల్లా ప్రవర్తించడంలో తప్పులేదని సమర్థించుకోవడం, సంతృప్తి పడడం రెండో పొరబాటు. అసలు నైతిక బలమనేది ఒకటుందని, అది అన్నిటినీ మించిందని నీలాంటి రాక్షసికి అర్థంకాదులే." అంది వాసంతి కోపంగా. వాసంతి చిటపటలకు కెరటాలు విరిగి పడినట్లు నవ్వింది సంధ్య.

"నైతిక బలమా?! అదేం పదార్థమే? ఇప్పుడు ప్రపంచం హోల్ మొత్తంలోవున్నవి రెండే రెండుబలాలు. ఒకటి అర్థబలం, రెండోది అంగబలం. నువ్వు అర్థబలం సంపాదించుకున్నావంటే చాలు, రెండోది

చచ్చినట్లు నీవెంటే వస్తుంది.”

‘దీన్నీ పెడత్రోవనుంచి తప్పించడం నాతరం కాదు.’ అనుకుని నిరాశపడింది వాసం.తి అలాంటివేమీ అంటని సంధ్య మళ్ళీ మొదలుపెట్టింది.

“అందుచేత అర్థబలాన్ని సంపాదించుకునే దోవేదో చూడు. పేషెంట్స్‌ని మోసం చెయ్యకూడదు. పీక్కుతినగూడదు లాంటి నాస్టీ నియమాల్ని పెట్టుకుని, పేషెంట్స్ ఇచ్చినంత పుచ్చుకుని మెడికల్ ప్రొఫెషన్ని ఛీప్ చెయ్యకు. ఏదయినా, ఎంతెక్కువ ఖరీదుంటే అంతెక్కువ విలువ. నువ్వెంత కాస్ట్లీ డాక్టరువయితే అంతెక్కువ హారతులిస్తారు జనం. ఈ సూక్తిని గుర్తుపెట్టుకోముందు.” ఉపదేశం పూర్తిచేసి నిష్క్రమించింది సంధ్య.

## 17

సూర్యకిరణాలు కత్తుల్లా పొడుస్తుంటే ఆకాశానికి గాయమై రక్తం ధారలు కడుతూంది.

వాసంతి మనసువేగంతో కారు పోటీపడలేక పోతూంది. ప్రక్కన కూర్చున్న సంధ్య ధైర్యవచనాలామె చెవిలో దూరడంలేదు. తక్షణం అమ్మదగ్గరకు చేరాలనే కోరిక ఆమె నరాల్ని సాగదీస్తూంది.

అమ్మ! అమ్మ తనకు దక్కుతుందా? అమ్మ చివరిమాటైనా తనువినగలుగతుందా! అబ్బ! పాడురోడ్లు, ఎంత ఇరుగ్గావున్నాయో! ఈ గేదెల మందొకటి. మనుష్యులతో పోటీగా రోడ్ రూల్స్‌ని అతిక్రమిం చేస్తాయి. వీటన్నిటిని దాటుకుని ఎప్పుడు చేరుతుంది తను అమ్మదగ్గరకు?

అమ్మకు సీరియస్‌గా వుందని ఫోన్‌వచ్చిన దగ్గర్నుండి వాసంతికి ఆందోళనతో పిచ్చెక్కిపోతూంది. చెల్లెళ్ళు, తమ్ముడు అమ్మను హాస్పటల్లో చేర్చడానికి ఎన్ని తిప్పలు పడ్డారో! ఈ తతంగాలన్నీ పూర్తిచేయడానికి

అనుభవంలేనివాళ్ళు, ఎంత ఇబ్బంది పడ్డారో! సుధీర్‌కూడా సమయానికి అక్కడలేడు. అసలు అమ్మకేమయిందో! ఇప్పుడెలా వుందో!

"వాసూ! ఎంతసేపలా కూర్చుంటావు? వెనక్కు చేరగిలబడి రిలాక్సవుకొంచెం." సంధ్య అనునయంగా వాసంతి భుజంమీద చెయ్యేసింది. వాసంతి తడికళ్ళతో సంధ్యవంకచూచింది. సంధ్య కబురు విన్నవెంటనే కారుతీసుకుని రాబట్టిగాని లేకపోతే ఇంకా ఎంత ఆలస్యమయేదో! కాళ్ళూ, చేతులూ ఆడక కూర్చున్న తనకు ధైర్యం చెప్పి తోడుగా వస్తున్న సంధ్యపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది వాసంతి హృదయం.

హాస్పటల్ బెడ్‌మీద స్పృహలేకుండా నిస్త్రాణగా పడుకున్న అమ్మనుచూచి బావురుమంది వాసంతి. బలవంతంగా వరండాలోకి లాక్కుపోయింది సంధ్య. కడుపులో నుంచి ఎగసివస్తున్న దుఃఖాన్నాపడానికామె చదువు, విజ్ఞానం, వయసు..వేటికీ శక్తిచాలడంలేదు. తల్లి పక్షికోసం ఏడుస్తున్న పక్షికూనలా ఆమె దీనంగా, గుండెలు పిండేసేలా విలపిస్తూంది.

"వాసూ! ఏయ్‌పిచ్చీ! ఏమిటా ఏడుపు? మనుషులన్నాక జబ్బులు రాకుండా వుంటాయా? అమ్మకి తగ్గిపోతుంది. షీ విల్‌బి ఆల్‌రైట్ బైటుమారో!" తన కౌగిలిలో వాసంతిని పొదవుకుని ఓదారుస్తున్న సంధ్యకళ్ళల్లో పలుచటితెర కమ్మింది. వినత, సాగర్, శార్వరి బిక్కమొహాలేసుకుని అక్క దగ్గరికొచ్చారు. వాళ్ళనుచూచి బలవంతాన దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తూ అమ్మదగ్గరకి వచ్చింది వాసంతి.

రాత్రి అందర్నీ పంపించి అమ్మబెడ్ ప్రక్కన కూర్చున్న వాసంతికి ఎడారిలో వున్నట్లు, భయంకరమైన శూన్యంలో దిక్కుతోచక నిలబడి నట్లు అనిపించింది. వైరాగ్యం, నిరాశ, అధైర్యం కలగాపులగంగా అయి ఆమె హృదయాన్ని విచలితం చేస్తున్నాయి.

"వాసూ!" తనకతిప్రియమైన స్వరం చేరువలో వినిపించి తృళ్ళిపడింది వాసంతి. రాజాని చూడగానే ఆమె హృదయ తంతువులన్నీ ఒక్కసారి ప్రకంపించాయి. ఆమెను ఒణికిస్తున్న దుఃఖం, ఒంటరితనం మరింత విజృభించి ఆమెను సమూలంగా కదిలించాయి. తన దుఃఖాన్ని, ఆరాటాన్ని పంచుకోగల ప్రాణికోసం అలమటిస్తున్న వాసంతి రాజావంక ఆర్తిగా చూచింది. ఈరోజు రాజా తనప్రక్కనుంటే తన కెంత ధైర్యంగా వుండేది? ఎంత నిబ్బరంగా ఈ స్థితిని ఎదుర్కోగలిగి వుండేది?

వేరే పేషెంట్‌ని చూడడానికి అక్కడకు వచ్చిన రాజా అమ్మను చూచి వేగంగా అన్నీ జరిగేలా చూసాడని, రాత్రినుండి రాజా అమ్మను కనురెప్పలా చూచుకుంటున్నాడని,అతను లేకపోతే అమ్మ నీవిధంగా చూడ గలిగేవాళ్ళం కాదని వినత చెప్పింది. వినత రాజాచేసిన సహాయం గురించి చెప్తూంటే వాసంతి హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. కాని ఎక్కడో అసంతృప్తి. పరిస్థితులు మరోలావుంటే తనీ విధంగా భావించేది కాదు. అతనితో చేయించుకోవడం తన హక్కు అనుకునేది.

"వాసూ! ఎంతసేపయింది వచ్చి? తమ స్నేహం గాఢమవుతున్న తొలిరోజుల్లోని అప్యాయత చిందిందతనిస్వరంలో. ఆ అప్యాయతకు కరిగిపోతున్న హృదయాన్ని నిగ్రహించుకోవడమామె వశం కావడం లేదు. భావోద్వేగం ఆమెను ఊపి ఊపి వివశురాల్ని చేసింది. తనను కౌగి లించుకుని కదిలి కదిలి ఏడుస్తున్న వాసంతి వంక షాక్ తిన్నట్లు చూచాడు రాజా. 'అసలామె స్పృహలోనే వుందా!' అన్న అనుమాన మొచ్చింది. ఆమె తెలివిలోనేవుంటే చచ్చినా అలా ప్రవర్తించదు. ఇన్నేళ్ళ తమ స్నేహంలో తనను ఒక్క చూపులో అల్లంత దూరాన వుండేటట్లు శాసించగలిగింది. తనకూ ఆమెకూ మధ్య ఏతెరలూ లేనప్పుడుకూడా ఆమె నమ్మకాలామెను బాహ్యంగా తనకు దూరంగానే వుంచాయి. ఈనాడు తామిద్దరిమధ్య ఇనుప తెర జారిపడింది. ఇప్పుడు అకస్మాత్తుగా తన దోసిలిలోకి వచ్చిపడిన ఈ

వెలుగు ముద్దను చూస్తుంటే అతని మెదడు పనిచెయ్యడంలేదు. అతని ఆలోచనతో ప్రమేయంలేని చేతులామె వీపుని చుట్టి ఓదార్పుగా తడుతున్నాయి. ప్రాపంచికమైన నియమాల్ని, సరిహద్దుల్ని పట్టించుకోకుండా ఒక హృదయం మరో హృదయంనుంచి స్వాంతన పొందుతూంది. ఎండి, బీటలువారిన ఒక హృదయంలో మరో హృదయం ప్రేమామృతాన్ని చిలకరిస్తూంది.

"వాసూ:" మృదువుగా పిలుస్తూ ఆమె కౌగిలినుండి విడివడి ఆమె కన్నీళ్ళను తుడిచాడు రాజా.

"వాసూ! ఎందుకరత బాధపడుతున్నావ్! మీ అమ్మగారికి నయమవుతుంది. నీ ఏడుపుచూస్తుంటే నువ్వసలు డాక్టరువేనా అని అనుమానమొస్తూంది." హాస్యం చేసి ఆమె దుఃఖాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాడు రాజా. ఉద్రిక్తత జారిపోయిన వాసంతి అంతవరకు తనున్న స్థితికి సిగ్గుపడింది.

"సారీ రాజా!" అంది వాసంతి కన్నీళ్లు తుడుచుకుంటూ

"సారీ! అంటే సరిపోతుందా? నా షర్టుకి పులిమిన కుంకుమని, కాటుకని చూచి మా ఆవిడచేసే క్రాస్ ఎగ్జామినేషన్‌కి ఏం సంజాయిషీలు చెప్పమంటావో చెప్పు" చిలిపిగా చూసాడు రాజా. అతని షర్టువంక చూచిన వాసంతి హృదయం ఝల్లుమంది. చేజారిపోయింది మరీ ప్రియంగా అనిపించసాగింది.

"అయ్యో! ఎలా?" నొచ్చుకుంది వాసంతి.

"తప్పేదేముంది? ఓవంద గుంజీలు. ఓ నాలుగుగంటల గోడకుర్చీ!" అమాయకంగా ముఖంపెట్టాడు రాజా.

"చాల్లే! పెళ్ళయినా నీకొంటెతనం మాత్రం పోలేదు. అదిసరే ఇప్పుడెలా?" వాసంతి షర్టువంక గాభరాగా చూస్తూ అరచేత్తో తుడవ

బోయింది.

"ఆగాగు. కంగారుపడకు" వాసంతిచేతిని పట్టి ఆపాడు రాజా. అతని స్పర్శ ఆమెలోని ప్రత్యణువుకు ఉత్తేజాన్నిస్తూంది. మనిషిలోని సహజమైన అనుభూతుల్ని, ఉద్రేకాల్ని, నమ్మకాలు, కట్టుబాట్లు కొంతవరకే అణచగలవని గుర్తించింది వాసంతి. నెమ్మదిగా చేతిని విడిపించుకుని దూరంగా జరిగింది.

"మా ఆవిడ ఊళ్ళోలేదు. ఆవిడవచ్చేసరికి యీ కుంకుమ ఛాయ, కాటుక రేఖలూ నాలో కలిసిపోయి ఓ అందమైన జ్ఞాపకంగా మిగులుతాయి." భావుకంగా వున్న రాజాస్వరం విని ఆశ్చర్యంగా చూచింది వాసంతి. రాజాకూడా తనను పోగొట్టుకున్నందుకు బాధపడుతున్నాడా? పరిశీలనగా అతనిముఖంవంక చూస్తున్న వాసంతి అంతకుమించి ఆలోచించడానికి  ఇష్టపడలేదు. అమ్మ మూలుగు వినిపించి ఆతృతగా వంగి ఆమెవంక చూచింది.

తరువాత పదిహేను రోజులకుగాని వాసంతి నిశ్చింతగా ఊపిరి పీల్చుకోలేదు. అమ్మను ఇంటికి తీసుకొచ్చేవరకు అన్ని విషయాలూ రాజాయే చూసుకోవడం ఆమెకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఒక చల్లని సాయంత్రం రాజాని సాగనంపి లోపలి కొచ్చిన వాసంతి శార్వరి మాటలు విని చిత్రప్రతిమలా నిలబడిపోయింది.

"అక్కా! నీ ఫ్రెండ్‌కి బాగా బుద్ధొచ్చినట్టుందే! నిన్ను ప్రేమించానని, పెళ్ళిచేసుకుంటాననిచెప్పి డబ్బుకోసం గడ్డితింటే ఏ హిడింబో, పూతనో అయ్యగారి పీకలమీదికెక్కి వుంటుంది. ఇప్పుడు దొంగ కన్నీళ్ళు కారుస్తూ నిన్ను పోగొట్టుకున్నందుకు లెంపలు వేసుకుంటూవుండుంటాడు. అవునా?" తను ఇంకా చిన్నపిల్ల, ఏమీ తెలియని పసిది అనుకుంటున్న చెల్లెలలా మాట్లాడుతూంటే విభ్రాంతితో చూస్తున్న వాసంతి తెప్పరిల్లడానికో నిమిషం

పట్టింది. ఆమె ఆ ధోరణిలో ఆలోచించడానికి, ఊహించడానికి గల కారణాల్ని తర్కించుకుంది. మెల్లగా వచ్చి చెల్లెలి ప్రక్కనకూర్చుంది.

‘‘రాజాగురించి నువ్వనుకుంటూందంతా పొరపాటు. కొన్ని విషయాల్లో మా ఇద్దరి అభిప్రాయాలు కలవలేదు. రాజీపడి సర్దుకుపోలే మనిపించింది. పెళ్లి చేసుకున్నాక బద్ధశత్రువుల్లా అనుక్షణం ఒకర్నొకరు ద్వేషించుకుంటూ, హింసించుకుంటూ బ్రతకడంకంటే ఫ్రెండ్లీగా విడిపోవడం మేలనిపించింది. విడిపోయాం”

“అంటే మీరిద్దరూ గాఢంగా ప్రేమించుకోనే లేదన్నమాట. అందుకే అంత తేలిగ్గా ఇతర విషయాలకు ప్రాముఖ్యమిచ్చి విడిపోగలిగారు.” చెల్లెలి మాటలకు ఉలిక్కిపడి ఒకసారి ఆత్మవిమర్శన చేసుకుంది వాసంతి.

“బహుశ అంత గుడ్డిప్రేమ కాదేమో మాది.” బలహీనంగా ఉంది వాసంతి స్వరం. క్షణంలో సర్దుకుని చిన్నగా నవ్వింది.

“ఎనీవే, జరిగిపోయినదానికిప్పుడు చెయ్యగలిగిందేమీ లేదు. రాజా ఎప్పటిలాగే నాకు మంచి ఫ్రెండ్ ఇప్పుడుకూడా. అదలా ఉంచు. నీ సైకాలజీ ఏమిటి? ప్రేమించిన అమ్మాయిని పెళ్ళిచేసుకోకుండా వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకున్న ప్రతివాడికి ఏ హిడింబో, పూతనో భార్యకావాలని ఏమైనా రూలుందా? భార్య ప్రియురాలికంటే అందగత్తె, ఉత్తమురాలు కాకుడదనేముంది? ఈ విషయంలో నిందించాల్సింది మోసగాడు, వ్యక్తిత్వం లేనివాడూ అయిన మగవాడినేగాని అతని భార్యను కాదు. రూపం, గుణం, ప్రేమించే హృదయంతోపాటు ‘డబ్బు’ అనే అదనపు క్వాలిఫికేషన్ కూడా వుండడం ఆవిడ తప్పా?” నిశితంగా చెల్లెలి కళ్ళలోకి చూచింది వాసంతి.

“నీ హృదయం మరీ హిందూమహాసముద్రమంత విశాలమయింది. అందుకే నీకు తప్పుగా తోచదు.” నవ్వుతూ తప్పించుకోవాలని చూచింది

శార్వరి.

ఆ అమ్మాయలా ఎందుకు మాట్లాడుతూందో తల్లి కన్నీళ్ళు పెట్టుకుని చెప్పినప్పుడు కాని అర్థమవలేదు వాసంతికి. చెల్లెల్ని నిలదీసి అసలు విషయం తెలుసుకోవాలని ప్రయత్నించిన వాసంతికి శార్వరి ధోరణిచూచి నోటమాట రాలేదు.

“అవునక్కా! నేను, చక్రపాణి ప్రేమించుకున్నాం. ప్రపంచం తల్లక్రిందులయినా సరే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం” ఎలాంటి జంకూ లేకుండా ఖచ్చితంగా చెప్పింది శార్వరి.

“అంత ప్రపంచం తల్లక్రిందులయినా పెళ్ళి చేసుకునేవాడికి కట్నం కావాలనే ఏడుపెందుకు? మహరాజులా నిన్ను కట్టుకొని ఊరేగొచ్చుగా?” తల్లి ఆవేశం చూచి కలత పడిన వాసంతి ఆమెను వారించింది.

“నువ్వూరుకోమ్మా! నేను కనుక్కుంటాను గదా!”

“ఏం కనుక్కుంటావే? ఇదెలాంటి మొండి గాడిదయిపోయిందో నీకు తెలియదు. ఒక హద్దూ అదుపూ లేకుండా పోయింది. వెధవ తిరుగుళ్ళు నేర్చి పరువు బజారున పెడుతూంది” అతి కష్టంమీద తల్లిని శాంతపరిచింది వాసంతి.

“అసలతనికి లక్షరూపాయల కట్నమిస్తామని వస్తున్నారు తెలుసా? నన్ను ప్రేమించాడు కాబట్టే ఇరవై వేలయితే చాలంటున్నాడు. పెద్ద ఆమాత్రం దానికింత గింజుకు పోతుందేమిటమ్మా?” శార్వరిది మూర్ఖత్వమో, అతి తెలివో అర్థంకాలేదు వాసంతికి.

“శారూ! మనకున్న ఆస్తిపాస్తులేమిటో తెలీయదా నీకు?” తెచ్చిపెట్టు కున్న శాంతంతో అడిగింది వాసంతి.

“అదంతా నాకు తెలవదు, ఆ డబ్బుని ఎక్కడనుంచి తెస్తారనేది

నాకు అనవసరం. చక్రపాణితో నా పెళ్లవనిరోజున మీకు కనిపించేది నేను కాదు నా శవమే.” విసవిసా లేచివెళ్తున్న శార్వరిని ఆపి ఆచెంపా యీచెంపా వాయించి కూర్చోబెట్టాలన్న ఆవేశాన్ని బలవంతంగా అణచుకుంది వాసంతి.

‘‘ఇవన్నీ చూడమనే బ్రతికించాడా మాయదారి దేవుడు.’’ ఏడవసాగింది అన్నపూర్ణ. ఆవాతావరణంలో ఊపిరాడనట్లనిపించింది వాసంతికి. పెరట్లోకి వెళ్ళి కూర్చుని దిగులుగా ఆకాశం వంక చూడసాగింది. పిల్లిలా అక్కడకు వచ్చింది వినత.

“అక్కా! యూనివర్సిటీ అంతా దీనిపేరు మార్మోగిపోతూంది. అతనితో చాలా క్లోజ్‌గా వెళ్ళిందని చెప్పుకుంటున్నారంతా. నేనేమన్నా చెప్పబోతే గంయిమని లేస్తుంది నామీద.” వినత చెప్తూంది విని ఎప్పుడూ కలలోకూడా అనుకోనిది జరుగుతూ ఉండటంవల్ల వాసంతికి పిచ్చికోపమొచ్చేస్తూంది.

“ఇన్నాళ్ళూ నాకెందుకు రాయలేదు?” వినతి వంక తీక్షణంగా చూచింది వాసంతి.

“మొన్నమొన్నటిదాకా ఇలా తిరుగుతూందని నాకూ తెలవదు. అసలందరి కంటే ఆఖరున నాకు తెలిసింది విషయం. నీకు రాద్దామనుకుంటూవుండగానే అమ్మకి జబ్బుచేసింది.’’ భయంగా అక్కవంకచూస్తూ చెప్తూంది వినత. వింటూ ఆలోచిస్తూంది వాసంతి.

“అక్కా, ఏదోఒకటి చెయ్యకపోతే అన్నంతపనీ చేసేస్తుందది.”

‘‘ఏం చెయ్యమంటావే? వేలేమన్నా చెట్లకు కాస్తున్నాయని అనుకుంటూందా అది? అసలిటు ప్రేమకావాలి, అటు కట్నమూ కావాలనే దగుల్బాజీగాణ్ణెలా ప్రేమిస్తూందది.? స్పృహలోవుండే అలా ప్రవర్తిస్తూందా?” అక్క కోపాన్ని బిత్తరపోయి చూస్తూంది వినత.

"చావు పేరు చెప్పి బెదిరించి సాధించే మెంటాలిటీ అంటే అసహ్యం నాకు. వేల కట్నాలు గుమ్మరించమని అడగడానికి మనస్థోమతేమిటో తెలియని పసిపిల్లా అది?'' వాసంతి కోపంచూచి చెప్పాలనుకున్నది చెప్పడానికి సంశయించింది వినత. చెప్తే అక్క బాధపడుతుందేమోనని వెనకాడింది. చెప్పకపోతే శార్వరి మనస్తత్వం ఇంకెంత విపరీతంగా మారిపోతుందో నని భయంగావుంది. అన్నివిషయాలూ అక్కకు తెలిస్తే తనే ఏదన్నాపరిష్కారం ఆలోచిస్తుందని చెప్పేయడానికి నిర్ణయించుకుంది.

"అక్కా!" అక్కముఖంచూచి ఈటెల్లాంటి శార్వరి మాటల్ని చెప్పడానికి మనసొప్పక ఆగిపోయింది వినత. ఆమెకు శ్రమతప్పిస్తూ శార్వరి సుడిగాలిలా వచ్చింది.

"వేలెక్కడన్నా చెట్లకు కాస్తాయా? సంపాదించే అవకాశమున్నప్పుడు దాన్నుపయోగించుకునే తెలివితేటలుంటే వస్తాయి." వినతవంక చూస్తూ అంది శార్వరి.

"శారూ! నువ్వునోర్మూస్తావాలేదా?" అసహనంగా అరిచింది వినత.

"నేనెందుకు నోర్మూసుకోవాలి? ఈవిడగారివల్ల ఎవరికుపయోగం? ఇంట్లో వాళ్ళకెలాగూ ఉపయోగంలేదు. ఏదో లోకాన్నుద్ధరించేస్తున్నానని ఈవిడ భ్రమ.'' తెల్లగాపాలిపోయింది వాసంతి ముఖం. చెల్లెలిలా తయారయినందుకు బాధపడే ఓపికకూడా లేకపోయింది

"నీకు బుద్ధుందా అసలు?." వినత ముఖం కోపంతో ఎరబ్రడింది

"నా బుద్ధి సరిగ్గా వుంది కాబట్టే అంటున్నాను. ఈవిడగారి సేవలవల్ల, మంచితనంవల్ల లోకానికేదో గొప్పమేలు జరుగుతూందని నీలాంటి తెలివితక్కువ దద్దమ్మలు నమ్మితే నమ్మొచ్చుగాని నేనంత వెర్రిదాన్ని కాను. ఐహేట్ దిస్. ఇలాంటి అసమర్థతంటే నాకు అసహ్యం." శార్వరివంక నిర్జీవంగా చూస్తున్న వాసంతి హృదయంలోని అతి సున్నితమైన ప్రదేశంలో

కోలుకోలేనంత పెద్ద దెబ్బ తగిలింది.

## 18

ప్రకృతి శబ్దంచేస్తూరోదిస్తూంది. ఎండ, వాన పోటీగా ఒకదాన్నొకటి తరుముతున్నాయి.

"అమ్మగారూ!" కాంపౌండర్ రామయ్య వాసంతి తనవంక చూడగానే కళ్ళు దించుకున్నాడు. ఏదో చెప్పాలనుకుంటూ చెప్పలేక, చెప్పక గత్యంతరంలేక ధైర్యాన్ని కూడదీసుకుని నోరువిప్పాడు.

"అమ్మా!" చెప్పబోయి, కంఠానికేదో అడ్డుపడినట్లయి ఆగిపోయాడతను.

"ఏమిటి రామయ్యా?" దిగులుగా, దీనంగా అడిగింది వాసంతి.

"మీతో చెప్పి ఇంకెక్కడయినా పని చూచుకుందామని" తప్పు చేస్తున్నట్లు చూచాడతను.

"నువ్వుకూడా వెళ్ళిపోతావా రామయ్యా?" నిస్సహాయంగా వుందామె చూపు.

"వెళ్లాలంటే నాకూ ప్రాణంపోతున్నట్లుగా ఉందమ్మా! కాని....ఎటు చూచినా అప్పులు పెరిగిపోతున్నాయి. పేషెంట్స్ వచ్చి నాలుగు రూపాయలిస్తేనే కదమ్మా బ్రతుకు వెళ్ళమారేది?" అతినెమ్మదిగా, క్షమాపణ వేడుకుంటున్న స్వరంతోనే చెప్పినా జీవంలేనట్లుగా వున్న వాసంతి ముఖం చూచాక 'ఎందుకు చెప్పానా!' అని మథనపడసాగాడు రామయ్య.

"ఇంకొంచెం రోజులు ఓపికపట్టలేవా రామయ్యా?" నూతిలోనుంచి వచ్చి నట్లుంది వాసంతి స్వరం. ఏం చెప్పాలో తోచలేదు రామయ్యకు. కాని... పేషెంట్స్ రోజురోజుకీ తరిగిపోతున్నారు. డాక్టర్ రమేష్ రకరకాల యుక్తులతో పేషెంట్స్‌ని తమవైపుకు తిప్పుకున్నాడు. కొంతమందింకా

అమ్మగారిని పట్టుకుని వ్రేళ్ళాడుతున్నా వాళ్ళంతా వాళ్ళకే ఠికానాలేనివాళ్లు. వాళ్ళు అమ్మగారికేం ఇస్తారు, తనకేం ఇస్తారు?... అమ్మగారిమీదెంత అభిమానమున్నా తన సంసారం గడవడం కోసం, తన బ్రతుకుతెరువు కోసం అమ్మగారిని విడిచిపెట్టక తప్పడంలేదు.

''డాక్టరమ్మగారూ!'' గొడుగు మడుస్తూ ఇంటి యజమాని లోపలికొచ్చాడు. "రండి కూర్చోండి" కుర్చీ చూపించింది వాసంతి.

"ఇల్లెప్పుడు ఖాళీ చేస్తున్నారో కనుక్కుందామనొచ్చాను." నాలుగేళ్ళల్లో మీకు మేడ కట్టించే పూచీనాదని చెప్పిన పెద్దమనిషి, ఇంటాయన మాటలు పుండుమీద కారం చల్లినట్లు అనిపించాయి.

"ఇంకో యిల్లు దొరకగానే ఖాళిచేస్తాను." తగ్గు స్వరంతో చెప్పింది వాసంతి.

"ఇంకో ఇల్లా? ఈ ఊళ్ళో మళ్ళీ ఇల్లు దొరకడమనేది కల్లో వార్త. ఊళ్ళో పెద్దలంతా మీ మీద మండిపోతున్నారు. ప్రెసిడెంటుగారి మనమడికి స్కూల్లో అటెండెన్స్ చాలక డాక్టర్‌సర్టిఫికెట్ కోసమొస్తే దొంగ సర్టిఫికేట్లివ్వ నన్నారట." వాసంతికి ఆవిషయం గురించి సంధ్య తిట్టడం గుర్తొచ్చింది.

"ఏమిటే నీ వీరమడీ నువ్వునూ,? ఆ సర్టిఫికేట్ రాసి వాడిముఖంమీద పడేస్తే నీసొమ్మేంపోయింది. అది దొంగ సర్టిఫికెట్టో దొరసర్టిఫికెట్టో ఎవరు చూడొచ్చారు." గంయిమని లేచింది సంధ్య.ఎవరో చూస్తారా, చూడరా అనేది కాదు,దొంగ సర్టిఫికెట్ ఇవ్వడం అనైతికం అని తన నమ్మకం.

"మునసబుగారి ఇంటావిడను చూడ్డానికి రమ్మంటే హాస్పటల్‌కు తీసుకురమ్మన్నారంట. సీతారామయ్యగారమ్మాయిని చూడటానికి రమ్మంటే అదే సమాధానం చెప్పారంట. అరికసలే ఘోషాగందా. హాస్పటల్ కెట్లావస్తారు." సినిమా హాళ్ళకి, బట్టల కొట్టులకి వెళ్ళడానికిలేని ఘోషా తన హాస్పిటల్‌కి రావటానికెలా అడ్డొచ్చిందో అర్థంకాలేదు. తమబోటి

కలిగిన వాళ్ళ ఇళ్ళకి వచ్చి చూడకుండా ఎలా నెట్టుకొస్తుందన్న అతిశయం! ...ఆ దృశ్యాలన్నీ కళ్ళముందు కదిలి చిరాగ్గావుంది వాసంతికి.

"అమ్మా!" మృదువుగా పిలిచాడు యింటి యజమాని.

"ఇల్లు ఖాళీ చేయించి తరిమేయడానికి నా మనసొప్పడంలేదు. నా కోడల్ని బ్రతికించి నాఇంటి దీపాన్ని నిలబెట్టిన తల్లివి, నీకిట్లా చెప్పాలంటే బాధగా వుందమ్మా! కాని పూర్తిగా చితికిపోయిన రైతుని. ఆ దుష్టుల కెదురుతిరిగి బ్రతకలేక చెప్పాల్సొచ్చిందమ్మా!" సన్నటి నీటిపొర కమ్మిందా వృద్ధుడి కళ్ళల్లో. తల వంచుకుని వింటూంది వాసంతి.

''నీ లాంటి మంచివాళ్ళకివి రోజులుకాదమ్మా!'' నిట్టూర్చి వెళ్ళిపోయాడాయన. మంచితనం! పేలవంగా నవ్వుకుంది వాసంతి.

ఆలోచనలతో కళ్లుమండి పోతూంటే ముఖం కడుక్కుంటానికి లేచింది. చల్లటినీళ్లు ముఖానికి, చేతులకి తగలగానే శరీరంతోపాటు మనసుకూడా చల్లబడి నట్లయింది. ఒకక్షణం సప్తవర్ణాలతో అందంగా కనిపించిన నీటి బుడగలు మరుక్షణంలో పేలిపోతుంటే సోప్‌ని చేతిలో ఉంచుకొని ఆలోచిస్తూంది వాసంతి. తను మనుషుల మీద పెట్టుకున్న నమ్మకాలు కూడా ఇలాంటివేనా?

తనంటే అబిమానంగా ఉండే పేషెంట్స్ అంతా తనకు దూరమవడం మొదలు పెట్టగానే తన నిజాయితీని కంటగించుకున్న వ్యక్తులంతా విజృంభిస్తున్నారు. మృత్యువుతో చివరి వరకు పోరాడడమే తన కర్తవ్యమనే తన నమ్మిక ఫలితంగా ఏ హాస్పటల్ నుంచీ వెళ్ళనన్ని శవాలు తన హాస్పటల్‌నుంచి వెళ్తాయి. దీన్ని తమ కనుకూలంగా వాడుకుంటున్నారు. తన ప్రత్యర్థులు. 'నాచేతిమాత్ర వైకుంఠ యాత్ర' అన్నట్లు అమ్మగారి భస్మాసురహస్తం ఎవరి మీద పడితే వాళ్ళకి మోక్షప్రాప్తి ఖాయమని ఎగతాళిగా ప్రచారం చేస్తున్నారు. చివరకు తనకిక్కడ నిలువనీడ లేకుండా చెయ్యాలనే

గట్టిప్రయత్నంతో ఇంటిని ఖాళీ చేయించి మరోయిల్లు దొరకనివ్వకుండా చేస్తున్నారు....ఇప్పుడు తనవల్ల ఉపకారం పొందిన వారంతా ఏరీ? ఎక్కడున్నారు? తనప్రక్కన ఎవరూ నిలబడరేం? సంపన్నులంతా డబ్బుపారేసాం, చేయించుకున్నాం, అంతే అంతటితోసరి, ఆవిడే గంగలో కలిస్తేమాకేం? అన్నట్లు ప్రవర్తిస్తున్నారు, పేదవాళ్ళు చాలామంది సంపన్నుల మీద ఆధారపడి బ్రతుకుతున్నవాళ్ళు. తనమీద జాలి, అభిమానం ఎంత ఉన్నా తనకోసం నిలబడే సాహసం వాళ్ళకులేదు. ఒకవేళ ధైర్యంచేసి నిలబడ్డా వాళ్ళని నయానో భయానో దూరం చేస్తారు. తను రాజాఅన్నట్లు, ఒంటరిగా నిలబడాల్సిందేనా?

రాజా! ఆ రోజు నువ్వు 'గాడ్ ఫర్బిడిట్' అన్నావుగాని గాడ్‌ఫర్బిడ్ చెయ్యలేదు రాజా! నేను మంచివని నమ్మిన సూక్తులే నన్ను అసమర్థురాల్ని చేసి కూర్చోబెట్టాయి. నా ఆదర్శాలే నన్ను ఘోరంగా దెబ్బతీసాయి. రాజా! ఆనాడు నువ్వు కోపంతో శపించకపోయినా నువ్వన్నట్లే జరుగుతూంది. అందుకు నువ్వేమాత్రం సంతోషపడవని, నా ఓటమి నీకు దుఃఖాన్ని కలిగిస్తుందని నాకుతెలుసు. ...అరచేతిని నుదుటకి ఆనించుకుని ఆలోచిస్తున్న వాసంతి చెక్కిళ్ల మీద టపటప కన్నీళ్ళు రాలాయి.

## 19

ఊళ్ళో ఓ మోతుబరి కూతురి పెళ్ళికి ఆహ్వానించారు. వాసంతికి వెళ్లాలని లేకపోయినా తను వెళ్ళనందుకు చేసే ప్రచారాల్ని తలచుకుని తట్టుకునే ఓపికలేక బయల్దేరింది.

రిక్షాదిగిన వాసంతిని చూచి పెళ్ళివారింట్లో ఎవరో పలకరింపుగా నవ్వి లోపలకు తీసుకువెళ్ళి ముత్తయిదువుల దగ్గర కూర్చోబెట్టి వెళ్ళిపోయారు. వాసంతి లోపల కూర్చున్న ఒక నిముషానికి కారొకటివచ్చి ఆగింది. 'డాక్టరుగారు, డాక్టరమ్మ గారు వచ్చార'ంటూ బిలబిలా పదిమంది

కారుదగ్గర కూడిపోయి నమస్కారాలు చేస్తూ సంధ్యను లోపలికి తీసుకొచ్చారు. గబగబ ఒక కుర్చీతెచ్చి ముత్తయిదువులంతా కూర్చున్న ఆ హాలుమధ్యలో వేసి సంధ్యను కూర్చోమని బలవంతం చేసారు. ఇబ్బందిగా అటూ, ఇటూ చూస్తున్న సంధ్యకు ఆమెకు చేస్తున్న మర్యాదల్ని వింతగా తిలకిస్తూ ఒక ప్రక్కన కూర్చున్న వాసంతి కనిపించింది.

"నువ్విక్కడ కూర్చున్నావా వాసూ! మీ ఇంటికి వెళ్తే నువ్విప్పుడే వెళ్ళిపోయావని చెప్పాడు మీ కాంపౌండరు." వాసంతి సంధ్య చెప్పేది వినడం లేదు. తన ప్రక్కన కూర్చున్న సంధ్యతో తనను పోల్చి చూసుకుంటూంది. సంధ్య సాంఘికంగా, ఆర్థికంగా, వృత్తిపరంగా తన కళ్ళముందే రోజురోజుకు పెరిగిపోతూంది. కాని....తను!.... ఛ! సంధ్య పొందుతున్న ఈ బాహ్యామైన ఉన్నతిని చూచి తనకు జెలసీగా వుందా? లేదు లేదు. తను తాత్కాలికంగా ఓడిపోయినందువల్ల తను నడుస్తున్న దారి చెడ్డదనే అభిప్రాయానికి రాకూడదు....క్షణకాలమయినా సంధ్యతో తనను పోల్చుకుని తక్కువగా ఫీలయినందుకు కించపడింది వాసంతి.

పేషెంట్స్ చాలామంది వచ్చి డాక్టరమ్మలిద్దర్నీ పలకరిస్తున్నారు. సాదాగా, నిరాడంబరమైన అలంకరణతో ఉన్న వాసంతికంటే పెద్ద పట్టుచీరతో, మేచింగ్ నగల సెట్టుతో మెరిసిపోతున్న సంధ్య వాళ్ళ నాకర్షించింది. అందానికితోడు అలంకరణ, స్టయిలుఉన్న సంధ్య ప్రతి కదలికని ఆరాధనగా చూస్తున్నారంతా.

"అమ్మగారూ! కేసొచ్చింది" రామయ్య పిలుపువిని ఆలోచనలలో నుండి బయటపడింది వాసంతి. వెంటనే లేచి పెళ్ళికూతురి తల్లిదగ్గరకు వెళ్ళి కేసు రావడం వల్ల తను వెళ్ళిపోతున్నట్లు చెప్పింది. తలూపి బొట్టు, తాంబూలం ఇచ్చిందావిడ. వాసంతిని సాగనంపడానికి ఆమెతోపాటు సంధ్యకూడా లేస్తే, 'అయ్యో అప్పుడే వెళ్ళిపోవడమేమిటండీ? భోంచెయ్యందే

వెళ్ళడానికి వీల్లేదు'  అంటూ ఆమె అగ్గగ్గలాడి పోతూంటే తన హృదయాన్నెవరో కొలిమిలో పెట్టినట్లనిపించింది వాసంతికి. ఈ పెళ్ళికూతురి అక్కకు పురుడుపోసి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసిందితను. ఈ పెళ్ళికూతురికి సంవత్సరం క్రితం గర్భమొస్తే ఈమె తలిదండ్రులు తన కాళ్ళమీద పడిబ్రతిమాలి తమపరువు నిలపమని ప్రాధేయపడ్డారు...వెల్! అదంతా గతం. తనతో అవసరం తీరిపోయింది, తను వాళ్ళకు చేసినమేలు వాళ్ళూ, తనూకూడా మరిచిపోవలసినది. తనానాడు వాళ్ళకేదో పెద్ద మేలు చేస్తున్నానని, దానికి వాళ్ళు జీవితాంతం ఋణపడివుండాలని కోరుకోలేదు...కాని వాళ్ళ నిర్లక్ష్యాన్ని భరించాలంటే తనవల్ల కావడంలేదు.

"వాసూ! మా కారులో వెళ్ళు. డ్రైవర్ దింపివస్తాడు." సంధ్య మాటలతో కొలిమినెవరో పనిగట్టుకుని ఊదినట్టనిపించింది.

"వద్దు. రిక్షావుంది." సంధ్యవంక చూడనుకూడా చూడకుండా రిక్షాఎక్కేసి పోనిమ్మంది వాసంతి.

పేషెంట్ చాలా సీరియస్ కండిషన్‌లో ఉంది. ఊళ్ళోని మిగతా డాక్టర్లు పరిస్థితి చూచి కేసు తీసుకోమని చెప్పి పంపేసారు. పేషెంట్‌నిచూచి వాసంతికూడా ఒకక్షణం తటపటాయించింది. మరుక్షణం అన్ని శంకల్ని, అంత సంఘర్షణను మరిచిపోయి పేషెంట్‌నెలా బ్రతికించడమా అన్న ధ్యాసలో పడిపోయింది.

తూరుపుదిక్కు ఎర్రబడేవేళ వాసంతి ప్రయత్నాలన్నిటినీ వృధాచేస్తూ పేషెంట్ చనిపోయింది. పేషెంటు బ్రతుకుతుందనే ఆశ తక్కువగా ఉన్నప్పటికి తన ప్రయత్నం విఫలమయ్యేప్పటికి తన సర్వశక్తుల్నీ ఎవరో లాగేసుకున్నట్లు కూర్చుండిపోయింది. ఇంతకంటే ఎవరూ ఏమీ చెయ్యలేదు. చెయ్యవలసినదంతా తను చేసిందన్న తృప్తి ఒకప్రక్క వున్నా పేషెంట్‌ని

బ్రతికించలేక పోయానన్న అసంతృప్తే ఎక్కువగా ఉంది వాసంతికి.

ఎప్పుడు, ఎక్కడ నిప్పురాజుకుందో తెలవదుకాని పెద్ద పెద్ద కేకల్తో జనం ఇంటిమీద పడ్డప్పుడుగాని పేషెంట్ గురించి విచారిస్తున్న వాసంతి తెలివిలోకిరాలేదు. "ఏదీ, బయటకులాగండిదాన్ని. ఇట్లా ఎంతమందిని పొట్టనబెట్టుకుంటుంది?"...ఒకరు.

"డాక్టరట, డాక్టరు. బోడి డాక్టరు బయల్దేరింది. లాగండి బయటకు. తన్నండి."... మరొకరు.

"చేతులారా నా బిడ్డను తీసుకొచ్చి యీ ముదనష్టపుదాని చేతుల్లో పెట్టాను దేవుడోయ్: నాబిడ్డనీమహాతల్లి పాడు చేతుల్లో పెట్టటమే కొంపముంచింది దేవుడోయ్" ఒక ముసలమ్మ శోకాలు.

మహా వెల్లువలాంటి ఆవేశంతో, ఉద్రేకంతో అరుస్తున్నారు జనం. తెలివి తెచ్చుకుని ఏమిటో చూద్దామని బయటికి రాబోయిన వాసంతిని ఆపి గబగబ తలుపులు మూసాడు రామయ్య.

"అమ్మా! ఆ దరిద్రులంతా కలిసి జనాన్ని రెచ్చగొట్టి తీసుకొచ్చారు. మీరిలా వెనకదారిన వెళ్ళి కామాక్షమ్మగారింట్లో దాక్కోండమ్మా:" రామయ్య మాటలు వింటూ శిలలా నిల్చుండిపోయింది వాసంతి. బయటినుండి అరుపులు, తలుపుల్ని బాదుతున్న చప్పుడు...వాసంతి మెదడులోని ప్రతి అణువు చిట్లిపోతూంది. 'మోస్ట్ అన్ గ్రేట్‌ఫుల్ ఫెలోస్' మోస్ట్ అన్ గ్రేట్‌ఫుల్ ఫెలోస్' ఎక్కడినుంచో రాజా కంఠం అస్పష్టంగా వినిపిస్తూంది.

ఇంతలో అకస్మాత్తుగా కేకలు, బొబ్బలు ఆగిపోయాయి. కారొకటి సర్రున వచ్చి ఆగడం, 'ఆగండి. ముందు మీరంతా అవతలకు పొండి' అని ఆజ్ఞాపించి "వాసూ" అంటూ ఎలుగెత్తి పిలుస్తూ సంధ్యవచ్చి తలుపుతట్టడం. సంధ్య కంఠం విన్న రామయ్య తలుపు తీయడం, ఒక్క పరుగునవచ్చి సంధ్య వాసంతిని కౌగలించుకోవడం...క్షణంలో

జరిగిపోయింది. చలనంలేకుండా నుంచున్న వాసంతి డా.రమేష్ నచ్చజెప్పడంతో జనమంతా సణుక్కుంటూ, తిట్టుకుంటూఎటువాళ్ళటు వెళ్ళిపోవడం చూస్తూనే ఉంది.

"వాసూ, ఈ దుర్మార్గులు..." ఆవేశంతో ఆయాసపడుతున్న సంధ్య వంక నిర్జీవంగా చూస్తూంది వాసంతి. అప్పటికే ఆమెలోని 'దేవత' ఉరేసుకోవడానికి ఉద్యుక్తురాలవుతూంది.

## 20

వాసంతిలోని దేవతను బ్రతికించడానికే వచ్చాడా అన్నట్లుగా సుధీర్ ప్రత్యక్షమయ్యాడు. అక్కగారింటికి వచ్చి తిరుగుప్రయాణంలో వాసంతికి కనపడి పోదామని వచ్చిన సుధీర్ కొద్దినిముషాల ముందు జరిగిందేమిటో తెలుసుకున్నాడు.

"సుధీర్! ఈ రాక్షసులంతా కలిసి మా వాసూమీదకెలా వచ్చారో తెలుసా?" ఉద్రేకపడుతూ చెప్తున్న సంధ్యను గుర్తించనట్లుగా వాసంతివంక తపనగా చూసాడు సుధీర్. ఆమె హృదయంలో తగలబడిపోతున్న సుందరవనాల తాలూకు సెగలూ, పొగలూ అతనికి కనిపిస్తూనేవున్నాయి. కంపిస్తున్న ఆమె పెదవులు దాస్తున్నమాటలు అతనికి వినిపిస్తూనే ఉన్నాయి బాధతో, భయంతో, అసహ్యంతో ఈ లోకం వంక చూస్తున్న వాసంతిని తన చేతుల్లోకి తీసుకుని ఓదార్చాలనే కోరికను నిగ్రహించుకోలేక పోతున్నాడు.

"వాసంతిగారూ!" సుధీర్ పిలుపు వినగానే వాసంతిలోని దుఃఖం ఎగసివచ్చింది. తనని ప్రోత్సహించి, అడుగడుగునా అండగా నిలబడిన సుధీర్ ఎదుట తన ఓటమి నగ్నంగా నిలవడం భరించలేక పోతూంది.

"నేను ఓడిపోయాను సుధీర్‌గారూ!" ప్రపంచంలోని దీనత్వమంతా పోగుపడిందా మాటలో.

"ఇది ఓటమికాదు వాసంతిగారూ! మంచికి తగిలినదెబ్బ. ఇంత చిన్నదానికే ఓటమి అనుకుని నీరసపడిపోతే ఎలా? డాక్టర్లంతా రాక్షసులని తిట్టుకుంటున్న నాకు డాక్టర్లలోని మంచిని, మానవత్వాన్ని చూపించారు మీరు. సేవ, ప్రేమ, నిజాయితీలమీద విశ్వాసంతో వృత్తిని చేపట్టిన మీలాంటి దేవతల్ని దెబ్బమీద దెబ్బకొట్టి రాక్షసులుగా మార్చడం ప్రజల దౌర్భాగ్యం." సుధీర్‌వంక, వాసంతివంక ప్రతిమలా చూస్తూ వుండిపోయింది సంధ్య. తన కన్నీళ్ళు సుధీర్‌కి కనపడకుండా ముఖాన్ని ప్రక్కకు తిప్పుకుంది వాసంతి.

"ఎంతో చిత్తశుద్ధితో, ఎన్నో ఆదర్శాలతో వృత్తిలో, ఉద్యోగంలో ప్రవేశించే యువత తమ ఆదర్శాలను నిలుపుకోగలిగే పరిస్థితి లేకుండా చేస్తూందీ వ్యవస్థ. ఈవ్యవస్థను మార్చే శక్తి నాకు లేదు. కాని..మీరు మంచిని కోల్పోకుండా నేను కాపాడుకుంటాను. మీఆదర్శాలకనుగుణంగా మీరుబ్రతకడానికి నేను చెయ్యగలిగిన సహాయం తప్పకుండా చేస్తాను.నాకీ అవకాశాన్నివ్వండి వాసంతి గారూ!" వ్యవస్థ మారకుండా వ్యక్తుల ఔదార్యాలు, మంచితనాలు మనిషిని పతనపు జారుడురాళ్ళమీద దొర్లిపోకుండా నిలబెట్టగలవా?... ప్రత్యూషపవనాల్లా స్వచ్ఛంగా సాగిపోవలిసిన యువతరపు జీవితాల్ని కలుషితం చేస్తున్న విషవాయువుల్నుండి తనని కాపాడేశక్తి సుధీర్‌కి వుందా?!..తనలోని మనిషి మాయమవకుండా ఇతను అడ్డుకోగలడా?...ఆశగా, అభిమానంగా, కృతజ్ఞతగా సుధీర్ కళ్ళల్లోకి చూచింది వాసంతి.

# వెలుతురు పువ్వులు

చల్లని గాలితెర మెల్లగా లేచివచ్చి స్రవంతిని పలకరించింది. పుస్తకాల్ని గుండెలకు హత్తుకుని, వానిటీబాగ్‌ని భుజానికి తగిలించుకుని చకచకా నడుస్తూందామె. పొడవాటి జడ లయగా కదుల్తూంది. అలసటతో లోతుకు పోయిన కళ్ళు, ఆరని చెమటతో చికాగ్గా వున్న శరీరం, ఆకలితో, నిస్సత్తువతో ఇంక సహకరించమని సమ్మెచేస్తున్న కాళ్ళు, వేగంగా నడవాలనే పట్టుదల, వజ్రపు తునకలాంటి చూపు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చూస్తూంటే టైమెంత గడిచిపోయిందీ తెలియలేదు స్రవంతికి . 'అరగంటలో వచ్చేయాలక్కా', అని షరతుపెట్టి షాపులో కూర్చున్నాడు ప్రకాష్. చాలా టైమయిపోయింది. తనమీద కారాలూ, మిరియాలూ నూరుతూ వుండుంటాడు.

"అన్యాయం! అక్రమం!" శరత్ స్రవంతికి చేరువుగా వచ్చి అన్నాడు.

"మీరా?" స్రవంతి అతనివంక సంభ్రమంగా చూచింది.

"చెట్టంత మనిషిని ఎదురుగా వస్తే చూడనట్లు దాటుకుపోయి పిలిచినా పలక్కుండా పారిపోతున్నారా" అతని అభియోగం విని కళ్ళు పెద్దవిచేసింది స్రవంతి.

"ఎదురుగా వచ్చారా? ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"పదండి! పదండి!" స్రవంతి ప్రశ్నలు విని హడావిడి చేశాడు శరత్.

"ఎక్కడికండీ?' అయోమయంగా చూచింది స్రవంతి.

"పభుత్వాసుపత్రికి"

"ఎందుకు?" గాభరాగా అడిగిందామె.

"మీ కళ్ళను, చెవుల్ని క్షుణ్ణంగా పరీక్ష చేయిస్తాను. అవసరమైతే రేపీపాటికి దిగ్విజయంగా ఆపరేషన్ చేయించి..." శరత్ మాట పూర్తికాకుండానే దీర్ఘంగా నిట్టూర్చింది స్రవంతి.

"మీ గుండె మొదటినుంచీ పెద్దదేనా, లేక విదేశాలకు వెళ్ళాక ఆ వాతావరణానికి క్రమక్రమంగా పెరిగిందా?" తాపీగా అడిగిందామె.

"అదేం?" గుండెమీద చేతినుంచుకుని పరిశీలనగా చూసుకున్నాడతను.

"ఏం లేదు, మన ప్రభుత్వాసుపత్రులమీద ఇంత గొప్ప అభిప్రాయాలుంటేను. అవునూ! .... నాకిలాంటి శిక్షవేసే ఆలోచన... మీకు పుట్టిన బుద్ధేనా, లేక నా శత్రువులెవరైనా నా మీద పగతో పన్నిన పన్నాగమా?!" గంభీరంగా అడిగిందామె.

"చిన్న డౌటు"

"ఇంత కంజూస్ మహారాజా ఏమిటండీ మీరు? డౌటుక్కూడా మీ సొమ్మేదో పోయినట్లు 'చిన్న' ఏమిటి? అడిగేదేదో 'పెద్ద' డౌటే అడగాలిగాని. కమాన్! పరువుతక్కువగా 'చిన్న' డౌట్ అడక్క, 'పెద్ద' డౌట్ ఏమన్నా వుంటే అడగండి" వరమిచ్చే వేలుపులా పోజిచ్చింది స్రవంతి.

"ఓకె! ఓకె ! మన హోదాకు, దర్జాకు తగ్గట్టుగా అతి పెద్ద డౌటే అడుగుతాను. మీరు అజ్ఞాతంగా వున్న గొప్పడైలాగ్ రైటరా?" కుతూహలంగా స్రవంతివైపు చూశాడు శరత్. తమాషాగా భుజాలెగరేసి కంఠాన్ని సవరించుకుంది స్రవంతి.

"కాదు, అంతకంటే గొప్పదాన్ని" అతిశయంగా చూచిందామె.

"అంటే?...."

"కవి సమ్మేళనాలకు, సాహత్య సమావేశాలకు, సారీ, సాహిత్య

సమావేశాలకు తప్పకుండా హాజరయ్యే ఉత్తమోత్తమురాల్ని. నా ప్రతిభకు, ఓర్పుకు మెచ్చి 'కాకర' వారు నాకు కనకాభిషేకం చేయదలచుకున్నట్లు టౌనంతా మారుమోగిపోతూంది" పెదాలు బిగబట్టి నవ్వింది స్రవంతి.

" 'కాకర' అంటే? కాకరకాయ ! ప్చ్ ! ఏమిటో !" అర్ధంకాక తలగోక్కున్నాడు శరత్.

"అమెరికా వెళ్ళినా తలగోక్కునే అలవాటు పోనందుకు నా సంతాపాన్ని ప్రకటిస్తున్నాను. 'కాకర' అంటే 'కాకరకాయ' అని అర్ధం చేసుకున్న మీ అజ్ఞానానికి బహు చింతిస్తున్నాను 'కాకర' అంటే 'కాకినాడ కవులు, రచయితలు'." నవ్విందామె.

"ఐతే మీక్కూడా వేపకాయంత ఉందన్నమాట!"

"ఏమిటి? వెర్రా?!" గలగలా నవ్వింది స్రవంతి.

"పదండి, పదండి. " తొందరచేసాడు శరత్.

" ఎక్కడకు మహానుభావా!" సందేహంగా చూచిందామె.

"చుట్టూ ఓ సారి చూడండి. ఎంతమంది మనవైపు చూస్తున్నారో! కాసేపాగితే ట్రాఫిక్ జామ్ అయే ప్రమాదం ఉంది. 'ఒక యువతి, యువకుడు ట్రాఫిక్‌ని నిలిపిన ఉదంతం' అంటూ రేపు పేపర్లో వచ్చే అవకాశం కూడా ఉంది. సో... తక్షణం మనమిక్కడనుండి కదలాలి".అతని మాటలు విని చుట్టూ చూసింది స్రవంతి. ఎవరి గొడవలో వాళ్ళు హడావుడిగా వెళ్తున్నారు.

"పదండి" శరత్ స్రవంతి చేతినందుకోబోయి, ఆమె ముఖం చూచి సంకోచంగా వెనక్కు తీసుకున్నాడు చేతిని. ఆమె సాన్నిధ్యంలో తను పొందుతున్న ఉద్వేగం కొత్తగా వుందతనికి. తన స్వభావానికి భిన్నంగా స్రవంతి సమక్షంలో తనకింతవరకు అనుభవంలోలేని అలజడికి లోనవుతున్నాడు. ఆమె మాటలకు తన ప్రతిస్పందన కొత్తగా ఉంది.

ఇప్పటి వరకు ఎంతోమంది ఆడపిల్లలతో పరిచయం, స్నేహం, సాన్నిహిత్యం ఉన్నాయి తనకు. కాని ఈ అమ్మాయి తనలో కలిగిస్తున్న సంచలనం అపూర్వంగా వుంది. ఆమె చూపులు మెరుపు తునకల్లా తాకి తనలో చైతన్యాన్ని నింపుతున్నాయి. ఆమె మాటలు తనలో చిత్రమైన కదలికను రేపుతున్నాయి. ఆమెతో తన మొట్టమొదటి పరిచయం కళ్ళముందు కదిలింది.

***

ప్రియురాలి సమక్షంలో వున్న యువకుడిలా ఉత్సాహంతో వెలిగిపోతున్నాడు సూరీడు. ఓవర్ బ్రిడ్జి మీదనుంచి వేగంగా క్రిందకు పరుగెత్తుతూంది రిక్షా. శబ్దం వినిపించి వెనక్కు తిరిగి చూచిన రిక్షావాలా కంగారుగా సడన్ బ్రేక్ వెయ్యబోయాడు. బ్రేకులు పడక మరింత కంగారుపడి, మరుక్షణం జరగబోతున్న ఉపద్రవాన్ని ఊహించి ఊపిరి బిగబట్టాడు. రెప్పపాటులో మెరుపులా మరో రిక్షాలోంచి దూకిన శరత్ రిక్షాలోంచి కిందకు ఒరిగిపోతున్న స్రవంతిని ఒకచేత్తోను, రిక్షాను మరోచేత్తోనూ పట్టుకున్నాడు. కొన్ని గజాలు రిక్షాతో పాటు క్రిందకు పరుగెత్తాక రిక్షా ఆగింది.

"ఎంత గండం తప్పించారుబాబూ! ఆయమ్మ కింద పడిపోయిందనే అనుకున్నాను" పెద్ద ఆపద తొలిగినట్లు విప్పారింది రిక్షావాలా ముఖం.

"ఎవరీ అమ్మాయి? ఎక్కడికి వెళ్తూంది?" స్రవంతిని రిక్షా సీటుమీద కూర్చోబెట్టడానికి ప్రయత్నిస్తూ అడిగాడు శరత్. మగతగా వాలిపోతున్నాయి స్రవంతి కళ్లు. సన్నగా కంపిస్తున్నాయామె పెదాలు, శక్తిలేనట్లు వేలాడిపోతూందామె శరీరం.

"ఏమో బాబూ! ఆస్పటల్ దగ్గరెక్కింది. వంద బిల్డింగుల కాడికి బేరమాడింది" అన్నాడు రిక్షావాలా. అంతలో చోద్యం చూడడానికి జనం

చుట్టూ పోగవుతున్నారు.  చటుక్కున రిక్షా ఎక్కి కూర్చున్న శరత్ ఆమె తలను ఒడిలో పెట్టుకుని పడిపోకుండా ఆమెను చేత్తో చుట్టి రిక్షాను పోనిమ్మన్నాడు.  వింతగా చూస్తున్న జన్నాన్ని తప్పించుకుని రిక్షా ముందుకు కదిలింది.

బలవంతాన కనురెప్పలు విప్పి అతనివంక చూచిన స్రవంతి కళ్లు అంతలోనే మూసుకుపోయాయి.  పద్మప్రియ టాకీస్ ముందు రిక్షా ఆపించి స్రవంతి ముఖంమీద చల్లటినీళ్ళు చిలకరించి వేడివేడి కాఫీ పట్టించాడు. అంతవరకు మంచుముద్దలా ఉన్న స్రవంతి శరీరంలో కొంచెం చలనం వచ్చింది.  తానో అపరిచిత యువకుడి చేతుల్లో ఉన్నానని గుర్తించి నిటారుగా కూర్చోవడానికి  ప్రయత్నించింది.

"పరవాలేదు.  తలనిలా వుంచండి" పసిపాపలా అమాయకంగా వున్న ఆమె ముఖంలోని సంకోచాన్ని గమనించి ఓదార్పుగా చూచాడు శరత్.

"బాబూ! ఈ అమ్మాయిగారు అక్కడ ఆడుకుంటున్న పిల్లలకు తెలుసేమో, ఇల్లెక్కడో కనుక్కునివొస్తాను" వంద బిల్డింగుల దగ్గరకొచ్చాక రిక్షా ఆపి, పిల్లల దగ్గరకు వెళ్లి వాకబుచేశాడు రిక్షావాలా.పిల్లలంతా కుతూహలంగా చూస్తూ రిక్షాదగ్గరకు బిలబిల పరుగెత్తుకొచ్చారు.

"ఈ అక్క మాకు తెలుసు. రండి ఇల్లు చూపిస్తాం" ముందుకు దారితీసారు పిల్లలు.

రిక్షాలోంచి దింపబోతుంటే భళ్ళున వాంతిచేసుకుంది స్రవంతి.  తను ఆదుర్దాలో ఆలోచించకుండా ఆమెను ఇంటికి తీసుకొచ్చాడేమొ, నేరుగా హాస్పటల్‌కు తీసుకువెళ్తే బావుండేదేమోననిపించింది శరత్‌కి.

"అయ్యో! ఏమయిందే?" ఆదుర్దాగా ఒక్క అంగలో బయటికి వచ్చి కూతుర్ని పొదివిపట్టుకుని లోపలికి నడిపించింది దమయంతి.  మంచం

వాల్చి స్రవంతిని పడుకోబోట్టి శరత్‌వంక ఒక్క క్షణం సందేహంగాచూచి,సర్దుకుని లోపలికి ఆహ్వానించింది.

“రండిబాబూ! కూర్చోండి” కుర్చీ చూపించింది. విసనకర్రతో విసురుతూ దిగులుగా కూతురివంక చూచింది దమయంతి. ఇరవై రోజులుగా స్రవంతి నలతగా వుంటూంది. తరచు అన్నం హితవు కావడంలేదని మానేయడం, నీరసంగా వుండడం, అలాగే ఓపిక చేసుకుని షాపుకు వెళ్లొస్తూంది.

లోపలి గదిలోంచి స్రవంతి తండ్రి రాంబ్రహ్మం పెద్ద కంఠంతో ఏం జరిగిందో అడుగుతున్నాడు.

‘ఏం లేదు. మీరు పడుకోండి” విసుగ్గా, కరుగ్గా జవాబిచ్చింది దమయంతి. పక్షవాతంతో మంచానికి అంకితమైపోయిన రాంబ్రహ్మం అన్నీ తెలుసుకోవాలనే ఆరాటాన్ని తగ్గించుకోలేకపోతున్నందుకు ఆమె చిరాకు పడింది

శరత్ పరిసరాల్ని గమనిస్తూ కూర్చున్నాడు. క్రింది మధ్యతరరగతి వాతావరణం, ఉన్నంతలో నీట్‌గా సర్ది వుంచిన గది. లేత నీలంరంగు చీర చింపి కుట్టిన కర్టెన్లు. అందమైన ప్రకృతి దృశ్యం ఉన్న కాలెండర్ గోడన వేలాడుతూంది....హఠాత్తుగా ‘తానింకా ఇక్కడెందుకు కూర్చున్నట్లు?’ అనిపించింది శరత్‌కి. ఈ అమ్మాయిని వాళ్లమ్మగారికి అప్పగించడంతో తనంత తాను స్వీకరించిన బాధ్యత తీరిపోయింది. కాని... అందం, ఆకర్షణ కలబోసిన ఈ అమ్మాయి పేరేమిటోకూడా తెలుసుకోకుండా ఎలా వెళ్లడం?!

“బాబూ! మా అమ్మాయి... ” దమయంతి అడగబోయిన ప్రశ్న అర్ధమయింది శరత్‌కి. ఆమెకు ఆఅమ్మాయిని తనే పరిస్థితిలో, ఎక్కడ చూసాడో వివరించాడు. సమయానికి అతను చేసిన సహాయానికి

కృతజ్ఞతతో చెమ్మగిల్లాయామె కళ్లు.

"అమ్మా!" బరువుగా కళ్లెత్తింది స్రవంతి. ఏదో జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్లు చుట్టూ చూస్తున్న స్రవంతి దృష్టి శరత్‌మీద ఆగింది.

"థాంక్‌యూ" అందామె మెల్లగా.

"మీరు రెస్ట్ తీసుకోండి" లేచి కూర్చోబోతున్న స్రవంతిని వారించాడు శరత్.

"ఏమయిందమ్మా?" కూతుర్ని అడిగింది దమయంతి.

"ఏం లేదమ్మా! కొంచెం నీరసం, అంతే" ఓపిక తెచ్చుకుని కూర్చుంది స్రవంతి. ఆమె సమాధానం విని తనలో తాను గొణుక్కుంటూ లోపలికి వెళ్లింది దమయంతి.

"మరి నేను వెళ్తాను" ఇంక తనక్కడ వుండడం భావ్యంగా వుండదని లేచాడు శరత్.

"ఒక్క నిమిషం. కొంచెం కాఫీ తీసుకువెళ్దురుగాని"

"ఇప్పుడేం వద్దు. మీరు రెస్ట్ తీసుకోండి. నేను వెళ్తాను" అన్నాడు కాని శరత్ లేవలేదు. అందం, ఆకర్షణను మించి మరేదో వుందామెలో. చిత్రమైన కాంతితో వెలుగుతున్న ఆమె కళ్లలోకి చూస్తూ మరికాసేపు మాట్లాడాలని, మామూలు ఆడపిల్లలకంటే ప్రత్యేకంగా కనిపిస్తున్న ఆ అమ్మాయితో పరిచయాన్ని వృద్ధి చేసుకోవాలనీ వుంది శరత్‌కి.

తను సీటుమీదనుండి క్రిందకు జారిపడడం, రిక్షాలోంచి రోడ్డుమీదకు పడిపోకుండా విశ్వ ప్రయత్నం చెయ్యడం, అంతలో రెండు బలమైన చేతులు తనని పొదవిపట్టుకోవడం లీలగా గుర్తొస్తూంది స్రవంతికి.

"సమయానికి మీరాదుకున్నారు. లేకపోతే ఈ పాటికి మార్చురీలో వుండేదాన్ని" నవ్వింది స్రవంతి.

"అంత తొందరగానా?" గంభీరంగా చూచాడు శరత్. అర్థంకానట్లు కళ్ళు విశాలం చేసి అతనివంక చూచింది స్రవంతి.

"ఏంలేదు. పోలీసులు, హాస్పటల్, డాక్టర్లు, ఎంతో తతంగం జరిగాక కదా మార్చురీ మజిలీ అని" అంతలోనే తను అతి చనువు ప్రదర్శిస్తున్నానేమోననే అనుమానం కలిగింది శరత్‌కి.

"ఓహ్! అదా!" గలగలా నవ్వింది స్రవంతి. అంతలో మళ్లీ కళ్లు తిరిగినట్లయి కళ్ళు మూసుకుని అరచేత్తో నుదుటిమీద రుద్దుకుంది.

"అసలేమయింది? జ్వరం వచ్చిందా?"

"లేదు. మత్తు ఇంజక్షన్ ప్రభావం." తక్కు వ స్వరంతో చెప్పింది స్రవంతి.

"మత్తు ఇంజక్షనా? ఎందుకు?" ఆశ్చర్యంగా తనలో తాను అనుకున్నాడు శరత్. అంతలోనే దమయంతి అక్కడికి రావడంతో శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

***

"ఏమిటండీ అలా సైంటిస్ట్ ముద్రలోకి వెళ్ళిపోయారు?" స్రవంతి ప్రశ్నతో శరత్ ఆలోచనల గొలుసు తెగిపోయింది.

"అబ్బే ఏంలేదు. అవునూ...మనమలా హోటల్‌కి వెళ్ళి ఓ కప్పు కాఫీ సేవిస్తే ఎలా వుంటుందంటారు?" స్రవంతికి షాపులో తనకోసం ఎదురుచూస్తున్న తమ్ముడు గుర్తుకొచ్చాడు. కాని అలసిన శరీరం, చికాగ్గా ఉన్న మనసు మార్పును కోరుకుంటున్నాయి. చురుగ్గా, సరదాగా వుండే శరత్ సమక్షంలో కొంతసేపు గడిపి ఉత్సాహాన్ని నింపుకోవాలని ఉందామెకు.

"బ్రహ్మాండంగా వుంటుందంటాను. పదండి. ఎప్పుడో ఫ్రెండ్స్‌తో

కలసి వెళ్ళేదాన్ని. కాలేజీలో వున్నప్పటి కమ్మటి అనుభవం అది”

స్రవంతి మనసు జ్ఞాపకాల పొరలను చొచ్చుకొని పోసాగింది.

***

పాయలై ప్రవహించే గోదావరి జలాలు, కన్నుతిప్పి ఎటుచూచినా కనిపించే పచ్చదనం, కొబ్బరితోటలు... వీటిమధ్య స్రవంతి బాల్యం హాయిగా గడచిపోయింది.

వరుసగా నాలుగేళ్లు ప్రకృతి చల్లని చూపు చూసేసరికి రాంబ్రహ్మం ఇల్లు, దొడ్లు సమృద్ధిగా పాడి, పంటలతో నిండిపోయాయి. అప్పటికే సీలింగ్‌ని మించిపోయేంత భూమి ఉండడంవల్ల అతనికి కొత్త ఆలోచన వచ్చింది. టౌన్‌కు వెళ్లి ఏదైనా వ్యాపారం పెడితే ఇటు సంపదా అభివృద్ధి అవుతుంది, అటు పిల్లలకు కాస్త చదువు, సంధ్యలు చెప్పించుకోవచ్చునన్న ఆలోచనతో మకాం కాకినాడకు మార్చారు. లంకంత ఇల్లు, గొడ్లు, తోటలు, పల్లెటూరి వసతుల్ని వదులుకుని పట్నంలో చాలీ చాలని అద్దె కొంపల్లో, పిలిస్తే పలికే దిక్కులేకుండా టౌనులో కాపరం పెట్టడానికి మొదట్లో దమయంతి ఒప్పుకోలేదు. పిల్లల చదువు గురించి వెళ్లక తప్పదని రాంబ్రహ్మం నచ్చచెప్పాక, స్వంత ఇల్లు కట్టించే షరతుమీద ఒప్పుకుంది. అప్పటికప్పుడు గాంధీనగరం ఒంటి మామిడి జంక్షన్ దగ్గరలో స్థలంకొని ముందు అద్దె ఇంట్లో దిగారు. సంవత్సరంలో స్వంత ఇల్లు తయారయింది.

కాకినాడకు మకాం మారేప్పటికి స్రవంతి నాలుగు, స్రవంతి అక్క సుబ్బలక్ష్మి ఆరు, తమ్ముడు రెండవ క్లాసులో వున్నారు. పట్నం రొద అంతగా లేకుండా, ప్రశాంతంగా, తమ ఊళ్ళో వున్నట్లే వుండడంవల్ల త్వరగానే కొత్తవాతావరణానికి అలవాటు పడిపోయారు.

“పిల్లల్ని ఇంగ్లీషు బడిలో వెయ్యండి. ప్రక్కింటి లాయరుగారి పిల్లలు

ఎంత ముద్దుగా మాట్లాడుతున్నారో ఇంగ్లీషు!" ముచ్చటగా చెప్పింది దమయంతి.

"అప్పుడే పట్నంగాలి సోకిందే!" భార్యను పరిహాసం చేసాడు రాంబ్రహ్మం.

"నాన్నా! నేను బ్లూ యూనిఫామ్ బళ్ళో చేరతాను". తండ్రివంక ఆశగా చూచింది స్రవంతి. పిల్లలకు ధారాళంగా ఇంగ్లీషు చదవనూ, రాయనూ నేర్పడానికి ఆంగ్లో ఇండియన్ టీచర్‌ని మాట్లాడాడు రాంబ్రహ్మం.

"అలాగేనమ్మా!" మురిపెంగా కూతురివంక చూచాడు రాంబ్రహ్మం. స్రవంతి పుట్టాకే తనకు కలిసొస్తూందని అతని నమ్మకం. అందుకే 'ధనలక్ష్మి' అని పేరు పెట్టాడామెకు. స్రవంతి ఎనిమిదో క్లాసుకి వచ్చేసరికి 'ధనలక్ష్మి' అని ఎవరైనా పిలిస్తే చాలు, ఆమెకు ఒంటిమీద తేళ్ళూ, జెఱ్ఱులూ పాకుతున్నట్లుండేది. పిలుపు వినగానే దెబ్బతిన్న నాగినిలా అసహనంగా చూచేది.

"ఇంకేం పేరూ దొరకనట్టు ధనలక్ష్మంట, ధనలక్ష్మి, ఇంకానయం, గజలక్ష్మి అనిపెట్టారు కాదు. ఎంత మంచి మంచి పేర్లున్నాయి... స్వప్న, కవిత, చందన, శిరీష... లెక్కలేనన్ని అందమైన పేర్లున్నాయి. ఒక్క వినసొంపైన పేరుకూడా దొరకలేదా మీకు నాకు పెట్టడానికి?" తల్లి దండ్రులమీద మీద ఇంతెత్తున లేచింది స్రవంతి.

"చదువు, సంధ్య లేనివాళ్ళం, పల్లెటూరి మొరటువాళ్ళం, మాకాపేర్లన్నీ ఎలా తెలుస్తాయమ్మా?" అనునయంగా కూతురి వంక చూచాడు రాంబ్రహ్మం.

"ఆపేరు వింటూంటేనే నాకు కంపరంగా ఉంది. నేను పేరు మార్చేసుకుంటాను" దృఢంగా చెప్పింది స్రవంతి.

"అదెలా జరుగుతుందమ్మా?ఐనా పేరుమారిస్తే ఎలా?" ధనలక్ష్మి పేరు తీసేస్తే తన దగ్గర్నుండి ధనలక్ష్మి పారిపోతుందేమోనన్నంత గాభరాగా అడిగాడు రాంబ్రహ్మం.

"ఈ సంవత్సరం అయిపోయాక మెట్రిక్‌కి వెళ్తాను. అప్పుడు మార్చేసుకుంటాను.... పేరు మారిస్తే ఎలా ఏమిటి? పేరు మారిస్తే కొంపలేమన్నా అంటుకుపోతాయా?" కూతురి పట్టుదల తెలిసిందే గనుక మరేం మాట్లాడలేదు రాంబ్రహ్మం. కాని ధనలక్ష్మి అన్న పేరును తీసేయడమంటే అతనికి కష్టంగానే వుంది.

తరువాత బాగా ఆలోచించి, పుస్తకాలు తిరగేసి, అందమైన పేరును సెలక్ట్ చేసుకుని పేరు మార్చుకుంది. ఇంట్లోనూ,బయటా అందరితో దెబ్బలాడిమరీ 'ధనం' అన్న పిలుపును మానిపించి 'స్రవంతీ' అన్న పిలుపును అలవాటు చేసింది.

స్రవంతికి మెట్రిక్ అయేసరికి సుబ్బలక్ష్మికి సంబంధాలు చూస్తున్నారు. సుబ్బలక్ష్మికి మెడిసిన్ చదవాలని ఉంది. ఇంటర్‌లో మంచి మార్కులొచ్చాయి కాని ఎంట్రన్స్‌లో సీటు రావడం కొద్దిలో తప్పిపోయింది. అంతలో బాగా డబ్బున్నవాళ్ళ సంబంధం కలిసొచ్చిందని చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టించి పెళ్ళిచూపు లేర్పాటు చేసారు.

చదువుకుంటానని గట్టిగా తల్లిదండ్రులకు చెప్పలేక తనలో తాను మథనపడుతూంది సుబ్బలక్ష్మి.

"ఇంత నోరులేని పెద్దమ్మవేమిటే? ఇప్పుడే పెళ్ళేమిటి నీకు? ఎంట్రన్స్‌లో సీటు రాకపోతే కొంపమునిగిపోయినట్లు ఇంక చదువే మానేయాలా? బి.ఎస్.సి. చదువు. పోనీ, నీకు మెడిసినే చదవాలనే ప్రతిజ్ఞ వుంటే, వాడికెవరికో ముక్కూ, మొహం తెలియనివాడికిచ్చేదాన్లో నాలుగోవంతు ఖర్చుపెడితే రంగరాయ మెడికల్ కాలేజిలో డొనేషనూ

కట్టొచ్చు, ఆరు సంవత్సరాల చదువూ అయిపోతుంది.” అక్కకు హితబోధ మొదలుపెట్టింది స్రవంతి.

“నీకులాగా నాన్న ముందు నేను మాట్లాడలేనే. ఆయన కుర్చీ, చేతి కర్ర, చుట్ట చూస్తేనే నా గుండెలదిరిపోతాయి”. తమ మాటలు ముందుగదిలో వున్న తండ్రి ఎక్కడ వింటాడోనన్న జంకుతో భయంగా ద్వారంవైపు చూచింది సుబ్బలక్ష్మి.

“నీ పిరికితనం చూస్తూంటే నాకు ఒళ్ళు మండిపోతూంది. చదువుకుంటానంటున్నావుగాని మరో పాడుపని చేస్తాననడం లేదుగా?!... అక్కా! మనకు కావలసిందేమిటో ముందు మనం తేల్చుకోవాలే. తేల్చుకున్నాక హరిహరాదులు అడ్డమొచ్చినా దాన్ని సాధించుకోవడానికి పోరాడాలి.”

“నిజమేననుకో!... ” నసిగింది సుబ్బలక్ష్మి,

“నీకు మెడిసిన్ చదవాలని గట్టిగా వుందాలేదా? ముందిది చెప్పు”

“వుంది. వుండేం లాభంలే.” నిరాశగా జవాబిచ్చింది సుబ్బలక్ష్మి.

“అలా జావగారిపోకు. నేనూ నీతో వస్తాను. పద, నాన్నెందుకు ఒప్పుకోరో చూస్తాను.” బలవంతాన సుబ్బలక్ష్మిని తండ్రి దగ్గరకు లాక్కెళ్ళింది స్రవంతి.

“మంచి సంబంధమమ్మా! అన్నివిధాలా అనుకూలంగా ఉంది. మనకి అందుబాటులో ఉన్న సంబంధమొచ్చినప్పుడు భారం తీర్చుకుంటే మంచిదికదా!” కూతురి వాదనవిని నచ్చజెప్పబోయాడు రాంబ్రహ్మం.

“ఏమిటి నాన్నా!! అంతభారంగా వున్నామామేము?!” ఛర్రున లేచింది స్రవంతి.

“ఒక వయసొచ్చాక ఆడపిల్లలు భారమేకదమ్మా!”

“మీ పాత చింతకాయ కబుర్లు కట్టిపెట్టండి నాన్నా! అక్క

చదువుకుంటా నంటూంది. మంచి మార్కులు తెచ్చుకుంది. మెడిసిన్ చదివించండి. ఈ సంవత్సరానికెలాగూ టైమయిపోయింది. వచ్చే సంవత్సరం మెరిట్‌లోనే వస్తుందేమో సీటు?!... ఒకవేళ రాకపోయినా, మీదగ్గర డబ్బుకు కొదవా? డొనేషన్ కట్టండి." స్రవంతి మూడ్ చూచి ఇంక నచ్చచెప్పినా లాభం లేదనుకుని మౌనంగా వుండిపోయాడు రాంబ్రహ్మం. మౌనాన్ని అంగీకారంగా భావించి సంతోషంగా అక్కడినుండి వెళ్ళిపోయింది స్రవంతి.

మరునాడు పెళ్ళిచూపుల కార్యక్రమం యధావిధిగా జరగడం చూచి మండిపడింది స్రవంతి. పెళ్ళిచూపులకు తయారవమని సుబ్బలక్ష్మికి నయానా, భయానా నచ్చచెప్తున్న దమయంతి స్రవంతి దూకుడు చూచి చివాట్లేసింది.

"నీకు ఉన్న మతికూడా పోతూందే. పెద్దమనుషుల్ని పిల్లను చూడడానికి రమ్మని పిలిచి ఆఖరి నిమిషంలో రావద్దని కబురు పెడ్తే ఏమనుకుంటారు? పరువు, మర్యాద ఉన్నవాళ్ళు చేసే పనేనా అది? అసలిప్పుడిది పెళ్ళి చేసుకుంటానికేమిటి అడ్డంకి? .... పెళ్ళీడురాలేదా? ... లేనిపోనివన్నీ ఎక్కించి దాన్ని నువ్వే చెడగొడ్తున్నావు." తల్లి తిట్లువిని స్రవంతి ముఖం ఎర్రబడింది. తండ్రిదగ్గర మాట్లాడినంత ధాటిగా తల్లిదగ్గర మాట్లాడే చనువులేక ఆయనదగ్గరే అసలు విషయం తేల్చేయాలని ముందుగదిలోకి వచ్చింది. అప్పుడే పెళ్ళివారిని ఆహ్వానించి లోపల కూర్చోబెడుతున్నాడు రాంబ్రహ్మం. చేసేది లేక కోపాన్ని నిగ్రహించుకుంటూ లోపలికొచ్చింది.

అప్పటిదాకా చదువుకుంటానన్న సుబ్బలక్ష్మి పెళ్ళి చూపులయాక 'మీ యిష్టం నాన్నా' అనేసింది సిగ్గుపడుతూ. ఆ అమ్మాయి జవాబు విని మరీ హీటెక్కిపోయింది స్రవంతి.

"నీ లాంటి దానికోసం పోట్లాడి అనవసరంగా నేను చెడ్డదాన్నయానే! పెళ్ళంటే అంత ఉబలాటపడుతున్న దానివి చదువుకుంటాననే ఏడుపెందుకు?... బుద్ధొచ్చింది. బాగా బుద్ధొచ్చేలా చేసావు. నీలాంటి గోడమీద పిల్లుల గురించి పెద్దపెద్ద ఆశలు పెట్టుకుని ఎనర్జీ వేస్టు చేసుకుంటూ పోట్లాడడం వెర్రి తనమని తెలిసేలా చేసావు." స్రవంతి సాధింపు విని నవ్వింది సుబ్బలక్ష్మి.

"చేసిన ఘనకార్యం చాలక యింకా చిదానందంగా నవ్వులు చిందిస్తున్నావా?... అవున్లే చదువుకుంటే ఏమొస్తుంది? పెళ్ళిచేసుకుని సంవత్సరానికో పిల్లనుకంటూ 'సంతానరత్న' బిరుదును సంపాదించుకో" చిరాగ్గా చూచింది స్రవంతి.

"తప్పయిపోయిందని లెంపలేసుకుంటున్నానే. ఇంకవదిలేయ్. చదువు గురించి అమ్మా, నాన్ననెలాగూ ఒప్పించగలననే నమ్మకం లేదు నాకు. ఇంక నచ్చిన వరుడినెందుకు కాదనాలని..." నవ్వుతూనే చెప్పసాగింది సుబ్బలక్ష్మి.

"తనమీద తనకు నమ్మకం లేనివాడికాదేవుడు కూడా సహాయం చెయ్యలేడు, ఇంకెందుకులే! బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పుస్తకాలవతలకి విసిరేసి పట్టు చీరలు, నగలు సెలక్ట్ చేసుకో." సుబ్బలక్ష్మి ధోరణి చూస్తూంటే స్రవంతికి తిక్కపుట్టుకొస్తూంది.

ఎంత అవలీలగా మారిపోతారో ఈఆడపిల్లలు! అప్పటిదాకా 'ఇప్పుడప్పుడే నాకు పెళ్ళేమిటి? నా పెళ్ళికేం తొందరొచ్చింది? నేను ఛస్తే ఇప్పుడు పెళ్ళిచేసుకోను... మీరు పెళ్ళిచూపులకు మాటిచ్చి వచ్చారు గనుక, కేవలం మీ పరువు నిలపడం కోసం వాళ్ళముందు కూర్చుంటానే తప్ప పెళ్ళికి మాత్రం ఒప్పకోను.' వగైరా డైలాగులు వల్లించిన వాళ్ళే పెళ్ళికొడుకు కాస్త కంటికి నదరుగా, మంచిగా కనబడితే చాలు,

మంత్రిమేసినట్లుగా మారిపోయి "మీయిష్టం" అని సిగ్గుపడుతూ చెప్తారు. అప్పటిదాకా తాము పేర్చుకుంటున్న కోరికలు, చదువు, ఉద్యోగం, స్వశక్తితో బ్రతకడం, అన్నిటినీ క్షణంలో మరచిపోయి పెళ్ళి, సంసారం, పిల్లల గురించి అందమైన కలలు కనడం మొదలుపెడతారు... అందమైన కలల్ని కనడం తప్పని తన ఉద్దేశ్యం కాదు. తన అభ్యంతరమల్లా అవి అకాలంలో జరగడమే. చదువు, ఉద్యోగం, సంపాదనపరురాలవడం ఎంత అవసరమో గుర్తించకుండా ఆత్రంగా, ఆలోచన లేకుండా, రైలెక్కడ వెళ్ళిపోతుందోనని ఆదుర్దాపడుతూ హడావుడిగా కంపార్ట్‌మెంట్‌లోకి జొరబడే ప్రయాణికుడిలా సంసారజీవితంలో ఎందుకు కాలూనాలి? నిలబడడానికి శక్తి సంపాదించుకోకుండా, ఎవరి దయాధర్మాల ఆధారంతోనో నడవడానికి ప్రయత్నించడం తెలివి తక్కువకాదూ?! శక్తిహీనుడిని శక్తిగలవాడు చులకన చేయడం, ఎడమ కాలితో నెట్టడం, అతని జీవితాన్ని తన యిష్టం వచ్చినట్లుగా శాసించడం అనాదిగా జరుగుతూనే వుంది. నిలబడడానికి, నడవడానికి, పరుగెత్తడానికి తనంత తాను శక్తిని సంపాదించుకోవాలి తప్పితే, అసమర్థతతో, నీర్వీర్యతతో జీవిత పర్యంతం పరాధీనపు బ్రతుకు బ్రతకడవెందుకు?... ఆలోచించడం, తర్కించడం అప్పుడప్పుడే నేర్చుకుంటున్న స్రవంతి ఆవేశంతో ఊగిపోయింది.

స్రవంతి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సుబ్బలక్ష్మి పెళ్ళి ఉన్నంతలో వైభవంగా జరిగిపోయింది. వెంటనే భర్త వెంట అత్తవారింటికి వెళ్ళిపోయింది.

"అక్క డాక్టరవాలని కలవరించావుకదా, నువ్వు చదవరాదు ఆ చదువేదో!" అన్నాడు రాంబ్రహ్మం.

"నేను చదవను. నాకు ఇంట్రస్ట్ లేదు." అంది పుల్లవిరిచినట్లుగా స్రవంతి.

“దీందంతా ఎతిమతమండి. సుబ్బుకోసం మనతో యుద్ధం చేసింది. తనను చదవమంటే ఇంట్రెస్ట్ లేదట ఇంట్రెస్ట్!!” తల్లిసాగదీయడం విని చిర్రెత్తుకొచ్చింది స్రవంతికి.

ఆ శవాలు, రోగాలు, ఆపరేషన్లు, ఇంజక్షన్లు అంటే ఎలర్జీ తనకు. ఆసక్తి లేని వాళ్ళను బలవంతాన చదివించాలని చూడడం, ఆసక్తి ఉన్నవాళ్ళ కోరికను చంపేయడం.... ఎప్పుడు మారతారీ పెద్దాళ్ళు!!

అప్పటివరకు ఆడపిల్లల స్కూల్‌లో చదివిన స్రవంతికి ‘కో ఎడ్యుకేషన్’ కాలేజీ జీవితం థ్రిల్లింగ్‌గా వుంది. ఆడపిల్లలు, మగపిల్లలు ఒకర్నొకరు ఆకర్షించాలని తాపత్రయపడడం, అందరూ కలిసి మాస్టార్లని ఏడిపించడం, కొంటె కామెంట్స్, చిలిపి అల్లర్లు, నవ్వుల జల్లులు, కొత్తలోకంలోకి వచ్చినట్లుగా ఉంది.

కాని అప్పుడప్పుడూ అబ్బాయిలు కూసే కారుకూతలు, అసభ్యకరమైన చూపులు బాధాకరంగా వున్నాయి. వాటినన్నిటినీ తలవంచుకుని సహించి, సర్దుకుపోయి, గొడవలేమీ లేకుండా మంచి బాలిక సీతలా వుండమని ఇంటా, బయటా అందరూ చెప్తూంటే స్రవంతి శరీరం దహించుకు పోతూంది.

స్రవంతికి రకరకాల ఫాషన్ డ్రెసెస్ వేసుకోవడమంటే యిష్టం. మాక్సీలు, పంజాబీ డ్రెసెస్, జీన్స్, చీరలు, లంగా ఓణీలు.... అన్ని రకాలు వేసుకుంటుంది. ఓ రోజు పంజాబీ డ్రెస్ వేసుకుంది. మెడను చుట్టిన వల్లెవాటు వీపుమీదగా జీరాడుతోంది. స్రవంతి క్లాసునుంచి బయటకి వస్తూంటే పల్లెవాటును వెనుకనుంచి పట్టుకున్నాడొక అల్లరివాడు. గిర్రున వెనక్కు తిరిగిన స్రవంతి ముఖం చూచి గబుక్కున వదిలేయబోయాడు.

“వదిలేస్తావేం? పట్టుకో. నేను రాణీని. నువ్వు భృత్యుడివి. నావెనకే రా.” స్రవంతి మాటలు విని అల్లరివాడికి, అతని ఫ్రెండ్స్‌కి వెంటనే నోట

మాటరాలేదు.  విసవిస నడిచి వెళ్ళిపోతున్న స్రవంతిని, ఎగతాళిగా నవ్వుతున్న ఆమె మిత్రబృందాన్ని చూచి ఉక్రోషంతో ఉడికిపోయారు.

"చెప్పుతీసి చెంపమీద కొట్టినట్లుగా అన్నావే. బుద్ధొస్తుంది వెధవకి" రోజూ వాళ్ళతో ఏదో ఒక మాట అనిపించుకుంటున్న పద్మ కసిగా అంది.

"అనవసరంగా వాళ్ళతో గొడవెందుకే?" గీత భయపడుతూ అంది.

"ఎవరే గొడవపెట్టింది? వాళ్ళా? నేనా?" ఖస్సుమంది స్రవంతి.

"అందరిలా నువ్వూ చీరలో, పరికిణి ఓణీలో వేసుకురాకూడదూ? ఇలాంటి ఫేషన్ డ్రెసెస్ వేసుకుని కాలేజికి రావడమెందుకు? వాళ్ళతో అల్లరిపడడం ఎందుకు?" తనకూ అలాంటి డ్రెసెస్ వేసుకోవాలనే సరదా వున్నా వేసుకునే ధైర్యంలేని అనిత అంది.

"ఖర్మ! ఏ పదిహేడో శతాబ్దంలోనో పుట్టాల్సింది, పొరపాటున ఇప్పుడు పుట్టిందీ అనిత" నుదురుకొట్టుకుంది పద్మ.

"నా డ్రెసెస్ విషయం నా యిష్టం. నేను మాక్సీ వేసుకుంటానా, జీన్స్ వేసుకుంటానా, మూరెడు చీర కట్టుకుంటానా, ముప్పయి గజాల చీర కట్టుకుంటానా అన్నది నా స్వవిషయం. నా అభిరుచికి సంబంధించిన విషయం. ఇది నావ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశమని గుర్తించకుండా మగ వాళ్ళమనే దురహంకారంతో అల్లరి పెట్టడం కరెక్ట్ కాదు. మొగపుట్టుక పుట్టినందుకు వచ్చిన పొగరుతో మాట్లాడితే సహించాల్సిన అవసరమేంటి మనకు?" స్రవంతి ముఖం కంది పోయింది.

"అలా అనకు మరి. మన వస్త్రధారణ ఎబ్బెట్టుగా కాకుండా, రెచ్చగొట్టేదిగా కాకుండా గౌరవప్రదంగా ఉండాలికదా ?" అంది అనిత. స్రవంతిది వితండవాదంలా అనిపించిందామెకు.

అనిత చెప్పింది విన్నాక స్రవంతికి మొన్నీమధ్య తనొక పత్రికలో

చదివిన వ్యాసం గుర్తుకొచ్చింది. ఆడవాళ్ళపై అత్యాచారాల సంఖ్య నానాటికి పెరగడానికి కారణం అమ్మాయిలు మగవాళ్ళ ఉద్రేకాన్ని రెచ్చగొట్టేలా డ్రెసెస్ వేసుకోవడమేనని, అమ్మాయిలు ఒద్దికగా డ్రెస్ చేసుకుని ఇంటిపట్టున ఉంటే వారిపై మగవాళ్ళు అలాంటి అఘాయిత్యాలకు తలపడరని... వగైరా వగైరా..స్త్రీల వస్త్రధారణ వారి స్వంతవిషయం, వారి స్వేచ్ఛకు సంబంధించిన విషయం. ఆయినాస్వేచ్ఛకు పరిమితులు ఉంటాయని, స్వేచ్ఛ అసభ్యతకు దారితీయగూడదనే వాదనను తను అంగీకరిస్తుంది.కాని ఆ పేరుతో ఆడవారిని కట్టడి చెయ్యాలని చూడడం, వాళ్ళని మరిన్ని సంకెళ్ళతో నిర్బంధించాలని చూడడం, ఆడవాళ్ళపై అఘాయిత్యాలకు కారణం వారి వస్త్రధారణ అంటూ ఆడవాళ్ళనే నిందించడం సమస్యను ప్రక్కదారిపట్టించే ప్రయత్నం కాక మరేమిటి? మూలకారణాల్ని వెతికి పట్టుకుని సమస్యను పరిష్కరించడానికి బదులు మగజాతి చేసే పరమ ఘాతుకమైన పనికి ఆడదాన్నే దోషిగా నిలబెట్టడం!!.....శతాబ్దాలుగా స్రీలు అనుభవిస్తున్న వివక్ష, పీడనల స్వరూప, స్వభావాలగురించి, మూలకారణాలగురించి స్రవంతికి సాకల్యంగా తెలియక పోయినప్పటికి ఇంట్లోనూ, బయటా ఆడపిల్లలపై పెడుతున్న ఆంక్షలు అనుభవంలోకి వస్తున్నకొద్దీ స్రవంతికి ఆవేదన, ఆగ్రహం కలగసాగాయి.

"అవునే, వాళ్ళు గొట్టాం పాంట్లు వేసుకున్నా, రోడ్లు ఊడ్చేలా ఎలిఫెంట్ బాటమ్ పాంట్స్ వేసుకున్నా, బారెడు మీసం పెంచుకున్నా, బూచాళ్ళలా జులపాలు, గడ్డాలు, మీసాలూ పెంచుకున్నా మనమేమన్నా ఏడిపిస్తున్నామా! అల్లరి చేస్తున్నామా!" పద్మ స్రవంతికి సపోర్టు యిచ్చింది.

"ఆడపుట్టుక పుట్టి వాళ్ళని ఏడిపించడం, అల్లరి చెయ్యడం కూడానా ?... ఆడజాతంటే వాళ్ళకు చులకన, ఆడవాళ్ళు సెకండ్ గ్రేడ్

ప్రాణులు, వాళ్ళను హేళన చెయ్యడం, అవమానించడం మగధీరుల జన్మహక్కు. వాళ్ళని ఏడిపించడం తమ మగతనానికి నిదర్శనం." స్రవంతి కోపం చూచి అనిత మరి మాట్లాడలేదు.

ఐతే, చెంపపెట్టు పెట్టినట్లుగా జవాబిచ్చిన స్రవంతి మరునాడు మరో సంఘటనకు సిద్ధంకావలసి వచ్చింది. రోజూ తనతో వచ్చే గీత కాలేజీకి రానందువల్ల ఒంటరిగా వస్తూంది.

చెట్లక్రింద కాపేసి స్రవంతి కోసం ఎదురు చూస్తున్నారు అల్లరి మూక. ఆమెను చూడగానే ఒకతను దగ్గరగా వచ్చాడు. మిగతా వాళ్ళు ప్రోత్సాహంగా అతని వంక చూస్తున్నారు.

తన కెదురుగా నిలబడి అసభ్యంగా మాట్లాడుతున్న అతన్ని చూస్తే కోపం కంటే బాధ ఎక్కువ కలిగింది, ఆడపిల్లలు మగపిల్లలకంటే తక్కువ వారని తలచే అతని అజ్ఞానానికి జాలి కలిగింది, అతనినంత హేయమైన మానసికస్థితిలోకి నెట్టిన భావజాలాన్ని తలుచుకుని దిగులుపడింది. ఆడపిల్లను తల ఒంచుకుని ఒదిగి బ్రతకమని శాసిస్తూ, మగవాడేదైనా మాట్లాడొచ్చు, ఏదైనా చెయ్యొచ్చు అనే వెసులుబాటు కలిగించే ద్వంద సామాజిక వ్యవస్థపట్ల ఆగ్రహం కలిగింది

"నీ గదికిదికిరానా?" వెకిలి నవ్వు నవ్వాడతను.

"రా! నీతోపాటీ గాడిదల్నందరినీ తీసుకురా. నా పాత చెప్పులు చాలానే వున్నాయి. వాటిని తుడిచి వెళ్దురు కాని." చేత్తో వాళ్లందర్నీ చూపిస్తూ, బిగ్గరగా వాళ్లకు వినపడేలా అనేసి ముందుకు కాలు కదిపింది స్రవంతి. 'ఎంతపొగరు!! దీని పొగరు వదిలిస్తాం' అనుకుంటూ అంతా ఆమె దగ్గరకు వచ్చారు.

"ఆగండి ఎక్కడికలా తోక తెగిన కోతుల్లా మీదమీదకు వస్తున్నారు? ఆడపిల్ల కూడా మీకులాగే రోషం, అభిమానం, చీమూ, నెత్తురూ ఉన్న

మనిషని మరిచిపోయి మీ యిష్టం వచ్చిన వాగుడు వాక్కండి" కలకత్తా కాళిలా కళ్ళురిమింది స్రవంతి.

"హౌ డేర్ యు ఆర్" ఆమెను పరాభవించాలన్న కృతనిశ్చయంతో త్రాచులా గాలికి కదులుతున్న ఆమె జడ నందుకోబోయాడతను.

"టేక్కేర్! నామీద చెయ్యి పడిందంటే మర్యాదగా వుండదు" గర్జించింది స్రవంతి. అంతలో అప్పుడే వస్తున్న పద్మ, రమ, అనిత స్రవంతిని చూచి పరుగెత్తుకువచ్చారు.

"మీరే వాగుళ్ళు వాగినా తలవంచుకుని వెళ్ళాల్సిన అవసరం మాకు లేదు. మర్యాదిచ్చి మార్యాద పుచ్చుకోండి."

"అబ్బ ఎందుకే వాళ్లతో అనవసరంగా" స్రవంతి చెయ్యి పుచ్చుకుని బలవంతంగా అక్కడినుంచి లాక్కుపోసాగింది రమ.

"ఎందుకే అలా భయపడి చచ్చిపోతావు?... అనవసరంగా వాళ్లతో గొడవ పెట్టుకున్నానా నేను?... వాడన్న మాటల్ని వింటే ఆమాట పలికిన నాలుకను చీరేసి వాడిని ఖండఖండాలుగా నరకాలనిపిస్తుందెవరికైనా..."

"నీకు దణ్ణం పెడతాను ఆపింక" ఒణుకింకా తగ్గని అనిత అంది.

"వీళ్లనింతటితో ఒదుల్తాననుకున్నారా? ప్రిన్సిపాల్‌కి రిపోర్టిచ్చి కాలేజీనుంచి గెంటిస్తాను. పోలీసు కంప్లైంట్ ఇచ్చి వాడి అంతు చూస్తాను" పెద్ద కంఠంతో అంటున్న స్రవంతిని స్నేహితురాళ్ళు వెయిటింగ్ రూంలోకి లాక్కుపోయారు.

"ఏమిటే ఆ ప్రతాప్‌గాడు హడలి ఛస్తున్నాడు" రెండు రోజులు పోయాక పద్మ ప్రశ్న విని పకపక నవ్వింది స్రవంతి

"వెన్నెముకలేని వెధవలంతా బెదరగొట్టేసరికి కాళ్లబేరానికొచ్చారు. వాళ్లు చూస్తూ వుండగా రెండుమూడుసార్లు ప్రిన్సిపాల్ రూంకి వెళ్ళాను.

కావాలని మా నాన్నగారు రానంటున్నా బ్రతిమాలి కాలేజీకి తీసుకొచ్చి వాళ్లని చూపించాను. అంతే, వ్యవహారం 'సారీ'ల దగ్గరకొచ్చింది. ఆడపిల్లను చూడగానే మీసం, గడ్డం రానివాడికూడా వీరత్వాన్ని ప్రదర్శించాలనే ఉబలాటమే.... ఈ దెబ్బతో మనజోలికింక ఛస్తే రారు"

"అలా అనుకోనఖ్ఖర్లేదు. అంత త్వరగా బుద్ధిరానివాళ్లుకూడా వుంటారు. పొంచివుండి తోడేళ్లలా మీద పడతారు" పద్మ మాటలువిని ఓ నిమిషం ఆలోచిస్తూ వుండిపోయింది స్రవంతి.

"వాళ్లమీద నాకంత దురభిప్రాయంలేదు. దె ఆర్ ఓన్లీ స్పాయిల్ట్ చిల్డ్రన్. వాళ్ళక్కావలసింది చిన్న షాక్ ట్రీట్‌మెంట్. సరదాకి, అసభ్యతకి మధ్యవున్న తేడా వాళ్ళకు తెలిసేలా చేస్తే చాలు"

"ఇదీమధ్య మరీ పుస్తకాల పురుగయిపోయింది. అన్నీ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతూంది. ఎలా బ్రతుకుతుందో ఏమిటో పాపం!" తమాషాగా నవ్వింది రమ.

స్రవంతి ధైర్యం, చొరవ ఆమె ఫ్రెండ్స్ అందరిలో చలనం తెచ్చాయి. వాళ్ళిదివరికటిలా అబ్బాయిలు ఏడిపిస్తారేమో, పేర్లు పెడతారేమోనని భయపడడంలేదు. వాళ్ళేదైనా అంటే తల వంచుకు వెళ్ళిపోవడంలేదు, ముఖం వాచేలా తిప్పి కొడుతున్నారు.

స్నేహమంటే ప్రాణం పెట్టే ఫ్రెండ్స్ సాహచర్యంలో కాలేజీ జీవితం కమ్మని కలలా గడచిపోతూంది స్రవంతికి. కాని అన్ని రోజులూ సుఖంగా, సంతోషంగా గడిచిపోతే అది జీవితమెలా అవుతుంది?!...

"మీకింక కాఫీ అవసరం లేదనుకుంటానే!" శరత్ ప్రశ్న విని తల విదిలించి వాస్తవంలోకి వచ్చింది స్రవంతి.

"అదేంటండోయ్?! కాఫీ ఇప్పించడం ఎగ్గొట్టాలని గొప్ప ఎత్తే

వేస్తున్నారే?! ఏం? ఎందుకని నాకు కాఫీ అవసరంలేదండి?"

"మౌనం భోజనంచేస్తున్నారుగా, అందుకని"

"అదా?! నా ఫ్రెండ్స్, అక్క గుర్తుకొచ్చారు. మా పోట్లాటలు, అల్లరి గుర్తుకొచ్చాయి" భావుకంగా చూస్తూంది స్రవంతి.

"మీరే రహస్యంగా గుర్తు తెచ్చుకోకపోతే నా పాపపు చెవుల్ని కూడా వెయ్యొచ్చుకదా!"

"పోనీ మీరు చెప్పండి మీ కబుర్లు. మీ కాలేజీ కబుర్లు, ఫ్రెండ్స్..."

శరత్ మనసు జీవితపు పేజీల్ని వెనక్కు తిప్పింది.

***

శరత్ బాల్యం రంగుల దృశ్యం కాదు. అమ్మ ప్రక్కలో సుఖ స్వప్నాలు కంటూ పడుకోవలసిన సమయంలో తండ్రి వీపుమీద ఒక్కటేసి లేపి గొడ్ల దగ్గర తుక్కు తీయించేవాడు. నిద్ర కళ్లతో తడుముకుంటూ, గడ్డి కాళ్లకు చుట్టుకుని పడిపోతూ వుంటే తండ్రి కళ్ళెర్రజేసి మరొకటి తగలనిచ్చేవాడు. పడిపోయి మోకాళ్లు, మోచేతులూ డోక్కుపోయిన శరత్‌ని చూచి అతని తల్లి రత్నం కన్నీళ్లు పెట్టుకునేది.

చీటికి మాటికి అమ్మను బండబూతులుతిడుతూ తమను చావచితకదన్నే తండ్రి అంటే పరమ రోతగా వుండేది శరత్‌కి. 'భార్యను అప్యాయంగా చూస్తే నెత్తికెక్కి కూర్చుని ఆడపెత్తనం చెలాయిస్తుంది. పిల్లల్ని ప్రేమగా చేరదీస్తే చెడిపోతారు. ఎందుకూ పనికిరానివాళ్లవుతారు. ఎంత బాగా నలగ్గొడితే అంత బుద్ధిమంతులూ, ప్రయోజకులూ అవుతారు' అన్న తత్వాన్ని నరనరానా జీర్ణించుకుని నియమంగా ఆచరణలో పెడుతున్న వ్యక్తి నీలకంఠం.

"ఇంత అడవిమనిషిని ఎక్కడా చూడం పిన్నీ! అన్నీ ఎడ్డెమంటే

తెడ్డం పనులు. ఒక్కదాన్లో కలిసిరారు. అంతా ఎతిమతం. మనం చెప్పేది వినిపించుకోరు. ఇరవై నాలుగ్గంటలూ గొడ్డు చాకిరీ చేయగానే సరా? ఒక పద్ధతి, పాడూ వుండఖ్ఖర్లేదా? ఎవర్ని చూడు. ఎంత పొందిగ్గా సంసారాలు దిద్దుకొంటారో! ఇవాళ చూసినాళ్ళు రేపటికి షావుకార్లవుతున్నాడు. లేనిది సంపాదించుకోలేకపోతేమానె, వున్నది వృద్ధి చేసుకునే తెలివి లేకపోయె... అడగనివాడిది పాపం. మెళ్లోది లాక్కుపోయి తెగనమ్మయినా సరే అప్పులిస్తారు. ఇచ్చిన అప్పు తిరిగి అడగడానికి నామోషి. పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. ఎలా కడతేర్చాలీళ్ల నందర్నీ?! ఈ సంసారం ఇంక బాగుపడేదెప్పుడో ఆ భగవంతుడికే తెలియాలి" నిస్పృహతో చెప్తున్న రత్నం వంక జాలిగా చూస్తోంది ప్రక్కింటావిడ. బేలగా చూస్తున్న శరత్‌ని దగ్గరకు తీసుకుని రత్నాన్ని ఓదార్చడానికి ప్రయత్నించిందామె.

"నువ్వు దిగులుపడమాకే అమ్మాయి. అన్నీ సర్దుకుంటాయి. ఆడు మాత్రం ఏం తప్పుడు నడతలు నడుస్తున్నాడు? ఒక తాగుడా? చీట్లాటా! ఆడాళ్లగోలుందా? కాకపోతే కొంచెం కోపదారి మనిషి. తనుపట్టిన కుందేటికి మూడేకాళ్లంటాడు. నీఅంతటాళ్ళు లేరని ఎవరైనా ఉబ్బేస్తే పొంగిపోయి ఉన్నదంతా దోచి పెడతాడు."

"అది చాలదా పిన్నీ! నలుగుర్నీ చూసయినా మనిషి తన స్వభావం మార్చుకుని రెండు రాళ్ళెనకేసుకుని పిల్లలకేమయినా అమర్చాలా?!... నేనొక్కదాన్ని ఎంత పాకులాడి మాత్రం ప్రయోజనమేముంది పిన్నీ! చీకటి ముఖాన లేస్తాను. నడుమెత్తలేని చాకిరీ. మళ్ళీ ఊరుమాటు మణిగాకే నడుము వాల్చడం. దానికి నాకేం బాధలేదు. నా పిల్లలకు నేను చేస్తున్నాను తప్పితే పరాయాళ్ళకు చేస్తున్నానా అనుకుంటాను. పాలు, పెరుగు, కోడిగుడ్లు ఏదైనా అమ్మి పిల్లలకేదైనా కొందామని నాలుగురూపాయలు దాస్తాననుకో,

గద్దలా తన్నుకుపోయి ఎవడో ఒక తలకిమాసిన వాడికిస్తారు. అట్లాజేస్తే ఎవరికైనా కడుపు మండిపోతుందా లేదా చెప్పు పిన్నీ!"

"ఎందుకు మండిపోదే పిచ్చితల్లీ!" సానుభూతిగా చూచిందావిడ.

"హితవైనాళ్లకు తన దగ్గర లేకపోతే ఎవరిదగ్గరైనా చేబదుళ్లు తెచ్చి మరీ ఇస్తారు... అప్పులు తేవడం, ఇవ్వడం, అందరితో తగూలు, మనిషికి కోపానికేమన్నా తక్కువా? తాచుపాము కోపం. తగువు తెచ్చుకున్న ప్రతాడినీ పొడిచేస్తానని మీదకెళ్లడం, పరువు, మర్యాద ఉన్నాళ్లు చేసే పనేనా ఇది? పెద్దదానివి నువ్వే చెప్పు పిన్నీ!... తాగుడు, పేకాట, ఆడాళ్లు ఇవేనా తప్పుడు పనులు? ఈయన చేసేవన్నీ మంచిపనులా? పెళ్లాంకీ, పిల్లకీ చిన్నమెత్తు ఉపయోగపడని మనిషి. పుణ్యంకొద్దీ పురుషుడంటారు. ఏం పాపంచేసుకున్నానో!'' రత్నం కంఠం గద్గదమయింది. కళ్ళు నిండుకున్నాయి.

''మీ బాబాయిని కేకలేయుమంటాన్లే. నువ్వేడవమాక. బిడ్డ బెంబేలుపడతాడు" అమ్మ కన్నీళ్లు చూచి బిక్కమొహం పెట్టాడు శరత్.

శరత్ చదువు గురించి ఎప్పటికప్పుడు తండ్రితో యుద్ధమే. రత్నం తన ప్రాణాలు, ఆశలు అన్నీ కొడుకుమీద పెట్టుకుంది. అతను బాగా చదువుకుని పెద్ద ఉద్యోగంచేసి తన కష్టాలు కడతేరుస్తాడని కలలు కంటూంది.

"ఎక్కడ చచ్చాడే ఈ శరత్‌గాడు? దొడ్లో పనులన్నీ ఎక్కడియ్యక్కడ పెట్టాడు" రంకెలువేస్తున్న భర్తనుచూచి రత్నం గుండెలు దడదడలాడాయి.

''చదువుకుంటున్నాడండీ. మధ్యాహ్నం పరీక్ష ఉందట'' నూతిలోనుంచి వచ్చినట్లుగా వుంది రత్నం స్వరం.

శరత్ చదువుకుంటూనే తండ్రిని, తల్లిని గమనిస్తున్నాడు.

“చదువా, గాడిద గుడ్డా? లేచిరమ్మను. చదివి ఏ ఊళ్ళేలతాడట దొరగారు?” ఇంత కర్కశంగా అడుగుతున్న ఈయన తండ్రేనా? కన్నబిడ్డల్నే కాదు, ఏ చిన్న పిల్లల్ని చూచినా స్పందనలేని ఈయనసలు మనిషేనా అన్న అనుమానమొచ్చింది శరత్‌కి.

“రారా!” తండ్రి హుంకరింపు విని తల్లివంక చూశాడు శరత్. పయటచెంగుతో కళ్లు తుడుచుకుంటున్న తల్లిని చూచి ఎదురుతిరుగుతున్న మనసుని సముదాయించాడు. తరువాత జరగబోయే ఘట్టం, తనకిలాంటి బుద్ధులు నేర్పుతున్నందుకు అమ్మజుట్టు వంగదీసి గబగబా బాదడం కళ్లముందు కదిలి ఒళ్లు జలదరించింది. మౌనంగా పుస్తకాలుమూసి తండ్రి పురమాయించిన పనులు చెయ్యడానికి వెళ్ళేవాడు.

అలాంటి అసంఖ్యాకమైన అవాంతరాల్ని ఎదుర్కొంటూ హైస్కూలు చదువు పూర్తిచేశాడు శరత్. కాలేజీలో చేరడానికి మళ్లీ తండ్రితో పెద్ద యుద్ధానికి తలపడాల్సివచ్చింది.

“నాన్నా! ఏం బ్రతుకురా నాది?! కన్నబిడ్డ ఘస్టున పాసయి గంపడాశతో పైచదువులు చదువుకుంటానంటే ‘అలాగేబాబూ!’ అనలేని దాన్ని” దుఃఖాన్ని నిగ్రహించుకోలేక తల్లి కుమిలి కుమిలి ఏడుస్తూంటే శరత్ హృదయం దేవేసినట్లుగా వుంది.

కాలేజీ చదువులకు తను తూగలేనని, పొలం పనుల్లో తనకు సాయంగా వుంటే బావుంటుందని అంటున్నాడు నీలకంఠం. హరిమీద గిరిపడ్డా తను చదువుకునేది ఖాయం అంటున్నాడు శరత్. భర్త మూర్ఖత్వం, కొడుకు కోరిక, పట్టుదల తెలిసిన రత్నం చదువుకోసం కొడుకు ఎక్కడ ఇంటిని విడిచి వెళ్ళిపోతాడో, ఎక్కడ దూరమవుతాడోనని తల్లడిల్లిపోయింది. భర్త అస్తవ్యస్త ప్రవర్తన తమ జీవితాల్నెంతగా ఛిన్నాభిన్నం చేస్తూందో తలచుకుని దిగులుపడసాగింది.

"అమ్మా! ఎందుకంత బాధపడతావు? నాన్న ప్రవర్తన మనకేమన్నా కొత్తా? నువ్వేం దిగులుపడొద్దు. నేను కాకినాడలోనే కదా చదువుకునేది? మనకు గంట ప్రయాణం. నీకెప్పుడు నన్ను చూడాలనిపిస్తే అప్పుడో కార్డ్ రాయించు. వచ్చి నీముందువాల్తాను" తల్లిని ఓదార్చడానికి నవ్వుతూ మాట్లాడుతున్నాడు శరత్. హృదయంలో అగ్నిని దాచుకుని తన కన్నీళ్లు తుడవడానికి ప్రయత్నిస్తున్న కొడుకుని చూచి ఆమె గుండె చెరువయింది.

"అక్కడెలా బ్రతుకుతావురా?! డబ్బు లేకుండా పట్నంలో ఎందుకు పనికొస్తాము?" దిగులుగా అంది రత్నం.

"డబ్బు విషయం నువ్వేం ఆలోచించొద్దమ్మా! నా తిప్పలేవో నేను పడతాను. అక్క పెళ్ళికయిన అప్పులే పాపంలా పెరుగుతున్నాయి. నాన్న మళ్లీ అప్పులు తేకుండా జాగ్రత్తపడు. వసు, నాని చదువు ఆపకుండా చూడు" కొడుకు పెద్ద ఆరిందాలా తనకు అప్పగింతలు పెడుతూంటే కన్నీళ్లతో అతనివంక చూచింది రత్నం. 'తల్లీ తండ్రీ సుఖంగా అమర్చిపెట్టి దండిగా డబ్బు చేతిలోపెడితే ఏ చీకులూ, చింతలూ లేకుండా, ఏ బాధ్యతలూ, బాదరబందీ లేకుండా పిల్లలు కాలేజీ చదువుకు వెళ్తున్నారు. డబ్బులేకపోయినా, తమ రెక్కల కింద దాచుకుని ఏ కష్టం కలగకుండా సాక్కుని వస్తున్నారు తల్లి తండ్రులు. తనకొడుక్కు మాత్రమే ఇలా జరగడం, ఇదంతా తన దౌర్భాగ్యమే', తల్లి ఆలోచనల్ని విని శరత్ నవ్వాడు.

"నువ్వు నాకు అమ్మవు. అది చాలదా అమ్మా నాకు" కొడుకు మాటతో రత్నం హృదయం పొంగిపోయింది.

"అమ్మా! నువ్వు నామీద ప్రేమతో, నాకేమీ జరపలేకపోతున్నానన్న బాధతో అలా అనుకుంటున్నావు కానీ ఒక్కసారి నీ చుట్టూతా చూడమ్మా! మనకంటే పేదవాళ్లు, బ్రతుకులో ఏ సుఖం, సంతోషం లేనివాళ్లు కోకొల్లలుగా వున్నారు. వాళ్లనిచూచి, వాళ్లతో పోల్చుకుని సంతృప్తి

పడదాం. నువ్వు నాకివ్వలేకపోయిన దాన్ని గురించి ఆలోచించకమ్మా! నువ్వు మావల్ల చీవాట్లూ, చెప్పుదెబ్బలూ తినకుండా వుంటే చాలు" రత్నానికి కన్నీటి వరదనాపడానికి శక్తి చాలడంలేదు.

పసివాడు, వీడిపాటి ఆలోచన, వివేకం, బాధ్యత భర్తకు లేకపోయాయే అని వాపోయింది రత్నం.

తండ్రి ప్రవర్తనవల్ల బాధలు పడే తల్లిని ఓదార్చడానికి తనుకూడా వుండడన్న దిగులుని, పై చదువులు చదవాలన్న ఉత్సాహాన్ని సమానంగా అనుభవిస్తూ కాలేజీలో అడుగుపెట్టాడు శరత్. మాస్టార్లు, స్నేహితులు తలాకొంచెం డబ్బు సర్ది అతను కాలేజీఫీజులు కట్టడానికి సాయపడ్డారు. ఒక స్నేహితుడు తనరూమ్‌లో తలదాచుకోవడానికి చోటిస్తానని వాగ్దానంచేసాడు.

ఒకరిముందు చెయ్యిచాచడానికి, 'దేహీ' అని అడగడానికి, స్నేహితులు సగం వాడి తీసేసిన బట్టలిస్తే వేసుకోవడానికి మనసు చిత్రహింస ననుభవిస్తూంది. 'వద్దు. యింత అవమానపు బ్రతుకు బ్రతక్కపోతేనేం? ఇన్నిసూటిపోటి మాటలు భరిస్తూ చదువుకోకపోతేనేం? ఇంతమంది అపహాస్యపు చూపుల్ని తట్టుకుంటూ భవిష్యత్తుమీద ఆశలు పెంచుకోకపోతేనేం?' అని ఎదురు తిరుగుతున్న మనసుని సముదాయించు కోవడానికి ఒకోసారి విఫలుడవుతున్నాడు. ఒకోరోజు తిండి తినకుండా, చదువుకోకుండా మునగదీసుకుని పడుకుంటాడు. ఆకలి, నిస్త్రాణ, నగ్నంగా కళ్ళెదుట నిలుస్తున్న వాస్తవం ఆవేశాన్ని జోకొట్టి పరిస్థితులతో రాజీపడమంటున్నాయి. లోకంలో ఇంకా మిగిలున్న స్నేహం, ఆదరణ, కష్టంలో ఆదుకునే తత్వం శరత్‌ని బ్రతికిస్తున్నాయి, ముందుకు నడవడానికి కావలసిన ఉత్తేజాన్నిస్తున్నాయి.

ఉత్సాహాన్ని నింపుకుంటూ, నిరాశతో క్రుంగిపోతూ, నవ్వుతూ,

కన్నీళ్ళను దిగమింగుకుంటూ రెండేళ్ళ చదువుని దాటించి ఇంటర్‌లో ఫస్ట్‌క్లాస్ తెచ్చుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ వచ్చాక కూడా మార్కులెలావచ్చాయో నన్నఆందోళనే. మార్కులిస్ట్ వచ్చి కాలేజీ ఫస్ట్ వచ్చాకగాని మనసు ఊరట చెందలేదు.

మంచి మార్క్లు వచ్చాయన్న సంతోషం ఒకవైపు, తన హృదయపు అట్టడుగు పొరల్లో వున్న కోరిక ఇంజనీరింగ్ చదవడం, ఆకోరికను నెరవేర్చుకోగలవా అన్న సంశయం మరోవైపు, ఉక్కిరి బిక్కిరి చేసే ఆలోచనలతో, ఎటూ తేల్చుకోలేక తనకి ఇష్టలైన మాస్టారు ఫిజిక్స్ లెక్చరర్ చక్రపాణిగారి దగ్గరకు వెళ్ళాడు. తనకు కావలసింది, ఏం చెయ్యాలో మాస్టారు నిర్ణయించడంకాదు. తనకేం కావాలో తనిదివరకే నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు తనాయననుంచి ఆశించేది మోరల్ సపోర్టు, తన నిర్ణయాన్ని సమర్ధించడం, తన చదువుకేమీ ఆటంకంరాదని ధైర్యం చెప్పడం.

"గుడ్. వెరీగుడ్. అయామ్ ఫ్రౌడ్ ఆఫ్‌యు" అన్నాడు చక్రపాణి శరత్ మార్క్‌లిస్ట్‌చూచి. నమ్రతగా తలవంచుకున్నాడు శరత్..

"ఊ! మరి నెక్స్ట్ ఏం చదువుతావ్?"

"ఏం చెయ్యాలో తోచడంలేదుసర్! ఇంజనీరింగ్ చదవాలని వుంది. కాని నా పరిస్థితి మీకు తెలుసుగా మాస్టారూ!" దిగులుగా అన్నాడు శరత్.

"తప్పకుండా చదువు. ఇంక పరిస్థితులంటావా, ఎదురు తిరిగే ధైర్యం నీకుంది. ఒక లక్ష్యాన్ని పెట్టుకుని, దాన్ని సాధించడంలోఉన్న థ్రిల్ ఉన్నదానితో సంతృప్తిపడి సర్దుకుపోవడంలో ఉండదు" మాస్టారి ప్రోత్సాహానికి ఉప్పొంగిపోయాడు శరత్.

"పరిస్థితులతో యుద్ధం చెయ్యడానికి నాకు జంకులేదు సర్. నాకు కావలసింది మీలాంటి పెద్దల ప్రోత్సాహం, బ్లెసింగ్స్" శరత్ మాటలు

విని సంతోషంతో, గర్వంతో నిండిపోయింది మాస్టారి హృదయం.

"నా ప్రోత్సాహం, సహకారం నీకెప్పుడూ వుంటాయి. నీ మార్క్సకి ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీలోనే సీట్ వస్తుంది. నీకే ప్రోబ్లమ్ వచ్చినా నన్ను కలువు" మాస్టారికి నమస్కారం చేసి రూమ్‌కి వచ్చాడు. అతనికి గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది. అప్పుడే తనో పెద్ద ఇంజినీరయిపోయినట్లు, ఫారిన్ వెళ్ళి సాంకేతిక అనుభవాన్ని గడించివచ్చినట్లు, అమ్మ తనను కౌగిలించుకుని సంతోషంతో కన్నీళ్ళు నింపుకున్నట్లు కలల్లో తేలిపోయాడు శరత్.

"నేనిక్కడే బి.కామ్‌లో జాయినవుతానురా. నేనిక్కడున్నన్నాళ్ళూ నువ్వు నా రూమ్‌లోనేవుండు" తను అడక్కుండానే చెప్తున్న గౌతమ్‌కి వంగి పాదాభివందనం చెయ్యాలనిపించింది.

"గౌతమ్! నీరుణాన్నెలా తీర్చుకోనురా?" గౌతమ్ చేతులందుకున్న శరత్ కళ్ళు తడిగా అయాయి.

"ఇందులో రుణమేంటిరా? నేనేం చేస్తున్నానని? పడుకోవడానికి, చదువుకోవడానికి కాస్త చోటిస్తున్నాను. ఆ మాత్రానికే రుణాలు, వడ్డీలూ అంటావేమిటిరా?" అతనలా మాట్లాడడం ఇష్టంలేనట్లు మృదువుగా చేతులు విడిపించుకున్నాడు గౌతమ్.

"అదెంతకాదు!" కృతజ్ఞతతో ఇంకేమో అనబోయి గౌతమ్ ముఖం చూసి ఆపుచేసాడు శరత్.

ఇంజనీరింగ్‌లో సీట్ రావడం పెద్ద కష్టం కాలేదు. తరువాత చదువుకోవడం, అవసరాలకు సరిపడాడబ్బు సంపాదించడంకోసం పెనుగులాట. స్కాలర్‌షిప్ డబ్బు కాలేజీ ఫీజులకు, పుస్తకాలకు, పరికరాలకు ఉపయోగపడుతూంది. ట్యూషన్స్ చెప్పడం, ఎకౌంట్స్ రాయడం, రకరకాల

అవతారాలెత్తి సాధ్యమైనంత వరకు ఎవరి ఎదుటా చెయ్యిచాచకుండా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు శరత్.

పడుతూ, లేస్తూ, నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తూ 'చదువు' అనే యజ్ఞాన్ని కొనసాగిస్తున్న శరత్‌కి ఫైనలియర్ పరీక్షలముందు పెద్ద ఆటంకం వచ్చింది. శక్తికిమించిన శ్రమవల్ల నీరసించిపోయాడు. దానికి తోడు టైఫాయిడ్ వచ్చి రెండు నెలలపాటు కాలేజీకి వెళ్ళలేదు. మందులు, పాలు, పండ్లు మొదలైన వాటికి స్నేహితులే ఖర్చు పెట్టారు. తెలిస్తే అమ్మ బాధపడుతుందని తనకు జబ్బు చేసిన విషయం గురించి ఇంటికి ఉత్తరం కూడా రాయలేదు.

కొంచెం ఓపికరాగానే మామూలుగా ట్యూషన్స్‌కి, ఎకౌంట్స్ రాయడానికి వెళ్ళాడు శరత్. వేరే వాళ్ళను పెట్టుకున్నామని చెప్పి ఆ నెల జీతమిచ్చి సాగనంపారు వాళ్లు. ఇన్నాళ్ళ తన శ్రమను, శ్రద్ధను ఒక్కరోజులో మరచిపోయి బయటికి నెట్టారన్న బాధ, కొత్తచోట పనులు వెదుక్కుంటానికి శక్తి లేకపోవడం, పెద్ద భూతాల్లాఫైనల్ పరీక్షలు దగ్గరపడడం .. ఏ రోజుకారోజు డబ్బుకు వెదుక్కోవలసి రావడంతో స్థిమితం కోల్పోయాడు శరత్. ఇంతలో పరీక్ష ఫీజు కట్టాల్సిన ఆఖరి డేట్ తెలిసింది. ఇప్పటికే తన కోసం హద్దుల్ని మించి ఖర్చు పెట్టిన స్నేహితుల్ని మళ్ళీ అడగడానికి మనస్కరించలేదు. తప్పనిసరి పరిస్థితిలో చదువుకోసం ఇంటి గడప దాటాక మొట్టమొదటిసారి తండ్రిని డబ్బు అడగడానికి నిశ్చయించుకున్నాడు శరత్.

లోకంలో తనలాంటి వాళ్ళు, తనకంటే నిర్భాగ్యులు కోట్ల కొలది వున్నారని తల్లిని ఓదార్చిన శరత్‌కి తనకంటే దురదృష్టవంతులీ లోకంలో మరెవరూ లేరన్నంత నిస్పృహ కలిగింది తండ్రి ఈసడింపులు విన్నాక.

"చదువు చదువంటూ ఎగురుకుంటూ పోయావుగా? నీ కంఠంలో

ప్రాణముండగా డబ్బుకోసం నా ముందు చెయ్యి చాచనని పెద్ద పౌరుషంగా చెప్పావుకదా? ఇప్పుడు నీ కంఠంలో ప్రాణం వుందా, పోయిందా?" సగం చచ్చి, అభిమానాన్ని చంపుకుని తండ్రిని డబ్బడిగిన శరత్‌కి ఆయన మాటలు విన్నాక అగాధాల్లోకి కూరుకుపోతున్నట్లుగా వుంది.

మార్పు అనేది జీవలక్షణం. ప్రకృతిలో ప్రతి అణువూ ఎన్నెన్నో మార్పులకు గురవుతూనే వుంటుంది. కాలానుగుణంగా సమాజం మార్పుకు లోనవుతూంది. పరిస్థితుల కనుగుణంగా వ్యక్తులు మారుతున్నారు. కాని.. కాని తన తండ్రి స్వభావం మాత్రం మారడంలేదు. లేకపోతే ఒక తండ్రి తన బిడ్డను అనవలసిన మాటలేనా అవి?! ... అందరి తండ్రులూ అష్టకష్టాలుపడైనా తిని తినక కొడుకు పరాయి ఊళ్ళో ఎక్కడ కష్టపడి పోతాడో, ఆకలితో ఎక్కడ పస్తుపడుకుంటాడోనని తల్లడిల్లిపోతూ డబ్బు పంపిస్తారే, కొడుకు పాసయితేచాలు, కొండెక్కినంత సంబరపడిపోతారే, మంచి మార్కులొచ్చాయంటే చాలు తమ కష్టం ఫలించిందని పొంగిపోతారే! బిడ్డ ప్రయోజకుడైతే చాలు అదే తమ బ్రతుక్కి సార్ధకత అని తలపోస్తారే... ఎందుకని ఒక్క తన తండ్రి మాత్రం ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు?' ఎప్పుడూ తండ్రి ప్రవర్తనను లక్ష్యపెట్టకుండా 'ఆయనంతేలే' అని తోసేసుకు తిరిగే శరత్ మొట్టమొదటిసారి ఆయనకు కొడుకుగా పుట్టిన దురదృష్టానికి దుఃఖపడుతున్నాడు. "ఏమిటిరా అలా రాయిలా కూర్చున్నావు? వెళ్ళు. ఊరిమీద పడు. ఉన్నారుగా నీ ప్రాణ స్నేహితులు, వాళ్ళను ముష్టెత్తు" చుట్ట కొసను కొరికి తుపుక్కున ఊసి బయటికి వెళ్ళిపోయాడు నీలకంఠం. శక్తి లేనట్లుగా కూర్చుండిపోయాడు శరత్.

ఎవర్ని అడగాలో పాలుబోవడం లేదు. సహాయం తీసుకుంటానిక్కూడా ఒక హద్దు వుంది... నిజమే. తన అదృష్టం తన

స్నేహితులంతా తనంటే ప్రాణం పెడతారు. తనంటే అభిమానం, తన పరిస్థితికి జాలివున్నాయి. తను అడిగినా అడక్కపోయినా తను అవసరంలో వున్నాడని తెలిస్తే చాలు తృణమో పణమో సాయపడ్డారు. కాని యిప్పుడెవరి దగ్గరకు వెళ్ళడానికీ మనసొప్పడం లేదు. ఎవరి దగ్గరైనా చెయ్యి చాచాలన్న ఊహకే ప్రాణం పోతున్నట్లుగా వుంది. శరత్ హృదయం నిప్పుల కొలిమిలో వున్నట్లుగా వుంది. "నాన్నా!" శూన్యంగా వున్న కళ్ళతో రత్నం వైపు చూచాడు శరత్. ఇంట్లో తాండవిస్తున్న దారిద్ర్యం, బక్కచిక్కిపోయి యంత్రంలా పనులు చేస్తున్న తల్లి, అటు చదువు, ఇటు పెళ్ళి లేక కొత్త చిగుళ్ళలాంటి ఆశల్ని తుంచేసుకుంటున్న చెల్లి. బాధ్యత తీసుకునే వాళ్ళు లేక సరిగ్గా చదువుకోకుండా జులాయిలా తిరుగుతున్న తమ్ముడు. పిచ్చెక్కిపోతున్నట్లనిపించింది ఇంటి పరిస్థితి చూస్తూంటే.

"ఇంట్లో కానీ డబ్బు లేదు. పుట్టిన చోటల్లా అప్పులు తెస్తున్నారు మీ నాన్న. చూస్తూ ఊరుకోలేక నేనేమైనా అంటే తాటి ప్రమాణాన లేస్తారు నా మీద" దిగులుగా చెప్పసాగింది రత్నం. 'కేవలం తన తండ్రి మూర్ఖత్వంవల్ల చేజేతులారా కొని తెచ్చుకుంటున్న పరిస్థితుల కారణంగా తమ సంసారం చితికి పోతూంది. పొదుపుగా సంసారాన్ని నిర్వహించే తల్లికి తండ్రి చేదోడు వాదోడుగా వుండుంటే తనీనాడింత దౌర్భాగ్య స్థితిలో నిలబడాల్సి వచ్చేదా!' మండుతున్న కళ్ళతో తల్లివైపు చూస్తున్నాడు శరత్.

"ఇప్పుడెందుకమ్మా అవన్నీ చెప్పి అన్నయ్యను బాధ పెట్టడం?" వసుంధర తల్లిమీద విసుక్కుంది.

"నిజమేనే! చెప్పొద్దనే అనుకుంటాను. ఏంటో, మనసాగక చెప్పానురా బాబూ!... నాన్నా! పోనీ అక్కదగ్గరకు వెళ్ళి అడగరాదు?! వచ్చే పంటల్లో సర్దేద్దాం" అంది రత్నం. శరత్ మనసంతా శూన్యంగా వుంది. ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించాలన్న ఉత్సాహం లేదు. ఎన్నడూ

కొడుకా విధంగా ఉండడం చూడని రత్నానికి కడుపు దేవేసినట్లుగా వుంది.

శరత్ భానుమతి దగ్గరకు వెళ్ళేదాకా ఊపిరాడ నివ్వలేదు రత్నం. చివరలో ఇలా కొడుకు చదువుకు అవాంతరం రావడం చేతికొచ్చిన పంట నేలపాలయినట్లుగా వుందామెకు.

శరత్ ఇప్పుడు మంచిచెడులను గురించి ఆలోచించే స్థితిలో లేదు. అతని ముందున్న ఏకైక లక్ష్యం డబ్బు సంపాదించి ఫీజు కట్టడం. అందుకే తల్లి మాటలకు తలఒగ్గి అక్క దగ్గరకు బయల్దేరాడు.

ఎన్నడూ ఇంతవరకు తన ఇంట్లో కాలుపెట్టని తమ్ముడిని సాదరంగా ఆహ్వానించింది భానుమతి. కొన్నేళ్ళుగా పుట్టింటి ఛాయలకే వెళ్ళని భానుమతికి శరత్‌ని కలిసే అవకాశం లేకపోయింది.

“ఏమిటిరా అలా వున్నావు? ఎన్నో రోజులనుండి తిండి తినని వాడిలా ముఖమలా వాడిపోయిందేవిటి? ఇంతలా చిక్కిపోయావేమిటిరా?” ఆత్మీయంగా అక్క అడుగుతుంటే హృదయానికి చలనం కలగసాగింది.

“కొంచెం ఒంట్లో బావుండడం లేదక్కా!”

“బావుందిరా, ఆరోగ్యం చెడగొట్టుకుని అంతలా చదవకపోతేనేం?”

అంతలో భానుమతి భర్త మూర్తి ఆఫీసునుంచి వచ్చాడు. అత్తవారంటే చులకన భావంవున్న మూర్తి బావమరిదిని చూడగానే ముఖం చిట్లించి ముభావంగా పలకరించాడు. బావగారి పలకరింపు విని శరత్‌లోని ఆశ పలుచబడింది.

భోజనాలయాక అక్క కబుర్లు అడుగుతూంటే చల్లకొచ్చి ముంత దాచడమెందుకని అసలు విషయం చెప్పాడు శరత్. అతని మాట వినగానే భర్తవైపోసారి చూచి తమ్ముడివైపు చూపు తిప్పింది భానుమతి.

“ఏ ముఖం పెట్టుకుని నా దగ్గరకు డబ్బుకోసం పంపిందిరా అమ్మ?

మొక్కు తీర్చుకున్నట్లు పెళ్ళిచేసి పంపి చేతులు దులిపేసుకున్నారు. ఓ అచ్చటా ముచ్చటా ఏనాడైనా జరిపారా? పండక్కయినా పిలిచి బొట్టుపెట్టి చీర పెట్టారా? ముద్దుకైనా పిల్లలికి ఒక్క ఉంగరమైనా చేయించారా?.... పోనీ వాళ్ళ పెట్టుపోతల కోసం ఇక్కడెవరూ నోరు తెరుచుకుని కోర్చోలేదు. నాకివ్వాల్సింది కూడా ఇవ్వకుండా తినేశారు. పోన్లే. అందుకూ నేను బాధపడలేదు. ఆడపిల్ల ఉసురు పోసుకున్నవాళ్లు బాగుపడతారంటలే అనుకుని ఊరుకున్నాను" పయట చెంగుతో ముక్కు తుడుచుకుంది భానుమతి. అక్క మాటలకంటే బావగారి చూపులు బాకుల్లాగా శరత్ హృదయాన్ని తాకుతున్నాయి.

'అమ్మ వెళ్లమంటే మాత్రం తన బుద్దేమయిపోయింది?డబ్బు కావాలన్న ఆదుర్దాలో తను యుక్తాయుక్తాల్ని మరచిపోయాడు. ఆప్యాయతనూ, అనురాగాన్ని పెంచడానికి, తుంచడానికి రక్తస్పర్శ వున్న వ్యక్తుల మధ్య కూడా డబ్బు ప్రధాన సాధనంగా మారిందన్న విషయాన్ని గుర్తించకపోవడం తన తెలివితక్కువ'. శరత్ తనని తాను తిట్టు కుంటున్నాడు.

తనకీ మనసులో పుట్టింటి వారంటే దుగ్ధ వున్నా కేవలం భర్త సంతృప్తికోసం, అతని అహాన్ని నిలబెట్టడం కోసం అంత పరుషంగా మాట్లాడిన భానుమతికి రక్తంచుక్క లేనట్లుగావున్న తమ్ముడి ముఖం చూడగానే ప్రాణం విలవిలలాడింది. చప్పున తన చిన్నతనం కళ్లముందు కదిలింది. ఎక్కువ వయసు తేడా లేకపోవడంవల్ల తనూ శరత్ అక్కాతమ్ముళ్ళలా కాక స్నేహితుల్లా వుండేవారు. అంతలోనే చిలిపికజ్జాలు, అంతలోనే కలిసి నవ్వుకోవడం, తండ్రి తిట్టినా కొట్టినా ఒకరినొకరు ఓదార్చుకోవడం, తమ్ముడు బాగా చదువుకుని పెద్ద ఆఫీసరవ్వాలన్న తన కోరిక... అన్నీ గుర్తుకొచ్చాయి. తన చేతికున్న రెండే రెండు బంగారపు

గాజులు తీసి తమ్ముడికి ఇవ్వాలన్న కోరికను బలవంతాన ఆపుకుంది. అలా చేసిందంటే తన పరిస్థితేమవుతుందో ఆమెకు తెలుసు. భర్త కోపానికి గురై అతని నీడలోంచి బయటపడి బ్రతకగల అవకాశం లేదు తనకు. తన కోరికల్నీ, ఆశల్నీ తనలోనే అణిచేసుకోవడం తప్ప మరో గత్యంతరం లేదు

తల వంచుకుని పిడుగుపాటు తిన్నవాడిలా కూర్చున్న శరత్ తేరుకోవడానికి కొంచెం సమయం పట్టింది.

"అక్కా! మరి నేను వెళ్తాను. లాస్ట్ బస్ అందుతుంది!" శరత్ లేచాడు. అక్కడింక ఒక్క క్షణం వుండాలన్నా దుర్భరంగా వుందతనికి. తమ్ముడినంతగా నొప్పించినందుకు తనను తాను నిందించుకుంటున్న భానుమతి అతనంత అకస్మాత్తుగా బయలుదేరడం చూచి అపరాధ భావనతో క్రుంగిపోయింది. మాటవరసకైనా తన తమ్ముడిని మరోపూట ఉండమని అడగని భర్తని చూస్తూంటే ఉక్రోషం ఎగిసి వస్తూందామెకు. మరో మాటకవకాశమివ్వకుండా బావమరిదిని సాగనంపడానికి లేచాడు మూర్తి.

ఒట్టి చేతులతో ఇంటికి తిరిగివచ్చాడు శరత్. తల్లి బాధపడుతుందని అక్క ఇంట్లో జరిగిందేమీ ఆమెతో వివరంగా చెప్పలేదు.

అక్క చెయ్యలేని పని చెల్లెలు చేసింది. ఎప్పుడో ఓణీలు వేసుకునే కొత్తలో తన ఫ్రెండ్స్ అందరూ రింగులు చేయించుకుంటే తనకూ కావాలని పేచీ పెట్టింది వసుంధర. కూతురి ముచ్చట తీర్చడానికి అప్పుడో రూపాయి అప్పుడో రూపాయి దాచిందంతా తీసి కంసాలిని పిలిపించింది రత్నం. అది చూచిన నీలకంఠం కంసాలిని వెళ్లగొట్టి ఆ డబ్బుతో పట్నంనుంచి రింగులు కొనితెచ్చాడు. వాటిని చూచి వసుంధర మొహం వెలిగిపోయింది. వాటిని రంగుకాగితంలో చుట్టి దాచుకుని పెళ్ళిళ్ళకూ, పేరంటాలకు మాత్రం పెట్టుకునేది. తనుపదిలంగా దాచుకున్న రింగుల్ని బయటకి

తీసింది వసుంధర.

"అన్నయ్యా! ఇవి అమ్మేసెయ్. పెద్దదాన్నయానుగా. ఇప్పుడీ రింగులు నప్పడంలేదు నాకు. నీకు ఉద్యోగం వచ్చాక దుద్దులు చేయించుదువుగాని" చిన్నగా నవ్వుతూ రింగులు తన చేతిలో పెడుతున్న వసుంధరవైపు కన్నెత్తి చూడలేకపోయాడు శరత్. తన అసమర్ధత వెయ్యింతలై ముందు నిలిచినట్లయింది.

"తీసుకో నాన్నా! పుస్తెలు తప్ప వంటిమీద చిన్నమెత్తు బంగారం లేకుండా చేశారు మీనాన్న... బిడ్డ ఒక్కగానొక్కసారి నోరు తెరిచి అడిగితే ఇవ్వడానికి గతిలేకపోయింది...ఏం బ్రతుకో పాడుబ్రతుకు?" వాపోతున్న తల్లివంక నిర్లిప్తంగా చూశాడు శరత్. తిరుగుడుతో, ఎడతెరిపిలేని ఆలోచనలతో అతని నిస్త్రాణ రెట్టింపయ్యింది. అతనిలోని ఆత్మవిశ్వాసం, ధైర్యం సడలిపోసాగాయి.

విధిలేక, మారుమాట్లాడకుండా రింగులు జాగ్రత్త చేసుకుని కాకినాడ తిరిగి వచ్చాడు శరత్. మరునాడు రింగుల్ని అమ్మడానికి బంగారపుషాపుకు వెళ్లాడు. షాపువాడు రింగుల్ని అనుమానంగా అటుఇటు తిప్పిచూసి శరత్‌వైపోసారి ఎగతాళిగా చూచి గీటుపెట్టి నిర్ధారించుకుని శరత్ ముందుకు విసిరాడు రింగుల్ని.

"ఏమిటిబాబూ! ఎప్పుడైనా బంగారం ముఖం చూశావా? ఎవర్ని మోసం చేద్దామని తెచ్చావు?"

నిర్ఘాంతపోయి చూస్తున్నాడు శరత్. ఇవి బంగారపు రింగులు కావా? ... కాదు.... వీడు తననేదో ఠోకరా కొట్టడానికి ప్రయత్నిస్తున్నాడు... తనకు బంగారం గురించి అసలేమీ తెలియదు. ఎలా మరిప్పుడు?!.

"కొట్టేసేది కాస్త చూసుకుని కొట్టేస్తే వ్రతం చెడ్డా ఫలం దక్కుండేది. బంగారపుపూత పూసినవి కొట్టేస్తే లాభమేమిటి?" హేళనగా చూస్తూ పెద్దగా

నవ్వుతున్న షాపువాడి పీకనులమాలన్నంత ఉద్రేకమొచ్చింది. బిగుసు కుంటున్న గుప్పెళ్లను బలవంతాన విప్పి రింగులు తీసుకుని బయటపడ్డాడు.

శరత్ హృదయం కుతకుత ఉడికిపోతూంది. తండ్రి చేసిన మరో దగుల్బాజీ పనికి తనీ అవమానాన్నెదుర్కోవలసి వచ్చింది. చిన్నపిల్లను బంగారపువి అని చెప్పి దారుణంగా మోసం చేసి ఆ డబ్బు తను వాడేసుకున్నాడు. రింగులు బంగారపువి కాదని వసుకు తెలిస్తే ఎంత అసహ్యించుకుంటుందో తండ్రిని!

అది సరే ఇప్పుడు తన గతేమిటి? బంగారం ధర బాగా పెరిగింది కదా రింగులు అమ్మితే తన పని గడిచి పోతుందనుకున్నాడు. ఇదీ చుక్కెదురే అయింది. తను డబ్బుకోసం తిరగడంతో పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. రేపే ఆఖరిరోజు ఫీజు కట్టడానికి. ఎప్పుడూ సహాయం చేసేవాళ్లని వద్దనుకుంటూనే అడిగి 'సారీ' అనిపించుకున్నాడు.

సడన్‌గా 'నీకే ప్రాబ్లమ్ వచ్చినా నన్ను కలువు' అని అభయ హస్తమిచ్చిన చక్రపాణి మాస్టారు గుర్తుకొచ్చారు. మనసు వెనక్కు లాగుతున్నా కాళ్లీడ్చుకుంటూ రామారావుపేట వెళ్లాడు శరత్.

పెద్ద కంఠంతో కేకలేస్తున్న మాస్టారి స్వరం వినిపించి గుమ్మంలోనే ఆగిపోయాడు. దూకుడుగా ముందు వసారాలోకి వచ్చిన మాస్టారు శరత్‌ని లోపలికి ఆహ్వానించడంతో వెనక్కి తిరగడానికి అవకాశం లేకపోయింది. అలాంటి పరిస్థితిలో తనిక్కడికి వచ్చినందుకు సిగ్గుపడుతూ, సంకోచపడుతూ, ముడుచుకుపోతూ వచ్చి కూర్చున్నాడు శరత్.

"ఎలా చదువుతున్నావోయ్?"

"బాగానే చదువుతున్నానండీ!"

"నువ్వు బాగానే చదువుతావోయ్. నాకు తెలుసు. నీ తల్లిదండ్రులు అదృష్టవంతులు. ఇదిగో కాంతం ఇటు చూడు. ఇతను శరత్ అని నా

స్టూడెంట్” శరత్ వంక గర్వంగా చూస్తూ భార్యను పిలిచాడు చక్రపాణి. పయటచెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చిందామె. శరత్ నుంచుని నమస్కారం చేసాడామెకు.

“కూర్చో బాబూ!” అందామె. విచారంగావున్న ఆమె ముఖంవంక తీక్షణంగా చూసారు మాస్టారు.

“శరత్‌ని చూచి నీ కొడుకును బుద్ధి తెచ్చుకోమను. పెద్దవాళ్ళ నుంచి నయాపైసా ఆశించకుండా స్వంతంగా సంపాదించుకుని చదువుకుంటున్నాడు. అలా ఇలా చదువుకోవడం కాదు. ఫస్టున వస్తున్నాడు. కష్టపడి చదువుకుంటున్నాడు గనుక ఇతనికి కష్టం విలువ తెలుసు. నీ పుత్రుడూ వున్నాడు” శరత్‌కి ఆయనలా మాట్లాడుతూంటే చాలా డెలికేట్‌గా వుంది. తను వచ్చిన పని చెప్పలేని పరిస్థితి అలావుంచి మాస్టారి భార్య ముఖం చూస్తుంటే ఎంత త్వరగా అక్కడినుండి పారిపోదామా అనిపిస్తుంది.

“యూనివర్శిటీ చదువు తనొక్కడే వెలిగిస్తున్నట్లు, ఇక్కడ నేనేదో ధనరాసుల్ని పోగేసుకు కూర్చున్నట్లు వారానికో మనియార్డర్ పంపమని టెలిగ్రాం, నాకు సర్కారువారు నెలకోసారి జీతమిస్తున్నారుగానీ వారానికి కాదుగా! టెలిగ్రాం వస్తే చాలు, ఇంక నాకాళ్ళకింద నిప్పులుపోసి మనియార్డర్ చేసేదాకా నిలవనివ్వదీవిడ. పంపి పదిరోజులు కాలేదు నిన్న మళ్లీ టెలిగ్రాం. ప్రొద్దుట లేచిన దగ్గర్నుండీ ప్రతీ అడ్డగాడిద కాళ్లూ పట్టుకున్నాను. నెలాఖరు రోజులు. ఎవరిస్తారు అప్పు?” కోపంగా మొదలుపెట్టిన మాస్టారు నిస్పృహగా చెప్పుకు పోతున్నారు. శరత్‌కి ఇంక అక్కడ కూర్చోవడం దుర్భరంగా అనిపించింది. తనొచ్చిన పని అవదని కూడా అర్ధమైంది.

మాస్టారి దగ్గర సెలవు తీసుకుని వచ్చేసాక ఫలితం వుండదని

అనిపించినా ఆశచావక మరో రెండుమూడు చోట్ల ప్రయత్నం చేశాడు.

రాత్రి పదవుతుండగా తిరిగి తిరిగి అలసిపోయి నిరాశతో క్రుంగి పోయి రూమ్‌కి చేరుకున్నాడు శరత్. ఏం చెయ్యాలో ఆలోచించ డానికి కూడా ఓపికలేక ముడుచుకుని పడుకున్నాడు.

మరునాడు కాలేజీకి వెళ్ళలేదు శరత్. కష్టమో, నిష్టూరమో ఇప్పటిదాకా బలవంతాన నెట్టుకొచ్చాడు. చివరలో వచ్చిన ఈ అవాంతరం తన జీవితగమనాన్ని కుంటుపరుస్తుందన్న ఆందోళన అతని హృదయాన్ని కుదిపేస్తూంది.

ఎవరో తలుపును చిన్నగా తడుతూంటే ఆలోచనల్లోంచి బయటపడి తలుపుతీసిన శరత్ రెప్పవాల్చడం మరచిపోయి సంభ్రమంగా చూస్తున్నాడు.

"గుడీవినింగ్!" మృదువుగావున్న సరళ కంఠం విన్నాక స్పృహలోకి వచ్చాడు శరత్. శరత్ క్లాసులో వున్న ఒకే ఒక్క ఆడపిల్ల సరళ.

"గుడీవినింగ్. రండి రండి..." కంగారుగా కుర్చీలోవున్న పుస్తకాలు తీసి టేబిల్‌మీద పెడుతూ ఆమెను లోపలికి ఆహ్వానించాడతను.

"క్లాసుకు రాలేదేం మీరివాళ?" సరళ ప్రశ్నకు జవాబివ్వకుండా ఇబ్బందిగా పెట్టాడు ముఖాన్ని.

"మంచినీళ్లు పుచ్చుకుంటారా?" గబగబా కూజా దగ్గరకు వెళ్లాడు.

'ఈవిడగారిప్పుడిక్కడికెందుకొచ్చిందో? తనతో ఇంతవరకు ఎప్పుడూ మాట్లాడిన గుర్తులేదు. ఇంత అకస్మాత్తుగా తమగదికి ఎందుకొచ్చిందో?'.... మంచినీళ్లు తెచ్చి ఆమెకు దగ్గరగా టేబుల్ మీదుంచాడు.

"నేనో పొరపాటు పనిచేశాను. మీరు కోపం తెచ్చుకోనంటే చెప్తాను!" ఆమె మాటలు వింటూంటే మతిపోతూంది శరత్‌కి. ఆవిడ పొరపాటు పన్లు చేస్తే మధ్యలో తనకు కోపమెందుకు? అసలీ అమ్మాయి స్పృహలోనే

వుందా? తన రూమ్‌కిలా రావడమేమిటి? ఇలా అర్థం పర్థం లేకుండా మాట్లాడడమేమిటి?

"ఏమిటి మాట్లాడరు?"

"పొరపాటు పనా? మీరా? చేసారా? నేన్నమ్మను" శరత్ ధోరణికి నవ్వొస్తూంది, తను చెప్పే విషయాన్ని అతనే విధంగా తీసుకుంటాడో, అభిమానం దెబ్బతిని పరుషంగా మాట్లాడతాడేమోనని జంకుగా వుంది సరళకు.

"ఏమీ అనుకోనని మీరు ప్రామిస్ చేయాలి" ఆ అమ్మాయి వాలకాన్ని ఎంత ఆలోచించినా అర్థం చేసుకోలేక పోతున్నాడు. అసలే తన గొడవతో తను ఛస్తూంటే మధ్యలో ఈవిడగారి గోలేమిటి?... ఈ ఆడపిల్లల్తో జాగ్రత్తగా వుండకపోతే ప్రమాదం... ఏం మాట్లాడితే ఎక్కడికి లాక్కెళ్తుందో ఈవిడగారు?

"చెప్పండి!"

"మీరు ప్రామిస్ చేస్తేనే!?" సస్పెన్స్‌లో పెట్టి చంపుతూందే ఈ పిల్ల. తనతో ఒట్లు కూడా పెట్టించడానికి చూస్తూంది. సరే. ఏమయితే అదైంది.

"ప్రామిస్! చెప్పండి!"

"మీ పర్మిషన్ లేకుండా మీ ఎగ్జామినేషన్ ఫీజు నేను కట్టాను!"

వెయ్యి వీణలొక్కసారి నినదించినట్లయింది శరత్‌కి. నిజం... నిజంగా ఈ అమ్మాయి తన పరీక్ష ఫీజు కట్టిందా? తను పరీక్షఫీజు కట్టలేదని ఎలా తెలిసిందీ అమ్మాయికి?... ఒకవేళ తెలిసినా అవలీలగా డబ్బు కట్టగలిగేంత సంపన్నురాలా!... అసలింతగా తనను గమనిస్తూందా ఈఅమ్మాయి?!.. శరత్ హృదయంలో మెత్తటి స్పందన.

"నేను ఫీజు కట్టలేదని ఎలా తెలిసింది మీకు?" తబ్బిబ్బు పడుతూ

అడిగాడు శరత్.

"నేను సాయంత్రం బజారుకొచ్చాను" ఉన్నత శిఖరాలమీద నుంచి జరజరా జారిపోతున్నట్లనిపించింది శరత్‌కి. అయితే ఆ అవమానకరమైన దృశ్యం ఈ అమ్మాయి కంటపడిందన్న మాట!!... తనెలాంటి పరిస్థితుల్లో ఎంత కష్టంమీద చదువుకుంటున్నాడో అందరికీ తెలుసు. అందుకెప్పుడూ ఆత్మన్యూనతతో బాధపడలేదు తను. తన పరిస్థితిని దాచి ఏ లోటూ లేనివాడిలా నటించనూ లేదు. కానీ అంతటి దుర్భరమైన పరిస్థితిలో ఈ అమ్మాయి కంటబడ్డాడా తను?... సన్నటి సెగ లేస్తూంది శరత్ హృదయంలో... అతని ముఖం చూశాక నిజంచెప్పి అతన్ని నొప్పించకుండా మరేదైనా చెప్పివుంటే బావుండేదనిపించింది సరళకు.

"సారీ మిమ్మల్ని హర్ట్ చేశానేమో?... కాలేజీలో చేరిన దగ్గర్నుండి అవసరానికెప్పుడైనా ఉపయోగ పడుతుందని ఐదు, పది దాస్తూ వచ్చాను". ఒక్క క్షణం సంకోచంగా ఆగింది సరళ.

"ఉదయం ఆఫీసులో కనుక్కుంటే మీరు ఫీజు కట్టలేదని తెలిసింది. మీరు కాలేజీకి రాలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఏమైతే అదయిందని ఫీజు కట్టేశాను. కట్టడమైతే కట్టానుగానీ మళ్లీ మీరెక్కడ తిడతారోనన్న భయం పట్టుకున్నది నన్ను" భయంగా అతని ముఖంవంక చూస్తూ చిన్నగా చెప్తూంది సరళ.

'తిట్టడమా? దేవతలా నన్నాదుకున్న మిమ్మల్ని తిట్టడమా? ఇంతటి అభిమానాన్నెలా భరించేది? మీరుణాన్నెలా తీర్చుకోను?... మీ సహాయం తీసుకోవడం చిన్నతనంగా భావించి బాధపడతా ననుకుంటున్నారు కదూ మీరు?... నా బ్రతుకే ఇతరుల సహాయంమీద ఆధారపడి నడుస్తూంది... ఇతరుల సహాయం తీసుకోడానికి, దయాధర్మల్ని స్వీకరించడానికి అవమానపడితే నేనొక్క అడుగు కూడా వెయ్యలేను... ఇంత గొప్ప

సహాయాన్ని ఇంతవరకూ ఎవరూ చెయ్యలేదు…' భావోద్వేగంతో కదిలిపోతూంది శరత్ హృదయం. మాటలు రానట్లుగా వుండిపోయాడో నిమిషం.

"థాంక్ యూ! థాంక్ యూ ఫర్ యువర్ కైండ్ హెల్ప్. మీకు కృతజ్ఞతను తెలుపుకోవడానికి నాకు మాటలు దొరకడంలేదు. మీరు చేసిన సహాయాన్ని జన్మలో మరిచిపోలేను" ఉద్వేగంతో చలించి పోతున్నాడు శరత్. శరత్ మాటలు విన్నాక తేలికపడింది సరళ హృదయం.

"మీరిచ్చిన డబ్బుకి పదింతలు మళ్ళీ తిరిగి ఇవ్వగలనేమోగానీ సమయానికి మీరు చేసిన ఈ సహాయానికి బదులు తీర్చుకోగలనా నేను?! మీలో ఇంత గొప్ప గుణం వుందని నేననుకోలేదు సరళగారూ?" నక్షత్రాల్లా మెరుస్తున్న కళ్ళతో శరత్‌వంక చూస్తూంది సరళ.

***

శరత్ తన జీవితంలోని ముఖ్య ఘట్టాల్ని క్లుప్తంగా గొంతు తగ్గించి చెప్తున్నాడు. అడ్డు ప్రశ్నలు వేయకుండా ఆసక్తిగా వింటూంది స్రవంతి. కాఫీ తాగి చాలాసేపయినా కబుర్లు చెప్పుకుంటూ కార్నర్ టేబుల్ దగ్గర కూర్చున్నారు శరత్, స్రవంతి. వీళ్ళెప్పుడు లేచి వెళ్ళి పోతారా? ఎప్పుడు అక్కడికి వచ్చి కూర్చుందామా అని తచ్చళ్లాడుతున్న జంటను చూచి వాళ్ళను బాధ పెట్టడం భావ్యంగా వుండదని బిల్లు చెల్లించి బయటకు వచ్చారు.

"మీకేమైనా పనుందా ఇప్పుడు?"

"పనేంలేదు" తమ్ముడు కళ్లముందు నిలిచాడు స్రవంతికి. కానీ అతనితో ఇంకా కాసేపు గడపాలన్న కోరిక అలా జవాబిచ్చేలా చేసింది.

"అలా పార్కులో కాసేపు కూర్చుందామా?"

"పదండి!"

పచ్చికమీద పొందికగా కూర్చుంటున్న స్రవంతివైపు చూశాడు శరత్. ఆ అమ్మాయి ప్రతి కదలికలోనూ సౌందర్యం కనిపిస్తూందతనికి.

"ఏమిటాలోచిస్తున్నారు?" చెక్కిట చెయ్యిచేర్చి ఆకాశంవంక చూస్తున్న స్రవంతిని అడిగాడు శరత్.

"మనిద్దరి జీవితాల్లో ఎంత తేడా ఉందో ఆలోచిస్తున్నాను. అల్లారుముద్దుగా పెంచారు నాన్న నన్ను. పేదరికమంటే ఏమిటో, ఆకలంటే ఏమిటో, బ్రతుకులో కనీసపు కోరికలు తీరకపోవడమెంత దయనీయమైన విషయమో మాకు తెలియకుండా పెంచారు. కానీ..." స్రవంతి వద్దనుకున్నా జరిగిపోయిన పీడకల కళ్ళముందుకు కదలివచ్చింది.

***

అదృష్ట దురదృష్టలనేవి చీకటి వెలుగుల్లాంటివని స్రవంతికి అనుభవంలోకి వచ్చే సంఘటన జరిగింది. అప్పటివరకు ఆరోగ్యంగా తిరిగిన రాంబ్రహ్మానికి అకస్మాత్తుగా ఒక కాలు, చెయ్యి స్వాధీనం తప్పాయి. వెంటనే నర్సింగ్‌హోమ్‌లో చేర్పించి వైద్యం చేయించారు. రక్తపోటు చాలా ఎక్కువగా వుందని, మెదడులోని రక్తనాళంలో రక్తం గడ్డ కట్టిందని, విశ్రాంతి అత్యవసరమని చెప్పాడు డాక్టరు. నర్సింగ్‌హోమ్ నుంచి బయటికి రావడానికి రెండు నెలలు పట్టింది. మరో మూడు, నాలుగు మాసాలు ఎలాంటి ఆందోళన, అలసట లేకుండా వుండాలని సలహా ఇచ్చారు డాక్టర్లు... కానీ పనికి అలవాటయిన రాంబ్రహ్మాన్ని పట్టుకోవడం చాలా కష్టంగా వుంది. చేతికర్ర సహాయంతో కొంచెం అటుఇటు నడుస్తున్న రాంబ్రహ్మం బిజినెస్ వ్యవహారాలు చూసుకోవాలని ఆరాటపడుతున్నాడు.

"చిన్నప్పుడు పిల్లలు పెద్దవాళ్ల మాట వినాలి. వార్ధక్యంలో పెద్దవాళ్ళు పిల్లల మాట వినాలని అంటారుగా నాన్నా మీరెప్పుడూను. మీ వయసు

మాటటుంచి జబ్బు వార్ధక్యంతో సమానమే. ఇప్పుడు మీరు మేము చెప్పినట్లు వినాలి. ఇప్పుడప్పుడే మీరేమీ పట్టించుకోవద్దు." బలవంతాన అతని పైపంచ, చేతికర్ర లాక్కుని పడకకుర్చీలో కూర్చోబెట్టింది స్రవంతి.

'ఇంకా నాలుగు అడుగులేస్తే చాలు, అలసటగా, గుండె దడదడలాడి నట్లుగా వుంటూంది తనకు. ఐనా షాపుకు వెళ్లకుండా ఇంటిదగ్గర వుండా లంటే కష్టంగా వుంది. యజమాని దగ్గరుంటే ఒకలా, దగ్గర లేకపోతే మరొకలా ప్రవర్తిస్తారీ పనివాళ్లు. కాస్త కన్ను మలిపితే చాలు అందినంత వరకు దోచుకుపోవడానికి ప్రయత్నిస్తారు. వెయ్యి కళ్ళతో చూచుకుంటేగానీ ఏదీ సవ్యంగా నడవదీరోజుల్లో. అప్పుడే తను షాపుకువెళ్ళి నాలుగు నెలలపైగా అయింది'. నీరసంగా కుర్చీలో వాలి ఆలోచిస్తూ కూతురివంక చూస్తున్నాడు రాంబ్రహ్మం.

"ఇంట్లో వుండివుండి నాకు పిచ్చెక్కి పోతూందమ్మా! నువ్వు డాక్టరుకన్నా ఎక్కువైపోయావు నన్ను కంట్రోల్ చెయ్యడానికి. నా శరీరం ఇక్కడుంటూంది తప్పితే ప్రాణం మాత్రం అక్కడే వుంటూంది" తండ్రివంక జాలిగా చూచింది స్రవంతి. తండ్రి బాధను తను అర్థ చేసుకోగలదు. కానీ... తప్పదు. ఆయనకీ తాత్కాలికమైన ఖైదు తప్పనిసరి. "నాన్నా! డోంట్‌వర్రీ. నేను చదువుతున్నదేంటి? బికామ్. రేపు పేద్ద బిజినెస్ మాగ్నెట్ కావలసినదాన్ని. ఆఫ్టరాల్ ఈ చిన్న బిజినెస్ వ్యవహారాలు చూడలేనా?!... అహహ! అలా చూడొద్దు. మీది పెద్ద బిజినెస్సే. కానీ నేను చెయ్యబోయే దాంతో పోలిస్తే మీది అతి చిన్న బిజినెస్... మీకెందుకు, మీరు నిశ్చింతగా వుండండి. రోజూ నేను కాలేజినుంచి వచ్చేప్పుడు షాపుకు వెళ్లొస్తాను" చిలిపిగా నవ్వుతూ తండ్రికి హామీ ఇచ్చింది స్రవంతి.

అన్నట్లే షాపుకు వెళ్లొస్తూంది స్రవంతి. రెండురోజుల్లోనే తనక్కడికి వెళ్ళడం అక్కడి వాళ్ళెవరికీ ఇష్టం లేదని అర్థమయింది. ఇంకా పరిశీలనగా

వాళ్లను గమనించసాగింది. వివరంగా తెలియకపోయినా తన తండ్రి వెనకేదో కుంభకోణం జరుగుతున్నట్లనిపించింది. పూర్తిగా తెలుసుకోవడానికి తనకా అనుభవం లేదు. తండ్రికి చెప్పడానికి ఆయనకు మళ్లీ బ్లడ్ ప్రెషర్ పెరుగుతుందేమోనన్న భయం పట్టుకుంది. తల్లికి చెప్పడానికి ఆవిడసలే గాభరా మనిషి. నోట్లో రహస్యం దాగదు. ఏమీ తోచక తన తండ్రి ఫ్రెండ్ వెంకట్రామయ్యగారికీ విషయం చెప్పి సలహా అడిగింది.

వెంకట్రామయ్య గారి జోక్యంతో ఎప్పుడో విరిగి మీద పడుతుం దనుకున్న మిన్ను అప్పుడే విరిగి పడింది. పరిస్థితి తేటతెల్లంగా కనిపించేసరికి షాక్ తిన్నారంతా. నమ్మకద్రోహమంటే ఏమిటో తెలియవచ్చింది. పులిమీద పుట్రలా ఇన్‌కంటాక్స్‌వారు దాడిచేసి ఈకకు ఈక, తోకకు తోక పీకి వదిలిపెట్టారు. ఫలితంగా ఇల్లు, పొలం, బంగారం అన్నీ అమ్మేసి వీధిలో నిలబడాల్సొచ్చింది.

గోరుచుట్టుపై రోకటిపోటులా ఇంత పెద్ద దెబ్బకు తట్టుకోలేక రాంబ్రహ్మానికి హార్ట్ ఎటాక్ వచ్చింది. అప్పుడప్పుడే కోలుకుంటున్న చెయ్యి, కాలు మళ్లీ చచ్చుబడిపోయాయి.

పెద్ద పెద్ద ఐస్ దిమ్మలు నెత్తిమీద పడినట్లయింది స్రవంతికి. ఏమరుపాటుగా వున్న తమపై జీవితం ఇంత దొంగ దెబ్బ తీస్తుందనుకో లేదు. 'డబ్బు లేకపోవడమంటే ఏమిటి' అన్న విషయం నగ్నంగా ఎదుట నిలుస్తుంటే వెర్రెత్తి పోతున్నట్లుగా వుంది.

"నన్ను బ్రతికించాలని ఎందుకమ్మా ఈ తాపత్రయం. నాకు బ్రతకాలని లేదు. ఈ ఇంజక్షన్లతో, మందులతో నన్నింక బాధపెట్టొద్దు. ఈ అవిటివాడితో మీకు బాధలేగానీ నేను బ్రతికి లాభంలేదు. నన్ను సుఖంగా పోనివ్వండమ్మా" ముద్దముద్దగా మాట్లాడుతున్న తండ్రి బొటబొటా

కన్నీరు కారుస్తుంటే విలవిలలాడి పోయింది స్రవంతి.

'బ్రతుకులో ప్రతి విషయంలోనూ లాభనష్టాల లెక్కలేనా నాన్నా?!... నువ్వు బ్రతకాలి. అవిటివాడిగానైనా సరే బ్రతకాలి. మాకు మా నాన్న ప్రాణంతో నిలిస్తే చాలు'... దుఃఖం పొంగివస్తున్నా తన కన్నీళ్లను చూస్తే తండ్రి ఇంకా అధైర్యపడతాడని దిగమింగుకుంది స్రవంతి.

"అలా అనకు నాన్నా! నీకు నయమవుతుంది. మళ్ళీ మామూలుగా లేచి తిరుగుతావు. డబ్బు లేకపోయినా బ్రతుకుతామేమో కానీ నువ్వు లేకుండా ఎలా బ్రతకం నాన్నా?" దీనంగా అడిగింది స్రవంతి. నాన్న లేకపోయినా బ్రతకొచ్చుకానీ డబ్బు లేకపోతే బ్రతకలేమని అప్పటికే అనుభవంలోకి వచ్చింది. అవసరాలు.. అవసరాలు... నాన్న మందులు, డాక్టర్ల ఫీజులు, ఇంట్లో అనుక్షణం కావలసినవి ఎన్నో... బంధుమిత్రులు సాయం చేస్తున్నారు కానీ ఎవరుమాత్రం ఎన్నాళ్ళని ఒక సంసారం సంసారాన్ని నడపగలరు! నెమ్మదిగా నెమ్మదిగా ఒక్కొక్కళ్ళు తప్పుకుంటున్నారు.

కల్పించుకుంటే ఎక్కడ కాళ్లకు చుట్టుకుంటుందోనని సుబ్బలక్ష్మికి ఒక నెల పోగానే వచ్చేయమని ఉత్తరం రాశారామె అత్తవారు. చిందరవందరగా వున్న పుట్టింటిని,బిక్కచచ్చిపోయిఉన్న పుట్టింటివారిని వాళ్ళ ఖర్మానికి వాళ్ళని వదిలేసి వెళ్ళాలంటే కష్టంగా వుంది సుబ్బలక్ష్మికి. అందరికంటే అపురూపంగా పెరిగింది స్రవంతి. ఇంతవరకు బ్రతుకుని ఆడుతూ పాడుతూ గడిపేసిన చెల్లి లేలేత భుజాలమీద అంతటి భారాన్ని వదిలి తనకేమీ పట్టనట్లు తప్పుకోడానికి మనసొప్పడంలేదు. మతిచలించినదాన్లా తనలో తాను గొణుక్కుంటూ కూర్చుంటున్న తల్లి, బెంబేలుపడిపోయి బిత్తరచూపులు చూస్తూ తిరుగుతున్న తమ్ముడు, మంచానపడ్డ తండ్రి... ఎంత భీభత్సంగా, ఎంత దయనీయంగా వుంది

తమ ఇల్లు?

ఇలాంటి పరిస్థితిలోనే కదా మనిషికి మనిషి అవసరం! కన్నీళ్లు తుడిచి ధైర్యం చెప్పే వ్యక్తి తోడుంటే మరికొంచెం గుండెబలంతో పరిస్థితులతో పోరాడగలడు. రేపటిమీద ఆశను, బ్రతుకుమీద కోరికను హృదయంలో నింపుకుని సమస్యల్ని ఎరుర్కోగలడు. ఆ విధంగా చెయ్యాల్సిన అవసరం, నైతికబాధ్యత తన మీదుంది... మరికొన్నాళ్లు వుండివస్తానని అత్తవారికి లెటర్ వ్రాసి పడేసింది. మనిషికి బదులు జాబు రావడంతో ఆమెను తీసుకువెళ్ళడానికామె భర్త వచ్చాడు.

"ఫరవాలేదక్కా? ఎలాగోలా నేను తంటాలుపడ్తానులే. బావకు బాగా కోపమొచ్చింది. నువ్వెళ్ళు!" చెల్లెలి మాట విన్నాక మరీ పట్టుదల వచ్చింది సుబ్బలక్ష్మికి.

"ఎలా తంటాలు పడతావే?!. పరీక్షలింకా నెలరోజులు కూడా లేవు. పరీక్షలు రాయవా మరి? మన దౌర్భాగ్యానికి తోడు చదువు కూడా ఆగిపోతే ఎలా? ఈ నాలుగు రోజులూ బాగా చదివి ఆ పరీక్షేదో గట్టెక్కేలా చూడు" స్రవంతి పాసయి ఏదో ఒక ఉద్యోగంలో చేరితే కుటుంబం పరిస్థితి కొంతవరకైనా కుదుటపడుతుంది. తిండికి కూడా వెతుక్కోవలసిన స్థితి తప్పుతుందనే ఆశతో ఆమె పరీక్షలయ్యేవరకు తను వుండిపోడానికే నిశ్చయించుకుంది సుబ్బలక్ష్మి.

"అది కాదక్కా! బావ..."

"నీకెందుకు? ఆయన సంగతి నేను చూసుకుంటానుగా! నువ్వెళ్ళి చదువుకో" చెల్లెల్ని కసిరి భర్త దగ్గరకు వెళ్ళింది.

"ఎలాగండీ వీళ్లనీ పరిస్థితిలో వదిలేసి రావడం? స్రవంతి పరీక్షలయ్యేదాకా వుండి వస్తాను" భార్య మాటలు విని విశ్వేశ్వరరావుకు కోపం, ఆవేశం వచ్చాయి. పిల్లలు పుట్టి పెద్దవాళ్లవుతున్నా పుట్టింటి మీద

మమకారం పోదీ ఆడవాళ్లకు. అయినా అంతా ఈవిడలాగానే వుంటారా?! అడిగి, దెబ్బలాడి, సాధించి మరీ తెచ్చుకుంటారు పుట్టింటినుంచి... నోరు తెరచి ఏదైనా అడిగితే చాలు, 'మామగారిని అడుక్కుంటానికి సిగ్గులేదా!' అని దులిపేస్తుంది. బుద్ధి పొరపాటయి అత్తవారేదైనా ఇవ్వలేదని అనుకుంటే చాలు ఆదిశక్తిలా మీద పడిపోతుంది. "మిమ్మల్ని లక్ష రూపాయలు పెట్టి కొనుక్కున్నాను. సంతలో కొనుక్కున్న పశువుకి బహుమతుల్విడమేమిటి?" డైరెక్ట్‌గా అనకపోయినా ఈ భావం వచ్చేలా మాట్లాడుతుంది. మొదట్లో నమ్రతగానే వుండేది. తరువాత తరువాతే తనుగానీ, అమ్మ, చెల్లాయిలెవరైనా గానీ తన పుట్టింటివారినేదైనా అంటే చాలు విరుచుకు పడిపోతుంది. అన్నీ బాగానే వున్నాయి ఐదోతనం ఒక్కటే తక్కువని అన్ని గుణాలూ మంచివే. ఒక్క పుట్టింటి వారిమీద ఈగను వాలనీయకపోవడం తప్ప... ఏదో వ్యాపారం బావుందికదా అని, పెంచిపెంచి ఒక మూట ఒక్కసారే ఇస్తాడని ఆశపడి మామగారు కట్నం డబ్బు ఇచ్చేస్తామన్నా తను వద్దని ఇక్కడే వుంచేసాడు. ఇప్పుడీయన నిండా మునిగి కూర్చున్నాడు. ఇంక తన డబ్బుకు నువ్వులు, నీళ్ళతో తర్పణం విడిచేయాల్సిందే.

"ఇంటికెళ్లాక కొంచెం డబ్బు పంపండి. చాలా ఇబ్బందిగా వుంది" అంది సుబ్బలక్ష్మి. 'బావుంది చాలా బావుంది ఇక్కడ రావలసిందాని కెలాగూ ఆశ వదిలేసుకున్నాము. అదీచాలక ఇంకా అక్కడనుండి పంపించాలా?... అబ్బా! కాలు కదిపితే చాలు దేనికోదానికి తగుల్తోంది. ఇంత ఇరుకు కొంపలో ఎలా బ్రతుకుతున్నారో వీళ్లు?!... ఈ ఉక్కతో ప్రాణం పోతూంది. ఫానులు కూడా అమ్ముకుని తినేస్తున్నారా వీళ్ళు!... అంతా బావుండగా అత్తగారు, మామగారూ పోటీలు పడి తమ వాళ్ళకు సాయాలు చేశారుగా, ఒక్కరూ కనపడరేం ఈరోజు?!'

భర్త వాలకం చూస్తుంటే చిరాగ్గా వుంది సుబ్బలక్ష్మికి. ఏమిటిలా

ఉలక్కుండా పలక్కుండా ముంగిలా కూర్చున్నారు?... వట్టి డబ్బు మనుషులు. డబ్బుకుతప్ప మనిషికే విలువాలేదు తన అత్తవారింట్లో. మొదటినుంచీ గొంతెమ్మ కోరికలన్నీ కోరి నాన్నతో పెట్టించుకున్నారు. కాబూలీవాళ్లలా పీడించుకు తింటూంటే తనకు ఒళ్ళు మండిపోయి ఇవ్వొద్దని అమ్మతో అంటే నాన్న నవ్వుతూ తనను సమదాయించి వాళ్ల కోరికల్ని తీర్చేవారు... అంత తిన్నామన్న కృతజ్ఞతయినా లేదీ మనుషులకి. తనవాళ్లీనాడింత కష్టంలోవుంటే చీమకుట్టినట్లయినా లేదు వాళ్లకి... ఒట్టి స్వార్ధపరులు... అసలు తప్పు తనది... బుద్ధితక్కువై పెళ్ళికి ఒప్పుకుంది. స్రవంతి చెప్పినప్పుడైనా తన కళ్లు తెరుచుకోలేదు. తను చదువుకునివుంటే ఈనాడెంత అండగా ఉండేది కుటుంబానికి?... తనే సంపాదిస్తూ ఉంటే తన వాళ్ళని ఆదుకునే స్వతంత్రం తనకుండేది. ఇప్పటిలా డబ్బుకోసం ఒకళ్ళను ముష్టి అడగాల్సొచ్చేది కాదు.

"ఐతే నువ్వు రానట్లేనా? పిల్లల్ని తీసుకెళ్తాను" ముఖానికి గంటు పెట్టుకుని అడిగాడు విశ్వేశ్వరరావు.

"పిల్లల్నెందుకు తీసుకెళ్ళడం?" నాలుగేళ్ల పాప, ఏడాది బాబు, తను లేకుండా వుండడం వాళ్ళ కలవాటు లేదు. అత్తవారింట్లో వారి ఆలనాపాలనా ప్రేమతో చూచే తీరికా, ఓపికా ఎవరికీ లేవు. మరెందుకు తీసుకెళ్లడం? కేవలం తన మీద పంతానికి, తను వాళ్లని విడిచి వుండలేదు గనుక వాళ్లవెనుకే తను కూడా చచ్చినట్లు వెళ్తుందని.

"ఇక్కడెలా వుంటారు?" అతని ప్రశ్నకు చిర్రెత్తుకొచ్చింది సుబ్బలక్ష్మికి.

"ఎలా వుండడమేమిటి! మేమంతా వుండడంలేదా? అలాగే!"

"నా పిల్లలకలా వుండాల్సిన ఖర్మ పట్టలేదు" అతని విసురు సూటిగా వచ్చి తాకింది సుబ్బలక్ష్మికి.

"మేమూ అలాగే అనుకునేవాళ్లం. అదృష్టాన్ని బొడ్డున పెట్టుకుని

పుట్టామని, ఏమీ లేకుండా అన్నిటికీ తడుముకుంటూ బ్రతికే ఖర్మ మాకు పట్టలేదని” అంత విసురుగానూ అంది సుబ్బలక్ష్మి.

ఎప్పుడెవరికే ఖర్మ పడుతుందో ఎలా చెప్పగలం! అన్న ధ్వని వినిపించి అతని అహం దెబ్బతింది. తను రమ్మనగానే మారుమాట్లాడకుండా తన వెంట వచ్చేయక ఎదురుసవాళ్లు చేస్తుందా? అమ్మా, నాన్నా అన్నది రైటే. పెళ్లానికి అలుసివ్వకూడదు. ఇస్తే ఇలాగే నెత్తికెక్కి స్వారీ చేస్తుంది. ఈసారి ఇంటికొచ్చాక తన ప్రతాపం చూపించి లొంగదీయాలి. ఈ పొగరు కాస్తా అణిచేయాలి. మొగాడు, భర్త అంటే ఏమిటో తెలిసేలా చెయ్యాలి... గబగబా బట్టలు సర్దుకుని బయటికి వచ్చాడతను. ముందు వాకిట్లో ఆడుకుంటున్న పిల్లలిద్దరూ తండ్రి బయటకురాగానే కాళ్ళకు చుట్టుకున్నారు. భార్య మీదెంత కోపంగావున్నా ఇన్నిరోజులుగా పిల్లల్ని వదిలి వుండడంవల్ల విడిచి వెళ్ళడం కష్టంగానే వుందతనికి. బలవంతాన వాళ్ళను విడిపించుకుని వడివడిగా వెళ్ళిపోయాడు.

సుబ్బలక్ష్మి మనసు మండిపోతూంది. భార్యంటేనూ, అత్తవారంటేనూ ఇంత అలుసా?... తనూ ఓపిక పట్టినన్నాళ్ళూ పట్టింది. పరమసాధ్వి అని పేరు తెచ్చుకోడానికి తన ఆత్మాభిమానాన్ని పణం పెట్టాలంటే తనవల్ల కాదు. భార్య అంటే బానిసలా ఉండాలని వాళ్ళ ఆశ. భార్యాభర్తల్ని కట్టి వుంచాల్సింది ప్రేమ, ఆప్యాయతా బంధం తప్ప అధికారి, బానిసా అన్న భావం కాదన్నది తన నమ్మిక. వాళ్ళ ఆశకు, తన నమ్మికకూ పొత్తు కుదురదు. సంఘర్షణకు జడిసి రాజీపడిపోయి వాళ్ళ కాళ్ళక్రింద చెప్పులా మాత్రం తను బ్రతకలేదు.

“ఏమిటక్కా నీకు బావతో పంతం? మాకోసం సంసారం వదులుకుని ఎన్నాళ్లిక్కడుంటావు?” ఆ ఇంట్లో వద్దనుకున్నా, అక్కా, బావల పోట్లాట స్రవంతి చెవిన పడింది.

"నా ఇష్టం వచ్చినన్నాళ్ళు. అడగడానికి నువ్వెవరివే?" అక్క కోపం చూచి చాలా రోజుల తరువాత మనసారా నవ్వింది స్రవంతి.

***

స్రవంతి పరీక్షలయ్యాక సుబ్బలక్ష్మి వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు చెల్లెలితో ఏ అవసరం వచ్చినా తనకు రాయమని పదిసార్లు చెప్పి వెళ్ళింది. తను వెళ్ళిపోతూందన్న మాటేగానీ ప్రాణమంతా ఇక్కడే ఉంటుందని, అవసరపడితే రెక్కలు కట్టుకుని వచ్చి ఇక్కడ వాలతానని పదేపదే చెప్పి వెళ్ళింది.

తమకోసం అక్క నిష్టూరాల్ని భరిస్తూంది. పోరుపెట్టి అక్కను పంపించేసింది గానీ తరువాత ఒంటరిగా పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చేప్పటికి భయమేసింది స్రవంతికి. మంగళగిరి పానకాలస్వామికిలాగా నాన్న జబ్బుకి ఎంత డబ్బు పోసినా దాహం తీరడంలేదు. ఇంట్లో ఒక పద్ధతి ఖర్చుకు అలవాటు పడ్డారిన్నాళ్ళూ. ఎంత తగ్గించుకుందామనుకున్నా ప్రతిదీ అత్యవసరమైన అవసరంలాగే కనిపిస్తూంది. అన్ని దారులూ మూసుకుపోయి ఇంట్లో విలువైన వస్తువులన్నిటికీ కాళ్ళొచ్చి చిట్టచివరికి పూట గడవని స్థితి వచ్చింది.

లోపలెంత గాభరాగా, అనిశ్చితంగా, భయంగావున్నా పైకి మాత్రం గంభీరంగా వుండడానికి ప్రయత్నిస్తూంది స్రవంతి. ఇన్నాళ్లూ వాళ్లూ వాళ్లూ సర్దుతూంటే ఎలాగోలా నెట్టుకొచ్చారు. ఇప్పుడు ఎవరి సహాయం తీసుకోవాలన్నా ప్రాణం చచ్చిపోతూంది. తను ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకోవాలి. తన సంపాదనతో ఎవరి దగ్గరా చెయ్యి చాచకుండా ఇల్లు గడపాలి. అప్పుడుగానీ తనకు మనశ్శాంతి దొరకదు. అందుకోసం ఏ చిన్న ఆధారం దొరికినా ఎంత చాకిరీ చేయాల్సివచ్చినా సంతోషంగా చేస్తుంది. కానీ ఆ ఉద్యోగం దొరకడమనేదే ఓ ఎండమావిలా వుంది.

"అమ్మా!" తండ్రి పిలుపువిని ఆలోచనల్లో నుంచి బయట పడింది స్రవంతి.

"ఏంటి నాన్నా!" తండ్రి పక్కలో కూర్చుని ఆయన చచ్చుపడిపోయిన చేతిని తన చేతుల్లోకి తీసుకుంది.

''ఆకలిగా వుందమ్మా!'' తృళ్ళిపడింది స్రవంతి. బాణం దెబ్బతిన్నదానిలా తండ్రివంక చూచింది. లక్షాధికారి అయిన తన తండ్రి, పుట్లకొలది ధాన్యాన్ని పండించి గాదెలు నింపిన తన తండ్రి, పదిమంది ఆకలిని తీర్చిన తన తండ్రి 'ఆకలిగా వుందమ్మా!' అని అంత దీనంగా అడగడం చూచి దుఃఖాన్నాపుకోలేక పోయింది. గబగబా వంటంట్లోకి వెళ్ళి తినడానికేమైనా దొరుకుతుందేమోనని వెదికింది ఖాళీగిన్నెలు వెక్కిరిస్తున్నట్లుగా కనపడ్డాయి.

"అమ్మా! అన్నం వండలేదా?" మూడంకెవేసి పడుకున్న తల్లిని తట్టి అడిగింది. జవాబుగా ముక్కు చీది, పయట చెంగుని నోటికడ్డు పెట్టుకుంది. అర్థం చేసుకున్న స్రవంతి పర్స్ తెరచి చూచింది. ఆఖరి రూపాయి ఒదిగి దాగింది. దాన్ని తీసుకుని పరుగులాంటి నడకతో వెళ్లి ఒక బన్ కొనుక్కొచ్చి ఒక కప్పు టీ పెట్టి దానిలో ముంచి తండ్రికి తినిపించింది. ఆవురావురు మంటూ, ఆబగా తింటున్న తండ్రిని చూచి ఆఖరి ముక్క అతని నోట్ల పెట్టి పెరట్లోకి వెళ్లి మోకాళ్ళమీద తలానించి వెక్కివెక్కి ఏడ్చింది....ఇప్పుడు ప్రకాష్ వస్తాడు. వాడి ఆకలినెలా తీర్చడం? పంచభక్ష్య పరమాన్నాల్ని తినే తమకింత దుర్గతి పడుతుందని కలలోనైనా అనుకున్నారా? తమ భవిష్యత్తు గురించి ఎన్నెన్ని గాలిమేడలు కట్టుకున్నారు? తను ఎమ్.బి.ఏ చేసి తమ బిజినెస్నింకా ఇంకా అభివృద్ధి చేయాలని, తమ్ముడు ఐ.ఏ.ఎస్ చేసి కలెక్టరవ్వాలని... ఎన్నెన్ని బంగారు కలలు!... ఒక్క క్షణంలో అన్ని గాలిమేడలూ కూలిపోయాయి. అన్ని

కలలూ కాలిపోయాయి.  కానీ... ఈ శిథిలాల్ని, బూడిదనూ చూస్తూ ఏడుస్తూ కూర్చోదు తను.  తను ధైర్యంగా వుంటుంది.  పునాదుల్నుండి మళ్లీ మొదలుపెడుతుంది.

"అమ్మా!" తండ్రి పిలుపువిని కళ్ళు తుడుచుకుంటూ లోపలికొచ్చింది స్రవంతి.

"ఎప్పుడొచ్చారు మామయ్యా?" తండ్రి ప్రక్కలో కూర్చున్న వెంకట్రామయ్యను పలకరించింది.

ఆకలితో, అలసటతో, దుఃఖంతో వాడిపోయిన స్రవంతి ముఖంవంక జాలిగా చూసాడాయన.  ఫ్రాకుల పాపాయి వయసునుంచి ఈ అమ్మాయి తనకు తెలుసు.  తను కావాలనుకున్నది పొందకపోతే ఎంత మారాం చేసేదో, ఎంత అల్లరిగా, పెంకెగా వుండేదో తనకింకా గుర్తుంది. ఆశాభంగం అంటే తెలియని ఈ అమ్మాయి ఇంత ఆపదనెలా తట్టుకోగలుగుతూంది?

"పాపం వాళ్ళాకలికెలా ఆగగలరు మామయ్యా?" బిచ్చగాళ్లను చూపిస్తూ జాలిగా, అమాయకంగా తనను అడిగిన పిల్ల ఆకలికెలా ఓర్చుకుంటూంది? 'డన్‌లప్ పరుపుమీద తప్ప నాకు నిద్ర పట్టదు' అని కరాఖండిగా చేప్పేసే అమ్మాయి ఇప్పుడు కటికనేలమీదెలా పడుకోగలుగుతూంది?!

"బావున్నావామ్మా!" ఆయన పలకరింపులోని ఆప్యాయతకు స్రవంతి కళ్ళల్లో చివ్వున నీళ్ళుబికాయి... తనొట్టి అర్భకురాలు. ఒక్క నిమిషం ముందు, ఇప్పుడేగా తను ధైర్యంగా ఉంటానని ప్రతిజ్ఞ తీసుకుంది! అవసరాన్ని మించిన సంపద, అన్నీ ఏ అవాంతరం లేకుండా జరిగిపోవడం తనలో సుకుమారాన్ని పెంచాయి.  ఏ చిన్ని కష్టం ఎదురైనా బెంబేలు పడిపోయే దుర్బలతను సృష్టించాయి... నో... తనీ దుర్బలతను జయిస్తుంది.

తను కన్నీళ్ళు పెట్టుకోదు.

"ఏం బావుండడంరా? ఇవన్నీ చూడకుండా నా ప్రాణం పోయుంటే ఎంత హాయిగా వుండేదా అని ఏడుస్తున్నాను" మిత్రుడి భుజంమీద చిన్నగా తడుతూ ఓదార్పుగా చూచాడు వెంకట్రామయ్య.

"ఆ శ్రీరామచంద్రుడంతటి వాడికి తప్పలేదు కష్టాలు. నువ్వా నేనూ ఎంతరా? తప్పు. ఊరుకో. నువ్వే ఇలా బాధపడితే, చిన్నపిల్లలు వాళ్ళకెవరు ధైర్యం చెబుతారు?"

"అలా చెప్పండి మామయ్యా!.. ఇప్పుడేమయిందని?... డబ్బు లేకపోయినా లోకంలో ఎంతోమంది ఏదోవిధంగా బ్రతికేయడంలేదా? అలాగే మనమూ బ్రతుకుతాం. ఏం మామయ్యా?" వెంకట్రామయ్య తీర్పుకోసం ఎదురు చూస్తున్నదానిలా ఆగింది స్రవంతి.

''అవునమ్మా! ఎందుకు బ్రతకలేం?'' స్రవంతి ఎంతగా క్రుంగిపోయుంటుందో, ఎలా ఓదార్చాలో అని భయపడుతున్న వెంకట్రామయ్య స్రవంతి నిబ్బరం చూసి ఊరట పొందాడు.

"మామయ్యా! నాన్న మేమేదో దిక్కులేని పక్షుల్లా అయిపోయామని బాధపడుతున్నారు. నేను చదువుకున్నాను. రెండు సంవత్సరాల్లో ప్రకాష్ చదువయిపోతుంది. మేమిద్దరం కలిసి అమ్మానాన్నల్ని పోషించలేమా?"

"చదువుకోగానే సరా? చదువుకోగానే బ్రతక గలుగుతున్నామా ఈ రోజుల్లో? రెండు నెల్లనుంచి కాలికి బలపం కట్టుకుని తిరుగుతూంది ఉద్యోగం కోసం. దొరికిందా? తెలిసిన వాళ్ళేమో ఉద్యోగం ఇచ్చి లోపలికి రానిస్తే ఇంకేం బాధ్యతలు చుట్టుకుంటాయోనని అస్సలు ఖాళీలే లేవంటున్నారు. తెలీని వాళ్ళు రెండొందలిస్తాం. మూడొందలిస్తాం అంటున్నారు. ఎప్పుడైనా అటు పుల్ల ఇటు పెట్టిన పిల్లా ఇది? ఆ అరవచాకిరీ ఎలా చేస్తుందిరా?" దీనంగా అడుగుతున్న రాంబ్రహ్మాన్ని

చూస్తుంటే వెంకట్రామయ్య గుండె మెలిపెడుతున్నట్లుగా ఉంది.

"నిజమే!" ఏం చెప్పాలో తోచక స్నేహితుడికి వంతపాడాడు వెంకట్రామయ్య.

"భలే వుంది మామయ్యా మీరిద్దరూ చెప్పేది! అందరూ కష్టపడడం లేదా? ఈ మాత్రం దారికూడాలేని వాళ్ళెంతమంది? నా ఫ్రెండొక ఉద్యోగం చూపించింది. ఇప్పటివరకు చేరదామా వద్దా అని సంశయిస్తున్నాను కానీ ఇంక చేరక తప్పదని ఇవాళే నిశ్చయించుకున్నాను. రేపెల్లి జాయినవుతాను" దృఢంగా అంది స్రవంతి.

"మంచిదమ్మా! ఇటు చూడు. ఈ డబ్బుంచు. చిన్నప్పటినుంచి మీ నాన్న నాకెన్నో సహాయాలు చేశాడు. ఎన్నోసార్లు నా పరువు, మర్యాదల్ని కాపాడాడు. అతని అండే లేకపోతే బడిపంతుల్ని నా జీతం డబ్బులతో ఇంతమందినీ చదివించి వృద్ధిలోకి తేగలిగేవాడినా? పెళ్ళిళ్ళూ, పేరంటాలూ చెయ్యగలిగే వాడినా? అతను నాకు చేసిన ఉపకారానికి బదులు తీర్చుకోలేను!"

"ఊరుకోరా? ఇప్పుడవన్నీ ఎందుకు?", మధ్యలో అడ్డొచ్చాడు రాంబ్రహ్మం.

"అమ్మా! మీ నాన్నకు మళ్ళీ ఏ కొంచెంగా ఉపయోగపడినా అది నా అదృష్టమేననుకునేవాడ్ని. ఇంత చెడ్డరోజులొచ్చి ఈ విధంగా వుంటారని ఎప్పుడూ అనుకోలేదు. ఇలా ఉపయోగపడే అవసరం వస్తుందని అనుకోలేదు... నిన్ననే ప్రావిడెంట్ ఫండ్ తాలూకు డబ్బందింది. పెద్దబ్బాయి బొంబాయి వచ్చేయమని ఉత్తరం రాశాడు. ఓ వారం రోజుల్లో వెళ్దామనుకుంటున్నాను"

"ఆ డబ్బు మాకిచ్చేస్తే నీకెలారా? మంచికీ చెడుకీ చేతులో డబ్బు లేకుండా ఎలా వుంటావు?"

"నాకేం అవసరాలుంటాయి? ఉన్నా, సంపాదిస్తున్న కొడుకులిద్ద రున్నారు... వాడలాగే అంటాడు. ఉంచమ్మా ఇది" బలవంతంగా స్రవంతి చేతిలో డబ్బు కవర్ పెట్టాడు.

"ఎందుకు మామయ్యా? అందరికీ ఎంత రుణపడి పోతున్నామో?" మొహమాటంగా అంది స్రవంతి.

"రుణాల ప్రసక్తివస్తే మీ నాన్న రుణం తీర్చుకుంటానికీ జన్మ చాలదు నాకు. నువ్వదేం మనసులో పెట్టుకోకమ్మా! నువ్వెంతో వృద్ధిలోకి రావాలని దీవిస్తూ ఇస్తున్నానిది. నువ్వు తప్పకుండా వృద్ధిలోకి వస్తావు" ఆయన ప్రేమాభిమానాలకు స్రవంతి హృదయం అరుణకిరణాల స్పర్శతో కరుగుతున్న మంచులా వుంది.

"థాంక్యూ మామయ్యా!"

"ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగువేసి రంగ రంగ వైభవంగా పెళ్ళి చేస్తాననేవాడు మీ నాన్న!"

"వద్దురా! అవన్నీ గుర్తు చెయ్యొద్దు. దాని నుదుటన పొట్ట చేతపట్టుకుని తిరిగే గీత గీసుంటే అలా ఎందుకు జరుగుతుంది?" బాధగా అన్నాడు రాంబ్రహ్మం.

కానీ.... త్వరలోనే స్రవంతి తన నుదిటిన పొట్టచేతపట్టుకుని తిరిగే గీత గీసిలేదని నిరూపించింది. మంచి మనసుతో వెంకట్రామయ్య చేసిన సహాయం ఆమెలో కొత్త ఆలోచనల్ని రేపింది. కొత్త పథకాన్ని రూపొందించుకునేలా చేసింది. కొంత లోన్ తీసుకుని బుక్‌షాప్ తెరవాలని నిశ్చయించుకుంది. అందుకు అవసరమైన వ్యక్తుల దగ్గరకు విరామం లేకుండా తిరిగి సాధించింది. సూర్యారావుపేట మెయిన్‌రోడ్‌లో షాపు తెరిచాక ఊపిరి పీల్చుకుంది.

షాపు తెరిచాక స్రవంతిలో అంతవరకూ ఉన్న అనిశ్చిత పరిస్థితి, భద్రతా రాహిత్యం, బ్రతుకుభయం తొలగిపోయి ఆత్మవిశ్వాసం చోటు చేసుకుంటూంది. కష్టపడి పైకి రావాలన్న పట్టుదల, బిజినెస్‌ని వృద్ధి చేయాలన్న కృతనిశ్చయం పటిష్టమవుతున్నాయి.

బిజినెస్ అంటే పూలపానుపు కాదని అతి త్వరలోనే తెలిసి వచ్చింది స్రవంతికి. అందులోనూ పుష్కలంగా డబ్బు లేకుండా, ఏ అండా లేకుండా, ఏ అనుభవం, లౌక్యం లేకుండా వ్యాపారం నడవడంలోని సాధకబాధకాలు తెలిసొచ్చాయి. తెల్లారి లేచిన దగ్గర్నుండి ఏదో ఒక సమస్య. దాని పరిష్కారం కోసం సతమతమవడం... బ్రతుకంతా ఇలా తడుముకుంటూ పోరాటం సలుపుతూ గడిపేయాల్సిందేనా అన్న నిస్పృహ కలుగుతూంది ఒక్కొక్కప్పుడు. అంతలోనే తేరుకుని గుండెల్నిండా ధైర్యాన్ని నింపుకుని తన భుజం తానే తట్టుకుంటూ ప్రోత్సహించుకుని బ్రతుకు యుద్ధానికి సమాయత్తమవుతూంది.

అయిదారు నెలలు గడిచేసరికి వ్యాపారం ఓ గాడిలో పడింది. పెద్దగా కూడబెట్టే పరిస్థితి రాకపోయినా ప్రతి చిన్నదానికీ ఒకరిదగ్గర చెయ్యిచాచే అవసరం తప్పింది.

ఇటు ఇంట్లో కూడా కాస్త సంతోషం కనిపిస్తూంది. రాంబ్రహ్మం అనారోగ్యం అలవాటయిపోయింది. ఎవరికి తగ్గ సహాయం వారు చేసి ఆయన కష్టపెట్టుకోకుండా చూస్తున్నారు తప్పితే ఆకాశం ఊడి పడిపోతున్నంత కష్టమొచ్చినట్టుగా ఎవరూ బాధపడడం లేదు. దమయంతి అస్తమానం తమ దురదృష్టాన్ని తిట్టుకుంటూ కూర్చోవడంలేదు. ఇంటెడు చాకిరీ స్రవంతిమీద వదిలేసి ఏడుస్తూ పడుకోవడంలేదు. ఇల్లు గడపడంలో స్రవంతికి ఏ బాధ్యతా బాదరబందీలూ లేకుండా చక్కదిద్దుకొస్తూంది. వడదెబ్బ నుండి తేరుకుంటున్న వాడిలా వున్నాడు ప్రకాష్.

ఇంటా బయటా కాస్త ప్రశాంతత దొరకడంతో స్రవంతిలో మునుపటి ఉత్సాహం మళ్ళీ చేరుకుంటూంది....

స్రవంతి తమ బ్రతుకులోని నల్లటికోణాల్ని వర్ణించి చెప్తుంటే ఆమెవంక తదేకంగా చూస్తూ వింటున్నాడు శరత్.

"బ్రతుకుని ఛాలెంజిగా తీసుకుని పోరాడి పైకి రావడం వేరు. వడ్డించిన విస్తరి ముందు కూర్చుని తింటూ శరీరాన్ని పెంచుకోవడం వేరు. ఎవరి మనస్తత్వాన్నిబట్టి వాళ్ళు ఆ రకమైన జీవితమంటే ఇష్టపడతారు" అన్నాడు శరత్.

"చిత్రమేమిటంటే రెండు రకాల జీవితాల్నీ గాఢంగా అనుభవించాన్నేను. కానీ పరిస్థితులెంత భయంకరంగా వున్నాయంటే సమస్యల వరదలో నిలదొక్కుకుని నిలబడగలవాళ్ళు వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంత మందయితే, దిక్కు తెలియకుండా కొట్టుకుపోయేవాళ్ళు లెక్కలేనంతమంది . నిలదొక్కుకోవడానికి నిలబడాలన్న పట్టుదల ఒక్కటే చాలడంలేదు, ఏదో ఒక ఆధారం, ఒక మంచిమాట, కొంచెం ప్రోత్సాహం, మరికొంచెం ఆదరణ అవసరమవుతున్నాయి. స్వార్ధం, మోసం, వంచన పునాదిగా ఉన్న ఈ వ్యవస్థలో వీటికోసం సెర్చిలైటు వేసి వెతికి పట్టుకోవలసి వస్తూంది" స్రవంతి మాటలు వింటూ ఆలోచిస్తున్నాడు శరత్.

'స్రవంతి చెప్తూన్నది నిజమే. మంచిగా, న్యాయంగా ఇతరులకు ఉపయోగ పడేలా బ్రతకాలనుకునే వాళ్ళు కొంచెం ఆదమరపుగా వుంటే చాలు స్వార్ధపరులు వాళ్ళని చప్పరించి మింగేస్తున్నారు. ఫలితంగా పరోపకారం చెయ్యడానికంటే ఆత్మరక్షణకు ఎక్కువ టైమ్‌ని వెచ్చించాల్సి వస్తూంది.' దూరంగా చర్చి గంటలు వినిపించాయి. ఒంగి శరత్ వాచ్‌లో టైము చూచింది స్రవంతి.

"మా తమ్ముడు నాకోసం ఎదురుచూస్తూ వుంటాడు షాప్‌లో.

కబుర్లలోపడి టైమ్ తెలియలేదు. ఇప్పుడే వస్తానని చెప్పి డిస్ట్రిక్ట్ లైబ్రరీకి పుస్తకాల కోసం వచ్చాను. మావాడీపాటికి నామీద కోపంతో ఆరంగ్రేటం ప్రారంభించి వుంటాడు" చీర దులుపుకుంటూ హేండ్‌బాగ్ తీసుకుని లేచింది స్రవంతి.

"టైమయిపోయాక అతనే షాపు మూసి ఇంటికెళ్ళిపోతాడు. ఇంకొంచెం సేపు కూర్చోండి... ప్లీజ్! నాకోసం. ఇంకొక్క పదిరోజులతరువాత ఇలా మిమ్మల్నెవరు విసిగిస్తారు చెప్పండి?" శరత్ ప్రాధేయ పూర్వకంగా చూశాడు.

"సరే, మీరంతగా బ్రతిమాలుతున్నారు గనుక ఇంకా కాసేపీ ఉద్యానవనంలోనే విహరిస్తారు రాణీగారు" చిలిపిగా నవ్వుతూ మళ్ళీ కూర్చుంది స్రవంతి.

"ఒక్క నిమిషం. వాటర్ బాటిల్ కొనుక్కుని వస్తాను. మీరు కూర్చుంటారా. వస్తారా?"

"నేనిక్కడే కుర్చుని కల్పనా టాకీస్ ముందు ఛాతీ విరుచుకుని నుంచున్న ఆంధ్రుల అభిమాన హీరో బొమ్మని చూస్తూ వుంటాను. మీరు త్వరగా రండి"

స్రవంతి గురించి ఆలోచిస్తూ వాటర్ బాటిల్ కోసం లేచాడు శరత్. ఆమెతో పరిచయమైన దగ్గర్నుండి దాదాపు రోజూ ఆమెను కలవడానికి కాకినాడ వస్తున్నాడు. తమ అమెరికాకు తిరిగి వెళ్ళిపోయే రోజు దగ్గరపడుతూంది. తను వెళ్ళేలోగా స్రవంతి గురించి ఓ నిర్ణయానికి రావాలని ఆరాటపడుతున్నాడు శరత్.

స్రవంతిని అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించినకొద్దీ ఆమె అంటే ఆకర్షణ, ఇష్టం పెరుగుతున్నాయి. మంచో, చెడో దేన్నీ దాచుకోకుండా

చెప్పే స్వభావం, బ్రతుకుమీద ఆమెకున్న నిర్దిష్టమైన అభిప్రాయాలు, ఎదురు దెబ్బలు తగిలినా నిలబడాలనే తపన, ముందుకు చొచ్చుకుపోగల సామర్థ్యం, ముఖ్యంగా ఏ విధమైన హిపోక్రసీ లేకపోవడం శరత్‌ని ఆకట్టుకున్నాయి.

కనీసం ఈ అమ్మాయిని భార్యగా పొందాలనే కోరికన్నా సవ్యంగా, సాఫీగా తీరుతుందా?!

శరత్‌కి ఊహ వచ్చిన దగ్గర్నుండీ ప్రతి చిన్నదీ ఎంతో కష్టపడితేగానీ, ఎంతో పోరాటం తర్వాతగానీ లభ్యం కావడంలేదు. పల్లేరుకాయల మీద నడుస్తూ మధ్యమధ్యలో సహృదయులందించిన చందనాన్ని గాయాలకు రాసుకుని ఊరట పొందుతూ చదువు ముగించాడు.

చదువయిపోయిందనే నిశ్చింత లేకుండా ఉద్యోగం కోసం వెదుకులాట, స్థిమితంలేని తచ్చిళ్ళాట. తనేం మినిష్టరుగారి మేనళ్ళుడా లేక ఎమ్.ఎల్.ఏ గారి బావమరిదా, చదువయిపోగానే ఉద్యోగం రెడీగా వుండడానికి? పేపర్లు, ఉద్యోగ ప్రకటనలు, అప్లికేషన్లు, ఇంటర్వ్యూలు, రికమండేషన్లు, రగిలే హృదయాలు, మరిగే వేడినెత్తురు, పొంగే చైతన్యాన్ని అణిచేసే అభివృద్ధి నిరోధకులు, మిగిలే వేడివేడి నిట్టూర్పులు, కరిగిపోయే కలలు, కారిపోలేని కన్నీళ్ళు... ఇదే, ఇదే స్వతంత్ర భారతావనిలో నిత్యం దిగ్విజయంగా ప్రదర్శింపబడుతున్న ఉద్యోగపు తోలుబొమ్మలాట.

అప్పుడే తనచేతికి డిగ్రీ వచ్చి సంవత్సరం గడిచిపోయింది. తన బ్రతుకులోని విలువైన కాలం, అతి శక్తివంతంగా, పదునుగా తన మేథ పనిచేసే అతివిలువైన కాలం వృధాగా తనకూ, తనజాతికీ, దేశానికి ఏ విధంగానూ ఉపయోగపడకుండా గడిచిపోయింది. తనలాంటి, తనకంటే ప్రతిభావంతుల మేథోసంపదను నిరుపయోగంగా వుంచుతున్న దౌర్భాగ్యస్థితి తన దేశపు ప్రత్యేకతేనా, లేక ఇతర దేశాల్లోకూడా వుందా?

తను ఇంజనీరయి సంవత్సరమైనా ఇంకా ఉద్యోగపు వేటలో

దారుణమైన ఆశాభంగాల్ని ఎదుర్కొంటూ, ఎటువంటి ఆసక్తీ, అనురక్తీ లేకుండా జీవితాన్ని గడిపేయడం విసుగు పుట్టిస్తూంది శరత్‌కి.

ఇంత పెద్దయి, చదువయిపోయాక కూడా నాలుగు రాళ్ళు సంపాదించి కన్నతల్లి కడుపు నింపలేక పోతున్నానన్న వ్యథ, ఇంత అర్థరహితంగా, ఇంత కటికచీకటిలో బ్రతకక్కపోతేనేం అని కుమిలిపోతున్న చెల్లి జీవితంలో రవ్వంతవెలుగు నింపలేక పోతున్నానన్న రంపపుకోత, తమ్ముడి బ్రతుకునో దారిలో పెట్టగల అర్హతను సంపాదించుకోలేక పోతున్నానన్న  దుఃఖం.... క్రుంగి క్రుంగి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్న సమయంలో గౌతమ్ జాబు రాశాడు.

గ్రీన్ కార్డు వున్న అమ్మాయిని పెళ్ళాడి అమెరికా వెళ్ళి ఎమ్.బి.ఏ. చేస్తున్న గౌతమ్ తన పేద మిత్రుడిని మరిచిపోనందుకు శరత్ కళ్లు చె మర్చాయి.  దేశంలో ఉండగా తనకు నిలవ నీడనిచ్చిన గౌతమ్ దేశాన్ని విడిచి వెళ్ళాక కూడా తనకు చెయ్యందించి పైకి లాక్కువెళ్తున్నందుకు కృతజ్ఞతతో బరువెక్కిందతని హృదయం.

గౌతమ్ చేయూతతో అమెరికాలో పై చదువు చదివేందుకు వెళ్ళాడు శరత్.  వెళ్ళేముందు సరళ దగ్గరకెళ్ళి తన కొచ్చిన అవకాశం గురించి చెప్పాడు.

“కంగ్రాట్యులేషన్స్.  అక్కడ కూడా మీరు తప్పక షైనవుతారు.  ఆల్ ద బెస్ట్”  హృదయపూర్వక అభినందనల్ని తెలిపింది సరళ.

“ఇదంతా మీ చలవ.అప్పుడు పరీక్ష రాయకపోతే నా భవిష్యత్తు ఎలా ఉండేదో!  నా బ్రతుకంతటిమీదా దాని ప్రభావం పడుండేది. మీకు నా కృతజ్ఞతనెలా వెలిబుచ్చాలో తెలియడంలేదు” అతనలా అంటూంటే సంకోచంగా చూచింది సరళ.

“నేను చేసిందేం లేదు.  మీరు మరీ పొగిడేస్తున్నారు.  అది కేవలం

మనిషిగా నా కర్తవ్యమని మాత్రమే నేననుకుంటున్నాను” మృదువుగా అంది సరళ.

“అది మీ ఔదార్యం. అలా అనుకోవడం మీ గొప్పదనం” తన హృదయంలోని భావాన్ని వెలిబుచ్చడానికి మాటలు దొరకనట్లు ఆగిపోయాడు శరత్.

“కూర్చోనా, పారిపోనా?” నవ్వుతూ లేవబోయింది సరళ.

శరత్ కూడా నవ్వేశాడు.

“నేను స్టేట్స్ వెళ్ళాక మీకు లెటర్ రాస్తాను. జవాబివ్వండి” అర్థింపుగా చూశాడు శరత్.

“నేను లెటర్స్ రాయడంలో కొంచెం బద్ధకిష్టుని. రాయడానికి ప్రయత్నిస్తాను. ఒకవేళ రాయకపోయినా మీరేం అనుకోవద్దు” చిన్నగా నవ్వింది సరళ.

ఎన్నో ఆశలతో, కలలతో, సందేహాలతో,అక్కడెలా వుంటుందో, నిలద్రొక్కుకోగలనో లేనో నన్న సందిగ్ధంతో విదేశానికి వెళ్ళాడు శరత్. గౌతమ్ ఆదరణతో, స్వంత కృషితో, స్వయంప్రతిభతో ఏ అవాంతరం లేకుండానే అక్కడ స్థిరపడగలిగాడు. చదువు పూర్తిచేసి మంచి ఉద్యోగాన్ని సంపాదించాడు.

చెల్లి పెళ్ళికి, తమ్ముడి చదువుకు డబ్బుపంపాడు. చెల్లి పెళ్లి సవ్యంగా జరిగి మంచి మనుషులమధ్య పడింది. తమ్ముడి చదువు ఒక దారిలో పడిందన్న సంతోషం నాలుగు రోజులైనా నిలవకముందే తండ్రి పోయాడన్న వార్త చేరింది. బ్రతికుండగా ఆయనంటే ఏనాడూ ప్రేమ పొంగకపోయినా, తండ్రి అని అనుకోవడానికి అవమానపడినా, పోయాక, ఎక్కడిదో ఆ విచిత్రమైన పాశం, దుఃఖంతో కళ్ళు నిండుకున్నాయి.

కష్టాల కడలిలో ఈది ఈది శక్తిహీనురాలైన తల్లి దుర్మార్గుడు, స్వార్ధపరుడు, అసమర్ధుడే అవనియ్, అతన్నుంచి తను ఎలాంటి, ప్రేమ, అభిమానం, సానుభూతి, ఓ చల్లనిమాట పొందకపోనియ్, భర్తను కోల్పోయినప్పుడు ఎంతగా తల్లడిల్లి పోయుంటుందో ఊహించుకుని రెక్కలు కట్టుకుని తల్లి దగ్గరకు వెళ్ళి ఆమెను ఓదార్చాలని ఆరాటపడ్డాడు.

“నీకు వెళ్ళాలనుంటే తప్పకుండా వెళ్ళు. డబ్బు గురించి ఆలోచించొద్దు. నేను చూసుకుంటాను” అన్నాడు అదే సమయంలో శరత్ దగ్గరకు వచ్చిన గౌతమ్.

“ఇప్పటికే నీ స్నేహాన్ని ఎంతగానో వాడుకున్నాను. ఇంక జీవితాంతం నిన్ను ఇబ్బంది పెడుతూనే వుండనా? వద్దు. పోయినాయన ఎలాగూ పోయాడు. నేను వెళ్ళి చేసేదేం లేదు” అంతకు కొద్దిరోజుల ముందేఉన్న డబ్బంతా ఇంటికి పంపేయడంవల్ల ప్రయాణానికి డబ్బులేదు శరత్‌దగ్గర.

“అలా అనకు. ఇప్పుడే అమ్మకు నీ అవసరం. వెళ్ళిపోయినాయన్ని బ్రతికించలేకపోయినా ఈ సమయంలో నువ్వు దగ్గరుంటే మీ అమ్మగారికి ధైర్యంగా వుంటుంది”

గౌతమ్ మాటలు విన్నాక స్వదేశానికి వెళ్ళాలని మరీ అనిపించింది. ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చూసుకునేసరికి వెళ్ళడానికి ఉద్యోగ బాధ్యతలు అడ్డొచ్చాయి. చేసేదిలేక తల్లిని ఓదారుస్తూ జాబు రాసి వూరుకున్నాడు.

ఎంత కప్పిపుచ్చుకున్నా ఎంత బాధాకరమైన పరిస్థితి ఇది! తన చదువుకి, సామర్ధ్యానికీ తగ్గ ఉద్యోగం దొరకకపోతే మానె, కనీసం కనీస అవసరాల్ని తీర్చగల ఉద్యోగం దొరికితే పొట్ట చేతబట్టుకుని ఇంతదూరం వచ్చేవాడా!!. కొంతమంది దురాశాపరులు, దోపిడీదారులు దేశసంపదను అతి దారుణంగా కొల్లగొట్టి పోగేసుకుని, దేశ ఆర్ధిక పరిస్థితిని తారుమారు

చేసి, తనలాంటి వేలాది ఇంజనీర్లని, డాక్టర్లని, సైంటిష్టులని సంపన్న దేశాలకు తరుముతున్నారు. ఒకవైపు తమ శక్తిసామర్థ్యాలు, ప్రతిభ రాణించని పరిస్థితుల్ని కల్పించి, మరోవైపు మేధావులంతా సంపదమీద ఆకర్షణతో, దేశభక్తి అనే మాటను మరిచిపోయి విదేశాలకు తరలి వెళ్ళిపోతున్నారనే కల్లబొల్లి ఏడుపులెందుకు?... కొంతమంది డాలర్ల మీద ఆశతో, సౌఖ్యాలకోసం ఇక్కడికి వచ్చి ఉండొచ్చు, కాని తను, తనలాగా కొందరు దేశం కోసం తమ శక్తి సామర్థ్యాల్ని వెచ్చిస్తూ అక్కడే వుండిపోవాలని అనుకున్నప్పటికి, అవినీతి, లంచగొండితనం, అశ్రిత పక్షపాతం, కులాభిమానం మొదలైన వాటితో ఊపిరాడక, ప్రాణం నిలిచే దారిలేక కాదా బంధుమిత్రులందర్నీ వదిలి ఈ దూరదేశాన మంచికీ, చెడుకీ నా అన్న వాళ్ళెవరూ లేకుండా ఒంటరి బ్రతుకునీడుస్తూంది?! ... ఇలా తరలివెళ్ళిన వాళ్ళలో, ఎవరైనా అంతర్జాతీయ ఖ్యాతిని పొందగల గొప్ప పనేమైనా చేస్తే అన్ని దేశాలు హారతి పడుతూంటే, వీడు మావాడేనోయ్ అని భుజాలు చరుచుకుంటూ ఆ ఖ్యాతిలో గొప్పదనంలో వాటాకి వచ్చే బందిపోటుతనం, సిగ్గులేనితనం!!... దేశంలో ఏ మూలవున్నా తన తల్లి దగ్గరకు వెళ్ళడానికి ఇంత కష్టమయేదా?... ఆలోచనలతో శరత్ మెదడు అలిసిపోయింది.

తండ్రి పోయి ఆరునెలలైనా కాకుండానే తల్లి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని మంచం పట్టిందని జాబు రాసింది వసు. వసును ఊళ్ళోనే తన స్నేహితుడి తమ్ముడికే ఇచ్చివేయడంవల్ల తల్లికే కష్టం వచ్చినా అండగా ఉంటూంది. తల్లి మంచంపట్టిన దగ్గర్నుండి వసు తమ ఇంట్లోనే వుండి అమ్మను చూచుకుంటూంది.

“అమ్మ నిన్నొకసారి చూడాలని కలవరిస్తూందన్నయ్యా! ఇంత దూరాభారం నుంచి నిన్ను చీటికీమాటికీ రమ్మని రాయడం నిన్ను బాధ

పెట్టడమేనని తెలిసినా, అమ్మ నిన్ను చూడకుండానే కన్ను మూస్తుందేమో, అమ్మ కడసారి కోరిక తీర్చలేకపోయామన్న వ్యధ మనని జీవితాంతం వెంటాడుతుందేమోనన్న భయంతో, తప్పనిసరి పరిస్థితిలో లెటర్ రాస్తున్నాను. ఏ మాత్రం వీలున్నా వెంటనే బయలుదేరిరా అన్నయ్యా! నిన్ను చూచి ఎన్నో జన్మలైనట్లుగా వుంది. నిన్నొకసారి చూడాలని అందరమూ తపించిపోతున్నామన్నయ్యా! నీకోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తూ వుంటాము. త్వరగా వచ్చేయి." వసు లెటర్ చూచి శరత్ గుండె భారంగా అయింది. మసకబారిన కళ్ళను తుడుచుకున్నాడు.

త్వరత్వరగా ప్రయాణపు ఏర్పాట్లు చేసుకున్నాడు శరత్. మిత్రుడిని సాగనంపడానికి వచ్చాడు గౌతమ్.

"నువ్వు ధైర్యంగా వుండరా. అమ్మకి నయమవుతుంది. కాకినాడ తీసుకెళ్ళి మంచి డాక్టర్‌కి చూపించు, పన్లోపని, మంచిపిల్లను చూచుకుని పెళ్ళి చేసుకుని, నీ భార్యను కూడా అమ్మకి చూపించి రా" గౌతమ్ మాటలతో అంతవరకు లేని పెళ్ళి ఆలోచన మనసులోకి వచ్చింది శరత్‌కి. పెళ్ళి తలపు రాగానే అనుకోకుండానే సరళ కళ్ళముందు నిలిచింది. తనిక్కడికి వచ్చాక సరళకి చాలా లెటర్స్ రాశాడు. ఒకటి రెండు లెటర్స్‌కి మాత్రం జవాబిచ్చింది. ఇప్పుడెక్కడుందో, ఏం చేస్తోందో కూడా తెలియదు. వెళ్ళాక వాకబు చెయ్యాలి.

"వెళ్ళాక ఏ అవసరం పడినా ఫోన్ చెయ్యి. ఇన్నేళ్ళుగా నాతోవున్నా నీకు మొహమాటం పోలేదు. నాకే ఏదన్నా అవసరం పడితే నిన్నడగనా? మొహమాటపడుతూ కూర్చుంటానా?" గౌతమ్ మాటలకు శరత్ హృదయం ఆర్ద్రమైంది.

"తమాషా ఏమిటంటే ఎప్పుడూ ఇవ్వడం నువ్వు, పుచ్చుకోవడం నేను. కనీసం పదిసార్లకొక్క మారైనా మన స్థానాలుమారితే..."

"డోంట్ బి సిల్లీ.  అన్నిటినీ అతిగా ఊహించుకుంటావు.  నా దగ్గర నువ్వలా ఫీలవడం నాకవమానం.   ఇలాంటి ఆలోచనలతో, కాంప్లెక్స్‌తో బంధించుకోకుండా హాయిగా, స్వేచ్ఛగా నాతో స్నేహం చెయ్యనే చెయ్యలేవా నువ్వు? నువ్వలా వుండలేక పోతున్నానంటే ఆ లోపం నాదే అయుండాలి."

'ఇంత మంచి మిత్రుడిని పొందిన తనెంత అదృష్టవంతుడు. మనిషి మంచిచెడుల కలయిక అయినట్లే, జీవితం అదృష్ట, దురదృష్టాల మిశ్రమం'. మిత్రుడి చేతిని మృదువుగా నొక్కి బయల్దేరి వెళ్ళాడు శరత్.

మంచానికంటుకుపోయి, కళ్ళల్లో ప్రాణం పెట్టుకుని వున్న తల్లిని చూడగానే శరత్ కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. అప్పటికప్పుడు కాకినాడ తీసుకువెళ్ళి నర్సింగ్‌హోమ్‌లో చేర్చి స్పెషలిష్టు చేత పరీక్ష చేయించాడు. జబ్బుకంటే కష్టాలు, బెంగలు, సరైన ఆహారం తీసుకోకపోవడం, తల్లి ఆరోగ్యాన్నీస్థితికి తీసుకొచ్చాయని తెలిసి హృదయాన్ని పిండినట్లయింది.

డాక్టర్ వైద్యంకంటే ఎక్కువగా కొడుకు సేవలు, ప్రేమ, అతని సమక్షంలో ఆవిడ పొందుతున్న నిశ్చింత, ధైర్యం, రత్నం పరిస్థితి త్వరగా మెరుగుపడేలా చేశాయి.  పదిరోజుల్లో లేచి తన పనులు తను చేసుకోగల స్థితికివచ్చింది.  మందులు రాయించుకుని ఇంటికి తీసుకువచ్చేసాడామెను.

"నిన్ను చూడగానే అమ్మ జబ్బు ఎగిరి పోయిందన్నయ్యా! అంతే. అమ్మకి కూతుర్లెప్పుడూ పరాయివాళ్ళే.   కొడుకులంటే పక్షపాతం. నువ్వొచ్చేదాకా కాకినాడ తీసుకెళ్ళి చూపిస్తానంటే ససేమిరా అనేది.  నువ్వు రాగానే మారుమాట్లాడకుండా వచ్చింది చూడు" వసుంధర అన్నగారితో తల్లి గురించి ఫిర్యాదు చేసింది.

"నాకలాంటి పక్షపాతం లేదే పిచ్చిదానా? మీరే అట్లా అనుకుంటారు. వాడూ నా బిడ్డే.  నువ్వూ నా బిడ్డవే.  కాకపోతే పరాయింటి కోడలివయాక కూడా నీతో చాకిరీ చేయించుకోవాలంటే నా ప్రాణం పోతూంది.

దానికితోడు అక్కడికీ, ఇక్కడికీ తిప్పి మిమ్మల్నింకా యాతన పెట్టనా".

"యాతనేంటి? మా అమ్మకు మేము చేసుకోవడం యాతనా? ఇప్పుడంటే అన్నావుగానీ ఇంకెప్పుడూ అనమాక. చిన్నప్పుడు నాకు చేసిందంతా నువ్వు యాతననుకున్నావా?" కూతురి కోపం చూచి నవ్వింది రత్నం. ఇద్దరివంక నవ్వుతూ చూస్తున్నాడు శరత్.

"అదీ ఇదీ ఒకటెలా అవుతుందే? పదిమంది పిల్లల్ని తేలిగ్గా సాకొచ్చుగానీ, మంచాన పడిన ఒక ముసల్దాన్ని సాకడం ఎంత కష్టం?! కష్టమైనా, తప్పక చేయించుకుంటున్నా, ఇట్లా చేయించుకోవడమెంత నరకయాతనో తెలుసా?" కన్నీళ్ళు పెట్టుకుంది రత్నం.

"అదుగో అదే వద్దనేది. నువ్వు నీ బిడ్డల్ని కంటిపాపల్లాగా చూసుకున్నావు. నీకు చేతనయినంతలో ఏ లోటూ రాకుండా చూడాలని తాపత్రయ పడ్డావు. ఎంత ప్రేమగా, బాధ్యతగా నువ్వు మమ్మల్ని పెంచావు? మేమూ అలాగే ప్రేమగా, బాధ్యతగా నిన్ను చూసుకోవాలనుకుంటే చేయించుకోవడానికంత బాధ పడిపోతావేమిటి?" కూతురి దులుపుడుకి మరి మాట్లాడలేక పోయింది రత్నం.

"చూడరా నాన్నా దీని దాష్టీకం" కొడుకువైపు తీర్పు చెప్పమన్నట్లు చూచింది రత్నం.

"నువ్వవేమీ ఆలోచించకుండా హాయిగా వుండమ్మా? ఇప్పుడు నీకున్న లోటేముంది? అక్క, వసు, నేను మా బ్రతుకులు మేము బ్రతుకుతున్నాం. తమ్ముడి బాధ్యత నాది. వాడెంతవరకు చదువుకుంటే అంతవరకూ చదువు చెప్పిస్తాను"

"అన్నీ బాగానే వున్నాయి. నువ్వు పెళ్ళి చేసుకుంటే కోడల్ని కళ్ళారా చూచి చచ్చిపోతానురా బాబూ!" తల్లి కోరిక వినగానే గౌతమ్, సరళ గుర్తొచ్చారు శరత్‌కి.

"నా భార్యను చూచి చచ్చిపోతావా? ఐతే నేనసలు పెళ్ళే చేసుకోను" పెంకెగా చూచాడు శరత్.

"అవునన్నయ్యా! తొందరగా పెళ్ళి చేసుకో. నీ పెళ్ళెప్పుడవుతుందా? ఆడబిడ్డ కట్నమెప్పుడు దండుకు తిందామా అని నోట్లో వేలేసుకు కూర్చున్నాను" చిలిపిగా అన్నవంక చూచింది వసుంధర.

పెళ్ళి ప్రస్తావన తెచ్చి అంతటితో ఊరుకోలేదు రత్నం. ఆమెకు మళ్ళీ కొడుకు స్వదేశం వచ్చేసరికి బ్రతికి వుంటానో లేదోనని అధైర్యంగా ఉంది. అక్కడే దొరసానినో కట్టుకోకుండా ఇక్కడి పిల్లను చేసుకుంటే బావుండునన్న కోరికా వుంది. అంచేత ఈసారి పెళ్ళి చేసుకుని భార్యను వెంటబెట్టుకుని వెళ్ళమని పోరు పెట్టింది.

శరత్ కూడా పెళ్ళి చేసుకుని బ్రతుకులో సెటిలవ్వాలనే ఆలోచనతో ఉన్నాడు. అందువల్ల ఆ ప్రయత్నంలో సరళను వెదుక్కుంటూ ఆమె అడ్రస్ పుచ్చుకుని హైదరాబాద్ వచ్చాడు.

కాలింగ్‌బెల్ నొక్కి సరళే తలుపు తియ్యాలని కోరుకుంటూ ఉద్విగ్నతతో ఎదురు చూస్తున్నాడు శరత్.

"హలో!" శరత్‌ని చూడగానే సంతోషంతో కళకళలాడి పోయింది సరళ ముఖం.

""రండి, రండి. ఎప్పుడొచ్చారు దేశానికి?" లోపలికి ఆహ్వానిస్తూ అడిగింది సరళ. సరళ వంక పరిశీలనగా చూస్తున్నాడు శరత్. తనను చూడగానే ఎంత సంతోషపడుతూంది? ఆమెకు తనంటే ఎంత అభిమానం!! అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదు. అప్పటిలానే నిరాభరణ సుందరి. అదే చిరునవ్వు, సౌమ్యత, నిరాడంబరత.... తనను చూచే ఇంత సంతోషపడుతూంది. తను వివాహ ప్రతిపాదన తెస్తే ఇంక ఆమె ప్రతిస్పందన ఎలా ఉంటుందో!!

సరళ ఏమేమో కబుర్లు అడుగుతూంది. తన ఆలోచనల్లో తనుండి ఆమె ప్రశ్నలకు ముక్తసరిగా జవాబిస్తున్నాడు శరత్.

"మీకు ఆఫీసుకు టైమవుతుందేమో? నేను కూర్చోపెట్టేసాను" సంకోచంగా చూచాడు శరత్.

"ఈరోజు ఆఫీసు ఎగ్గొట్టేస్తాను. ఇన్నాళ్లకు కనిపించారు మీరు. మిమ్మల్నొదిలి ఆఫీసుకెళ్తానా?"

సరళ జవాబుకు పొంగిపోయాడతను. ఈ అమ్మాయేనా తన లెటర్స్‌కి జవాబివ్వంది? తనంటే ఇంత ఆప్యాయతవున్న ఈమె తన లెటర్స్‌కి జవాబివ్వలేదంటే ఆమె అన్నట్లుగా పెద్ద బద్దకిష్టే అయుండాలి.

మాగజైన్స్ శరత్ ముందుకి జరిపి లోపలికెళ్ళి కాఫీ కలిపి తీసుకువచ్చింది సరళ.

"మీ ప్రోగ్రామేమిటి? ఎన్ని రోజులుంటున్నారు దేశంలో? ఏమైనా పనిమీదొచ్చారా ఇక్కడికి?" ప్రశ్నలు కురిపించింది సరళ.

"హైదరాబాద్ మీ కోసమే వచ్చాను" తనకు కావలసిన ప్రశ్నకు మాత్రం జవాబిచ్చాడతను.

''రియల్లీ!'' మెరుస్తున్న ఆమె కళ్ళల్లో ఎన్నో అర్ధాలు కనిపించాయతనికి.

"మమ్మీ" కళ్ళు నలుపుకుంటూ తప్పటడుగులు వేస్తూ వచ్చి సరళ కాళ్ళను చుట్టుకున్న అందాలబొమ్మను చూడగానే శరత్ గుండె ఒక్కసారి కొట్టుకోవడం మరిచిపోయింది.

"నా కూతురు. ఇప్పుడే వీళ్ళ నాన్న ఆఫీసుకు వెళ్ళిపోయారు. మీ గురించి ఎప్పుడూ చెప్తూవుంటాను తనతో" సరళ చెప్పేదేమీ శరత్ వినడంలేదు. ఇప్పటివరకు తనెంత గొప్ప భ్రమలో వున్నాడో

అర్ధమయిందతనికి.  తనలోని మగ మనస్తత్వం కళ్ళెదుట నిలిచి సిగ్గుపడ్డాడు. సరళ తన పరీక్ష ఫీజు కట్టడం, తన రూమ్‌కి వచ్చి చెప్పడం, తనంటే అభిమానం, అంతకంటే దగ్గరితనం ఫీలవడంవల్ల అనుకున్నాడు. అమెరికా వెళ్ళే ముందు ఆమెను కలవడానికి వెళ్తే ఆమె చూపించిన ఆప్యాయతను పదేపదే గుర్తుచేసుకుని తనకు ఆవిడ హృదయంలో స్థానం వుందని తలపోశాడు. తను అమెరికా నుంచి పంపిన డబ్బుని ఆమె పుచ్చుకోకపోతే, తనను ప్రేమిస్తూ వుండడమే దానికి కారణమని అర్ధం చెప్పుకున్నాడు. ఇప్పటికిప్పుడు తన రాకకు సంతోషాన్ని వెలిబుచ్చుతుంటే దానికి ఎన్నెన్ని అర్ధాలు తీశాడు?!... ఒక ఆడపిల్ల తనకు సహాయపడగానే అది తనమీది ప్రేమతో, తనను పెళ్ళి చేసుకోవాలన్న స్వార్ధంతో ఆ పని చేసిందని సంకుచితంగా అనుకున్నాడు. ఆ అమ్మాయి స్పష్టంగా, కుండబద్దలు కొట్టినట్లుగా ఒక మనిషిగా అది తన కర్తవ్యమనుకున్నానని చెప్పినా, ఆమెలోని ఉదాత్తతను స్వచ్ఛంగా అంగీకరించే సంస్కారంతనలో లేకపోయినందుకు సిగ్గుపడ్డాడు.ఒక మంచి విద్యార్ధి భవిష్యత్తు కుంటుబడడం ఇష్టంలేకే ఆ అమ్మాయి తనకు సహాయపడిందని, సహవిద్యార్ధిపట్ల, తోటి మనిషిపట్ల ఒక మంచివ్యక్తి చూపించే నిష్కళంకమైన ఆప్యాయత, నిస్వార్ధమైన అభిమానాన్ని మాత్రమే చూపించిందని ఇప్పటికి అర్ధమయిందతనికి. తనెంత పిచ్చిపిచ్చి ఊహాగానాలు చేశాడో, స్వచ్ఛమైన ఆమె స్నేహానికి, ఆత్మీయప్రవర్తనకు తనెన్ని రంగులు పులిమాడో తెలిసొచ్చింది శరత్‌కి. సరళని చూస్తుంటే ఆమె మారుతున్న సమాజంలో ఓ కొత్త స్త్రీ జాతికి ప్రతినిధిలా కనిపించింది. ఒక స్త్రీ ఒక పర పురుషుడిని 'సోదరుడి'గానో, 'ప్రియుడి'గానో అభిమానించడమే అలవాటయిన సమాజంలో స్త్రీ పురుష బాంధవ్యాల్ని కొత్త మలుపుకు తిప్పి 'స్నేహితుడి'గా కూడా అభిమానించ గలదని నిరూపించే ఆధునిక మహిళలకు ప్రాతినిథ్యం వహిస్తున్నట్లుగా కనిపించింది.

తనకోసం సరళ పెళ్ళి చేసుకోకుండా ఎదురు చూస్తూ వుంటుందన్న భ్రమతో వచ్చిన శరత్ ఆమె ముచ్చటైన సంసారాన్ని చూసి తనకు కలుగవలసినంత బాధ, ఆశాభంగం కలగలేదని గ్రహించాడు. అంటే తను ఆమె కావాలని గాఢంగా కోరుకోలేదు. తనకు సహాయం చేసినందుకు కృతజ్ఞత, తననామె ప్రేమిస్తూందేమో నన్న చిత్తభ్రమ, తనామెను పెళ్ళాడితే ఆమెను ఉద్ధరించినట్లవుతుందన్న మిధ్యాభిప్రాయం, ఆ అభిప్రాయంతో వచ్చిన ఒక ఎగో... ఆత్మ పరిశీలన చేసుకుంటున్న శరత్ మేధోపరంగా ఉన్నతస్థాయికి చెందిన తను అనుభూతుల దగ్గర కొచ్చేసరికి సామాన్య మానవుడి స్థాయిలోనే వుండిపోయినందుకు సిగ్గుతో కుంచించుకుపోయాడు.

'నాఫ్రెండ్' అంటూ సాయంత్రం ఇంటికొచ్చిన కొలీగ్స్‌కి తనను పరిచయం చేస్తున్న సరళ, స్వచ్ఛంగా నవ్వుతూ తనతో మాట్లాడుతున్న ఆమె భర్త, 'అంకుల్' అంటూ వచ్చీరాని మాటలు చెప్తూ తన ఒడిలోకి ఎగబాకుతున్న కూతురు 'మంజూష'. భ్రమలు విడిపోయి స్ఫటికంలా వున్న శరత్ హృదయానికా గృహ వాతావరణమెంతో అపూర్వంగా, మనోజ్ఞంగా వుంది. సరళ భర్త స్నేహశీలతను, భార్యపట్ల అతను వ్యవహరించే తీరును, ఆ భార్యాభర్తల అనుబంధాన్ని చూచి దాంపత్య జీవితంమీద అపురూపమైన భావాన్ని పెంచుకుంటున్నాడు శరత్. సరళ, ఆమె భర్త బలవంతాన శరత్‌ని మరో రోజు ఉంచేశారు .

కాకినాడలో రైలు దిగిన శరత్ కొంచెం పనుండి సాయంత్రందాకా వుండిపోయాడు. అదేరోజున అతనికి స్రవంతితో మొదటిసారి పరిచయమయింది. స్రవంతిని తను చూడగానే పొందిన ప్రతిస్పందన, ప్రత్యేకంగా ఉన్న ఆమె రూపం, ప్రవర్తన ఆమెతో పరిచయాన్ని పెంచుకోవడానికి దోహదపడ్డాయి, పెళ్ళి చేసుకోవాలనే కోరికను

బలపరచాయి.  ఇప్పుడే, తను తిరిగి వెళ్ళేలోగానే పెళ్ళి చేసుకోవాలనే పట్టుదల కూడా పెరిగింది.  అంచేత కోరి కావాలని స్రవంతికి చేరువగా వచ్చాడు.  అంత ముఖ్యం కాకపోయినప్పటికి తన గతం, కుటుంబ పరిస్థితులు అవసరమైన మేరకు ఆమెకు తెలియజేశాడు. ఆమె కుటుంబ పరిస్థితులు, బాధ్యతలు పరిశీలించాక ఆమెను వివాహం చేసుకోవాలన్న కోరిక ఇప్పుడు మరీ బలపడింది.

తను త్వరపడి ఆమెతో మాట్లాడకపోతే తనకు సమయం చాలదు. ఆమె కూడా తనంటే సుముఖంగా, ఇష్టంగానే ప్రవర్తిస్తూంది.  ఇంక భర్తగాతననెంత వరకు అంగీకస్తుందో చూడాలి. స్రవంతి వైపు అడుగు కదిపాడు శరత్.

***

మసక వెన్నెలలో ఊగుతున్న చెట్ల క్రీనీడలు ముచ్చటగా కదులుతున్నాయి.  సినిమా వీధి కోలాహలంగా జన సందోహంతో నిండిపోయి వుంది.  ఇటే, ఈ వీధిలో నుంచే తను రోజూ వెళ్ళేది. గుండెల్నిండా ప్రేమనూ, కళ్ళ నిండా  కలల్నీ నింపుకుని ప్రతి రోజూ ఒక వ్యక్తి కోసం పరవళ్ళు తొక్కుతూ కదిలిపోయేదీ వీధిలో నుంచే ... పార్కులో కూర్చున్న స్రవంతి కళ్ళముందు స్మృతుల తెరలు జారుతున్నాయి.

స్రవంతి చాలా ఉల్లాసంగా హేలగా గడిపేస్తున్న రోజులవి. నవయౌవన సౌందర్యం, సుతిమెత్తటి భావాలు, సున్నితమైన సెంటిమెంట్స్, సురుచిర స్వప్నాలు, ఏవో సాధించాలన్న తపన, ఏవేవో పొందాలన్న ఆరాటం స్రవంతిని నిలవనివ్వడం లేదు.  సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం, స్రవంతికివంటే ప్రీతి.  ఊళ్ళో ఎక్కడ సంగీత కచేరి వున్నా, కవి సమ్మేళనం జరుగుతున్నా, ఆర్ట్ ఎగ్జిబిషన్ వున్నా ఉత్సాహంగా నలుగురు ఫ్రెండ్స్‌ని పోగేసుకుని మరీ వెళ్ళేది.

ఆరోజు డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీలో కవి సమ్మేళనం జరుగుతూంది.

సభకి అధ్యక్షత వహించవలసిన ప్రముఖ కవిగారికేదో అర్జంట్ పని రావడంవల్ల సభను ప్రారంభించడానికి కొంచెం ఆలస్యం జరిగింది. మీటింగ్ హాల్లో ఊపిరి సలపనట్లయి బయటికి వచ్చి కబుర్లు చెప్పుకుంటున్నారు స్రవంతి మిత్రబృందం.

"హలో గీతా!" గీత, పద్మ, స్రవంతి, కవిత తల తిప్పి చూచారు. అతను గీతని పిలిచినా అతని దృష్టి మాత్రం జోక్ పేల్చి ఫకాలున నవ్వుతున్న స్రవంతి మీదుంది. హృదయాన్ని చీల్చుకు వస్తున్నట్లు అత్యంత సహజంగా, హాయిగా వున్న ఆమె నవ్వు చాలా ఆకర్షణీయంగా కనిపించిందతనికి.

" మాఅన్నయ్య ఫ్రెండ్ హరీంద్ర. మంచి ఆర్టిస్ట్. కవిత్వం కూడా రాస్తారు" గీత అతన్ని పరిచయం చేసింది. పువ్వులా సుకుమారంగా, తెలుపు పసుపుకలిపి ముట్టుకుంటే కందిపోతాడేమోననిపించే రంగుతో, భావుకంగా చూచే కళ్ళతో, సిల్కు లాల్చీ, పైజామాతో విలక్షణంగా కనిపిస్తున్న హరీంద్రను చూస్తూ చేతులు జోడించింది స్రవంతి.

"మా స్రవంతికి కవిత్వమన్నా, ఆర్ట్ అన్నా ఇష్టమండి. అందువల్లే మా ప్రాణాలు తీసి మరీ ఇక్కడకు తీసుకొచ్చింది" అంది గీత.

"మీరు ఆర్టిస్టా?" సన్నగా పొడవుగా వున్న ఆమె వ్రేళ్ళ వంక చూస్తూ అడిగాడతను.

"కాదండి. చూచి ఆనందించడంవరకే" ఆమె పెదవుల కదలికలోని అందాన్ని గమనిస్తున్నాడతను.

"స్రవంతికి ఆర్ట్ నేర్చుకోవాలని వుంది. శ్రద్ధగా నేర్పే వాళ్ళు దొరక్క నేర్చుకోలేదు" అంది గీత.

"నేను నేర్పుతాను. నేర్చుకుంటారా?!" ఒకపూల బాణం వచ్చి తాకింది స్రవంతిని. ఒక కెరటం ఉవ్వెత్తున్న లేస్తూంది స్రవంతి

హృదయంలో,

“తప్పకుండా నేర్చుకుంటాను, మీరు నేర్పాలే కాని”, కొత్త వ్యక్తితో మాట్లాడుతున్నానన్న సంకోచమేమీ లేకుండా సూటిగా చూస్తూ, స్వేచ్ఛగా జవాబిస్తున్న స్రవంతి హరీంద్ర హృదయపు పొరల్ని సున్నితంగా కదుపుతూంది.

అధ్యక్షులవారు రావడంతో సభ ప్రారంభమైంది. అంతా లోపలికెళ్ళి కూర్చుంటున్నారు.

“లోపలికి వెళ్దామా!” అందర్నీ ఉద్దేశించి అన్నా అతని చూపు స్రవంతి మీదే వుంది.

‘‘మీరు మాటతప్పకూడదు మరి. ఎప్పుడు, ఎక్కడ కలుసుకోమంటారు మిమ్మల్ని.” పాలనురుగు లాంటి చిరునవ్వు విరిసింది స్రవంతి అధరాల మీద.

“మాట తప్పడమా? నెవర్, అడ్రసిస్తాను. రేపే రండి.” చిన్న కాగితం మీద అడ్రస్ రాసిచ్చాడతను.

మరునాడు కాలేజీ అయిపోయాక అతనిచ్చిన అడ్రస్ ప్రకారం అతన్ని వెదుక్కుంటూ వెళ్ళింది స్రవంతి. కల్పన టాకీస్ వెనుక వీధిలో అతని గదిని త్వరగానే పట్టుకోగలిగింది.

“స్వాగతం!” తలుపు తెరిచి, కొంచెం ఒంగి, చెయ్యి చాచి డ్రమెటిక్‌గా తనను ఆహ్వానిస్తున్న హరీంద్రను చూచి వేగంగా కొట్టుకుంది స్రవంతి గుండె.

“లేట్ చేసానా?”

“మెల్లగా అడుగుతారేంటి? కొన్ని యుగాల మంచి మీ కోసం వెయిట్ చేస్తున్నాను. ఎవరి పద ధ్వనులు వినిపించినా మీరేవస్తున్నారని, ఎవరు

తలుపుతట్టినా అది మీ గాజుల సవ్వడేనని", గలగలా నవ్వింది స్రవంతి.

కుర్చీమీద కూర్చుంటూ రూమ్‌ని కలయచూచింది స్రవంతి. పెళ్ళికాని వాడు, అందునా ఆర్టిస్ట్, చిందరవందరగా, అస్తవ్యస్తంగా వుంటుంది అతని రూమ్ అనుకుందామె. నీట్‌గా సర్దివున్న రూమ్, బుక్ షెల్ఫ్‌లో ఇంగ్లీషు, తెలుగు కవితా సంపుటిలు, ఆర్ట్‌కు సంబంధించిన పుస్తకాలు, గోడలకు నాలుగు తైలవర్ణ చిత్రాలు మనోహరమైన రంగుల కలయికతో జీవ కళ ఉట్టిపడుతున్నాయి.

"మీరు వేసినవేనా" ప్రశంసగా అతనివంక చూస్తూ అడిగిందామె.

"నావే. మీరంతకంటే బాగా వెయ్యాలి" ఆమె హృదయంలో అతనంటే గౌరవం, అతని ప్రతిభమీద గురి పెరిగాయి.

"బాప్‌రే! ఇంతకంటే బాగానా! కుంచె పుచ్చుకోవడం రాని దాన్ని నేనేం వెయ్యగలను!" గుండెల మీద చేతి నుంచుకుని కళ్ళు విప్పార్చి చూచింది స్రవంతి.

"బావుంది. ఆర్టిస్ట్సు అంతా కుంచెచేత్తో పట్టుకుని పుడతారనుకుంటున్నారా?... మొదట్లో అందరికీ అలాగే వుంటుంది. నేర్చుకోవాలన్న ఉత్సాహం, నేర్చుకోలేనేమోనన్న అధైర్యం..... నేర్చుకు తీరాలన్న పట్టుదలే వుండాలి కాని ఎందుకు నేర్చుకోలేరు? సాధన వలన పనులు సమకూరు ధరలోన."

"ఆగండాగండి, రేపో డైరీ తెచ్చుకుని మీ సూక్తుల్ని రాసుకుంటాను. ఈ రోజుకి గీతలెలా గీయాలో నేర్పండి" నవ్వింది స్రవంతి.

"మీరే ఒక సజీవమైన ఆర్ట్‌పీస్‌లా వున్నారు. మిమ్మల్ని చూస్తూ కూర్చోవాలనుందితప్పితే గీతల జోలికి పోబుద్ధి కావడంలేదు ఇప్పుడు." స్రవంతి గుండెలో వెన్నెల తుంపరలు, కళ్ళలో మెరుపుజల్లులు, తన అందాన్ని గురించిన పొగడ్తలు తనకు ఊహ వచ్చిన దగ్గర్నుండి వింటూనే

ఉంది. కాలేజీలో అడుగుపెట్టిన దగ్గర్నుండి తన అందాన్ని ఆరాధించే వాళ్లు, ప్రశంసించేవాళ్ళు చాలా మందే తారసపడ్డారు. వాళ్ళ పొగడ్తలు వింటే సంతోషం కలిగేది. మరీ తన వెంట వెంట తిరిగి తనని ఆకర్షించాలని ప్రయత్నించే కుర్రాళ్ళని ఏడిపించాలనే చిలిపి ఊహ కలిగేది. వాళ్ళ వంక కన్నెత్తి చూడకుండా, పలకరిస్తే ఖస్సుమని, వాళ్ళు ముఖాలు వేలాడేసుకుంటే నవ్వుకునేది. కాని ఈ సంచలనం కొత్తది. ఇంతకుపూర్వమెప్పుడూ అనుభవంలోకి రానిది. ....తననెంతో ప్రోత్సహిస్తూ పెయింటింగ్‌కి సంబంధించిన ప్రాధమిక విషయాల్ని బోధిస్తున్న హరీంద్ర వంక ఆసక్తిగా చూస్తూ అతను చెబుతున్న విషయాల్ని శ్రద్ధగా ఆకళింపు చేసుకుంటూంది స్రవంతి.

"మీకీ విషయం తెలుసా?" ముందుకు ఒంగి ఆమె కళ్ళలోకి మధురంగా చూస్తూ అడిగాడు హరీంద్ర.

"ఏమిటి?" తెప్పరిల్లుతూ అడిగింది స్రవంతి.

"ఓ రోజు బ్రహ్మదేవుడు తన భార్యను మెప్పించి సంతోష పెట్టడానికి తనలోని కళాత్మక శక్తినంతనీ కేంద్రీకరించి ఓ అందాల ప్రతిమను తయారుచేసాడు. అప్పుడాయన భార్య 'ఈ బొమ్మకు ప్రాణం పోసి భూలోకంలో వదలండి. అక్కడి మగవాళ్ళంతా ఈ అమ్మాయి కోసం కొట్టుకు కొట్టుకు చస్తూంటే ఆ తమాషా చూసి మనసారా ఆనందిద్దాం' అంది. ఇప్పుడు బ్రహ్మ దంపతులు బ్రహ్మానందపడి పోతూ వుంటాడు. ఆ అమ్మాయెక్కడుందో తెలుసా మీకు!", కుడి చేతి చూపుడువేలిని చాపి అడిగాడు హరీంద్ర.

"ఊహు" తల అడ్డంగా చూసిందామె. హరీంద్ర ఏం చెప్తున్నాడో ఆమెకు తెలుస్తూనే వుంది. ఆమె హృదయం వేగంగా ప్రకంపిస్తూంది. ఆమె రక్తనాళాల్లో విద్యుత్తు జరజరా ప్రవహిస్తూంది.

"ఇక్కడే, నా కళ్ళ ముందే వుంది. ఈ క్షణంలో నా ఒక్కడిదే ఆ అదృష్టం, ఆ ఆనందం, ఆ అనుభూతి", మత్తుగా చూస్తున్నాడు హరీంద్ర. స్రవంతి కళ్ళు నెమ్మదిగా వాలిపోయాయి. ఆమెలోని స్త్రీత్వం శతసహస్ర పత్ర కమలంలా వికసిస్తూంది.

"మీరు కవేననుకున్నాను. కథకులుకూడా నన్నమాట." జలపాతం తృళ్ళిపడినట్లుగా నవ్వింది స్రవంతి. జలపాతపు హోరు వెనుక నిద్రలేచిన స్త్రీత్వం పదిలంగా దాక్కుంది.

"నా హృదయం ఫీలయింది చెప్తుంటే మీకు ఎగతాళిగా వుందన్న మాట!" అలిగినట్లు ముఖం పెట్టాడు హరీంద్ర.

"అబ్బే అదేం లేదు. ఓన్లీ ఫర్ ఫన్" కంగారుగా అంది స్రవంతి.

"అంతే! మీ అమ్మాయిలు ప్రేమగా దగ్గరకొస్తే బుసకొడతారు. కాలితో తంతే కాళ్ళు పట్టుకుని వదలరు". కళ్ళు పెద్దవి చేసి చూస్తూంది స్రవంతి. ఏమిటితని విచిత్ర ధోరణి? ఈ అందమైన రూపం వెనుక, ఆకర్షణీయమైన కళ్ళ వెనుక దాగున్న మనస్తత్వమెలాంటిది?! సభ్యత ఉట్టిపడే కదలికల వెనుక స్పష్టాస్పష్టంగా వున్న సంస్కారమెలాంటిది?! ఇతని ప్రశంసల వెనుక, అభిమాన ప్రదర్శన వెనుక వున్న నిజాయితీ ఏపాటిది?"

"ఏమిటిలా చూస్తున్నారు? మీ అమ్మాయిల్నిలా అన్నాననా? ఓ! లీవిట్. జస్ట్, జోక్ చేసానంతే!" మరుమల్లెలు గుమ్మరించినట్లు నవ్వాడతను. స్రవంతి ముగ్ధురాలై చూస్తూంది. అనుభూతి ఆలోచన మీద తెర దింపుతోంది.

"అందమైన దృశ్యాన్ని చూచినా, అందమైన ఆడ పిల్లను చూచినా ఆర్టిస్టు తనను తానుమరిచిపోతాడు. ఏవేవో వెర్రిగా మాట్లాడతాడు. ఆ మాటల్ని పట్టించుకోవద్దు మీరు. ఆ మైమరపులోని పారవశ్యాన్ని

గుర్తించండి చాలు.", స్రవంతిని మామూలు మూడ్‌లోకి లాక్కురావడానికి ప్రయత్నిస్తున్నాడు హరీంద్ర.

తరువాత ఆ మాత్రం ఆలోచనకు కూడా అవకాశమివ్వకుండా ఆమె అందాన్ని, గుణగణాల్ని పొగుడుతూ, ఆమె మీద తన ప్రేమను అవకాశమున్నప్పుడల్లా ప్రకటిస్తూ, అలుగుతూ, బ్రతిమాలించుకుంటూ, కోపగిస్తూ, కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడుతూ స్రవంతి తనమీది ఆకర్షణలో మెడలోతు మునిగేలా చేసాడు హరీంద్ర. నిద్ర లేచిన దగ్గర్నుండి ఉద్వేగంతో సాయంత్రం కోసం ఎదురు చూడడం, కాలేజీ నుంచి అతని రూమ్‌కి పరుగెత్తడం, అతనొకవేళ ఆఫీసు నుంచి రాకపోతే అసహనంగా నిరీక్షించడం, అతనుంటే సాయంత్రాన్ని క్షణంలా గడిపేయడం, రాత్రిని తిట్టుకుంటూ ఇంటికి రావడం పరిపాటయిపోయింది స్రవంతికి.

"మీ ఇంట్లో తెలుసా నువ్విక్కడకు ఒస్తున్నట్లు?...ఏ ఫ్రెండింట్లోనో చదువుకుంటున్నానని చెప్తూ వుండుంటావు కదూ?" కుతూహలంగా చూచాడతను.

"అలా అబద్ధం చెప్పడమెందుకు?" విస్మయంగా చూచింది స్రవంతి.

"నా రూమ్‌కి వస్తున్నావని తెలిస్తే కేకలేయ్యలేదా మరి మీ వాళ్ళు?"

"కేకలేయడమెందుకు? నేను మా వాళ్ళతో చెప్పాను. మనం ఒకరంటే ఒకరం ఇష్టపడుతున్నామని, పెళ్ళి చేసుకుంటామని" అతని పెదాలమీద చిరునవ్వు మాయమయింది. చూపులు ఎటో తిప్పుకున్నాడు.

"రేపు మీరు మా ఇంటికి రావాలి. మా నాన్నగారికి చూపిస్తాను మిమ్మల్ని తప్పకుండా వస్తారుకదూ?" స్వచ్ఛంగా వున్న ఆమె కళ్ళల్లోకి చూడలేక పోతున్నాడతను.

"అలాగే!" అతి ప్రయత్నంమీద జవాబిచ్చాడు.

అతనికా అవకాశం లేకుండా ఆ రాత్రే రాంబ్రహ్మాన్ని అకస్మాత్తుగా హాస్పటల్లో జాయిన్ చేయాల్సి వచ్చింది. సమస్యల వలయంలో చిక్కుకుని ఊపిరాడకుండా ఉన్న స్రవంతికిప్పుడు రోజూ హరీంద్ర రూమ్‌కి రావడానికి వీలుపడడంలేదు. అతన్ని తండ్రికి పరిచయం చేయాలన్న ఆలోచననూ వాయిదా వేసింది.

ఆ రోజు రాంబ్రహ్మానికి కొంచెం సులువుగా ఉంది. ఉదయం హరీంద్ర స్రవంతి కాలేజీకి వచ్చి ఆ సాయంత్రం తన రూమ్‌కి తప్పకుండా రమ్మని చెప్పివెళ్ళాడు. హరీంద్రతో పరిచయమైనప్పటి నుండి స్రవంతికి అతనితో గడిపే సమయం తప్ప మిగతా సమయమంతా, మిగతా వారంతా.... కాలేజీ చదువు, ఫ్రెండ్స్, ఇంట్లోవాళ్ళు... పరమ బోర్‌గా అనిపించసాగింది. ఆ రోజు మరీ అలా అనిపించి సాయంత్రం కోసం ఉత్సాహంగా, ఉద్వేగంగా ఎదురు చూడసాగింది.

“మన స్నేహానికి వార్షికోత్సవం జరుపుకుందామీ రోజు. ఈ సందర్భంలో నీకు నా చిరుకానుక” ఓ పాకెట్ అందించాడు హరీంద్ర.

సంభ్రమంగా పాకెట్ విప్పిన స్రవంతి రెప్పవాల్చడం మరిచిపోయింది. ఆమె హృదయంలోని అమృతాన్ని చిలుకుతున్నారెవరో?.... తనలోలేని అందాలు, తనెప్పుడూ గమనించని సరికొత్త కోణాలు తన చిత్రంలో ప్రతిఫలిస్తున్నాయి. చిత్రం క్రింది భాగంలో ‘విత్ లవ్ ఫ్రమ్ హరి’ ఆప్యాయంగా ఆ అక్షరాల్ని తడిమింది స్రవంతి. మెల్లగా కళ్ళెత్తి అతనివంక చూసింది. ఆమెలోని సంచలనాన్ని గర్వంగా గమనిస్తున్నాడతను.

“థాంక్‌యూ! థాంక్‌యూ సోమచ్!” ఈ మాటల్ని ఆమె అధరాలు పలకలేదు. ఆ భావాన్ని ఆమె కళ్ళు పలికిస్తున్నాయి.

“బావుందా మీ ప్రతిబింబం?” పెదవి విప్పితే తమ పొందుతున్న

తాదాత్మ్యత చెదిరిపోతుందేమోనన్న భయంతో ఆమె మౌనంగా తలూపింది... ఎంత గొప్ప ఆర్టిస్ట్ ఇతను? ఈ కళాకారుడి సహచర్యంలో తన జీవితం కళాత్మకంగా గడిచిపోతుంది. ఇతనితో తన అనుబంధం ఎలాంటి కలతలూ, కార్పణ్యాలూ లేకుండా కొనసాగుతుంది. ఇతనితో తన పొందు దాంపత్యానికి కొత్త అర్థాల్ని చెప్తుంది.... కోరికల కోటల్ని కట్టుకుంటూంది స్రవంతి. తన భావోద్రేకంలో తనున్న స్రవంతి హరీంద్రలో రూపం దిద్దుకుంటున్న కాంక్షను గుర్తించలేదు. ఆమె మనస్తత్వం తెలిపిన హరీంద్ర చప్పున ధైర్యం చెయ్యడానికి జంకి సమయం కోసం వేచి చూస్తున్నాడు.

కష్టాల పరంపర ప్రారంభమైనాక, పరిస్థితుల్తో కలబడి పోట్లాడే సమయంలో విపరీతమైన మనఃక్లేశానికి గురయినప్పుడు అతని దగ్గరకొచ్చి కాసేపు కబుర్లు చెప్తే మనసు తేలికపడినట్లుండేది స్రవంతికి.

"నువ్వతని రూమ్‌కి వెళ్తుంటే నలుగురూ ఏమనుకుంటారు?... అమ్మ చాలా బాధపడుతూంది నీ మొండితనానికి. పెళ్ళి కావలసిన దానివి. ఇదేం బాగాలేదు" తండ్రిని చూడడానికి వచ్చిన సుబ్బలక్ష్మి చెల్లెల్ని మందలించింది.

"హరిని చూడందే నేనుండలేనక్కా! నేను తప్పు చెయ్యడంలేదన్న నమ్మకం నాకుంది. నలుగురూ అర్థం పర్థం లేకుండా అనుకునేదాని కంటే నా ఆనందం నాకు ముఖ్యం"

"సర్లే, నలుగురి మధ్యా వుంటున్నప్పుడు వాళ్ళను పట్టించుకోకపోతే ఎలా? నీకు నువ్వు తప్పు చెయ్యడంలేదనుకుంటే కాదు, నలుగురికీ ఆ అభిప్రాయం కలిగించాలి. అసలతనెలాంటి వాడో జాగ్రత్తగా గమనించావా?... ఈ రోజుల్లో ఎంతో జాగ్రత్తగా వుంటేగానీ ఈ మగాళ్ళతో నెగ్గుకు రావడం కష్టం. బుట్టలో పడేదాకా ప్రేమకబుర్లు వల్లిస్తారు.

అవసరం తీరాక మరి పత్తావుండరు. రోజురోజుకీ మరీ దుష్టులూ, దుర్మార్గులూ, దొంగ రాస్కెల్స్ ఎక్కువవుతున్నారు. వాళ్ళ ఉచ్చులో చిక్కుకోకుండానే వుండాలిగానీ, చిక్కుకున్నాక ఇంక విముక్తి అనేది వుండదు" అక్క అమాయకత్వం చూచి స్రవంతికి నవ్వొస్తాంది. ఉచ్చులుపన్నే చాకచక్యం వున్నవాడికి అద్భుతంగా నటించే చాకచక్యమూ వుంటుంది. తను ఎవరికోసమైతే ఉచ్చును పన్నాడో ఆమె ఎదుట చాలా మంచిగానే వుంటాడు. సభ్యతా సంస్కారాల్ని ప్రదర్శిస్తాడు. ఆమెకోసం ప్రాణం పెట్టేందుకు సిద్ధంగా వున్నట్లు కనిపిస్తాడు. అన్నీ తనలోని మంచి కోణాలే వెల్లడయ్యేలా జాగ్రత్త తీసుకుంటాడు. ఏక్సిడెంటల్‌గా బయట పడితే తప్ప అతనిలోని చెడును చప్పున గుర్తుపట్టడం కష్టం. మరి ఎలా తను ప్రేమించే వ్యక్తి మంచివాడో, చెడ్డవాడో అంచనా వెయ్యడం!!... అంటే ఆ వ్యక్తిలో చెడుకంటే మంచి ఎక్కువుందా లేక తక్కువుందా అని నిర్ణయించడమెలా?... తన మట్టుకు తను హరిలోని బలహీనతల్ని కొన్నిటిని గుర్తించింది. ఐనా అతని బలహీనతల్తో సహా అతన్ని ఇష్టపడుతూంది. ఏ మనిషీ లోపరహితంగా వుండడనే వాస్తవాన్ని తను అంగీకరిస్తుంది.

"అతను ఆర్టిస్టు అనో ఏదో చెప్పావు. ఐతే మరీ జాగ్రత్తగా వుండాలి. ఎందుకంటే ఈ ఆర్టిస్టులూ, కవులూ, కళాకారులూ మరీ డేంజరస్ ఫెలోస్. వీళ్ళు తమ ఫీల్డ్‌లో తమకున్న ప్రతిభ అనే వశీకరణ మంత్రాల్ని ఆడపిల్లలమీద ఉపయోగిస్తారు. రచనలంటేనూ, కళ అంటేనూ వున్న గ్లామర్ వల్ల ఆడపిల్లలు వీళ్ళకు త్వరగా క్లోజ్‌గా వస్తారు. రచయితగా, కళాకారుడిగా ఎంతో ఆదర్శవంతంగా, గ్లామరస్‌గా కనిపించే వీళ్ళు మామూలు మనుషులకంటే చాలా అధ్వాన్నంగా, ఊహించలేనంత నీచంగా ప్రవర్తిస్తారు. సమయం మించిపోయాకగానీ వీళ్ళలోవున్న అసలు మనిషిని, సారీ దానవుడ్ని గుర్తించరు మోసపోయిన ఆడపిల్లలు." విస్తుపోయి వింటూంది స్రవంతి.

‘అక్క ఎప్పుడు ఎలా పరిశీలించసాగింది వీళ్ళని?! అసలు తను చెప్పిందెంత వరకు నిజం?... ఒక పురుషుడు, ఒక స్త్రీని మోసం చేస్తే వచ్చేంత సంక్షోభం, అరుదుగానే అయినా ఒక స్త్రీ ఒక పురుషుడిని వంచిస్తే రాదే?... ఎప్పుడూ, సర్వసామాన్యంగా మోసగించే అధికారం పురుషుడికి, మోసపోయే దైన్యత స్త్రీవంతూ ఎందుకవుతుంది? సుడిగుండాలుంటాయని తెలిసి తెలిసి, సుడిగుండంలో పడితే మరి బ్రతికి బయటపడడం కష్టమని తెలిసి కూడా ప్రతి స్త్రీ ప్రేమ ప్రవాహంలోకి ఉరకాలని ఎందుకు ఉవ్విళ్ళూరుతుంది?! కానీ... సన్నిహితంగా వచ్చిన ప్రతి మగాడ్ని సంశయిస్తూ, తన నీడను చూచి తాను జడుసుకుంటూ, తన పవిత్రత చుట్టూ ఉక్కు కవచాన్ని నిర్మించుకునే స్త్రీ పరమపవిత్రంగా ఉన్నానని సంతోషపడితే పడొచ్చుగానీ ప్రేమలో వున్న థ్రిల్‌ని, ఆనందాన్ని అనుభవించ గలుగుతుందా?... ఐనా హరీంద్రకు తనంటే ప్రాణం. మిగతా కళాకారులు, రచయితల సంగతేమోకానీ హరిమాత్రం ఉన్నతుడు. హరి విషయంలో అక్క హెచ్చరికను లెక్క చేయక్కర్లేదు... స్రవంతి తన ప్రవర్తనని సమర్థించుకోవడానికనువుగా తన ఆలోచనల్ని పేర్చుకుంటూంది.

“హరి చాలా మంచివాడక్కా!”

“శుభం. కానీ... ప్రతి ఆడపిల్లకూ తన ప్రేమికుడు సకల సుగుణాభిరాముడిగా కనిపిస్తాడు ముందు. అది మరవొద్దు... ఇంతగా ఎందుకు చెప్తున్నానంటే ఇప్పటికే అన్నివిధాలా చితికిపోయాం మనం. ఇంకేం చెడు జరిగినా తట్టుకోలేని స్థితిలో ఉన్నాం. అది గుర్తు పెట్టుకుని ప్రవర్తించు” అక్క హితబోధ చాలా విసుగు పుట్టిస్తూంది స్రవంతికి.

***

“బోర్ కొట్టిందా?” వచ్చి కూర్చున్నాడు శరత్. ఉలిక్కిపడి శరత్ వంక చూచింది స్రవంతి. శరత్ చెప్పబోతున్నదేదో ఆమెకు చూచాయగా

తెలుస్తూనే వుంది. స్రవంతి హృదయంలో ఏదో అలజడి.  తన జీవితం తాలూకు అతి ముఖ్యమైన ఘట్టాన్ని అతనికి తెలపకుండా వుండడం సమంజసం అనిపించడం లేదు.

"మన మొట్టమొదటి పరిచయం గుర్తుందా మీకు?... ఆరోజు నేను హాస్పటల్ నుండి వస్తున్నాను.", ఒక నిమిషం ఏం చెప్పాలో తోచనట్లు ఆగింది. శరత్ ఆమెవంక ప్రశ్నార్థకంగా చూచాడు.

"ఎబార్షన్ చేయించుకుని వస్తున్నాను",  ప్రక్కలో బాంబు పడినట్లు అదిరిపడ్డాడు శరత్.  పవిత్ర భారతదేశంలోని ఒక తెలుగుపిల్ల తనంతట తాను ఎబార్షన్ చేయించుకున్నానని చెప్పడమా?... ఇంత తెలివిగల అమ్మాయి ఎబార్షన్ చేయించుకునే స్థితికి వెళ్ళిందా?.. ఇంపాజిబుల్! తను నమ్మడు.  ఈ అమ్మాయి తనకేదో పరీక్ష పెడుతూంది.

"తప్పనిసరి పరిస్థితిలో విధిలేక ఆ పని చేయాల్సొచ్చింది" భావ రహితంగా వుంది స్రవంతి ముఖం.  ఏం మాట్లాడడానికి  చాలా డెలికేట్‌గా వుంది శరత్‌కి.

"హరీంద్ర అని ఓ ఆర్టిస్ట్.  అతన్ని నా ప్రాణంగా భావించాను. ఇంట్లోవాళ్ళనీ, లోకాన్నీ లెక్కచేయలేనంత గాఢంగా అతన్ని అభిమానించాను.  అతన్ని పెళ్ళాడి నా కలల్ని పండించుకోవాలనుకున్నాను. నా బ్రతుకుని కళాత్మకంగా మలచుకోవాలనుకున్నాను... నేను వివశత్వానికి గురయిన ఒక ఘడియలో అతనితో లైంగికానందాన్ని పొందాను"

శరత్‌కి చాలా గాభరాగా వుంది.  ఆమె నిర్భయత్వం, ఎటువంటి దాపరికమూ లేకుండా, లోకం అతి పెద్దనేరంగా భావించే సంఘటనను కూడా అతి మామూలుగా చెప్తున్న తీరు అతనికి విభ్రాంతిని కలిగిస్తున్నాయి.

"నేను  అతి సహజంగా తీసుకున్న సంఘటనని హరి చాలా వక్రదృష్టితో చూశాడు.  హరి నేను ఇష్టపడి కోరుకున్న వ్యక్తి, పెళ్ళి

చేసుకోవాలని అనుకుంటున్న వ్యక్తి. ఒకనొక ఎమోషన్‌లో, ఒక అనుభూతి పారవశ్యంలో ఇద్దరం కలిసి ఒక అపూర్వమైన అనుభవాన్ని పొందాం. పెళ్ళి అనేది హృదయాల కలయికకు ఒక బాహ్యరూపం మాత్రమేనని నా అభిప్రాయం. పెళ్ళి అనే తంతు జరగనంత మాత్రాన నేనతనితో కలిసి పొందిన 'అనుభూతి' ని 'తప్పు' అని బ్రాండ్ చెయ్యడం సబబా?!"

శరత్ రియాక్షన్‌ని గమనించడానికన్నట్లు ఓ క్షణం ఆగింది స్రవంతి. స్త్రీ పురుషుల కలయిక అత్యంత సహజమైందేనని తనూ ఒప్పుకుంటాడు. కానీ దానికి కొన్ని నిర్దిష్టమైన నియమాలూ, సమయ సందర్భాలూ ఉన్నాయే!... ఈ నియమాలిక్కడున్నంత ఇరుకుగా మరే దేశంలోనైనా వున్నాయా?

"ఈ సోకాల్డ్ 'తప్పు'ని అడ్డుపెట్టుకుని నోటికి వచ్చిన చెత్తనంతా వాగి నా జీవితంలోంచి శాశ్వతంగా తప్పుకుని వెళ్ళిపోయాడు హరి. అసహ్యమేసింది అతనంటే... యౌవనంలోవున్న ఆడపిల్ల మనసుకు వచ్చినవాడి ఆకర్షణలో పడడం అతి మామూలు విషయం. అతను అలా మాట్లాడాక అంత దుర్మార్గుడ్ని తలచుకుని బాధపడడం కూడా హేయమనిపించింది. కానీ... అతను సామాన్యమైన దెబ్బ కొట్టాడా నా జీవితంమీద? గుర్తు తెచ్చుకోకుండా ఎలా ఉండగలను? హృదయం బండరాయిలా మారితే అది సాధ్యపడేదేమో!" విషాదం గూడు కట్టుకుంది స్రవంతి కళ్ళలో. జాలిగా ఆమెవంక చూశాడు శరత్.

"ఎంత విదిలించుకుందామనుకున్నా అప్పటివరకు నేనతనితో పెంచుకున్న అనుబంధం, నా ఊహలు, కోరికలు, హృదయాన్ని నలిపి పిండేసాయి. అతను చేసిన అవమానం, వంచన మనసుని చిత్రవధ చేసి పిచ్చెక్కించాయి... కానీ... నాకు పిచ్చెక్కలేదు... నిదానంగా ఆలోచించాను. తోసుకువస్తున్న ఏడుపును దిగమింగాను. రణరంగంలావున్న మనసుని

సముదాయించు కున్నాను. ఒక నయవంచకుడు కొట్టిన దెబ్బతో నా బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవడం, వెర్రితనమనిపించింది. అతనితో నేను పొందిన అనుభవం వలన నా శరీరం మైలపడిందని, మలినమైన నా శరీరాన్ని మరో పురుషుడికి అర్పించడం అతన్ని మోసగించడమని, స్త్రీ తన జీవితంలో ఒక్కరినే ప్రేమిస్తుందని, ఆ ప్రేమ ఫలించకపోతే ఆమె గోదార్లో దూకాల్సిందేనని... తరచూ మనం పుస్తకాల్లో చదివే, సినిమాల్లో వినే దారుణమైన నీతివాక్యాలు పరమ బూటకాలని పించాయి. ఆడపిల్లకు మాత్రమే ఉద్దేశింపబడిన ఈ ధర్మపన్నాలన్నిటినీ ఛేదించుకుని, పాత జ్ఞాపకాల్ని తుడిచేసుకుని కొత్తవ్యక్తినై, సరికొత్త జీవితాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నాను.”

ఒక మహాద్భుతాన్ని చూసుకున్నట్లుగా స్రవంతి వంక చూస్తున్నాడు శరత్.

“ఐతే నా సమస్య అంతటితో ఆగిపోలేదు. నా నిర్ణయాన్ని సమూలంగా కదిలిస్తూ, మరోసారి తీవ్రమైన సంఘర్షణను సృష్టిస్తూ నేను గర్భవతినన్న భయంకరమైన నిజం నాముందు నిలిచింది. ఏం చెయ్యాలో తోచక గాభరా పడ్డాను. ఎవరితో చెప్పుకోవాలో తెలియక తికమకపడ్డాను. ఇంట్లో వాళ్లు, ఫ్రెండ్స్ అంతా హరితో నా బాంధవ్యానికి వ్యతిరేకులు. ఎన్నోసార్లు హెచ్చరించారు. మందలించారు. బెదిరించారు. వాళ్ళు బి.సి నాటి మనుష్యులని, వాళ్ళవి బూటకపు భావాలని ఎగతాళి చేసాన్నేను. ఈ స్థితిలో ఇలా వాళ్ల సహాయం కోరడానికి చిన్నతనమని అనిపించింది. అందుకే ఒంటరిగా వెళ్ళి డాక్టర్ సహాయం కోరాను” అంతవరకు నిబ్బరంగా ఉన్న స్రవంతి కంఠం వణికింది.

“నాకు పిల్లలంటే ప్రాణం. నా రక్తాన్ని పంచుకుని పుట్టబోయే బిడ్డను తీసేయించుకోవడానికి నా హృదయం ఎదురు తిరిగింది. డాక్టర్

ఎబార్షన్ చేస్తుంటే నా శరీరంలోని ఒక్కొక్క అవయవాన్నీ తరిగి పోగులు పెట్టినట్లయింది.'' స్రవంతి చెంపలమీదుగా కన్నీళ్ళు జలజలా రాలుతున్నాయి. కంఠం పట్టేసింది. అంతలోనే సంబాళించుకుందామె. శరత్ హృదయం వర్షించబోతున్న మేఘంలా వుంది.

"అసలెందుకు ఎబార్షన్ చేయించుకున్నాను? హరితో నా అనుభవాన్ని అత్యంత సహజమైన విషయంగా భావించిన దాన్ని అంతే సహజంగా బిడ్డను ఎందుకని కనలేకపోయాను? అవివాహిత తల్లిగా నా బిడ్డను పెంచుకోగల ధైర్యం నాకు లేకపోవడంవల్లా? నాముందు జీవితానికి బిడ్డ ఆటంకమవుతుందనే స్వార్థంతోనా?... నన్ను నేను తేల్చుకోకుండానే, నా సత్తాని నేను అంచనా వేసుకోకుండానే ఆ గాభరాలో, అనిశ్చిత పరిస్థితిలో ఆ నిర్ణయాన్ని తీసుకున్నాను. మంచో, చెడో ఒక నిర్ణయం తీసుకుని దాన్ని అమల్లో పెట్టేసాక దాన్ని తరచితరచి బాధపడడం, తలుచుకుని తలుచుకుని గింజుకోవడం నాకలవాటు లేదు. అంచేత ఆ సంఘటననీ మరిచిపోవడానికే ప్రయత్నిస్తున్నాను"

శరత్ ఏదో ఒకటి మాట్లాడడానికి యత్నిస్తున్నాడు. ఏమీ మాట్లాడకుండా కూర్చుంటే ఆమె నొచ్చుకుంటుందేమోనన్న ఆందోళనా వుంది.

"ఇదంతా ఎందుకు చెప్పానంటే... మీరు నేనంటే మీకున్న ఇష్టాన్ని ప్రకటించారు. నామీది మీ అభిప్రాయాల్ని, నన్ను పెళ్ళాడాలన్న కోరికను వెల్లడించారు. మీలాంటివ్యక్తికి నచ్చినందుకు నాకు సంతోషంగా కూడా వుంది. మీతో జీవితాన్ని పంచుకోవాలనే ఆశా వుంది... ఇంకో విషయం. ఈ కొద్దిరోజుల మీ స్నేహం నాకు మహోపకారం చేసింది. మండుతున్న నా గాయాల్ని మంత్రం వేసినట్లు మాన్పేసింది. నన్ను తినేస్తున్న జ్ఞాపకాల్నుండి విముక్తి కలిగించింది. నాలో కొత్త జీవితాన్ని సృష్టించు

కోవాలన్న కోరికను బలపరిచింది... క్షమించండి... ఏదో చెప్పబోయి ఏదేదో చెప్తున్నాను"

"పర్వాలేదు చెప్పండి!" అప్పటికి నోరు విప్పగలిగాడు శరత్.

"నా స్వంత అభిప్రాయాల మాటటుంచి సమాజం దృష్టిలో నేను శీలం కోల్పోయిన ఆడపిల్లను. సగటు మగాడు తన చరిత్ర ఎలా వున్నా తన భార్య మాత్రం అనాఘ్రుత పుష్పం కావాలని కోరుకుంటాడు. నా విషయాల్ని దాచి దొంగతనంగా మీ జీవితంలోకి రావాలని నేనను కోవడంలేదు. నేనేదో తప్పు చేసినట్లు భావించి, ఆ తప్పు మీకు తెలిసి పోతుందేమోనని భయపడుతూ నేను నరకాన్ని అనుభవిస్తూ మీకు నరకాన్ని సృష్టించడం... ఐ జస్ట్ హేటిట్, నేను నిర్భయంగా, నిస్సంకోచంగా, ఎటువంటి ఆత్మన్యూన్యతా లేకుండా మీ జీవితంలోకి రాగలగాలి. ఎలాంటి ఇన్‌హిబిషన్స్ లేకుండా మీ ప్రేమలో కరిగిపోవాలి... నేనలా చేయగలగాలంటే మీరు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నన్ను నన్నుగా, నా తప్పొప్పులతో పాటు, ఔన్నత్య అల్పత్వాలతోపాటు స్వీకరించగల శక్తి మీకుందా?" స్రవంతి వదిలిన తూటా శరత్ మెదడుని తాకింది.

'ఈ అమ్మాయి తన శక్తిసామర్థ్యాల్ని ఛాలెంజ్ చేస్తోంది. తన సంస్కారానికి, మంచితనానికి పరీక్ష పెడుతూంది. ఇదే మరో పరిస్థితిలో, మరో అమ్మాయి గురించయితే తనకింతగా ఆలోచించే అవసరమే వుండేదికాదు. మరో ఆలోచన లేకుండా కాదని వుండేవాడు... దానికి కారణం వివాహబంధం గురించి తనకు కొన్ని అభిప్రాయాలున్నాయి. భార్యాభర్తా ఒకరికోసం ఒకరు బ్రతకాలని, భార్యకు భర్త, భర్తకు భార్య తప్ప వారి జీవితాల్లో మరొకరికి చోటుండకూడదని, అన్యోన్యంగా, ఆప్యాయతతో కడకంటా బ్రతకాలని... కానీ ఇది కేవలం ఒక అందమైన

ఊహ... విష్‌ఫుల్ థింకింగ్... వాస్తవంలో అది సాధ్యంకాదు. వివాహమయేదాకా నీ జీవితంలోకి ఎవరూ రాకూడదు. ఒకవేళ ఎవరైనా వస్తే ఆరు నూరయినా అతనితో లేక ఆమెతోనే నీ జీవితం ముడిపడాలని ఎవర్నయినా శాసించగలమా?... వివాహమయాక కూడా మరొక వ్యక్తిని అభిమానించవచ్చు. ఇష్టపడవచ్చు. ఆకర్షింపబడొచ్చు. ధైర్యం, చొరవ, కోరికవున్న వాళ్ళు శారీరక బంధాన్ని కూడా పెంచుకుంటారు. ఏది తప్పు? ఏది ఒప్పు? తప్పొప్పుల సరిహద్దు గీతెక్కడ? కేవలం శారీరక బంధమే తప్పా? మానసికమైన ఇష్టం, ఆకర్షణ ఇవి తప్పుకావా?... తను ఇప్పుడుంటున్న పాశ్చాత్య సమాజంలో వీటినంతగా పట్టించుకోరే?! స్త్రీ పురుషుల బాంధవ్యాలు ఇక్కడింత సంకుచితంగా, అక్కడంత విశృంఖలంగా ఎందుకుంటున్నాయి? ఈ రెండు వ్యతిరేక ధృవాలకీ ఎప్పటికి సమన్వయం కుదురుతుంది? ఈ స్త్రీపురుష బాంధవ్యాలకు ఆర్థిక, సామాజిక పునాదులేవి?... ప్రపంచం ఆర్థికంగా, వైజ్ఞానికంగా శరవేగంతో ముందుకు పోవలసిన సమయంలో నిరంతర స్రవంతిలా సాగిపోవలసిన బాంధవ్యం ఇంత క్లిష్టంగా ఎందుకు మారుతూంది?... నిరంతర స్రవంతి... స్రవంతి... స్రవంతి గురించి ఆలోచించకుండా ఏమేమిటో ఆలోచిస్తున్నాడేమిటి తను?!.... ఇలాంటి అమ్మాయిని, ఇంత అద్భుతమైన వ్యక్తిత్వం వున్న స్త్రీని అర్థంలేని నెపంతో కోల్పోలేడు తను.

బ్రతకడమెంత సహజమో, పొరబాట్లు చెయ్యడమూ అంతే సహజం. ఈ పొరపాట్లనేవి వ్యక్తికీ వ్యక్తికీ, కాలానికీ కాలానికీ, దేశానికీ దేశానికీ మారుతూ వుంటాయి. సుఖంగా బ్రతకాలంటే కొన్ని పొరపాట్లతో రాజీపడాలి. దాంపత్య జీవితం సాఫీగా సాగిపోవాలంటే కొన్ని లోపాలను సర్దుకోవాలి... స్రవంతిని ఆమె తప్పొప్పులతో, ఔన్నత్య అల్పత్వాలతో సహా స్వీకరించగల సత్తా తనకుంది... తనకు స్రవంతి కావాలి. ఆమె ప్రేమ

కావాలి.  ఆమెతో జీవితం కావాలి.

"స్రవంతీ!" ఇంతవరకు ఆమెను స్పృశించాలనే కోరికను అరికట్టుకుంటున్న శరత్ ఆమె చేతుల్ని అపురూపంగా అందుకున్నాడు.

* * *



నిష్ఠురమైన వాస్తవాన్ని ఉన్నదున్నట్లుగా పసిగట్టిన అధునికానంతర ఆదర్శవాదానికీ, 1964 కి ముందు ఆదర్శవాదానికీ తేడా ఉంది. పూర్వకాలపు ఆదర్శవాదం బోలు ఆదర్శవాదం. దానిలో వాస్తవ పరిస్థితి పట్ల ఎరుక తక్కువ. అది చాలా వరకు ఊహాత్మకం. నేల విడిచిన సాము. ఇప్పటి ఆదర్శవాదం వాస్తవ పరిస్థితుల పట్ల సమ్యక్ జ్ఞానంతో, మెలకువతో, క్రియాశీలతత్వంతో కూడుకున్నది. అత్యంత ఆచరణాత్మకం. అన్నిటికన్నా ముఖ్యమైన తేడా మరొకటివుంది. పూర్వకాలపు ఆదర్శవాదం ఒకే ఆదర్శాన్ని నలుగురికీ యాంత్రికంగా వర్తింపచేయగలమని నమ్మేది. కాని ఇప్పటి ఆదర్శవాదం అలా భావించదు. ఇది ఎవరికి వారు తమ తమ వ్యక్తిగత జీవితానుభవాలమీంచి తమ శక్తి సామర్థ్యాలకు తగ్గట్టుగా ఆచరించి చూపగల ఆదర్శవాదం.... 80 ల్లోనే రాసినప్పటికీ, చాలా ఆలస్యంగా వెలుగు చూస్తున్న డా॥ విజయలక్ష్మిగారి ఈ రెండు నవలల్లోనూ ఆధునికానంతర ఆదర్శవాదం చాలా స్పష్టంగా కనిపించడం నన్నెంతో సంతోషానికీ, సంభ్రమానికీ గురిచేసింది.

డా॥ విజయలక్ష్మి గారు జీవితంలోనూ, సాహిత్యంలోనూ కూడా తన ఆదర్శలోకాన్ని పదిలపర్చుకుంటున్న వ్యక్తి. 70ల మొదట్లో ఆమె ఎంత ధగధగతో నాకు కనిపించారో ఇప్పుడు ఈ కొత్త శతాబ్దంలో కూడా ఈ రెండు కథలు చదువుతున్నప్పుడు కూడా అంతే ధగధగతో కనిపిస్తున్నారు. కథలు చదవడం పూర్తవగానే 'అదిగో నవలోకం, విరిసే మన కోసం' అనిపిస్తుంది.

- వాడ్రేవు చిన వీరభద్రుడు